సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 49

గురువారం 11-5-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సోనోవిజన్‌లో కొనుగోలుదారుల సందడి

అన్ని పెద్ద కంపెనీల నుండి ఎక్కువ కూలింగ్ కెపాసిటీ, హై ఎనర్జీ ఎఫిషియన్సీ రేషియోతో 2023 లేటెస్ట్ మోడల్స్ A.C లు అత్యంత విస్తృతశ్రేణిలో లభిస్తున్నాయి. ఫైనాన్స్ కొనుగోలులో వడ్డీగాని, DBD గాని లేకుండా లభించే ఫైనాన్స్ లాభదాయకంగా ఉంది. అంతే కాకుండా 15% వరకు లభించే క్యాష్‌బ్యాక్ పట్ల కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని పెద్ద కంపెనీల నుండి ఎక్కువ కూలింగ్ కెపాసిటి, హై ఎనర్జీ ఎఫిషియన్సీ రేషియోతో 2023 లేటెస్ట్ మోడల్స్ A.C లు అత్యంత విస్తృతశ్రేణి

సోనోవిజన్ సమ్మర్ మేళా

LG Life's Good — 10 Years Compressor WARRANTY, 5 Years PCB WARRANTY — Starting EMI : 3000/-
SAMSUNG — Starting EMI : 3050/-
VOLTAS — Starting EMI : 2875/-
LLOYD — Starting EMI : 2875/-
HITACHI — Starting EMI : 3125/-
DAIKIN — Starting EMI : 3150/-

LG Life's Good — Side by Side 694 Litres Refrigerator — EMI : 12000/-
SAMSUNG — Side by Side 700 Litres Refrigerator — EMI : 6800/-
Whirlpool — Frost Free Double Door 260 Litres Refrigerator — EMI : 1958/-
VOLTAS beko — Direct Cool Single Door 190 Litres Refrigerator — EMI : 1150/-
Haier — 256 Litres BMR Refrigerator — EMI : 1958/-
LLOYD — Frost Free Double Door 276 Litres Refrigerator — EMI : 1900/-

Haier — Side by Side 682 Litres Refrigerator — EMI : 6125/-
LLOYD — Side by Side 590 Litres Refrigerator — EMI : 4625/-
SAMSUNG — Frost Free Double Door 253 Litres Refrigerator — EMI : 1958/-
Godrej — Direct Cool Single Door 190 Litres Refrigerator — EMI : 1116/-
LG Life's Good — Direct Cool Single Door 215 Litres Refrigerator — EMI : 1400/-
Haier — Direct Cool Single Door 190 Litres Refrigerator — EMI : 992/-
Chest Freezer 230 Litres — EMI:1625/-

BAJAJ — Air Cooler 67 Litres — EMI : 1450/-
Crompton — Air Cooler 55 Litres — EMI : 1335/-
VOLTAS — Air Cooler 72 Litres — EMI : 1535/-
USHA — Air Cooler 70 Litres — EMI : 1634/-
orient — Air Cooler 105 Litres — EMI : 1800/-
KENSTAR — Air Cooler 70 Litres — EMI : 1535/-

SONY — 108 Cm (43") 4K Anroid — EMI : 1850/-
LG Life's Good — 108 Cm (43") 4K Smart LED — EMI : 1999/-
Panasonic — 108 Cm (43") Smart LED — EMI : 1834/-
SAMSUNG — 80 Cm (32") Smart LED — EMI : 1250/-
LLOYD — 108 Cm (43") Smart LED — EMI : 2166/-
TCL — 108 Cm (43") Google LED — EMI : 2182/-
SONY — Sound Bar — EMI : 1500/-

LG Life's Good — Front Load Washing Machine 10.5 KGS — EMI : 5575/-
SAMSUNG — Front Load Washing Machine 9 KGS — EMI : 3500/-
BOSCH — Front Load Washing Machine 6 KGS — EMI : 2475/-
IFB — Top Load Washing Machine 6.5 KGS — EMI : 1650/-
Whirlpool — Top Load Washing Machine 7.5 KGS — EMI : 1559/-

Convection Microwave Oven — Rs : 10,600/- Onwards
Microwave Oven — Rs : 6200/- Onwards
Chimney — Rs : 9700/- Onwards
2 Burner Glass Manual Gas Stove — Rs : 2700/- Onwards
Water Dispenser — Rs : 8200/- Onwards
Water Purifier RO — Rs : 13200/- Onwards
Water Geyser — Rs : 3300/- Onwards
Wet Grinder — Rs : 3600/- Onwards
Rice Cooker — Rs : 1700/- Onwards
Mixer — Rs : 3000/- Onwards

* T & C Apply

amazon pay Upto 1000/- క్యాష్ బ్యాక్ (షరతులు వర్తిస్తాయి)

visit : www.sonovision.in మా టీమ్ ఆన్‌లైన్ & ఆఫ్‌లైన్ సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నారు.

LG Life's Good SAMSUNG SONY Haier Whirlpool LLOYD Panasonic Godrej DAIKIN HITACHI VOLTAS Carrier IFB BOSCH BAJAJ
VOLTAS beko TCL V-GUARD Amirthaa Preethi EUREKA FORBES KENT ULTRA Butterfly FABER Crompton orient KEELINE AO Smith hp vivo oppo iPhone ONEPLUS ONIDA mi morphy richards

అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్

విశాఖపట్నం
డైమండ్‌పార్క్ - 1 ద్వారకా నగర్, వైజాగ్ 9390006608, 8333924946
డైమండ్‌పార్క్ - 2 ద్వారకా నగర్, వైజాగ్ 9246667474, 8333924929
శ్రీకన్య థియేటర్ ఎదురు, గాజువాక 9246667575, 9154281127
న్యూ గాజువాక జంక్షన్, గాజువాక 9440804187, 9100991705
న్యూ సుకన్య థియేటర్, గోపాలపట్నం 9100991704, 9154281129
కాన్వెంట్ జంక్షన్, మధురవాడ 9246666214, 9390006613

తూర్పు గోదావరి
కోటిపల్లి బస్టాండ్, రాజమండ్రి 9246662288, 9246666212
టి.యన్.రోడ్, రాజమండ్రి 9100991700, 9154281119
సాయికృష్ణ థియేటర్, ఇన్నిసుపేట, రాజమండ్రి 9154281197, 98, 99
రామయ్య స్ట్రీట్, కాకినాడ 9246665511, 9246666201
యస్.పి.పి.బోట్ క్లబ్ ఎదురు, సర్పవరం జంక్షన్, కాకినాడ 7331149376, 77, 78

శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా
చిన్నయ్య బస్టాండ్ దగ్గర, నెల్లూరు 9246666206, 9154279913
ముత్తుకూరు గేట్, మిని బైపాస్ రోడ్, నెల్లూరు - 8712600519, 20, 21

పశ్చిమ గోదావరి
జువ్వల పాలెం రోడ్, భీమవరం 8333924936, 9154281175
బిఎస్ఎన్ పార్క్ ఎదురు, ఏలూరు 9246666205, 9154281172
అశోక్ నగర్, ఏలూరు 9390006620, 9154281112
పైడిపర్రు రోడ్, తణుకు 8333924938, 9154281115

విజయనగరం
3 లాంతర్ల సెంటర్, 9246666208, 9390006630
బస్ స్టాండ్ జంక్షన్, 8712600523, 8712600535

శ్రీకాకుళం
రామలక్ష్మి జంక్షన్, జి.టి.రోడ్, శ్రీకాకుళం - 9154281140, 41

విజయవాడ ఎన్.టి.ఆర్. జిల్లా, కృష్ణా జిల్లా.
రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ 9440804182, 9246666202
కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్, విజయవాడ 9440804183, 9246666209
ఆల్ ఇండియా రేడియో ఎదురు, యం.జి.రోడ్, విజయవాడ 9246666203, 9154281640
మోహన్‌దాస్ థియేటర్ దగ్గర, పటమట, విజయవాడ 9246661616, 9100991702
శ్రీనగర్ కాలని, రింగ్ రోడ్, విజయవాడ 8712600531, 532, 533
విజయటాకీస్ (విజయటాకీస్) ఏలూరు రోడ్, విజయవాడ 9154281648, 649, 650
ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట, విజయవాడ 9100991701, 8333924945
ఎనికేపాడు, విజయవాడ 9100991703, 9154281626
ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్, గొల్లపూడి, విజయవాడ 8333924930, 9154281628
కానూరు, యం.జి.రోడ్, విజయవాడ 8712600536, 8712600537
మెయిన్ రోడ్ సెంటర్, పోరంకి 9154281645, 46, 47

గుడివాడ
ఏలూరు రోడ్, గుడివాడ 9100991708, 9154281178, 79

మచిలీపట్నం
మునిసిపల్ పార్క్ ఎదురు, రామనాయుడుపేట, కోనేరు సెంటర్, మచిలీపట్నం - 7331149379, 80, 81

గుంటూరు జిల్లా
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు 9154279910, 9440804185
లక్ష్మీపురం, మెయిన్ రోడ్, గుంటూరు 9246667373, 9154867822, 23, 24
లక్ష్మీపురం, గుంటూరు 9246666204, 9154279905
బ్రాడీపేట్, గుంటూరు 9246666215, 9100991706
రత్నాటాకీస్ దగ్గర, తెనాలి 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్ రోడ్, తెనాలి 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లె 9390006609, 9154281200
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి - 7331149366, 367, 368

ఒంగోలు
బాపూజీ మార్కెట్, ఒంగోలు 9246666329, 9154279918

రాయలసీమ
న్యూ బాలాజి కాలని, ఎయిర్ బైపాస్ రోడ్, తిరుపతి - 7331149370, 371, 372
అలిపిరి రోడ్, లీలామహల్ జంక్షన్, తిరుపతి - 9100991707, 9154279918
నేతాజి రోడ్, తిరుపతి 9440804186, 9154279916
ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురు, పార్క్ రోడ్, కర్నూలు - 9154281642, 43.
అమ్మ హాస్పిటల్ సెంటర్, సి-క్యాంప్ ఆఫీస్, కర్నూలు - 8333924947, 48
హెచ్.పి. పెట్రోల్ బంక్ ప్రక్కన, సుభాష్ రోడ్, అనంతపురం - 9154281191, 92
రాజీవ్ గాంధి పార్క్ రోడ్, యస్.ఆర్.రాజీవ్ పార్క్, కడప - 9154281194, 96
తిరుపతి రోడ్, దర్గా ఎదురు, చిత్తూరు 8712600528, 8712600530
టి.టి.డి. కళ్యాణ మండపం ఎదురు, శ్రీనివాస నగర్ నంద్యాల - 8712600525, 526, 527

హైదరాబాద్
పంజాగుట్ట, హైదరాబాద్ 9246663535, 9440804181
మెట్రోస్టేషన్ దగ్గర, కూకట్‌పల్లి 9154281180, 9154281181
హైదర్ నగర్, హైదరాబాద్ 7331149363, 364, 365
మలక్‌పేట్, హైదరాబాద్ 8333924932 / 933
ఎల్.బి.నగర్, డి-మార్ట్ ఎదురు 8333924943, 9154281188

ఖమ్మం
వర్తకసంఘం, ఖమ్మం 9246666319, 9154281634
వైరా రోడ్, ఖమ్మం 9100991709, 9154281635
పద్మశాల ఎదురు, వైరారోడ్, ఖమ్మం 8333924931, 9154281637, 38
కొత్తగూడెం, భద్రాచలం రోడ్ 9154867825, 26, 27



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 49

గురువారం 11-5-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'రచన చేయడం అంటే తెలుసుకోవడం కూడా' అనే మాట 'రైజింగ్ ఫ్రమ్ ది యాషెస్' పుస్తక రచన కోసం కలం పట్టినప్పుడు **కృతిక పాండే**కు అనుభవంలోకి వచ్చింది. ఈ పుస్తకం మనల్ని బాధితుల ప్రపంచంలోకి తీసుకువెళుతుంది. ఈ పుస్తక ప్రయాణం సానుభూతి కోసం కాదు. 'మనలో వారి పట్ల చిన్న చూపు ఉంటే మార్చుకుందాం' అని చెప్పడం. 'వారితో కలిసి నడవండి' అని చెప్పడం. 'విజేతలకు కష్టాలు అడ్డు కాదు' అనే సత్యాన్ని గుర్తు చేయడం...

అక్షర స్వరం

అవమానాలు, అనుమానాలు, లింగవివక్ష, వేధింపులు, గృహహింసలు... స్త్రీలు ఎదుర్కొనే సకల సమస్యలకు సమాధానం చెబుతుంది 'రైజింగ్ ఫ్రమ్ ది యాషెస్: ఎ జర్నీ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్' పుస్తకం. ఇది కాల్పనిక ఊహల సమాహారం కాదు. నిజజీవితానికి చెందిన కథ.

నిమృత్‌కు చిన్నప్పటి నుంచి మూర్ఛ సమస్య ఉంది. ఆ సమస్య తనను నీడలా వెంటాడింది.

'ఈ సమస్యతో స్కూల్‌కు ఎలా పంపుతాం?'

'ఫ్రెండ్స్‌తో సినిమాకు వెళతావా? అక్కడ పడిపోతే ఎవరు చూస్తారు?'

పెళ్లి వయసులోనూ ఆ సమస్య ముందుకు వచ్చింది.

'మీ అమ్మాయికి మూర్ఛ సమస్య ఉందా? ముందే చెప్పి బతికించారు' అని వెనక్కి తిరిగి వెళ్లిపోయిన వారు ఎంతోమంది ఉన్నారు.



నిమృత్‌కు పెళ్లి జరగడం అనేది అతి కష్టం అనుకునే సందర్భంలో తన సమస్య తెలిసి కూడా ఒక కుటుంబం పెళ్లికి ఒప్పుకుంది.

'మూర్ఛ' కారణంగా సంసార జీవితంలో ఒడిదొడుకులు మొదలయ్యాయి. అయితే ముందు కనిపిస్తున్న ముండ్లబాటను చూసి భయపడలేదు నిమృత్. అక్కడే ఆగిపోయి ఉంటే, వెనుతిరిగి ఉంటే ఆమె జీవితం ఈ పుస్తకంలోకి వచ్చేది కాదు.

సమస్యను సవాలు చేసి ముందుకువెళ్లింది.

కష్టాలను తట్టుకొని నిలబడింది.

ప్రపంచం గుర్తుంచుకోదగిన అసాధారణ విజయలేమీ ఆమె సాధించకపోవచ్చు. అయితే తన జీవితాన్ని జయించింది. కష్టాల్లో ఉన్నవారికి స్ఫూర్తిని ఇచ్చింది. తనలాంటి వారెందరికో ధైర్యాన్ని ఇస్తోంది.

'ఆరోగ్య స్థితిని బట్టి ఎవరూ నిర్లక్ష్యానికి గురి కావద్దు. వారికి సహాయంగా నిలవండి. వారి అడుగులు ముందుకు పడడానికి సహకరించండి' అని ఈ పుస్తకం సందేశం ఇస్తుంది.

కృతిక పాండే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగం హెడ్‌గా పనిచేస్తోంది.

బెంగళూరులో గ్రాడ్యుయేషన్ చేసిన కృతిక దిల్లీలో డిజిటల్ మార్కెటింగ్ కోర్సు చేసింది.

డెహ్రాడూన్‌కు చెందిన కృతిక ఒక వైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాలు, స్త్రీ సాధికారతకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. ఈ పుస్తకం అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తాన్ని దివ్యాంగుల సంక్షేమం కోసం పనిచేస్తున్న బెంగళూరులోని 'మిత్ర జ్యోతి ట్రస్ట్'కు ఇవ్వనుంది కృతిక.



వేడుకల సందర్భాలలో బంధుమిత్రులకు ఏదైనా కానుక తీసుకెళుతుంటాం. ఎంపిక చేసే కానుక ప్రత్యేకంగా ఉండాలనుకోవడమే కాదు, దానిని అంతే ప్రత్యేకంగా ప్యాకింగ్ చేయించి, మన అభిమానాన్ని చాటుకుంటాం. ఈ విషయాన్ని గమనించిన కృతిక సబర్వాల్ 'ది స్మార్ట్ ర్యాప్' పేరుతో వ్యాపారవేత్తగా మారింది. వర్క్‌షాప్స్, వెబినార్ ద్వారా టీచర్ ప్రెన్యూర్‌గానూ తన సత్తా చాటుతోంది. న్యూ ఢిల్లీలో ఉండే కృతిక ఇప్పటివరకు 5000 మంది విద్యార్థులకు గిఫ్ట్ ప్యాకింగ్ తయారీలో శిక్షణ ఇచ్చింది. దేశవ్యాప్తంగా 1300 మంది మహిళలకు ఉచితంగా గిఫ్ట్ ర్యాపింగ్ క్రాఫ్ట్ నేర్పించి, తన అందమైన మనస్తత్వాన్నీ చాటుకుంటుంది.

స్మార్ట్‌గా చుట్టేస్తోంది

అందమైన ప్యాకింగ్‌తో ఆదాయం





తొమ్మిదేళ్లుగా చేస్తున్న ఈ కృషిలో మహిళలు గిఫ్ట్ ర్యాపింగ్‌లో ప్రతిరోజూ ఇంటి నుంచే మూడు గంటల పాటు శిక్షణ తీసుకుంటున్నారు. వెబినార్ ద్వారా ఉచితంగా గిఫ్ట్ ర్యాప్ తయారీతో పాటు ఇంటి నుంచే సొంత సంపాదన ఎలా సృష్టించుకోవచ్చో అవగాహన కల్పిస్తోంది కృతిక సబర్వాల్. వీటికి సంబంధించిన వివరాలను ఎంతో ఆనందంగా పంచుకుంటుంది.



''జీవితం అనేది ఒక వేడుక. ఇక్కడ మనం ఆనందం, ప్రేమతో ఎంపిక చేసుకున్న బహుమతులను ఆప్తులకు బహూకరిస్తూ ఉంటాం. మన ప్రియమైనవారికి మన విలువైన సమయాన్ని వెచ్చించి, ఖరీదైన వస్తువులను ఎంపిక చేసి బహుమతిగా ఇచ్చినప్పుడు ఆటోమ్యాటిగ్గా వాటిపైన ఉన్న అందమైన ప్యాక్‌పైన దృష్టి వెళుతుంది. ఆ బహుమతిని అందుకునేవారి మనసును ఆకట్టుకునేలా ప్యాకింగ్ సేవలను అందించాలనుకున్నాను. వెంటనే 'మీ బహుమతులను మరింత ఆహ్లాదకరమైన రీతిలో అందించండి' అనే థీమ్‌తో 2013లో ది స్మార్ట్ ర్యాప్ బిజినెస్‌లోకి ప్రవేశించాను. ఆ తర్వాత 2016లో ఇంటి నుంచే చిన్న గిఫ్ట్ ర్యాపింగ్ వర్క్‌షాప్ చేయాలనే ఆలోచన నన్ను టీచర్‌ప్రెన్యూర్‌గా మార్చింది. దీంతో కోర్సులు, వర్క్‌షాప్‌లను రూపొందించడం ప్రారంభించాను. చాలా మంది గిఫ్ట్ ప్యాకేజింగ్ డిజైనర్లుగా మారడానికి సహాయం చేశాను. నాకే కాదు, ఎంతోమంది మహిళలకు ఉపాధికి అందమైన మార్గం దొరికింది అనిపించింది. గత పదేళ్లుగా 200కు పైగా వర్క్‌షాప్స్, 600కు పైగా వర్చువల్ క్లాసులు నిర్వహించాను. ప్రపంచంలో ఎవరైనా గిఫ్ట్ ప్యాకింగ్ నేర్చుకోవాలనుకుంటే వారికి మొదట గుర్తుకు వచ్చే పేరు 'ది స్మార్ట్ ర్యాప్' అనేది ఉండేలా సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.





ఇంటినుంచే వ్యాపారం

ఎప్పటికప్పుడు మార్కెట్‌లోని తాజా ట్రెండ్‌లను అప్‌గ్రేడ్ చేయడం నా బిజినెస్ లక్ష్యం. గిఫ్ట్ ర్యాప్ వ్యాపారం ద్వారా ఇంటి నుంచే సంవత్సరానికి సుమారు తొమ్మిది లక్షల రూపాయలు సంపాదించవచ్చు. ఆన్‌లైన్ ఆర్డర్‌ల ద్వారా ఇంకా ఎక్కువే సంపాదించుకోవచ్చు. ఈవెంట్ నిర్వాహకులు, బేకర్లు, స్వీట్లు, గిఫ్టింగ్ కంపెనీలు, గృహాలంకరణ బ్రాండ్లు ఈ కళ పట్ల మొగ్గు చూపడానికి చాలా అవకాశాలున్నాయి. సందర్భానికి సరిపోయేలా గిఫ్ట్ ప్యాక్ ఎలా రూపొందించాలో తెలిసుండాలి. వాటిని నేను పరిచయం చేస్తాను. మంచి మాటలే కాదు మనం అందించే కానుక ప్యాకింగ్ కూడా చాలా కాలం పాటు అందుకున్నవారి మదిలో గుర్తుండిపోయేలా మనం చేయాలి.





నిపుణులనూ తయారు చేయచ్చు

ర్యాపింగ్ టెక్నిక్‌లను పంచుకోవడం, వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్నది నా లక్ష్యం. ఈ గిఫ్ట్ ర్యాప్ ప్యాక్ క్రాఫ్ట్ నుంచి మీ తోటివారితో వినూత్న ఆలోచనలను పంచుకోవచ్చు. ప్రొఫెషనల్ వెడ్డింగ్ ప్యాకర్‌గా మారడంలోనూ ఇది మీకు సహాయపడుతుంది. మీలాగే మరికొందరిని ఈ జాబితాలో చేర్చుకోవచ్చు. జట్టుగానూ విజయాలను సాధించవచ్చు. కార్పొరేట్ హ్యాంపర్లు, స్వీట్లు, డ్రై ఫ్రూట్స్, బేబీ బర్త్ ప్యాక్స్, కృత్రిమ పూలు, కలపతో తయారుచేసిన బాస్కెట్స్ అలంకరణలు దీనికి జోడించవచ్చు. అంతేకాదు, ఈ ర్యాప్స్ నుంచి ఈవెంట్ డెకొరేటివ్ ఆలోచనలకు కావల్సిన సలహాలనూ ఇస్తుంటాను. ఇన్నేళ్లలో ఇది ఎంతోమంది మహిళలకు ఉపయుక్తంగా మారిపోవడం ఆనందాన్నిస్తుంది'' అని వివరిస్తున్న కృతికను చూస్తుంటే, స్మార్ట్‌గా మెలకువలను అమలు చేయడం ఎంత అవసరమో అర్థం అవుతుంది.







కాంతులీనే చర్మం కోసం...

నార్మల్ స్కిన్ వాళ్లకు కూడా ఎండాకాలం చర్మం ఒకింత జిడ్డు బారుతుంటుంది. ఈ జిడ్డు వదలడానికి నిమ్మ, బత్తాయి, కమలా పండు వంటి సిట్రస్ పండ్ల రసం రాస్తే చర్మం మరీ ఎక్కువగా పొడిబారిపోతుంటుంది. అలాంటి వాళ్లకు టొమాటో ప్యాక్ మంచి పరిష్కారం. బాగా పండిన టొమాటోలను మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి ఆ గుజ్జును ముఖం, మెడ, గొంతు, చేతులకు రాయాలి. పదిహేను నిమిషాల తరవాత చన్నీరు లేదా గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. టొమాటో సహజసిద్ధమైన మైల్డ్ ఆస్ట్రింజెంట్‌గా పని చేస్తుంది. ఈ ప్యాక్ జిడ్డును వదిలించడంతోపాటు వార్ధక్యపు లక్షణాలైన ముడతలు, సన్నని గీతలను కూడా తగ్గించి చర్మాన్ని యవ్వనంగా ఉంచుతుంది.

పార్శిల్ పేరుతో మోసం

ప్రతీకాత్మక చిత్రం



డోర్‌బెల్ మోగడంతో కమల బయటకు వచ్చింది. 'మీ పక్క పోర్షన్‌వారు ఆర్డర్ చేసిన పార్శిల్ వచ్చింది మేడం. వారి ఇంటికి తాళం వేసుంది. వారికి ఫోన్ చేస్తే మీకు ఇమ్మన్నారు' అన్నాడు డెలివరీ బాయ్. 'సరే' అని పార్శిల్ తీసుకుంది కమల. 'మేడమ్, వాళ్లకు ఒకసారి ఫోన్ చేసి, పార్శిల్ ఇచ్చినట్టు, అలాగే డెలివరీ ఓటీపీ చెప్పమనండి' అనడంతో ఆ పోర్షన్‌లో ఉండే మాలినికి ఫోన్ చేసింది కమల. బంధువుల పెళ్లిలో ఉన్న మాలిని అప్పుడే ఫోన్‌కి వచ్చిన లింక్‌ని ఓపెన్ చేసి, వచ్చిన ఓటీపీ చెప్పింది. తర్వాత తన హడావిడిలో పడిపోయింది. ఆ తర్వాత ఫోన్ చూసుకున్న మాలినికి బ్యాంక్ అకౌంట్ నుంచి వేలల్లో డబ్బు డెబిట్ అయినట్టుగా వచ్చిన మెసేజ్ చూసి షాకయ్యింది. ఇంటికి వచ్చాక డెలివరీ పార్శిల్ తెరిచి చూస్తే ఖాళీ బాక్స్ మాత్రమే ఉంది.

* * *

ఇటీవల ఆన్‌లైన్ ఆర్డర్ డెలివరీలు పెరిగిపోయాయి. వీటిని ఆసరా చేసుకొని, మోసగాళ్లు రకరకాల స్కామ్‌లకు పాల్పడుతున్నారు. స్కామర్లు ఒక చట్టబద్ధమైన డెలివరీ కంపెనీ లేదా పోస్టల్ సర్వీస్‌గా నటిస్తూ ఫేక్ మెసేజ్‌లు, ఇ–మెయిల్స్, ఫోన్‌కాల్స్‌కు పంపుతుంటారు. తమ వద్ద పార్శిల్ ప్యాకేజీ ఉందని, ఛార్జీలు చెల్లించమని అడుగుతూ, వ్యక్తిగత సమచారాన్ని కోరుతుంటారు. విదేశాల నుంచి వచ్చిన కొరియర్ అని, కస్టమ్స్ ఫీజులు, ట్యాక్స్, డెలివరీ అడ్రస్ మిస్ అయిన కారణంగా వివరాలు తెలపమని అడగవచ్చు.

* * *

ఈ మోసాలు ప్రత్యేకించి హాలిడే సీజన్‌లలో లేదా అధికంగా ఆన్‌లైన్ షాపింగ్ కార్యకలాపాలు చేసేవారి విషయంలో జరిగే అవకాశాలు ఎక్కువ కాబట్టి, జాగ్రత్తలు తప్పనిసరి.

క్యూ ఆర్ కోడ్ ఉపయోగించవద్దు

మీరు ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరిపితే యూపీఐ లేదా క్రెడిట్ కార్డ్ వంటి సురక్షిత చెల్లింపు పద్ధతిని ఉపయోగించండి. డబ్బు చెల్లించే ముందు డెలివరీ ప్యాకేజీని ఓపెన్ చేసి, తీసుకోండి. డెలివరీ సమయంలో చెల్లించడానికి పార్శిల్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్‌లను స్కాన్ చేయడం కన్నా ధ్రువీకరించిన ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రయత్నించండి.

షార్ట్ లింక్స్‌పై క్లిక్ చేయవద్దు

డెలివరీ పెండింగ్‌లో ఉందని మోసగాళ్లు మీకు మెసేజ్‌లు లేదా ఇ–మెయిల్ పంపుతుంటారు. ప్యాకేజీ ట్రాక్ కోసం లింక్‌పై క్లిక్ చేయమని, అటాచ్‌మెంట్ డౌన్‌లోడ్ చేయమని అడగవచ్చు. కొరియర్ కంపెనీ వెబ్‌సైట్‌లా కనిపించే నకిలీ వెబ్‌సైట్స్ లేదా లాగిన్ పేజీలను సృష్టించవచ్చు. వీటి వల్ల మీ వ్యక్తిగత సమాచారాన్ని మోసగాళ్లు దొంగలించే అవకాశాలున్నాయి. ఇలాంటప్పుడు అది నిజమో కాదో నిర్ధారించుకోవడానికి ట్రాకింగ్ నంబర్‌ను చెక్ చేయండి. కొరియర్ కంపెనీలు తమ వెబ్‌సైట్‌లలో, వారి యాప్‌ల ద్వారా ట్రాకింగ్ సమాచారాన్ని అందిస్తాయి.

* * *

ఫ్యామిలీ యాప్, ఇ-మెయిల్ మేలు

కుటుంబంలో కొంతమంది తరచూ ఆర్డర్స్ చేస్తుంటారు. ఇలాంటి వారిని స్కామర్లు టార్గెట్ చేస్తారు. అందుకని, ఇంటిల్లిపాదీ ఒకటే యాప్ ఉపయోగించడం మేలు. అలాగే, ఒకరు మాత్రమే ఒక యాప్ ద్వారా నగదు చెల్లింపులు చేయడం మంచిది. ఈ విధానం వల్ల ఆర్డర్ వెరిఫై చేయడం సులువు అవుతుంది. ఆర్డర్ చేశామా లేదా అని చెక్ చేసుకోవడం కూడా సులువు అవుతుంది. ఇ–కామర్స్ అకౌంట్‌కు సంబంధించి కుటుంబం మొత్తం ఒకే యాప్, ఒకే ఇ–మెయిల్ వాడటం మంచిది.

ట్రాకింగ్ చెక్ చేయాలి

కొరియర్ పంపినవారి ఇ–మెయిల్, చిరునామా లేదా ఫోన్ నెంబర్‌ని చెక్ చేయాలి. అలాగే, వారి అధికారిక వెబ్‌సైట్ వంటివి తెలుసుకోవాలి. నేరుగా డెలివరీ కంపెనీకి కాల్ చేయడం, మీరు ఆర్డర్ చేసిన ట్రాకింగ్ వివరాలు చెక్ చేయడమూ మంచిది.

సైబర్ టాక్

తప్పుడు ఆరోపణలకు భయపడవద్దు

కొంతమంది స్కామర్లు బాధితులకు ఫోన్ చేసి, డెలివరీ చేయాల్సిన కొరియర్ ద్వారా స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, ఆయుధాలను కనుక్కొన్నట్లు చెబుతారు. బాధితుడు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెబితే, స్కామర్లు తమ క్లెయిమ్‌లను ధ్రువీకరించడానికి బ్యాంక్ లేదా పాన్ కార్డ్ సంబంధించిన సమాచారం మొదలైనవి అడుగుతారు. దీంతో బాధితులు భయంలో ఎక్కువగా ఓటీపీ షేర్ చేస్తారు. కొన్ని సందర్భాలలో మోసగాళ్లు స్క్రీన్ షేరింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయిస్తారు. బాధితులు పోలీసు అరెస్ట్ నుంచి తప్పించుకోవాలనే ఆత్రుతలో స్క్రీన్ షేర్ యాప్ నియంత్రణకు అనుమతిస్తారు. దీంతో మోసగాళ్లు సులువుగా డబ్బును దొంగలిస్తారు.

* * *

మీరు సైబర్ క్రైమ్ బాధితులైతే టోల్ ఫ్రీ నంబర్ 1930, సిటిజన్ ఫైనాన్షియల్ ఫ్రాడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు కాల్ చేయండి. లేదా https://www.cybercrime.gov.in లాగిన్ అయ్యి, మీ ఫిర్యాదును నమోదు చేయండి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



మామూలు స్కూల్లో చదువుకుంది. రోజు కూలీ కుమార్తె. అయితే ఏం? ఇంటర్‌లో 600కు 600 మార్కులు సాధించింది. తమిళనాడు దిండిగల్‌కు చెందిన నందిని 'మా ఇంటి ఆర్థిక పరిస్థితే నా పట్టుదలకు కారణం' అని తెలిపింది. నందిని ఇప్పుడు తమిళనాడులో ఎందరికో స్ఫూర్తి. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆమెను పిలిచి సత్కరించారు.



'నా బలం మా నాన్న. ఆయన ఎంతో కష్టపడి నన్ను చదివించడం వల్లే నేను ఇంత దూరం రాగలిగాను. పేదరికాన్ని కారణంగా చూపించి, చదువు ఆపించాలని ఆయన అనుకుని ఉంటే నేను చదువుకోవడానికి కుదిరేది కాదు. నిరంతరం సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. నేనింత కష్టపడుతున్నాను కాబట్టి నువ్వు బాగా చదవాలని ఆయన ఎప్పుడూ అనలేదు. నీకు వీలైనంత చదువు అన్నారు. కనుక ఇంతే వీలవుతుంది అని ఫిక్స్ కాకుండా ఎంత వీలైతే అంత చదివాను. అందుకే సాధించగలిగాను' అంది నందిని.

ఇప్పుడు తమిళనాడులో అందరూ ఆ అమ్మాయిని చూస్తున్నారు. దానికి కారణం మొన్న విడుదలైన ఇంటర్ ఫలితాల్లో 600లకు 600 మార్కులు తెచ్చుకుంది. తమిళం, ఇంగ్లిష్, ఎకనామిక్స్, కామర్స్, అకౌంటెన్సీ, కంప్యూటర్ అప్లికేషన్... ఈ ఆరు పేపర్లలో వందకు వంద తెచ్చుకుంది. 'మిగిలిన పేపర్లు ఎలా ఉన్నా తమిళంలో వందకు వంద తెచ్చుకోవడం చాలా ప్రశంసనీయం. ఇలా తమిళంలో వందకు వంద వచ్చిన విద్యార్థి ఈ సంవత్సరం మరొక్కరు మాత్రమే ఉన్నారు' అని కొన్ని పత్రికలు నందినిని అభినందించాయి.



● తల్లిదండ్రులతో... నందిని

మదురైకు గంట దూరంలో ఉండే దిండిగుల్ పట్టణంలో నివసించే శరవణ కుమార్ అనే రోజు కూలీ కార్మికుడి కుమార్తె నందిని. అక్కడి అన్నామలైర్ మిల్స్ గర్ల్స్ హైస్కూల్‌లో ఇంటర్ చదివింది. నందినికి స్టేట్ ఫస్ట్ వచ్చిందని వినగానే స్కూల్‌లో పండగ వాతావరణం నెలకొంది. ఆ స్కూల్లో అందరూ మహిళా టీచర్లే కనుక ఇది మహిళా విజయం అని కూడా అనవచ్చు.

నందినికి వచ్చిన మార్కుల గురించి విని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రత్యేకంగా పిలిచి అభినందించారు. నందిని సి.ఏ చేయాలని అనుకుంటోందని తెలిసి ఎంత చదివితే అంతకు సపోర్ట్ చేస్తానని తెలిపారు. కవి వైరముత్తు నందినికి బంగారు కలం బహూకరిస్తానని చెప్పారు. ఇవన్నీ చూసి తండ్రి ఆనందానికి అవధుల్లేవు. 'మా పాప చేత సివిల్స్ రాయించాలని ఉంది. చూద్దాం. నేను పనిలో ఉంటే ఫోన్ చేసి ఆరువందలకు ఆరువందలు వచ్చాయి నాన్నా అని చెప్పింది. చేతిలో ఉన్న టూల్స్ అన్నీ పక్కనపెట్టి ఇంటికి వెళ్లాను. పాపని గట్టిగా హత్తుకుని ఏడ్చేశాను' అన్నాడు శరవణ కుమార్.

నందిని ఎప్పుడూ చదువుతూ, రాసుకుంటూ కనిపించినా రిలాక్స్ కావడానికి కవిత్వం రాస్తుంది. పుస్తకాలు చదువుతుంది. 'ఇంటి పరిస్థితిని గమనిస్తూ, తల్లిదండ్రుల కష్టాన్ని గమనిస్తే ఎవరికైనా బాధ్యత వచ్చి చదవాల్సిందే' అని చెప్పే నందిని మరిన్ని ఉన్నత చదువులు చదువుతుందనడంలో సందేహం లేదు.


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 49

గురువారం 11-5-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



భారత్ తీన్‌మార్ పంచ్..

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి 3 పతకాలు ఖాయం - 8లో



ఇన్వెస్టర్లలో అప్రమత్తత


స్వల్ప లాభాల్లో ముగిసిన మార్కెట్లు సెన్సెక్స్ 179 పాయింట్లు పైకి.. - 9లో



ఇమ్రాన్ ఖాన్ ముమ్మాటికీ దోషి

తోషఖానా కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని, పీటీఐ పార్టీఅధినేత ఇమ్రాన్ ఖాన్‌ను ఇస్లామాబాద్ కోర్టు దోషిగా తేల్చింది.

వివరాలు 6లో ▸



మోచా తుపానుతో వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర తుపానుగా బలపడనుంది. అండమాన్‌లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది.

వివరాలు 6లో ▸



స్వప్రయోజనాలే పరమావధి

ఉగ్రవాదుల పట్ల మెతక వైఖరి కాంగ్రెస్ నైజమని.. ఆ పార్టీకి స్వప్రయోజనాలే ముఖ్యమని ప్రధాని మోదీ విమర్శించారు.

వివరాలు 6లో ▸



ఢిల్లీకి చెన్నై చెక్

ఐపీఎల్ మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ 27 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. పతిరణ 3 వికెట్లతో సత్తా చాటాడు.

వివరాలు 8లో ▸

మనది ఉద్యోగాంధ్ర

ఇక్కడ ఉపాధి అవకాశాలు పుష్కలం.. దేశంలో 4వ స్థానం

ఇంటర్న్‌షిప్ కల్పిస్తున్న రాష్ట్రాల్లో దేశంలోనే ఫస్ట్

- వార్షిక వేతనం రూ.2.6 లక్షలకు మించి ఇస్తున్న ప్లేస్‌మెంట్లలోనూ టాప్
- నాలుగేళ్ల కిందటితో పోలిస్తే ఏకంగా 130 శాతం పెరిగిన ప్లేస్‌మెంట్లు
- ఇవన్నీ 'ఇండియా–2023 స్కిల్ రిపోర్టు' సాక్షిగా కేంద్రం చెప్పిన వాస్తవాలు
- సామాజిక, పారిశ్రామిక, సాంకేతిక మౌలిక సదుపాయాలూ భేష్ అని ప్రశంస
- వీటన్నిటినీ దాచేసి... రాష్ట్రంలో ఉద్యోగాల్లేవంటూ 'ఈనాడు' విష కథనాలు
- ఎలాంటి రిపోర్టుల్నీ ప్రస్తావించకుండా సామాజికవేత్తలు చెప్పారంటూ అబద్ధాలు
- బాబు హయాంలో నిరుద్యోగ రేటు 5.3 శాతం... ఇప్పుడది 4.2 శాతం
- ఇది కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ నివేదించిన వాస్తవం
- ఈ నాలుగేళ్లలో ఒక్క ప్రభుత్వ రంగంలోనే 2 లక్షలకు పైగా ఉద్యోగాలు
- చదువులకు, ఉద్యోగాలకు యువత విదేశాలకు వెళ్లిపోతున్నారని రామోజీ ఏడుపు
- ఉన్నత చదువులు, ఉన్నత ఉద్యోగాలకోసం విదేశాలకు వెళ్లటం తప్పా?
- హెచ్ఎస్‌బీసీ 2015లోనే దేశం వీడి వెళ్లిపోతే ఇప్పుడే వెళ్లిపోయిందంటూ రాతలేల?
- ఇన్ఫోసిస్, బీఈఎల్, అమెజాన్, ర్యాండ్‌స్టాడ్ సహా ఎన్నో దిగ్గజ సంస్థలు రాలేదా?
- అంబానీ, అదానీ, జిందాల్, భజాంకా, బంగూర్, టెక్ మహీంద్రా ప్రశంసలు వినలేదా?
- దిగ్గజ సంస్థలన్నీ ఇక్కడ భారీగా పెట్టుబడులు పెడుతుండటం చూడటం లేదా?
- వీటన్నిటినీ దాచేసి కంపెనీలు వెళ్లిపోతున్నాయని విషం గక్కటం దారుణం కాదా?
- ఐటీలో బాబు హయాంలో రూ.1,000 కోట్ల పెట్టుబడులు, 14వేల మందికి ఉపాధి
- ఈ నాలుగేళ్లలో అదే ఐటీలో రూ.5,700 కోట్ల పెట్టుబడులు, 30 వేల మందికి ఉద్యోగాలు
- ఎంఎస్ఎంఈ సెక్టార్‌లోనే నాలుగేళ్లలో రూ.24 వేల కోట్ల పెట్టుబడులు
- వీటిద్వారా ఈ రంగంలో దాదాపు 12.60 లక్షల మందికి జాబ్స్.. ఎంఎస్ఎంఈలకు బాబు పెట్టిన బకాయిలూ చెల్లింపు... పైగా రెగ్యులర్‌గా ఇచ్చేలా క్యాలెండర్

2 లో

ఫ్యాక్ట్ చెక్



ఉపాధికి రక్షణ కవచం!

- సత్యసాయి జిల్లా పాల సముద్రం వద్ద బీఈఎల్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్
- 914 ఎకరాల్లో ఐదు దశల్లో నిర్మాణం
- రాడార్లు, మిస్సైల్స్, సబ్‌మెరైన్ పరికరాల తయారీ, టెస్టింగ్
- తొలి దశలో రూ.384 కోట్లతో యూనిట్

7 లో

కర్ణాటక కాంగ్రెస్‌దే!

ఎగ్జిట్ పోల్స్ జోస్యం

- కాంగ్రెస్‌కు 122 నుంచి 140 సీట్లు
- ఇండియాటుడే–మై యాక్సిస్ వెల్లడి
- అత్యధిక సర్వేల్లో కాంగ్రెస్‌కే మొగ్గు
- ఒకట్రెండింట్లో బీజేపీకి ఆధిక్యం
- జేడీ(ఎస్)కు 20 నుంచి 25



మొత్తం అసెంబ్లీ స్థానాలు **224** మెజారిటీకి కావాల్సింది **113**

సర్వే	బీజేపీ	కాంగ్రెస్	జేడీ(ఎస్)	ఇతరులు
ఇండియాటుడే	62-80	122-140	20-25	0-3
టైమ్స్ నౌ	78-92	106-120	20-26	0-3
ఇండియా టీవీ	80-90	110-120	20-24	-
సీఎన్ఎన్	96	102	24	3
జన్ కీ బాత్	94-117	91-106	14-24	0-2
జీ న్యూస్	79-94	103-118	25-23	2-5
రిపబ్లిక్ టీవీ	85-100	94-108	24-32	2-6
టుడేస్ చాణక్య	92	120	12	-
న్యూస్‌నేషన్	114	86	21	3
ఏబీపీ న్యూస్	83-95	100-112	21-29	2-6
పోల్ ఆఫ్ పోల్స్	97	100	25	2

కర్ణాటకలో పోలింగ్ 71.77 శాతం

అత్యధికంగా రామనగరలో 78.22 శాతం..

బీబీఎంపీ స్థానంలో కేవలం 48.63 శాతం పోలింగ్

6 లో

న్యూస్‌రీల్

విదేశీ విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని ప్రతిభా పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలను మంత్రులు రాజన్న దొర, బొత్స విడుదల చేశారు. ప్రభుత్వం అందిస్తున్న విదేశీ విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వివరాలు 10లో ▸

'వాట్సాప్'పై కేంద్రం సీరియస్



వాట్సాప్ వినియోగంలో లేనప్పుడు వినియోగదారుల అనుమతి లేకుండా ఫోన్‌లోని మైక్రోఫోన్‌ను వాట్సాప్ సంస్థ యాక్సెస్ చేస్తోందని వెల్లువెత్తిన ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. గోప్యత ఉల్లంఘనపై ఐటీ శాఖ సహాయ మంత్రి విచారణకు ఆదేశించారు.

వివరాలు 6లో ▸

కౌలు రైతులకూ సంక్షేమ ఫలాలు అందాలి



'దేశంలో మరెక్కడా లేనివిధంగా ఏపీలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. అవి నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కౌలు రైతులకూ అవి పూర్తి స్థాయిలో అందాలి. ఈ విషయమై సీఎంను కలిసి వివరిస్తా'అని ప్రజా ఉద్యమాల నాయకురాలు మేధా పాట్కర్ చెప్పారు.

వివరాలు 3లో ▸

కళ్లు పొడి బారుతున్నాయ్



వేసవి వేడి గాలుల ప్రభావం వల్ల కళ్లు పొడి బారుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొందరికి టియర్ పొర దెబ్బతిని కంటికి తేమ అందట్లేదని పేర్కొన్నారు. కళ్లు ఎరుపెక్కడం, దురదలు, మంటలు వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కళ్లకు తగిన రక్షణకు వైద్యులు పలు సలహాలిచ్చారు.

వివరాలు 2లో ▸

ఆ జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులకు 16 శాతం హెచ్ఆర్ఏ

- జనాభా నిబంధనలను సడలిస్తూ ప్రభుత్వం నిర్ణయం
- ఇప్పుడు ఉన్న 12 శాతానికి బదులు 16 శాతం హెచ్ఆర్ఏ
- జిల్లా కేంద్రాలు.. పార్వతీపురం, పాడేరు, అమలాపురం, భీమవరం, బాపట్ల, నరసరావుపేట, పుట్టపర్తి, రాయచోటికి వర్తింపు
- జూన్ 1 నుంచి అమలు.. ఉత్తర్వులు జారీ.. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల హర్షం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన జిల్లాల కేంద్రాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి అద్దె భత్యాన్ని (హెచ్ఆర్ఏ) 16 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జనాభా నిబంధనల మేరకు కొన్ని జిల్లా కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు 12 శాతమే ఇంటి అద్దె భత్యం వస్తోంది. అయితే ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు జనాభా నిబంధనలను ప్రభుత్వం సడలించింది. 12 శాతం ఇంటి అద్దె భత్యాన్ని 16 శాతానికి పెంచింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పెంపుదల వచ్చే నెల 1 నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం జనాభా నిబంధనల మేరకు కొత్త జిల్లాల కేంద్రాలైన పార్వతీపురం, పాడేరు, అమలాపురం, భీమవరం, బాపట్ల, నరసరావుపేట, పుట్టపర్తి, రాయచోటిల్లో పనిచేసే ఉద్యోగులకు 12 శాతం ఇంటి అద్దె భత్యాన్ని

మిగతా 3వ పేజీలో ▶



వైజాగ్ స్టాండ్స్ విత్‌యూ: విశాఖలో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు

2 లో

నేడు విశాఖకు సీఎం జగన్

వన్య ప్రాణులకు జీవధార



వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పాపికొండల అభయారణ్యం పరిసర ప్రాంతాల్లో సుమారు 60 నీటి తొట్టెలతో పాటు 20 చలమలను తీసి వన్య ప్రాణులకు నీటి సదుపాయం కల్పించారు.

- వివరాలు 3లో



పాత వాటాలే

- కృష్ణా జలాల పంపిణీపై తేల్చేసిన బోర్డు
- ఏపీకి 512 .. తెలంగాణకు 299 టీఎంసీలు
- అభ్యంతరాలుంటే జల్ శక్తి శాఖ/అపెక్స్ కౌన్సిల్‌ను ఆశ్రయించండి
- తెలంగాణ ప్రభుత్వానికి బోర్డు సూచన
- వాడివేడిగా కృష్ణా బోర్డు సర్వసభ్య సమావేశం

10 లో



క్లుప్తంగా...

నేడు విశాఖకు సీఎం వైఎస్ జగన్

పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విశాఖపట్నంలో పర్యటించనున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని.. ప్రారంభోత్సవాలు చేస్తారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 3.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 3.50 గంటలకు పీఎం పాలెం వైఎస్సార్ స్టేడియానికి చేరుకుని.. అక్కడ ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. సాయంత్రం 4.50 గంటలకు ఆరిలోవకు చేరుకుని అపోలో కేన్సర్ ఆస్పత్రిని ప్రారంభించి ప్రసంగిస్తారు. అనంతరం 5.50 గంటలకు బీచ్ రోడ్డుకు చేరుకుంటారు. అక్కడ వీఎంఆర్డీఏ అభివృద్ధి చేసిన సీ హ్యారియర్ యుద్ధ విమాన మ్యూజియాన్ని సీఎం జగన్ ప్రారంభిస్తారు. అక్కడి నుంచే రామ్‌నగర్‌లోని వీఎంఆర్డీఏ కాంప్లెక్స్, ఎంవీపీలోని ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాలను కూడా ప్రారంభిస్తారు. అనంతరం ఎండాడలోని కాపు భవనం, భీమిలిలోని ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారు. 6.15 గంటలకు బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌కు చేరుకుని ఎమ్మెల్యే గొల్ల బాబురావు కుమారుడి వివాహ రిసెప్షన్‌లో పాల్గొంటారు. అనంతరం రాత్రి 7 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 8.20 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

వైజాగ్ స్టాండ్స్ విత్‌యూ..!

- ఉప్పొంగిన 'హోర్డింగ్స్'.. సీఎం జగన్‌కు ఘన స్వాగతం
- నేడు సీఎం పర్యటన నేపథ్యంలో స్వచ్ఛందంగా ఏర్పాటు




సీఎంకు స్వాగతం పలుకుతూ విశాఖలో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌లు

సాక్షి, విశాఖపట్నం: దశాబ్దాలుగా నిరాదరణకు గురైన ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊపిరి పోసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జనం జేజేలు పలుకుతున్నారు. వికేంద్రీకరణలో భాగంగా విశాఖలో పరిపాలన రాజధానిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో 'వైజాగ్ స్టాండ్స్ విత్‌యూ'.. 'థాంక్యూ సీఎం సార్..' అని నినదిస్తున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కోసం గురువారం విశాఖ వస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు భారీ హోర్డింగ్‌లతో స్వాగతం పలుకుతున్నారు. ముఖ్యమంత్రి పర్యటించనున్న పలు ప్రాంతాల్లో, ముఖ్య కూడళ్ల వద్ద థాంక్యూ సీఎం సార్.. మన విశాఖ.. మన రాజధాని.. మీవెంటే మేముంటాం.. అనే నినాదాలతో స్వచ్ఛందంగా హోర్డింగులు ఏర్పాటు చేశారు. పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వద్ద సీఎం కార్యక్రమం ప్రాంతంలో దాదాపు 50 అడుగుల భారీ హోర్డింగ్‌ని కొందరు ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసి అభిమానాన్ని చాటుకున్నారు. దారి పొడవునా ఏర్పాటైన హోర్డింగ్‌లు ప్రజల మనోగతంతోపాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాటలు వేసిన సీఎం జగన్ పాలన పట్ల ఆదరణను చాటుతున్నాయని పేర్కొంటున్నారు.

వలస ముద్ర స్థానంలో రాజముద్ర!

వీఎంఆర్డీఏ, జీవీఎంసీ చేపట్టిన పలు ప్రాజెక్టులను ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేడు విశాఖలో పర్యటించనున్నారు. దేశ విదేశీ ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్న విశాఖ నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటికే ఉత్తరాంధ్రలో రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు రూపకల్పన చేసి భూమి పూజ చేయడంతోపాటు పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇన్నాళ్లు వలస జిల్లాలుగా ముద్రపడిపోయిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ రూపురేఖలు రాజధాని ఏర్పాటుతో సమూలంగా మారిపోతాయని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారు. సెప్టెంబర్ నుంచి విశాఖ వేదికగా పాలన సాగిస్తానని సీఎం జగన్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో బుధవారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు

నగరం/పట్టణం	గరిష్ఠం	కనిష్ఠం
రెంటచింతల	42.4	27.1
రాజమహేంద్రవరం	41.5	28.0
విజయవాడ	41.0	28.0
మార్కాపురం	41.0	27.0
ఏలూరు	40.0	28.0
తిరుపతి	40.0	27.0
కర్నూలు	39.6	27.4
కడప	38.6	26.6
నెల్లూరు	38.5	28.2
అనకాపల్లి	37.8	25.0
విశాఖపట్నం	37.6	28.0
విజయనగరం	37.0	30.0
శ్రీకాకుళం	37.0	26.0

కళ్లు పొడి బారుతున్నాయ్

ప్రయాణాల్లో కళ్లపై వేడి గాలుల ప్రభావంతో పొడి బారుతున్న కళ్లు

- సెలవుల్లో పిల్లలు స్మార్ట్‌ఫోన్లతోనే కాలక్షేపం
- టియర్ పొర దెబ్బతింటున్నట్టు వైద్యులు వెల్లడి
- కళ్లు ఎరుపెక్కడం, దురదలు, మంటలు వంటి సమస్యలు
- 15 నుంచి 25 ఏళ్ల వారికి ఎక్కువగా వస్తున్నట్టు గుర్తింపు



లబ్బీపేట (విజయవాడ తూర్పు): వేసవి గాలులు తీవ్ర రూపం దాల్చాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేసేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. అలాంటి వారికి వేడి గాలుల ప్రభావంతో కళ్లు పొడిబారిపోతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. దీంతో టియర్ పొర (కన్నీటి గ్రంధి) దెబ్బతిని కంటికి తేమ అందక డ్రై అవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. మరోవైపు పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ఇచ్చేశారు. దీంతో పిల్లలు ఇంట్లోనే స్మార్ట్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తున్నారు. పిల్లల్లో అత్యధికులు రోజులో 3నుంచి 5గంటల పాటు స్మార్ట్‌ఫోన్లు చూస్తున్నారు. అలాంటి వారిలో కంటి సమస్యలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా నిమిషానికి 8 సార్లు కంటి రెప్పల్ని ఆర్పుతుంటాం. అలా చేయడం వల్ల కార్నియాకు అవసరమైన నీరుచేరి కళ్లు డ్రై కాకుండా చేస్తాయి. స్మార్ట్‌ఫోన్ చూసే సమయంలో కనురెప్పలు నిమిషానికి రెండు లేదా మూడుసార్లు మాత్రమే ఆర్పుతుంటారని వైద్యులు చెబుతున్నారు. దీంతో కళ్లు డ్రై అవుతున్నాయంటున్నారు. ప్రస్తుతం కంటి దురదలు, కళ్ల మంటలు రావడం, కొందరికి తలనొప్పి వంటి సమస్యలు వస్తున్నట్టు చెబుతున్నారు. వెలుతురు సరిగ్గా చూడలేకపోవడం, కళ్లు ఎర్రబారడం వంటి లక్షణాలుంటాయంటున్నారు. చికిత్స పొందకుంటే నల్లగుడ్డుపై ప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు.

సకాలంలో చికిత్స పొందాలి



కళ్లు డ్రై అయిన వారిలో దురదలు, కళ్ల మంటలు, ఎర్రగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. అశ్రద్ధ చేస్తే క్రమేణా నల్లగుడ్డుపై ప్రభావం చూపవచ్చు. ప్రతిరోజూ ఐ డ్రాప్స్, ఆయింట్‌మెంట్ వాడటం వలన సమస్యను పరిష్కరించుకోవచ్చు. ఆ మందులు దీర్ఘకాలం వాడినా ఎలాంటి దుష్ఫలితాలు ఉండవు. సమస్య రాకుండా ఉండాలంటే కంటికి దూరంగా.. బ్రైట్‌నెస్ తక్కువగా పెట్టుకుని స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్‌లను వినియోగించాలి.

– సి.త్రివేణి, నేత్ర వైద్య నిపుణురాలు, విజయవాడ

ఏం చేయాలంటే..



- వేసవిలో ప్రయాణాలు చేసేవారు విధిగా కళ్లజోడు వినియోగించాలి.
- తరచూ ముఖాన్ని చన్నీటితో కడుక్కోవడం మంచిది.
- స్మార్ట్‌ఫోన్ బ్రైట్‌నెస్ తక్కువగా పెట్టుకుని ఉపయోగించాలి.
- కళ్లకు ఫోన్‌ను 15 సెం.మీ. దూరంలో ఉంచి చూడాలి. ముఖానికి దగ్గరగా పెట్టకూడదు.
- 20 నిమిషాలపాటు ఫోన్, కంప్యూటర్ వాడిన తర్వాత 20 సెకన్లపాటు దూరంలో ఉన్న వస్తువులను చూడాలి. అలా చేయడం ద్వారా కనురెప్పలు వేయడంతో నల్లగుడ్డు పొరపైకి నీరు చేరి డ్రై కాకుండా చేస్తుంది.
- ఎట్టి పరిస్థితుల్లో చీకట్లో స్మార్ట్‌ఫోన్ వినియోగించకూడదు.
- కంప్యూటర్‌పై పనిచేసే వారు యాంటీ రిఫ్లెక్టివ్ గ్లాస్ వాడితే మేలు.
- రోజులో ఎక్కువసేపు స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్‌పై పని చేసే వారు ఐ డ్రాప్స్, ఆయింట్‌మెంట్ వాడటం ద్వారా దుష్ఫలితాలు లేకుండా చూడవచ్చు.

ఎండ తీవ్రత, ఉక్కపోత

పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతోంది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. ఒకవైపు ఎండవేడి, మరోవైపు ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భూమిపై నుంచి వచ్చే గాలులు వేడిగా ఉండడం, గాలుల్లో వేడి ఎక్కువగా ఉండడంతో ఉక్కపోత ఎక్కువగా ఉంటోందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతాయని ఫలితంగా రాత్రి సమయాల్లో కూడా వేడి వాతావరణం ఉంటుందని తెలిపారు. గురువారం అల్లూరి జిల్లా రాజవొమ్మంగి, అనకాపల్లి జిల్లా నాతవరం, కాకినాడ జిల్లా కోటనందూరు మండలాల్లో తీవ్రవడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బి.ఆర్. అంబేడ్కర్ తెలిపారు. మరో 45 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉన్నట్లు చెప్పారు.

తుపానుగా మారిన అల్పపీడనం

బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం బుధవారం సాయంత్రానికి తుపానుగా మారినట్లు వాతావరణశాఖ తెలిపింది. తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇది పోర్టుబ్లెయిర్‌కి 530 కిలోమీటర్లు, బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్‌కు 1,420 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ 11వ తేదీ రాత్రికి మరింత బలపడుతుందని వాతావరణశాఖ తెలిపింది. తర్వాత ఉత్తర–ఈశాన్య దిశగా కదులుతూ మే 13 నుంచి కొద్దిగా బలహీనపడి ఆగ్నేయ బంగ్లాదేశ్, ఉత్తర మయన్మార్ తీరాలను దాటుతుందని పేర్కొంది.

మనది ఉద్యోగాంధ్ర

ఇక్కడ ఉపాధి అవకాశాలు పుష్కలం... దేశంలో 4వ స్థానం

- ఇంటర్న్‌షిప్ కల్పిస్తున్న రాష్ట్రాల్లో దేశంలోనే అగ్రస్థానం
- వార్షిక వేతనం రూ.2.6 లక్షలకు మించి ఇస్తున్న ప్లేస్‌మెంట్లలోనూ టాప్

(సాక్షి, అమరావతి)

ఉద్యోగాల్లేవని ఒకరోజు... అప్పులు తెచ్చేస్తున్నారంటూ మరో రోజు... ధాన్యం కొనుగోలు చేయటం లేదంటూ ఇంకోరోజు!!. వార్త ఏదైనా అబద్ధమే అజెండా. రామోజీరావుకు నిజాలతో పని లేదు. ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా... సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనను ఎవరు తప్పుబట్టినా... 'ఈనాడు' దృష్టిలో వాళ్లు ప్రముఖులు.. నిపుణులు.. సామాజికవేత్తలు!. రాష్ట్రంలో ఉద్యోగాలు లేవంటూ సోమవారం పతాక శీర్షికలో వండిన కథనం ఈ కోవలోనిదే. వైఎస్ జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచే ప్రయత్నంలో భాగమే. ఉద్యోగాలు, పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ తాలూకు వాస్తవాలివిగో...

ఉద్యోగావకాశాల కల్పనలో దేశంలోని టాప్-5 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ది నాలుగో స్థానం.

ఈ మాట చెప్పింది వేరెవరో కాదు. రెండు నెలల కిందట మార్చిలో సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 'ఇండియా–2023 స్కిల్ నివేదిక'. ఇది... వాస్తవం.

కానీ 'ఈనాడు' ఏం చెబుతోందంటే... రాష్ట్రంలో ఉద్యోగావకాశాలు లేక విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు యువత వెళ్లిపోతున్నారని, దీంతో ఊళ్లలో వృద్ధులే మిగులుతారని. అది కూడా సామాజిక వేత్తలు అంటున్నారని!!.

అసలేంటి చెరుకూరి రామోజీరావు కడుపుమంట? ఇక్కడి పిల్లలు విదేశాలకు వెళ్లకూడదా? అక్కడ చదవకూడదా? ఉద్యోగాలు చేయకూడదా? ఏం! గతంలో ఆంధ్రప్రదేశ్ యువత విదేశాలకు వెళ్లలేదా? పై చదువుల కోసం, ఉన్నత ఉద్యోగాల కోసం విదేశాలకు, దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లటమనేది ఇప్పుడు మొదలైందేమీ కాదుకదా? అలాగే ఇతర రాష్ట్రాల నుంచీ అవసరాన్ని బట్టి మెరుగైన వేతనాల కోసం ఇక్కడకు తగిన నైపుణ్యాలున్న వారు వస్తున్నారు కదా!!. ఇంతటి సహజమైన ప్రక్రియకు రాజకీయాలు అంటగట్టి ఇప్పటి ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్న 'ఈనాడు'కు ఇంకా దిగజారడానికి ఏమైనా ఉందా?

కేంద్రం ప్రభుత్వం విడుదల చేసిన ఇండియా– 2023 స్కిల్ రిపోర్ట్‌లో దేశంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నాల్గో స్థానంలో ఉందంటేనే ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పైపెచ్చు ఇదే నివేదికలో... రాష్ట్రంలో సామాజిక, పారిశ్రామిక, సాంకేతిక మౌలిక సదుపాయాలు అద్భుతంగా మెరుగయ్యాయని కేంద్రం ప్రశంసించింది. వీటివల్ల 2022 సంవత్సరంలో అత్యధిక వృద్ధి సాధించినట్లు స్పష్టం చేసింది. ఈ వాస్తవాలను వదిలేసి బురద జల్లుతున్న 'ఈనాడు'కు చంద్రబాబు సిండ్రోమ్ ముదిరిపోయిందన్నది పచ్చి నిజం. ఏపీలో 22 నుంచి 25 సంవత్సరాల వయసున్న యువత ఉపాధి స్కోరు 64.36 శాతం ఉందని నివేదిక పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం... 18 నుంచి 21 సంవత్సరాలు, 26 నుంచి 29 సంవత్సరాల మధ్య ఉపాధి వనరులు కలిగిన రాష్ట్రాల్లో టాప్ ఐదు రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. ఇక్కడ అత్యధికంగా 93.50 మంది అభ్యర్థులు ఇంటర్న్‌షిప్‌లు పొందుతుండగా... ఇంటర్న్‌షిప్‌లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ది నెంబర్-1 స్థానం.

''నైపుణ్యం లేని ఉద్యోగాలకన్నా ఏదైనా టాలెంట్ పూల్ ద్వారా ఉద్యోగాలను పొందాలని యువత కోరుకుంటోంది. రాబోయే సంవత్సరాల్లో టాలెంట్‌తో కూడిన ఇంటర్న్‌షిప్‌ల విషయంలో ఏపీ ముందుంటుంది. బీఈ, బీటెక్, ఐటీఐ, ఎంఎస్సీ, బీసీఏ రంగాల్లో అత్యధిక అర్హత కలిగిన టాలెంట్ యువత స్కోరు 60 శాతం పైనే ఉంది.'' అని నివేదిక తెలిపింది. ఇంకా ప్లేస్‌మెంట్లలో 2.6 లక్షలు, అంతకన్నా ఎక్కువగా వేతనాలు అందే రాష్ట్రాల్లోఏపీ మొదటి స్థానంలో ఉంది. చంద్రబాబు నాయుడి హయాంలో ప్లేస్‌మెంట్లు 37 వేలు మాత్రమే ఉంటే అదే ఇప్పుడు ఈ ప్రభుత్వ హయాంలో 2021–22లో ప్లేస్‌మెంట్లు 85 వేలకు చేరాయి. పైపెచ్చు రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో 2018–19లో నిరుద్యోగ రేటు 5.3 శాతం ఉండగా... ఇపుడది 4.2 శాతానికి తగ్గినట్లు స్వయంగా కేంద్ర కార్మికమంత్రిత్వ శాఖ ప్రకటించింది.



బీఈఎల్ నూతన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం (ఫైల్)

ఫ్యాక్ట్ చెక్

హెచ్ఎస్‌బీసీ వెళ్లిపోయిందెప్పుడు రామోజీ?

ఈ వాస్తవాలను విస్మరించిన 'ఈనాడు'... ఎప్పుడో 2015లోనే దేశం వీడి వెళ్లిపోయిన హెచ్ఎస్‌బీసీని పట్టుకుని ఇప్పుడే వెళ్లిపోయిందంటూ అబద్ధాలను వండేసింది. ఇక ఇన్ఫోసిస్, బీఈఎల్, అమెజాన్ డీసీ, డిక్సన్, డబ్ల్యుఎన్ఎస్, ర్యాండ్‌స్టాడ్ వంటి దిగ్గజ సంస్థలు వచ్చి రాష్ట్రంలో కార్యకలాపాలు సాగిస్తున్నా... వాటికి ప్రస్తావిస్తే ఒట్టు. పైపెచ్చు కంపెనీలు వెళ్లిపోతున్నాయంటూ నిస్సిగ్గుగా అబద్ధాలు!!. 2015లోనే హెచ్ఎస్‌బీసీ తన వ్యాపార వ్యూహంలో భాగంగా దేశంలో కార్యకలాపాలను మూసేసుకుని వెళ్లిపోతే ఇప్పుడే కొత్తగా విశాఖ నుంచి హెచ్ఎస్‌బీసీ వెళ్లిపోయిందని... అది కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వల్లేనని 'ఈనాడు' రాసిందంటే జగన్ సర్కారుపై ఎంత కక్షతో వ్యవహరిస్తున్నదో అర్థంకాక మానదు.

పెట్టుబడుల హబ్‌గా మారుతున్న ఏపీ

ప్రైవేటు రంగంలో అత్యధిక ఉద్యోగాలిచ్చే సామర్థ్యం ఉన్న ఎంఎస్ఎంఈ రంగంలోనే... గడిచిన నాలుగేళ్ల రూ.24 వేల కోట్ల పెట్టుబడులతో పాటు 12.60 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయి. నిజానికి పారిశ్రామిక ప్రోత్సాహకాలు (ఇన్సెంటివ్‌లు) సమయానికిస్తేనే ఇవి బతికి బట్టకడతాయని బాబుకు తెలిసినా వీటిని పట్టించుకోలేదు. ఇన్సెంటివ్‌లను గాలికొదిలేశారు. బాబు నిర్లక్ష్యంతో దారుణంగా చితికిపోయిన ఈ రంగానికి వైఎస్ జగన్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చి... ప్రోత్సాహకాలను సమయానికి ఇవ్వడమే కాకుండా... అలా ఇచ్చేందుకు పటిష్ఠమైన వ్యవస్థను తీసుకొచ్చింది. అందుకే ఇన్ని ఉద్యోగాలొచ్చాయి. ఇక భారీ పరిశ్రమల్లోనైతే 85 వేల మందికి ఉపాధి లభించింది. ఐటీ రంగంలో చంద్రబాబు హయాంలో రూ. వెయ్యి కోట్ల పెట్టుబడులు, 14వేల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. కానీ ఈ నాలుగేళ్లలో జగన్ సారథ్యంలో ఈ రంగంలో రూ.5,700 కోట్ల పెట్టుబడులు, 30 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఈ గణాంకాలన్నీ ఏ సామాజిక వేత్తలో, వైఎస్సార్‌సీపీ అభిమానులో చెబుతున్నవి కాదు. గణాంకాలన్నీ మదించి... కేంద్ర ప్రభుత్వం నివేదించినవి.

ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ... విప్లవం

ప్రైవేట్ రంగంలోనే కాకుండా ప్రభుత్వ రంగంలో సైతం గతంలో ఎన్నడూ లేనన్ని ఉద్యోగాలను ఈ ప్రభుత్వం కల్పించింది. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు 4 లక్షల మంది ఉన్నారు. కానీ వైఎస్ జగన్ పాలనా పగ్గాలు చేపట్టాక ఈ సంఖ్య 6 లక్షలు దాటింది. అంటే... ఉన్న ఉద్యోగాల్లో 50 శాతాన్ని అదనంగా... అది కూడా ప్రభుత్వ రంగంలో ఈ నాలుగేళ్లలోనే సాధ్యం చేసి చూపించారు. వీరికి తోడు మూడు లక్షలకు పైగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అవకాశాలొచ్చాయి. మరి ఇవన్నీ ఎవరికిచ్చారు రామోజీ? ఈ రాష్ట్ర యువతకే కదా? వేరే దేశంలోని యువతకు కాదు కదా? ఎందుకీ దిగజారుడు రాతలు!!. నిత్యం ఏదో ఒకరకంగా బురద జల్లేటపుడు... కనీసం ఆత్మసాక్షిని ప్రశ్నించుకోవాలి కదా? చంద్రబాబుపై ఉన్న ప్రేమతో ఈ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దారుణంగా దెబ్బతీస్తున్నామనే స్పృహ లేదెందుకు? ఒక్క సచివాలయ వ్యవస్థ ద్వారానే సుమారు 1.30 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలివ్వటం... వైద్య ఆరోగ్య శాఖలో కొత్తగా 49 వేల మందికి ఉద్యోగాలు కల్పించటం... 52 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటం... ఇదంతా ఈ ప్రభుత్వం రాసిన కొత్త చరిత్ర కాదా? దీన్ని మీ పత్రిక సాయంతో దాచేయగలరా?

పారిశ్రామికులు ఏమంటున్నారో తెలియదా?

ఈ దేశంలో నెంబర్-1 గ్రూపుగా వెలుగొందుతున్న రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ నుంచి స్టీల్ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అధినేత సజ్జన్ జిందాల్, కరణ్ అదానీ, సెంచురీ ప్లై భజాంకా, శ్రీ సిమెంట్ బంగూర్... ఇలా దిగ్గజాలంతా ఇటీవలి అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు (జీఐఎస్) వేదికపై ఆంధ్రప్రదేశ్‌కు తామిస్తున్న ప్రాధాన్యాన్ని చెప్పకనే చెప్పారు. ఇక్కడి నాయకత్వంపై తమకున్న నమ్మకాన్ని బహిరంగంగా వ్యక్తపరిచారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని పారిశ్రామికంగా ముందుకు తీసుకెళుతున్నారని సభాముఖంగా చెప్పారు. మరి ఇవన్నీ మీకు కనిపించవా రామోజీ? దిగ్గజ పారిశ్రామిక వేత్తలంతా ఇంతలా ప్రశంసిస్తుంటే పరిశ్రమలు రావటం లేదని, ఉద్యోగాలు లేవని ఎందుకీ దౌర్భాగ్యపు రాతలు?

రామోజీరావు రాస్తున్నట్టుగా ఇక్కడ పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం లేకపోతే... పరిశ్రమలు తాము సంతోషంగా ఉన్నామని చెప్పకపోతే... సులభతర వాణిజ్య విధానాన్ని అవలంబించే రాష్ట్రాల్లో (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) గత మూడేళ్లుగా ఏపీ ఎందుకు నెంబర్-1గా నిలుస్తుంది? దేశంలో ఏ రాష్ట్రానికీ దక్కని ఈ హోదా మన రాష్ట్రానికే ఎందుకు దక్కుతోంది? అర నిమిషంలో తనను ముఖ్యమంత్రి ఒప్పించారంటూ... 6 నెలల్లో ఆలోచన నుంచి అనుమతులన్నీ వచ్చి, భూ కేటాయింపు పూర్తయి శంకుస్థాపన చేయగలిగామని సాక్షాత్తూ టెక్ మహీంద్రా సీఈఓ గుర్నానీ ప్రశంసించారు. ఆయన తన కుమారుడి బయో ఇథనాల్ ప్లాంటు 'అస్సాగో'కు ఏపీనే ఎంచుకున్నారు. ఏపీలో పరిశ్రమలకు రెడ్ కార్పెట్ వేస్తున్నారని చెప్పింది ఏకంగా ఐటీసీ సీఈఓ సంజీవ్ పురి. ఏపీలో అతిపెద్ద స్పైసెస్ ప్రాసెస్ ప్లాంట్‌ను ఇటీవలే ఆయన ప్రారంభించారు. ఇక ఆదిత్యబిర్లా గ్రూపు వైఎస్సార్ జిల్లాలో గార్మెంట్స్ తయారీ యూనిట్‌కు భూమి పూజ చేసిన రెండు నెలలకే తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురంలో కాస్టిక్ సోడా యూనిట్‌ను ప్రారంభించింది. తమ గ్రూపు సంస్థలకు ఏపీ కీలకమని, మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే సత్తా రాష్ట్రానికి ఉందని ఆ గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లాయే చెప్పారు. 'రావాలి జగన్... కావాలి జగన్' అనే నినాదం ఇప్పుడు 'జగన్ వచ్చారు... అభివృద్ధి తెచ్చారు' అనేట్లుగా మారిందనేది డిక్సన్ టెక్నాలజీస్ ప్రెసిడెంట్ పంకజ్ శర్మ ప్రశంస. ఎలక్ట్రానిక్ ఉపకరణాల ఉత్పత్తి కేంద్రానికి కొప్పర్తి ఈఎంసీలో భూమి పూజ చేశారాయన. ఇక రూ.600 కోట్లు పెట్టుబడి పెడదామనుకున్నామని, దాన్నిపుడు రూ.2,600 కోట్లకు పెంచుతున్నామని చెప్పింది సాక్షాత్తూ సెంచురీ ప్లైవుడ్ చైర్మన్ సజ్జన్ భజాంక. తమిళనాడులో యూనిట్ ఏర్పాటు చేయాలనుకున్నా... రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు కూడా ఆయనే చెప్పారు. తొమ్మిది రాష్ట్రాల్లో సిమెంటు ప్లాంట్లున్న శ్రీసిమెంట్... తొలిసారి ఏపీలో అడుగుపెడదామని నిర్ణయించుకున్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శ్రీసిమెంట్ ఎండీ హరిమోహన్ బంగూర్ కలిశాకే. గుంటూరులో రూ.1,500 కోట్లతో ప్లాంటును రెండేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించింది కంపెనీ. మరి ఒక్క కంపెనీ కూడా రాలేదని... ఇప్పటికే ఉన్నవి కూడా వెళ్లిపోతున్నాయని విష ప్రచారమెందుకు?

ఇవిగో వాస్తవాలు...

ప్లేస్‌మెంట్లలో 2.6 లక్షలకు అంతకు ఎక్కువగా వేతనాలు అందే రాష్ట్రాలు

1వ స్థానం	ఆంధ్రప్రదేశ్
2వ స్థానం	కర్ణాటక
3వ స్థానం	మహారాష్ట్ర
4వ స్థానం	తమిళనాడు
5వ స్థానం	ఉత్తరప్రదేశ్

అత్యధిక ఉద్యోగాల కల్పన ఉన్న రాష్ట్రాలు

1వ స్థానం	ఉత్తరప్రదేశ్
2వస్థానం	మహారాష్ట్ర
3వస్థానం	ఢిల్లీ
4వ స్థానం	ఆంధ్రప్రదేశ్
5వ స్థానం	రాజస్థాన్

ఇంటర్న్‌షిప్‌ను అందుకుంటున్న వారి శాతం

ఆంధ్రప్రదేశ్	93.50
రాజస్థాన్	93.22
జార్ఖండ్	92.98
కర్ణాటక	91.62
వెస్ట్ బెంగాల్	91.38

ప్లేస్‌మెంట్లు ఇలా

సంవత్సరం	సంఖ్య	వేతనం (లక్షల్లో)
2018-19	37000	2.50
2019-20	52000	3.50
2020-21	69000	4.20
2021-22	85000	5.00

3 కారిడార్లు ఇక్కడే...

తాజాగా విశాఖపట్నంలో శంకుస్థాపన చేసిన అదానీ డేటా సెంటర్‌తో పాటు విజయవాడ, తిరుపతి, అనంతపురాల్లో ఏర్పాటు చేస్తున్న ఐటీ పార్కుల ద్వారా లక్షల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. దేశ వ్యాప్తంగా 11 ఇండస్ట్రియల్ కారిడార్లు అభివృద్ధి చెందుతుంటే.. అందులో మూడు కారిడార్లు అభివృద్ధి చేస్తున్న రాష్ట్రం ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమే. 50 వేల ఎకరాల పారిశ్రామిక భూములు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తూ పారిశ్రామికవేత్తలకు కావాల్సిన మౌలిక వసతులన్నిటినీ కల్పిస్తోంది. రాష్ట్రంలో తిరుపతిలో రెండు, శ్రీసిటీ, కొప్పర్తిల్లో ఒక్కొక్కటి చొప్పున ఉన్న ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లలో పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లోనూ యువతకు ఉపాధి అవకాశాలూ పెరుగుతున్నాయి. ఇవీ.. 'ఈనాడు' చెప్పని వాస్తవాలు.



అదానీ డేటా సెంటర్‌కు భూమి పూజ చేస్తున్న సీఎం వైఎస్ జగన్, అదానీ గ్రూప్ ఎండీ రాజేష్ అదానీ, సీఈవో కరణ్ అదానీ (ఫైల్)

నాలుగేళ్లలో నాలుగు పోర్టులు

రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 6 పోర్టులతో పాటు మరో నాలుగు పోర్టుల ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి రాచబాట వేశారు ముఖ్యమంత్రి జగన్. దీని ద్వారా ఆయా పోర్టులు ఏర్పాటవుతున్న ప్రాంతాల్లోని స్థితిగతులు సమూలంగా మారబోతున్నాయి. వేల మందికి ఉద్యోగాలు రాబోతున్నాయి. వీటితో పాటు 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం జరుగుతోంది. విమానాశ్రయాలను చూసుకున్నా ఇటీవలే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికీ అనుమతులు అన్నీ మంజూరయి శంకుస్థాపన రాయి పడింది. కర్నూలు, కడప విమానాశ్రయాలు అందుబాటులోకి వచ్చి విమానాల రాకపోకలు పెరుగుతున్నాయి. ఇక బల్క్ డ్రగ్ పార్క్ కోసం 17 రాష్ట్రాలు పోటీ పడితే దక్షిణ భారతదేశంలో బల్క్ డ్రగ్ పార్క్ సాధించిన ఘనత మన రాష్ట్రానికే దక్కింది. 2022వ సంవత్సరంలో అత్యధికంగా పెట్టుబడులు ఆకర్షించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. ఇవన్నీ చెబుతున్నది కేంద్ర ప్రభుత్వ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ విభాగమైన డీపీఐటీ నివేదికలే. కాకపోతే చంద్రబాబు మైకంలో కొట్టుకుంటున్న 'ఈనాడు'కు గానీ... ఎల్లో వైరస్ సోకిన రామోజీరావుకు గానీ... ఇవేవీ కనిపించవు. జనానికి వాస్తవాలు తెలుస్తున్నాయని, గతంలో మాదిరి తాము చెప్పిందే జనానికి తెలిసే రోజులు పోయాయనే స్పృహ 'ఈనాడు'కు లేకపోవటమే ఎల్లో ముఠా దౌర్భాగ్యం.



క్లుప్తంగా...

ఉత్తమ డ్రైవర్లకు ఆర్టీసీ ఎండీ అభినందన




ఉత్తమ డ్రైవర్లతో ఎండీ తిరుమలరావు

సాక్షి, అమరావతి: దేశంలోనే ఉత్తమ డ్రైవర్లుగా 'హీరోస్ ఆన్ రోడ్'పేరుతో 2 విభాగాల్లో (సిటీ, మఫిసల్) అవార్డులు గెలుచుకున్న ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్లను సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు బుధవారం సన్మానించారు. సిటీ విభాగంలో ఆత్మకూరు (కర్నూలు) డిపోకి చెందిన డ్రైవర్ ఏఎం బాషా, మఫిసల్ విభాగంలో సింహాచలం డిపో డ్రైవర్ ఎస్ఏఎన్ రాజు తమ సర్వీస్‌లో ఒక్క యాక్సిడెంట్ కూడా చేయకుండా విధులు నిర్వర్తించినందుకు జాతీయ అవార్డులు అందుకున్నారు. ఎండీ మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడం ఆర్టీసీ ఉద్యోగుల ప్రథమ కర్తవ్యమన్నారు. డ్రైవర్లు అందరూ బాషా, రాజులను ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు గోపీనాథ్ రెడ్డి, రవికుమార్, బ్రహ్మానంద రెడ్డి, కోటేశ్వరరావు, కృష్ణ మోహన్, ఓఎస్డీ రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ గడువు మార్చి 31 వరకు పొడిగింపు

- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు..
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు జీవోఆర్టీ నంబరు 341ని బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు జారీచేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు అమలు చేస్తున్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని గతంలో 2022 ఆగస్టు 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ గడువును వచ్చే మార్చి 31 వరకు మళ్లీ పొడిగించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రస్తుతం అమలు చేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)అమలులో ఎదురయ్యే అవాంతరాలను అధిగమించేందుకు ఈ గడువు పెంపు దోహదపడనుంది. ఇందుకు సంబంధించి వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవోను ప్రభుత్వం ఆదేశించింది.

ఈహెచ్ఎస్ కింద బెంగళూరు, చెన్నైల్లో వైద్యం

సాక్షి, అమరావతి: పూర్వపు నెల్లూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన ఈహెచ్ఎస్ కార్డుదారులు చెన్నై, వెల్లూర్, బెంగళూరుల్లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఈహెచ్ఎస్ పథకం అమలుకు సంబంధించి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రభుత్వం నిర్వహించిన సమావేశంలో ప్రతినిధులు చేసిన విజ్ఞాపనను పరిగణనలోకి తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏసీబీకి చిక్కిన కంభం సబ్ రిజిస్ట్రార్

- స్థలం రిజిస్ట్రేషన్ కోసం రూ.15 వేలు డిమాండ్
- డాక్యుమెంట్ రైటర్ ద్వారా బాధితుడి నుంచి వసూలు

సాక్షి, అమరావతి/కంభం: స్థలం రిజిస్ట్రేషన్ కోసం రూ.15 వేలు లంచం తీసుకుంటూ ప్రకాశం జిల్లా కంభం మండల సబ్ రిజిస్ట్రార్ శ్రీరామ శ్రీరామమూర్తి ఏసీబీకి చిక్కాడు. కంభం మండలానికి చెందిన ఒక వ్యక్తి తన భార్య పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. రూ.15 వేలు లంచం ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తానంటూ సబ్ రిజిస్ట్రార్ శ్రీరామమూర్తి డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఏసీబీ అధికారులు బుధవారం రంగంలోకి దిగారు. సబ్ రిజిస్ట్రార్ సూచనలతో డాక్యుమెంట్ రైటర్ బలబద్రుని రామచంద్రరావు బాధితుడి నుంచి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఒంగోలు అవినీతి నిరోధక శాఖాధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం జరిపిన సోదాల్లో సబ్ రిజిస్ట్రార్ వద్ద నుంచి సంబంధిత డాక్యుమెంట్‌ను స్వాధీనం చేసుకున్నారు. దర్శిలోని ఆయన ఇంటిని సీజ్ చేశారు. కంభంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో సోదాలు కొనసాగుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్‌ను అదుపులోకి తీసుకుని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పర్చారు. ఏసీబీ కాల్ సెంటర్ 14400తో పాటు ఏసీబీ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలతో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

వన్య ప్రాణులకు జీవధార

- ఇప్పటికే చలమలు, చెక్‌డ్యామ్‌లు
- అవి కాకుండా 60 నీటి తొట్టెల ఏర్పాటు
- వడదెబ్బ కొట్టకుండా ఉప్పు ముద్దల ఏర్పాటు
- పాపికొండల అభయారణ్యంలో అధికారుల చర్యలు



అడవిలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెల్లో నీరు తాగుతున్న వన్యప్రాణులు

బుట్టాయగూడెం: వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రెండేళ్లుగా వన్యప్రాణి సంరక్షణ కోసం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు సత్ఫలితాలనిస్తున్నాయి. గతంలో వేసవిలో నీటి కోసం వన్యప్రాణులు అటవీ పరిసర ప్రాంతాల్లోని జనావాసాల్లోకి వచ్చేవి. ఆ సమయంలో కుక్కల బారిన లేదా వాహనాల కింద పడి మృతి చెందేవి. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు వన్యప్రాణులు సంచరించే ప్రాంతాల్లో నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తున్నారు. ఏలూరు జిల్లా పరిధిలోని పాపికొండల అభయారణ్యం పరిసర ప్రాంతాల్లో సుమారు 60 నీటి తొట్టెలను ఏర్పాటు చేసినట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. వీటితో పాటు అటవీ ప్రాంతంలోని కాలువల్లో 20 చలమలను తీసి, వన్యప్రాణులకు నీటి సౌకర్యం లభించేలా చర్యలు తీసుకున్నారు. అవి కాకుండా 25 చెక్ డ్యామ్‌ల ద్వారా నీటిని నిల్వ ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా నీటి తొట్టెల్లో వేసవిలో నాలుగు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా బేస్‌క్యాంప్ సిబ్బంది, బీట్ అధికారులు నీటిని తెచ్చి నింపుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ.1.50 లక్షలు మంజూరు చేస్తోంది. నీటి తొట్టెల పక్కన ఉప్పు ముద్దలను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. నీటి కోసం వచ్చిన వన్యప్రాణులు ఆ నీరు తాగి.. ఉప్పు ముద్దను నాకుతాయని.. దీనివల్ల వడదెబ్బ బారి నుంచి కాపాడుకునే అవకాశాలుంటాయని అటవీశాఖ అధికారులంటున్నారు. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో పాపికొండల అభయారణ్యం పరిధిలో ఉన్న బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కదలికలు ఎక్కువగా ఉన్నాయి. పాపికొండల అభయారణ్యంలో ఎలుగు బంట్లు, కొండ గొర్రెలు, జింకలు, కొండ చిలువలు, అడవి పందులు, ఆగలి, చిరుతలు, ముళ్ల పందులు, జాకర్స్, దుప్పలు వంటి అనేక జంతువులున్నట్లు అధికారులు గుర్తించారు. వాటికి వేసవిలో దాహార్తి తీర్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



పాపికొండల అభయారణ్యంలోని వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక కృషి చేస్తున్నాం. సుమారు 60 నీటి తొట్టెలు వన్యప్రాణులు సంచరించే ప్రదేశాల్లో ఏర్పాటు చేశాం. వేసవిలో నాలుగు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా నీరు పోసి నింపుతున్నాం. జంతువులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– దావీదు రాజునాయుడు, ఫారెస్ట్ రేంజ్ అధికారి, పోలవరం

ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాల్సింది వైద్యులే

- ఆస్పత్రి నుంచి రోగి సంతృప్తితో ఇంటికి వెళ్లినప్పుడే ప్రభుత్వ కృషి ఫలించినట్లు..
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



మాట్లాడుతున్న మంత్రి రజిని

సాక్షి, అమరావతి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత వైద్యులపైనే ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లోని పరిపాలనా విభాగానికి చెందిన అధికారులకు విజయవాడలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి రజిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిబ్బందికి సర్వీస్ రూల్స్, ఫైల్స్ నిర్వహణ, ఆస్పత్రి, కళాశాలల్లో పరిపాలనా బాధ్యతలు, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వైద్య శాఖలో 49 వేలకు పైగా పోస్టులను భర్తీ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. అంతేకాకుండా ప్రతి గ్రామానికి విలేజ్ హెల్త్ కేర్ సెంటర్ తీసుకొచ్చామని, ఇందులో ప్రాథమిక వైద్య పరీక్షలన్నీ చేస్తున్నట్లు వివరించారు. మందులు కూడా అందుబాటులో ఉన్నాయని.. 80 శాతం మంది ప్రజలు ఇప్పుడు ఈ స్థాయిలోనే వైద్యం పొందుతున్నారని పేర్కొన్నారు. వైద్య విద్యలో నూతన అధ్యాయానికి తెరతీస్తూ ఏకంగా 17 వైద్య కళాశాలలను సీఎం జగన్ ఏర్పాటు చేస్తున్నారని.. వీటిలో 5 కాలేజీల్లో వచ్చే విద్యా సంవత్సరంలోనే తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. కొత్త వైద్య కళాశాలల నిర్మాణం.. ఇప్పటికే ఉన్న ఆస్పత్రుల బలోపేతం, ఇతర సదుపాయాల కల్పనకు నాడు–నేడు కింద రూ.16 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ఆస్పత్రుల్లోని సిబ్బంది సమయ పాలన కచ్చితంగా పాటించేలా చూడాలని సూపరింటెండెంట్‌లను మంత్రి ఆదేశించారు. ఆస్పత్రి నుంచి ప్రతి రోగి సంతృప్తిగా ఇంటికి వెళ్లినప్పుడే ప్రభుత్వ కృషి ఫలించినట్లన్నారు. ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి రజిని చెప్పారు. ఏకంగా 3,255 ప్రొసీజర్‌లను పథకం పరిధిలోకి తెచ్చామన్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెండింగ్ బిల్లులను ఇప్పటికే కొంత మేర చెల్లించామని.. త్వరలో మరికొంత మొత్తం చెల్లిస్తామన్నారు. సమావేశంలో డీఎంఈ డాక్టర్ నరసింహం, అడిషనల్ డీఎంఈ డాక్టర్ సత్యవరప్రసాద్, ఏడీ అప్పారావు, మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, బోధనాస్పత్రుల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు

- పవన్, చంద్రబాబు మా లెక్కల్లోనే లేరు
- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి


రాజానగరం/రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి ప్రపంచ దేశాలను కూడా ఆకర్షించేరీతిలో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపాన లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించిన రైతు బజారుని, స్టాల్స్‌ను, కాతేరులో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల నూతన భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. రైతుబజారు వద్ద జరిగిన సభలోను, వ్యవసాయ కళాశాల వద్ద మీడియాతోను మాట్లాడారు. రాష్ట్రంలో రైతాంగానికి మేలు జరిగిందంటే అది వైఎస్సార్, జగన్ ప్రభుత్వాల్లోనేనని ఘంటాపథంగా చెప్పగలమన్నారు. తమ ప్రభుత్వం ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి ఆ సీజన్‌లోనే పరిహారం అందజేస్తోందని చెప్పారు. ఇన్‌పుట్ సబ్సిడీలను వెనువెంటనే అందజేస్తున్న ప్రభుత్వం కూడా తమదేనన్నారు. ఇందుకు అవసరమైన బీమా ప్రీమియంని ఫసల్ బీమా పథకంలో కేంద్రం నిరాకరిస్తే రైతులు, ప్రభుత్వం పక్షాన ప్రభుత్వమే చెల్లిస్తోందని చెప్పారు. వర్షాలకు వాటిల్లిన పంటనష్టాన్ని ప్రభుత్వ యంత్రాంగం అంచనావేస్తోందని, ఆ వెంటనే రైతులను ఆదుకుంటామని తెలిపారు. తడిసి మొలకలు వస్తున్న ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసేలా ఆదేశాలిచ్చిన సీఎం చరిత్రలో జగన్ తప్ప మరొకరు లేరని చెప్పారు.

చంద్రబాబు హయాంలో రైతులకు రూ.5 వేలకోట్ల ఎగవేత

చంద్రబాబు హయాంలో రైతులకు సీడ్‌బకాయిలు, డ్రిప్ ఇరిగేషన్ బకాయిలు, రైతుపథం బకాయిలు, ధాన్యం కొనుగోళ్ల బకాయిలు దాదాపు రూ.5 వేలకోట్లకుపైగా సొమ్ము ఎగవేసి పోయారని చెప్పారు. చంద్రబాబు తన హయాంలో రెండేళ్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని, దిగిపోతూ రైతుల బీమాసొమ్ము సైతం ఎగ్గొట్టి పోయాడని పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు సైతం రూ.5 లక్షల సొమ్ము ఇవ్వలేదన్నారు. అటువంటి చంద్రబాబు ఇప్పుడు దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నాడన్నారు. చంద్రబాబు సర్కారులో రైతులకు వ్యవసాయ పనిముట్లు సరఫరా చేస్తున్నామంటూ దోపిడీకి పాల్పడ్డారని చెప్పారు. రైతురథాలను పచ్చచొక్కాలకే పరిమితం చేశారని, మార్కెట్లో రూ.5 లక్షలు ఖరీదున్న ట్రాక్టరును రూ.6 లక్షలకు రైతులకు అంటగట్టారని పేర్కొన్నారు. ఇది నిజం కాదని నిరూపించగలవా చంద్రబాబు అంటూ సవాల్ విసిరారు. జనసేన పవన్‌కళ్యాణ్‌కు వ్యవసాయమే తెలియదని, పదిపంటలను చూపిస్తే ఐదు పంటలు కూడా చెప్పలేరని పేర్కొన్నారు. పవన్, చంద్రబాబులకు దడిసే ప్రసక్తిలేదని, ఆ ఇద్దరూ తమ లెక్కల్లోనే లేరని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో హోంమంత్రి తానేటి వనిత, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకూ సంక్షేమ ఫలాలు అందాలి

- దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు
- వీటిని కౌలు రైతులకూ అందించాలి
- భూ యజమాని సంతకంతో పని లేకుండా సీసీఆర్సీ కార్డులివ్వాలి
- సీఎం వైఎస్ జగన్‌ను కలిసి కౌలు రైతుల సమస్యలు వివరిస్తా
- ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక నాయకురాలు మేధాపాట్కర్




సాక్షి, అమరావతి: 'దేశంలో మరెక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. అవి నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. భూమినే నమ్ముకొన్న కౌలు రైతులకు కూడా అవి పూర్తి స్థాయిలో అందాలి. ఈ విషయమై త్వరలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వివరిస్తాను' అని ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక నాయకురాలు మేధా పాట్కర్ చెప్పారు. రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో విజయవాడలో కౌలు రైతుల సమస్యలపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆత్మహత్యలకు పాల్పడే రైతుల్లో 90 శాతం కౌలు రైతులేనని చెప్పారు. విజయ్ మాల్యా లాంటి వారు వేల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతుంటే భూమినే నమ్ముకున్న రైతులు మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రకృతి, నేలపై ఆధారపడి జీవించే వారిని ఆదుకోకపోతే అధోగతి తప్పదని చెప్పారు. దేశంలో సంపన్నుల ఆస్తులు రోజురోజుకు పెరుగుతున్నాయని, రైతులు మాత్రం భూములమ్ముకొని కూలీలుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా రైతుల సాగులో ఉన్న భూములు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని, అటవీ భూములనూ వదలడంలేదని తెలిపారు. మోదీ సర్కారు చట్టాలు అమలులో మాయ చేస్తోందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, దేశవ్యాప్తంగా రుణ విముక్తి, కనీస మద్దతు ధరల చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆ ఒక్క సంతకం వల్ల కౌలు రైతులు నష్టపోతున్నారు

2019 లో తెచ్చిన పంట సాగుదారు హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయకపోవడం వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. భూ యజమాని సంతకం చేస్తేనే కౌలుదారులకు పంట సాగుదారు హక్కు పత్రం (సీసీఆర్సీ) ఇస్తున్నారని తెలిపారు. కానీ 90 శాతం భూయజమానులు సీసీఆర్సీలపై సంతకం చేయడం లేదన్నారు. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, పంట నష్టపరిహారం వంటి సంక్షేమ ఫలాలు కౌలుదారులకు అందడం లేదని వివరించారు. ఈ ఫలాలన్నీ సాగు చేయని భూ యజమానుల ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు. అందువల్ల వారికి భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా క్షేత్రస్థాయి అధికారుల సిఫారసుతో సీసీఆర్సీ కార్డులు ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు న్యాయం చేయాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్థాయిలోనే ధ్రువీకరించి కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులివ్వాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. దేవదాయ, ఈనాం, వక్ఫ్, ఎస్సీ కార్పొరేషన్ నుంచి లీజుకు తీసుకుని సాగు చేస్తున్న కౌలుదారులకు సీసీఆర్సీ కార్డులు ఇవ్వాలని అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సంఘం జాతీయ కార్యదర్శి పీఎస్ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సదస్సుకు అధ్యక్షత వహించిన రైతు స్వరాజ్య వేదిక నాయకులు విస్సా కిరణ్‌కుమార్ రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 4,154 మంది కౌలు రైతులను సర్వే చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలుదారులుంటే, 5.47లక్షల మందికి (8.8 శాతం) మాత్రమే సీసీఆర్సీ కార్డులిచ్చారని తెలిపారు. కౌలు రైతుల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏడు తీర్మానాలు చేశారు.

త్వరలో రాజకీయ నిర్ణయం

కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం



మీడియాకు లేఖను విడుదల చేస్తున్న పద్మనాభం, జేఏసీ నేతలు


సాక్షి ప్రతినిధి, కాకినాడ/కిర్లంపూడి: తన భవిష్యత్ రాజకీయ నిర్ణయం త్వరలో ప్రకటిస్తానని మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తెలిపారు. ఈ మేరకు ప్రజలకు రాసిన మూడు పేజీల బహిరంగ లేఖను కాకినాడ జిల్లా కిర్లంపూడిలో బుధవారం మీడియాకు విడుదల చేశారు. 2016 జనవరి 31న తునిలో కాపుగర్జన సభ జరిగిన మరునాడు తనను తీహార్ జైలుకు తీసుకెళ్లటానికి హెలికాప్టర్ సిద్ధంగా పెట్టారని, వెంటనే బెయిల్ తెచ్చుకోవాలని.. లేదంటే అండర్ గ్రౌండ్‌కు వెళ్లిపోవాలని పలువురు సలహా ఇచ్చారని గుర్తు చేశారు. అప్పట్లో అలా చేసి ఉంటే కులంతో పాటు ఉద్యమం కూడా చులకనయ్యేదని ముద్రగడ అన్నారు. తుని సమావేశంలో ఎక్కువగా భయపడింది, బాధపడింది తనతో ఉన్న సామాన్యుల కోసమేనని పేర్కొన్నారు. అందుకే.. సభకు వచ్చిన వారిని బాధ పెట్టొద్దని, సభ పెట్టడానికి తానే కారకుడనని, అన్ని కేసులు తనపై పెట్టుకోవాలని ఆనాడే ప్రభుత్వానికి చెప్పానన్నారు. ఈ కేసులో ఉరిశిక్ష వేసినా హైకోర్టుకు అప్పీల్‌కు వెళ్లకూడదని నిశ్చయించుకున్నానని తెలిపారు.

'ప్రత్తిపాడు రాజకీయ భిక్ష పెట్టింది'

ప్రత్తిపాడు నియోజకవర్గం తనకు రాజకీయ భిక్ష పెట్టిందని, తన తాత పద్మనాభం మున్సబుగా, తండ్రి వీరరాఘవరావు స్వతంత్ర ఎమ్మెల్యేగా తమ కుటుంబానికి విలువ తెచ్చారని ముద్రగడ పేర్కొన్నారు. నీతిగా, నిజాయితీగా, ధైర్యంగా ఉంటూ ఎవరికీ అన్యాయం చేయకూడదని వారు చెప్పారని, తన ఊపిరి ఉన్నంత కాలం ఆ మాటలు గుర్తుంటాయన్నారు. వారి బాటలో నడిచే తాను జాతిని అమ్మకం, తాకట్టు పెట్టలేదన్నారు. ఉద్యమాలు, రాజకీయాల్లో డబ్బు సంపాదించాలనే ఆలోచన ఎప్పుడూ రాలేదన్నారు. కాపు జాతి రిజర్వేషన్ల కోసం ప్రయత్నించి జోకర్ కార్డు మాదిరిగా అయినందుకు బాధపడుతున్నానని ముద్రగడ ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో కాపు జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, నల్లా విష్ణుమూర్తి, కల్వకొలను తాతాజీ, గౌతు స్వామి, గణేశుల రాంబాబు తదితరులు ఉన్నారు.

12 నుంచి శ్రీలక్ష్మీ మహాయజ్ఞం

- విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహణ
- సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభం
- భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి



తాడేపల్లిగూడెం అర్బన్: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 12 నుంచి 17 వరకు చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. బుధవారం తాడేపల్లిగూడెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ఆ దిశగా ఇప్పటికే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనని చెప్పారు. అలాగే దేవదాయ శాఖ తరఫున రాష్ట్రం సుభిక్షంగా ఉండేందుకు, ప్రజలు సుఖసంతోషాలతో జీవించేందుకు ఈ మహా యజ్ఞాన్ని తలపెట్టామన్నారు. యజ్ఞంలో 550 మంది రుత్విక్‌లు, 300 మంది సహాయకులు పాల్గొంటారన్నారు. అనుగ్రహ భాషణ చేసేందుకు దేశవ్యాప్తంగా ఉన్న పీఠాధిపతులు విచ్చేస్తున్నట్లు తెలిపారు. యజ్ఞాన్ని సీఎం జగన్ చేతుల మీదుగా 12న ఉదయం 8.30 గంటలకు ప్రారంభిస్తామన్నారు. 17న సీఎం చేతుల మీదుగానే మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులంతా ఈ మహాయజ్ఞాన్ని దర్శించి.. యాగం చుట్టూ ప్రదక్షిణ చేసి యాగఫలాన్ని పొందాలని కోరారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా క్యూ లైన్లతో పాటు పలు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. నిత్యం తీర్థ ప్రసాదాలు అందిస్తూ చివరి రోజు అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. రాష్ట్రంలోని ఆలయాల వద్ద చలువ పందిళ్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేశామన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే

కుమారుడితో కలిసి యర్రం వెంకటేశ్వరరెడ్డి చేరిక

- సత్తెనపల్లి బీజేపీ కన్వీనర్ పక్కాల సూరిబాబు కూడా..
- కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం జగన్
- జనసేన, టీడీపీ బేరసారాలు : మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, అమరావతి: సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం కుమారుడు నితిన్ రెడ్డితో కలిసి సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. సత్తెనపల్లి బీజేపీ కన్వీనర్ పక్కాల సూరిబాబు కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ సీఎం జగన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సత్తెనపల్లి నుంచి 2004, 2009 సార్వత్రిక ఎన్నికల్లో యర్రం వెంకటేశ్వరరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ గాదె సుజాత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మీడియాతో మాట్లాడుతూ.. మొదటి నుంచీ యర్రం వెంకటేశ్వరరెడ్డి.. వైఎస్సార్ కుటుంబానికి సన్నిహితులన్నారు. 2019 ఎన్నికల్లో జనసేన ఆయన్ను వాడుకుని వదిలేసిందని చెప్పారు. తనను ఓడించాలని కుట్ర పన్ని, కోడెల శివప్రసాద్, చంద్రబాబులతో కుమ్మక్కై అప్పటికప్పుడు నాదెండ్ల మనోహర్ ఆయనకు జనసేన బీఫాం ఇచ్చారన్నారు. ఆ తర్వాత వెంకటేశ్వరరెడ్డిని జనసేన కార్యక్రమాలకు పిలవకపోగా, అభాసుపాలు చేశారని తెలిపారు. 'మనోహర్, పవన్, చంద్రబాబులు విడిపోయినట్లు నటించి, మళ్లీ కలిశారు. ఇప్పుడు మళ్లీ బేరసారాలు చేస్తున్నారు. ఇదంతా చంద్రబాబు కోసమేనని ప్రజలు గమనించాలి. వెంకటేశ్వరరెడ్డి, సూరిబాబుల చేరికతో పల్నాడులో వైఎస్సార్‌సీపీకి మరింత బలాన్నిస్తుందన్నారు. వారికి సరైన గౌరవం, సముచిత స్థానం ఇస్తామని చెప్పారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. వీరి సేవలను అన్ని విధాలా వినియోగించుకుంటామన్నారు. యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. బలోపేతం అవుదామన్న ఆలోచన జనసేన నేతలకు లేదని చెప్పారు. తనకు ఎక్కడి నుంచీ పోటీ చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు తన వంతుగా పూర్తిగా సహకరిస్తానని చెప్పారు. పేదల సంక్షేమాభివృద్ధి కోసం సీఎం పరితపిస్తుండటం చూసి, తాను వైఎస్సార్‌సీపీలో చేరానని పక్కాల సూరిబాబు తెలిపారు.

15 కల్లా పంట నష్టం అంచనాలు

- వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది

సాక్షి, అమరావతి: ఏప్రిల్, మే ల్లో కురిసిన అకాల వర్షాల వల్ల ముంపునకు గురై దెబ్బతిన్న పంటలకు వాటిల్లిన నష్టాల గణనను ఈ నెల 15 కల్లా పూర్తిచేయాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది అధికారులను ఆదేశించారు. ఆ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్‌తో కలిసి బుధవారం ఆయన జిల్లా వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అకాల వర్షాల వల్ల వరి, జొన్న, మొక్కజొన్న తదితర పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. బాధిత రైతుల జాబితాను 16–20 వరకు సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల వద్ద ప్రదర్శించాలని నిర్దేశించారు. అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పునఃపరిశీలించి తుది జాబితాలను 21 నాటికి కమిషనర్ కార్యాలయానికి సమర్పించాలని చెప్పారు.

ఆ జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులకు 16 శాతం హెచ్ఆర్ఏ

▶ మొదటి పేజీ తరువాయి

మంజూరు చేస్తున్నారు. ఇప్పుడు దీన్ని 16 శాతానికి పెంచారు. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు ఒకేలా 16 శాతం ఇంటి అద్దె భత్యం అందుతుంది.

పీఎస్‌టీయూ హర్షం

రాష్ట్రంలో కొత్త జిల్లాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు 12 శాతం నుంచి 16 శాతానికి ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) పెంచడంపై ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (పీఎస్‌టీయూ) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏసీవీ గురువారెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఒక్కొక్కటిగా తమ డిమాండ్లను పరిష్కరిస్తుండడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. డీఏ బకాయిలు, ఆర్జిత సెలవులకు నగదు చెల్లింపు డిమాండ్లను కూడా వీలైనంత త్వరగా పరిష్కరించాలని వారు కోరారు.

సీఎం జగన్‌కు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కృతజ్ఞతలు

తమ సంఘం అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం 16 శాతం హెచ్ఆర్ఏను పెంచడంపై ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. హెచ్ఆర్ఏను పెంచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే తమకు ఇచ్చిన హామీ ప్రకారం అందరి ఉద్యోగులతోపాటు పోలీసు సిబ్బందికి కూడా సరెండర్ లీవులను మే నెలాఖరున వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. పీఆర్సీ, డీఏ ఎరియర్స్‌ను సెప్టెంబర్‌లోగా ఇవ్వాలని విన్నవించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.



“ ప్రతీ గొప్ప సంపద వెనుకా ఒక నేరం ఉంటుంది.

– హొనొరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 11 మే 2023

నేర నిలయాలు!

ఒక సమాజ నాగరికత స్థాయిని అంచనా వేయాలంటే అక్కడున్న జైళ్లను ముందుగా చూడాలన్నాడు విశ్వవిఖ్యాత రచయిత ఫ్యొదోర్ దాస్తొవిస్కీ. దాన్నే గీటురాయిగా తీసుకుంటే అన్ని వ్యవస్థలూ సిగ్గుపడాల్సిందే. మన దేశంలో జైళ్ల స్థితిగతుల గురించి ఏటా జాతీయ క్రైం రికార్డుల బ్యూరో (ఎన్సీఆర్బీ) వెల్లడించే అంశాలు కంగారు పుట్టిస్తుంటాయి. ఇతర జైళ్ల సంగతలావుంచి దేశంలోనే అతి పెద్దదయిన తిహార్ జైలు గురించి కథలు కథలుగా చెబుతుంటారు. ఈ జైలు దేశంలో మాత్రమే కాదు...దక్షిణాసియా దేశాల్లోనే అతి పెద్దది. అలాంటిచోట నెలరోజుల వ్యవధిలో రెండో హత్య జరిగిందంటే ఎవరికైనా దిగ్భ్రాంతి కలుగుతుంది. గత నెల 14న రౌడీ షీటర్, ఒక హత్య కేసు ముద్దాయి అయిన ప్రిన్స్ తెవాతియా అనే యువకుణ్ణి అతని ప్రత్యర్థి వర్గం హతమార్చింది. రెండూ వర్గాలూ పదునైన ఆయుధాలతో దాడి చేసుకోవటంతో నలుగురు గాయపడ్డారు. వారిలో ఒకడైన తెవాతియా మరణించాడు. దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియదుగానీ, గతవారం టిల్లూ తాజ్‌పురియా అనే గూండాను ప్రత్యర్థివర్గం దాడిచేసి మట్టుబెట్టింది. నిరుడు ఢిల్లీలోని రోహిణి కోర్టు కాంప్లెక్స్‌లో జరిగిన గూండా జితేందర్ గోగి మరణానికి టిల్లూ తిహార్ జైలునుంచే పథక రచన చేశాడని అప్పట్లో అధికారుల దర్యాప్తులో తేలింది. జైళ్లను సంస్కరణాలయాలుగా ఎంత చెప్పుకున్నా అందుకు అనుగుణమైన చర్యలు అంతంతమాత్రమే. ఏ నేరమూ చేయకుండానే కేసుల్లో ఇరుక్కుని వచ్చే అమాయకులతోపాటు రకరకాల నేరాలు చేసి అక్కడికొచ్చేవారు కూడా అధికంగా ఉంటారు జైళ్లలో పర్యవేక్షణ అంత సులభం కాదు. అందునా తిహార్ జైలు రాజకీయ నాయకులకూ, గూండాలకూ, కరడుగట్టిన నేరగాళ్లకూ, చిల్లర నేరగాళ్లకూ నిలయం. అక్కడ పరిస్థితి చేయిదాటిందంటే ఎంతటి ప్రమాదమైనా చోటుచేసుకోవచ్చు. అయితే సమస్య ఉందని గుర్తించినపుడు దానికి తగిన పరిష్కారం వెదకాలి. ఎక్కడో ఒకచోట ఆ సమస్యకు అడ్డుకట్ట పడాలి. కానీ అది ఎవరికీ పట్టినట్టు లేదు. ఫలితంగా జైల్లో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవటం, చంపుకోవటం, బయటనున్న ప్రత్యర్థుల్ని మట్టుబెట్టడానికి పథక రచన చేయటం యధేచ్ఛగా సాగిపోతోంది. మరీ ఘోరం జరిగితే తప్ప అన్నీ బయటకు రావు.

తిహార్ జైలు 400 ఎకరాల విస్తీర్ణంలో 9 జైళ్లుగా ఉంటుంది. అక్కడ 10,026మందిని ఖైదు చేయటానికి వీలుండగా, అంతకు రెట్టింపు మంది ఉంటారు. ఆ జైల్లో అత్యధికంగా ఉండేది ఉత్తరాదివారు గనుక జైలు భద్రతను తమిళనాడు స్పెషల్ పోలీస్(టీఎన్ఎస్పీ)కి అప్పగించారు. ఆ విభాగంనుంచి దాదాపు వేయిమంది సిబ్బంది తిహార్ జైల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వారితోపాటు అనుకోని పరిస్థితులు తలెత్తితే ఎదుర్కొనడానికి ఇండో టిబెటిన్ సరిహద్దు పోలీస్(ఐటీబీపీ) సన్నద్ధంగా ఉంటుంది. కానీ టిల్లూను ప్రత్యర్థివర్గం కొట్టిచంపినప్పుడు అందరూ ప్రేక్షకపాత్ర వహించారని సీసీటీవీ ఫుటేజ్‌లో బయటపడింది. ఇప్పటికైతే ఏడుగురు టీఎన్ఎస్పీ అధికారులను సస్పెండ్ చేశారు. ఇందువల్ల అంతా మారిపోతుందనుకోవటం అత్యాశే. నిజానికి కొన్ని దేశాల జైళ్లతో పోలిస్తే మన జైళ్లు మరీ అంత కిక్కిరిసినట్టు భావించనక్కరలేదని కొందరి వాదన. అది నిజమే కావొచ్చు గానీ...మన జైళ్లు కూడా రకరకాల కారణాలతో పరిమితికి మించిన ఖైదీలతోనే నిండి ఉంటున్నాయి. జైళ్లలో ఉండేవారంతా నేరస్తులు కాదు. అందులో విచారణలో ఉన్న ఖైదీలు కూడా ఉంటారు. చెప్పాలంటే మన ప్రభుత్వాల విధానాల వల్లనో, అలసత్వం వల్లనో ఈ రెండో క్యాటగిరీవారే అధికం. విచారణలో ఉండే ఖైదీల్లో క్షణికావేశంలో ఏదో ఒక తప్పు చేసి కేసుల్లో ఇరుక్కొని వచ్చేవారు ఎక్కువ. అలాగే పల్లెటూళ్లలో పెత్తందార్ల ఆగ్రహానికిగురై అకారణంగా జైలుపాలైనవారూ ఉంటారు. అటువంటివారిని గుర్తించి వెంటవెంటనే విడుదల చేయగలిగితే జైళ్లు ఇంత చేటు కిక్కిరిసిపోయే అవకాశం ఉండదు. ఇలాంటివారిని జైళ్లలో ఉంచటం వల్ల కలిగే మరో అనర్థం ఏమంటే... తప్పు చేయటం పెద్ద నేరమేమీ కాదన్న భావన వారిలో కలిగినా కలగొచ్చు. ఎన్డీటీవీ యాంకర్‌గా పనిచేసిన సునేత్రా చౌదరి ఆరేళ్లక్రితం రాసిన 'బిహైండ్ బార్స్' అనే పుస్తకం ఈ సంగతినే హెచ్చరిస్తుంది. ముఖ్యంగా తిహార్ జైల్లో అడుగడుగునా కనిపించే అవినీతిని, సంపన్నుల ఇంట పుట్టి నేరాల్లో ఇరుక్కొని జైలుకొచ్చేవారికి దక్కే రాచమర్యాదలనూ పుస్తకం వివరిస్తుంది. కిరణ్ బేడీ తిహార్ జైలు సూపరింటెండెంట్‌గా ఉన్నకాలంలో అక్కడ సంస్కరణలు చేపట్టినట్టు, అందువల్ల ఎన్నో మంచి ఫలితాలు వచ్చినట్టు మీడియాలో కథనాలు వెలువడేవి. కానీ ఆ తర్వాత అంతా మామూలే.

సిబ్బంది కొరత, విచారణలో ఉన్న ఖైదీలకు సకాలంలో న్యాయ సహాయం అందకపోవటం వంటి కారణాలవల్ల ఖైదీల పర్యవేక్షణ సక్రమంగా ఉండటం లేదు. దీన్ని అధిగమించటం కోసం కొందరు ఖైదీలను పర్యవేక్షకులుగా ఉంచే సంస్కృతి అన్నిచోట్లా కనబడుతోంది. ఇందువల్ల ఏ ఖైదీ మానసిక స్థితి ఎలావుందో, ఎవరికి వైద్య సాయం అవసరమో తెలిసే పరిస్థితి ఉండటం లేదు. జైళ్లలో తగినమంది సిబ్బందిని నియమించటం, అనవసరంగా ఉంటున్నవారి సంఖ్యను తగ్గించటం వంటివి చేయగలిగితే మెరుగైన పర్యవేక్షణకు వీలవుతుంది. అప్పుడు ఈ స్థాయిలో నేరగాళ్లు బరితెగించే అవకాశం ఉండదు. సస్పెన్షన్లు, తొలగింపులు సిబ్బందిలో భయం కలిగిస్తాయన్నది నిజమే కావొచ్చు. కానీ అది తాత్కాలికమే. దానికి బదులు వారిపై పడే అదనపు భారాన్ని వదిలిస్తే సిబ్బంది మెరుగ్గా పనిచేయగలుగుతారు. అప్పుడు జైళ్లు నిజమైన సంస్కరణాలయాలుగా మారతాయి.

గణాంకాల్లో మన ఘన వారసత్వం

సందర్భం



అతనూ బిశ్వాస్

భారత్‌కు గొప్ప గణాంక శాస్త్ర సంప్రదాయం ఉంది. గణాంక శాస్త్ర ప్రపంచంపై ఆధిపత్యం చలాయించగల నిపుణులు భారతదేశంలో ఎంతోమంది ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా గణాంక శాస్త్ర అభివృద్ధి కోసం భారత్ అసాధారణ ప్రేరణనిచ్చింది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఐక్యరాజ్యసమితి గణాంక కమిషన్ (స్టాట్‌కమ్)కు భారత్ ఎన్నిక కావడం మనం సంతోషించాల్సిన విషయం. విధాన నిర్ణయం, పర్యవేక్షక పాత్రలో మన దేశం ఉంటుంది. సుసంపన్నమైన భారత్ గణాంక వారసత్వం, భారత 'ప్రణాళికా పురుషుడి'గా సుపరిచితమైన ప్రొఫెసర్ పీసీ మహలనోబిస్‌కు ఎంతగానో రుణపడి ఉంటుంది. ఆయన దేశంలో గణాంక శాస్త్రానికి మార్గదర్శి మాత్రమే కాకుండా, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ)ని స్థాపించారు.

భారత గణాంక సమాజం సంతోషించ దానికి కనీసం రెండు కారణాలు ఉన్నాయి. గణాంక శాస్త్రంలో ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ బహుమతిని ఇండియన్–అమెరికన్ గణాంక శాస్త్రవేత్త ప్రొఫెసర్ సీఆర్ రావుకు బహూకరించారు(ఈయన తెలుగువాడు). సైన్సును, టెక్నాలజీని, మానవ సంక్షేమాన్ని పురోగమింపజేయడానికి గణాంక శాస్త్రాన్ని ఉపయోగించి కీలక విజయాలను సాధించినందుకు ప్రతి రెండేళ్లకోసారి ఒక వ్యక్తికి లేదా బృందానికి ఈ అవార్డును అందజేస్తారు. గణాంక శాస్త్ర సిద్ధాంతాలకు దశాబ్దాలుగా సీఆర్ రావు అందించిన తోడ్పాటుకు ఇది నిస్సందేహంగా సరైన గుర్తింపు అని చెప్పాలి. మరొక విజయం, ఐక్యరాజ్యసమితి గణాంక కమిషన్ (స్టాట్‌కమ్)కు భారత్ ఎన్నిక కావడమే. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత విధాన నిర్ణయం, పర్యవేక్షక పాత్రలో మన దేశం ఐక్యరాజ్యసమితి సంస్థలో తిరిగి చేరింది.

1947లో స్థాపితమైన స్టాట్‌కమ్... ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక కౌన్సిల్ (ఎకోసాక్)కు చెందిన కార్యాచరణ కమిషన్. ఇది ఐక్యరాజ్యసమితి గణాంక విభాగం (యూఎన్ఎస్డీ) పనిని పర్యవేక్షిస్తుంది. అలాగే ప్రభుత్వ విధానాలకు, ప్రైవేట్ కార్యాచరణకు తోడ్పడేలా గణాంక సమాచార అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యం వైపుగా కృషి చేయడానికి ప్రపంచవ్యాప్త గణాంక శాస్త్రజ్ఞులను ఒక చోటికి తెస్తుంది. స్టాటిస్టికల్ కమిషన్, నార్కోటిక్ డ్రగ్స్ కమిషన్, ఐక్యరాజ్యసమితి హెచ్ఐవీ/ఎయిడ్స్ జాయింట్ ప్రోగ్రామ్... వీటన్నింటికీ భారత్ 'ఎకోసాక్' ద్వారా ఎన్నికైంది.

స్టాట్‌కమ్ వ్యవస్థాపక పితామహుడు అమెరికన్ సామాజిక శాస్త్రవేత్త, గణాంక శాస్త్రవేత్త అయిన స్టువర్ట్ అర్థర్ రైస్. 1946 మేలో న్యూయార్క్‌లోని హంటర్ కాలేజీలో 'న్యూక్లియర్ సెషన్'కు రైస్ అధ్యక్షత వహించారు. ఐక్యరాజ్య సమితి పరిధిలో గణాంకాల కోసం ఒక శాశ్వత కమిషన్ ఏర్పాటు, దానికి అవసరమైన నిబంధనలను ఆనాటి సెషన్ సిఫార్సు చేసింది. స్టాట్‌కమ్ తొలి మూడు సెషన్లకు 1947–48 కాలంలో కెనడియన్ హెర్బర్ట్ మార్షల్ అధ్యక్షత వహించారు. ప్రపంచ గణాంక వ్యవస్థ రూపకల్పనను వేగవంతం చేయడం ద్వారా శాంతి కోసం ప్రపంచాన్ని కూడగట్టే ఐక్యరాజ్య సమితి ప్రయత్నాలకు తోడ్పడటం అనే లక్ష్యాన్ని మూడో సెషన్ (1948) నివేదిక ప్రకటించింది.

అంతర్జాతీయ గణాంకపరమైన కార్యకలాపాల కోసం ఏర్పడిన అత్యున్నత నిర్ణాయక విభాగమైన స్టాట్‌కమ్... గణాంకపరమైన ప్రమాణాలను రూపొందించడం; జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వాటిని అమలు చేయడంతో సహా భావనలు, విధానాల అభివృద్ధి విషయంలో బాధ్యత తీసుకుంటుంది. ప్రపంచవ్యాప్తంగా సభ్య దేశాల్లోని – మొత్తంగా 24 – కీలక గణాంక శాస్త్రవేత్తలను ఇది ఒకటి



చేసింది. గత 76 సంవత్సరాల కాలంలో, కమిషన్ ప్రపంచమంతటి నుంచి ఒక చీఫ్ స్టాటిస్టీషియన్ నేతృత్వంలో నడుస్తూ వచ్చింది.

గణాంకాలు, వైవిధ్యత, జనాభా రంగంలో భారతీయ నైపుణ్యమే ఐక్యరాజ్యసమితి స్టాటిస్టికల్ కమిషన్‌లో భారత్‌కు స్థానం సాధించి పెట్టిందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవలే ట్వీట్ చేశారు. సుసంపన్నమైన భారత్ గణాంక వారసత్వం, భారత 'ప్రణాళికా పురుషుడి'గా సుపరిచితమైన ప్రొఫెసర్ పీసీ మహలనోబిస్‌కు ఎంతగానో రుణపడి ఉంటుంది. ఆయన దేశంలో గణాంక శాస్త్రానికి మార్గదర్శి మాత్రమే కాకుండా, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ)ని స్థాపించారు. ఆధునిక భారత గణాంక వ్యవస్థలో అత్యంత విశిష్ట వ్యక్తి అయిన మహలనోబిస్ భారత రెండో పంచవర్ష ప్రణాళిక రూపశిల్పి కూడా. అలాగే జాతీయ శాంపిల్ సర్వే సంస్థతో పాటు కేంద్ర గణాంక సంస్థ స్థాపనలో కూడా కీలకపాత్ర వహించారు.

స్టాట్‌కమ్‌లో భారత్ మునుపటి పాదముద్రకు ప్రధానంగా మహలనోబిస్ కారణం. కమిషన్ ప్రారంభ సమయంలో ఆయన శిఖర స్థాయిలో ఉండేవారు. 1946లో ప్రారంభ సెషన్ నుంచి 1970లో సంస్థ 16వ సెషన్ వరకు తన జీవితకాలంలో అన్ని సెషన్లకు హాజరైన అద్వితీయ రికార్డు ఆయన సొంతం. సభ్యుడిగా, రాపోర్టర్‌గా, వైస్ ఛైర్మన్‌గా అనేక పాత్రలను పోషించిన మహలనోబిస్ 1954 నుంచి 1956 వరకు 8వ, 9వ సెషన్లకు ఛైర్మన్‌గా కూడా వ్యవహరించారు. ఆ కాలంలో ఆయన సంస్థకు అద్వితీయ తోడ్పాటును అందించారు.

నమూనా సేకరణ కోసం ఐక్యరాజ్యసమితి సబ్ కమిషన్ ఏర్పాటు చేస్తే "ప్రత్యేకించి వెనుకబడిన ప్రాంతాల్లో గణాంక శాస్త్రం మెరుగుదలను ప్రోత్సహించడంలో గొప్ప సహాయం చేస్తుంది" అని సూచిస్తూ మహలనోబిస్ 1946 ఏప్రిల్లో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శికి ఉత్తరం రాశారు. దానికనుగుణంగానే ఒక సబ్ కమిషన్ ఏర్పాటైంది. తర్వాత ఈ ఉప కమిషన్‌కు ఆయన అధ్యక్షత వహించారు. ఈ ఉపకమిషన్ నమూనా సర్వే నివేదిక (1947) సన్నాహకాల కోసం సిఫార్సులు చేసింది. వివిధ రంగాల్లో అధికారిక గణాంకాలకు సంబంధించిన నమూనా సర్వేల అన్వయానికి ఈ సిఫార్సులు మార్గాన్ని సుగమం చేశాయి.

'శిక్షణ పొందిన మానవ వనరులను కలిగి ఉండని దేశాల్లో' గణాంక శాస్త్రంలో విద్య కోసం అంతర్జాతీయ కార్యక్రమాలను ప్రోత్సహించడంలో మహలనోబిస్, రైస్ కీలక పాత్ర పోషించారని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ టీజే రావు ఒక పరిశోధనా వ్యాసంలో పేర్కొన్నారు. అలాంటి సంస్థను ఆసియా దేశాల కోసం లేదా ఇండియా, దాని పొరుగు దేశాల కోసం ఏర్పర్చాలని మహలనోబిస్ సూచించారు. 1950లో కలకత్తాలో స్థాపించిన 'ది ఇంటర్నేషనల్ స్టాటిస్టికల్ ఎడ్యుకేషన్ సెంటర్' (ఐఎస్ఈసీ)ను ఇప్పుడు ఐఎస్ఐ, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

మహలనోబిస్ 1972లో చనిపోయారు. ఆ సంవత్సరం తన 17వ సెషన్లో చేసిన ఒక తీర్మానంలో కమిషన్ ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసింది. "సామాజిక గణాంక శాస్త్రం తరఫున ఆయన సాగించిన మార్గదర్శక ప్రయత్నాలను స్మరించుకుంటున్నాము. అభివృద్ధి చెందుతున్న దేశాల గణాంక అవసరాల కోసం నిలబడిన ఛాంపియన్‌గా ఆయన్ని స్మరించుకుంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా గణాంక శాస్త్ర అభివృద్ధి కోసం ఆయన ఇచ్చిన అసాధారణ ప్రేరణను మేము స్మరించుకుంటున్నాము" అని పేర్కొంది. "కమిషన్ సభ్యుల మధ్య ఏర్పడిన అభిప్రాయ భేదాలను పరిష్కరించడంలో ఆయన అసాధారణ సామర్థ్యాన్ని" కూడా కమిషన్ ఆ సందర్భంగా గుర్తుచేసుకుంది.

సీఆర్ రావు క్లాస్‌మేట్, ఎలక్ట్రానిక్ డేటా ప్రాసెసింగ్‌లో పథగామి వక్కలంక ఆర్.రావు (ఈయనా తెలుగువాడే) 1976లో స్టాట్‌కమ్ 19వ సెషన్‌కు అధ్యక్షత వహించారు. ఐక్యరాజ్యసమితి డ్యూటీ స్టేషన్ వెలుపల స్టాట్‌కమ్ నిర్వహించిన ఏకైక సమావేశం ఇదే. ఇది న్యూఢిల్లీలో జరిగింది. స్టాట్‌కమ్ 70వ వార్షిక సంబరాల కోసం రూపొందించిన బుక్‌లెట్ బ్యాక్ కవర్ పేజీపై, 1976 సెషన్ కోసం హాజరైనవారు తాజ్‌మహల్ ముందు నిల్చున్న చిత్రాన్ని పొందుపర్చారు.

భారత్‌కు ఉజ్వలమైన గణాంక శాస్త్రపు గతం ఉంది. మన దేశం స్టాట్‌కమ్‌కు గణనీయ స్థాయిలో తోడ్పాటును అందించింది. అంతర్జాతీయ గణాంక రంగంలో భారత్ తన స్థానాన్ని తిరిగి పొందినట్లయితే, అది ప్రశంసార్హమవుతుంది. భారత్‌కు గొప్ప గణాంక శాస్త్ర సంప్రదాయం ఉంది. దీనికి మహలనోబిస్ గొప్ప ప్రయత్నం కారణం. అంతేకాకుండా గణాంక శాస్త్ర ప్రపంచంపై ఆధిపత్యం చలాయించగల నిపుణులు భారతదేశంలో ఎంతోమంది ఉన్నారు. ఐక్యరాజ్యసమితి గణాంక కార్యకలాపాల ప్రధాన స్రవంతి వైపు భారత్ తిరిగి వెళ్లడం సరైన దిశగా వేసే ముందడుగు అవుతుంది.

వ్యాసకర్త ప్రొఫెసర్, ఐఎస్ఐ, కోల్‌కతా

('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మనవాళ్లే!



పాకిస్తాన్‌లో మానవత్వం అధోగతి పాలవడం చూస్తుంటే బాధ కలుగుతోంది. ఒకానొక కాలంలో మనం ఒక్క దేశం వాళ్లం, వాళ్లూ మన మనుషులేనని మరిచిపోవద్దు. వాళ్ల రాజకీయ నాయకులు, అంధ విశ్వాసాల వల్ల నాశనమయ్యారు.

– సీతూ మహాజన్ కోహ్లీ, ఆర్కిటెక్ట్

మనవాళ్లా?



పాకిస్తాన్ వాళ్లు మన జనం కాదు. అయివుంటే 1947, దాని అనంతర మారణకాండ, అనంతర తీవ్రవాదం, అనంతర యుద్ధాలు జరిగివుండేవి కాదు. నిజం చెప్పాలంటే, శత్రువు తనకు తానే నేలకూలడం చూడ్డానికి హాయిగా ఉంది.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

ఖేల్ ఖతం



పాకిస్తాన్‌లో సైనిక పాలన వస్తుందనడం తప్పు. సైనిక పాలన విధించాలంటే సైన్యానికి ప్రజాదరణ ఉండాలి. కానీ అది లేదు. సింపుల్‌గా చెప్పాలంటే వాళ్లు 'ప్రాజెక్ట్ ఇమ్రాన్ ఖాన్' అనేదాన్ని మూటగట్టేస్తున్నారు.

– వైభవ్ సింగ్, జర్నలిస్ట్

నిరాడంబరత



నెదర్లాండ్స్ ప్రధాని మార్క్ రుట్ సామాన్య జనంలో ఒకడిగా సైకిల్ మీద వెళ్తూ కనిపిస్తారు. మన ప్రధానమంత్రి, గౌరవనీయ ఎంపీలు అలా చేయగలరా?

– సందీప్ వర్మ, అడ్వకేట్

వ్యూహాత్మక కదలిక



మధ్య ప్రాచ్యంలో ఇండియా భారీ భౌగోళిక ఎత్తుగడ వేస్తోంది. ఒకవేళ ఇండియా పథకం విజయవంతం అయితే, బిలియన్ల వాణిజ్యానికి అవకాశం ఉంటుంది. అది ఆ ప్రాంతంలో చైనా ప్రభావాన్ని ఎదుర్కొని, ఇండియా ప్రతిష్ఠను పదిలం చేస్తుంది.

– శశికాంత్ మట్టూ, జర్నలిస్ట్

ఇన్‌బాక్స్

సాంకేతికత కీలకం

మానవ సమాజ అభివృద్ధిలో ఆదిమ కాలం నుంచి నేటి వరకు సాంకేతిక విజ్ఞానం కీలక పాత్ర పోషిస్తూ వస్తోంది. మన దేశ అభివృద్ధినీ ఇందులో భాగంగానే చూడాలి. దేశ 21వ శతాబ్ద అవసరాలను తీర్చడంలో శాస్త్ర సాంకేతిక రంగం కీలక పాత్ర పోషించింది. ఒక దేశం అణుశక్తి కలిగి ఉండడం అంతర్జాతీయ సమాజంలో గొప్ప హోదా, మర్యాదా కలుగజేసే అంశంగా ఉన్న తరుణంలో... మన సైంటిస్టులు, సాంకేతిక నిపుణులు ఆ శక్తిని దేశానికి అందించారు. 1998 మే 11న రెండవ అణు పరీక్షల పరంపరను రాజస్థాన్‌లోని ఎడారిలో ప్రభుత్వం 'పోఖ్రాన్–2' లేదా 'ఆపరేషన్ శక్తి' పేరుతో నిర్వహింపచేసింది. ఈ రోజు ప్రత్యేకత చిరస్థాయిగా నిలిచిపోయేలా... దేశ శాస్త్ర సాంకేతికాభివృద్ధికీ, తద్వారా దేశ ప్రజల జీవన ప్రమాణాలు పెరగడానికీ, దేశానికి ఎనలేని పేరు ప్రతిష్ఠలు సమకూరడానికీ కారణమైన భారతీయ సాంకేతిక నిపుణులు, ఇంజినీర్ల సేవలను గుర్తు చేసుకోవడానికి వాజ్‌పేయి ప్రభుత్వం ప్రతి ఏడాదీ మే 11న 'జాతీయ టెక్నాలజీ డే' జరుపుకోవాలని నిర్దేశించింది. అప్పటినుంచి భారత ప్రభుత్వం ఈ దినోత్సవాన్ని జరుపుతోంది. భారత్ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించడంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన పాత్ర చాలా ముఖ్యమని దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి పునాది వేశారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చే మార్పులకు అనుగుణంగా మన దేశాభివృద్ధికి మార్పులు చేర్పులు చేస్తూ ప్రభుత్వం 'శాస్త్ర సాంకేతిక తీర్మానాలను' రూపొందించింది.

గత కొన్ని సంవత్సరాలుగా భారతదేశం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో గొప్ప విజయాలు సాధించింది. సైన్స్, ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీలు పొందిన వారి సంఖ్య (దాదాపు 25,000) పరంగా చైనా తర్వాత భారతదేశం 3వ ర్యాంక్‌ను ఆక్రమించింది. ప్రపంచంలో యునికార్న్‌ల సంఖ్య (107) పరంగా భారతదేశం 3వ స్థానంలో ఉంది. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ గ్లోబల్ ర్యాంకింగ్‌లో 2022లో ప్రపంచంలోని 130 ఆర్థిక వ్యవస్థలలో 40వ స్థానానికి భారత్ చేరుకొంది.

– సంపతి రమేష్ మహారాజ్, సామాజిక విశ్లేషకులు

(నేడు నేషనల్ టెక్నాలజీ డే)

కాలం గొప్ప తీర్పరి!

సందర్భం



నందమూరి లక్ష్మీపార్వతి

రామోజీరావు గారూ!

ఇప్పటి మీ పరిస్థితి చూస్తుంటే ఇది రాయక తప్పడం లేదు. 'విధిరేవ బలీయసి' అనే మాట ఎంత అక్షర సత్యం! ఇన్నాళ్ళూ ఎదురు లేకుండా మీ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని నిరాఘాటంగా సాగించిన అరాచక సామ్రాజ్యం మీద దాడులు జరుగుతున్నాయని పాపం బాధపడుతున్నట్టున్నారు. మీ అండదండలతో ఎదిగిన వారికి మీ పట్ల సానుభూతి రావచ్చు. కానీ మీకు తెలుసో తెలియదో డెబ్బై శాతం మంది ప్రజలు ఇన్నాళ్లకైనా మీ పాపాలు పండి నిజాలు బయటకు వస్తున్నాయని సంతోషిస్తున్నారండీ. కాలం గొప్ప తీర్పరి కదా. మీకంటే పెద్ద పెద్ద నాజీలకే శిక్షలు వేసింది.

మొన్నామొన్నటి మూడ్రోజుల క్రితం మీరు నడుముకు అవసరార్థపు కట్టు కట్టుకొని, పూర్తిగా బెడ్ మీద పడుకొని నిస్సహాయంగా మాట్లాడుతూ '87 సంవత్సరాల వయస్సులో నన్ను బాధ పెట్టడం కాలమహిమా? లేక జగన్ మహిమా?' అని వాపోవడం చూస్తే 'తన దాకా వస్తేగానీ తెలియదు' అనే సామెత గుర్తుకొస్తున్నది. అయినా ప్రభుత్వాల్నే పడగొట్టగలిగిన సమర్థుడు; కేంద్ర, రాష్ట్ర నాయకుల్ని నేరుగా దగ్గరకే పిలిపించుకోగలిగిన పలుకుబడి ఉన్నవారు, ఎంతోమంది జడ్జీలకు విందులిచ్చిన ఘనులు... ఆఫ్ట్రాల్ ఒక 'సీఐడీ'ని చూసి భయపడటం ఏంటండీ? పెద్దపెద్ద వాళ్ళనే భయపెట్టి వాళ్ళ పత్రికలనూ, వ్యాపారాలనూ మూయించారు కదా. పాలమ్మినా, పచ్చళ్ళమ్మినా, చిట్‌ఫండ్ వ్యాపారం చేసినా, పత్రిక నడిపినా 'మేము తప్ప' ఆ రంగంలో మరొకరు ఉండరాదనే మీ రాజ శాసనం ఇన్నేళ్ళు బాగానే అమలు చేసుకున్నారు కదా. అటువంటి మీరు మీ మనుమడి వయస్సులో ఉన్న ఒక చిన్న కుర్రాడిని చూసి 'ఇది జగన్ మహిమా?' అంటూ మంచం ఎక్కటం ఏంటండీ! నిజంగా మీరన్నట్టు కాలమూ, జగనూ ఇద్దరూ గొప్పవారే. ఈరోజు మీ వలన నష్టపోయిన నాలాంటి అభాగ్యులెందరో సంతోషపడుతుంటారు.

అసలు మీకు పాప భీతి అనేది లేదా? అన్ని చట్ట విరుద్ధమైన పనులు చేసి, వాటిని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు మిమ్మల్ని బాధపెడుతున్నారని వాపోతున్నారా? ఈరోజు ధర్మదేవత కళ్ళు తెరిచి ప్రశ్నిస్తే మీ గురుశిష్యులిద్దరూ మీకు జరగరాని అన్యాయం జరిగినట్లు గుండెలు బాదుకుంటున్నారే! ఒక్కసారి 1995 ఆగస్టు సంక్షోభంలోకి వెళ్ళి మీ అధికార దాహానికి ఎన్టీఆర్‌ను ఎలా బలి తీసుకున్నారో గుర్తు చేసుకోండి. ఆయన పదవి పోవటానికి డాల్ఫిన్ హోటల్ నుండి వైస్రాయ్ హోటల్ వరకు జరిపిన కుట్రలలో కర్త, కర్మ, క్రియ మీరేగా! ఎన్టీఆర్ మీ మాట వినకపోయేసరికి శత్రువు లాగా చూశారు. 1989 ఎలక్షన్స్ వరకు చంద్రబాబును అవినీతిపరుడిగా, రాజ్యాంగేతర శక్తిగా అనేకసార్లు మీ పేపరు ద్వారా విమర్శించిన మీకు... అదే అవినీతిపరుడు తెలుగుదేశం పార్టీ రక్షకుడయ్యాడా? మీకు నచ్చితే పందిని నందిగా మారుస్తారు. లేకపోతే నంది పందిగా మారిపోతుంది. ఒక్క పేపర్‌ను అడ్డం పెట్టుకుని మీరు కొనసాగించిన అరాచకాలూ, బ్లాక్ మెయిలింగ్‌లూ ఈ రోజు బయటకొస్తుంటే మీ పాపాల పుట్ట పగిలి తేళ్ళు, పాములు, వస్తున్నట్లుగా ప్రజలు భావిస్తున్నారు. అవమానం, ఆత్మక్షోభ మీ గురు శిష్యులు ఇద్దరికేనాండి? మీ వలన నష్టపోయిన ఎన్నో ఫైనాన్స్ కంపెనీల వాళ్ళు, ఆత్మహత్యలు చేసుకున్న వర్కర్స్, వాళ్ళ కుటుంబాలకు ఉండవా? మీ కీలు బొమ్మ చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని పేదవాళ్ళ నుండి వేల ఎకరాలు దోపిడీ చేశారు కదా. వాళ్ళెంత బాధపడి ఉంటారు!

అన్నిటిని మించి నా భర్త నందమూరి తారక రామారావు అనుభవించిన అవమానాల క్షోభకు కారణం మీరు కాదా? ఎన్టీఆర్ ఎదురుగా కూర్చోవడానికి భయపడే ఒక నక్కను మీరు సింహాసనం మీద కూర్చోబెట్టి ఒక దరిద్రపు పాలనను కొనసాగించారు. ప్రజాస్వామ్యబద్ధంగా 1994 ఎన్నికల్లో మిత్రపక్షాలతో కలిసి 258 సీట్లు సాధించుకున్న ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని 8 నెలలు తిరక్కుండానే కూల్చేశారే! ఈ నయవంచక చంద్రబాబు ఆయనను పార్టీ అధ్యక్షుడిగా తొలగించినప్పుడు, వైస్రాయ్ హోటల్ ముందు చెప్పులేసి అవమానించినప్పుడు, ఆయన కుటుంబాన్ని ఆయనకు దూరం చేసినప్పుడు ఆయన ఎంత వేదనను అనుభవించారో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి.

ముఖ్యంగా 1995 ఆగస్టు 31న మీరు మీ భార్యతో కలిసి ఇంటికి వచ్చారు. మీరు సాధించిన ఘన విజయాన్ని ఆయన ముందు ప్రదర్శించి మీ గొప్ప చాటుకోవడానికేగా వచ్చారు. ఆగస్టు 30వ తారీఖున మీ ఇద్దరూ చేసిన నీచమైన అవమానాలను తట్టుకోలేక ఎన్టీఆర్ మెడ్విన్ హాస్పిటల్‌లో జాయిన్ అయ్యారు. ఆ రోజంతా అక్కడే ఉండి 31వ తారీఖు నాడు ఇంటికి వచ్చిన సందర్భంలో మీరు మీ భార్యతో సహా వచ్చి కలిశారు. మీ మొహంలో ఏదో సాధించానన్న గర్వం కనిపించింది. భయంకరమైన శాడిస్ట్ కళ్లముందు నిలబడినట్లు అనిపించింది. నీరసంగా మంచం మీద పడుకున్న ఎన్టీఆర్‌ను నవ్వుతూ పలకరించారు. ప్రపంచంలో ఎన్నో రకాల దుర్మార్గుల్ని చూస్తాము. కానీ స్వయంగా ప్రాణం తీసి మళ్ళీ బాధ

రామోజీకి లేఖ



నటిస్తూ దండెయ్యటానికి వచ్చే విలన్ లాగా ఉంది మీ పరామర్శ. చెయ్యాల్సిందంతా చేసి ఏమీ ఎరుగనట్లు పలకరించటానికి వచ్చారే... అది మీలో ఉన్న మరో నట కోణాన్ని బయట పెట్టింది. పైగా ఎన్టీఆర్‌తో 'మీ పాత సినిమాలన్నీ ఈటీవీలో ప్రసారం చెయ్యటానికి కొనేశాను' అని చెప్పినప్పుడు ఆయన ఒక మాట అన్నారు. బహుశా మీరు మర్చిపోయి ఉండొచ్చు. 'వాటితో ఇప్పుడు నాకేమవసరం. నేను టీవీయే చూడను. మీ మరో వ్యాపారానికి నా సినిమాలు అవసరం అవుతాయిలే!' అందులో ఉన్న వ్యంగ్యాన్ని గమనిస్తే ఎంత సిగ్గుమాలిన వాడికైనా సిగ్గనిపిస్తుంది. మీరు వెళ్ళేటప్పుడు మిమ్మల్ని సాగనంపటానికి బయటకు వచ్చిన నేను మీ కాళ్ళు పట్టుకుని ఏడ్చాను. 'అన్నా! ఆయన ఆరోగ్యం బాగుండటం లేదు. ఈ సమయంలో ఇంతటి అవమానాన్ని ఆయన తట్టుకోగలరా! మీరొక్కరే కాపాడగలరు. మీరు చంద్రబాబుకి చెప్పి ఎన్టీఆర్‌ను పదవిలో కొనసాగనివ్వండి. నా వలన ఏ ఇబ్బందీ లేదండీ' అంటూ ఒక చెల్లెలిగా భోరున ఏడ్చాను. మీ కసాయి గుండె ఏ కొంచెమైనా కరుగుతుందేమోనని ఆశపడ్డాను. మీరు నిర్దాక్షిణ్యంగా నన్ను తోసేసుకుని వెళ్ళిపోతే పడుకున్న ఎన్టీఆర్ లేచివచ్చి నన్ను ఓదారుస్తూ 'లక్ష్మీ! పులి చంపేస్తుందని కుందేలు సింహాన్ని ఆశ్రయించిందంట. అలా ఉంది నువ్వు ఇతన్ని వేడుకోవటం. ఇదంతా ఇతడి వల్లనే కదా జరిగింది. నా కుటుంబ సభ్యుల్ని నా నుండి దూరం చేసి పట్టం కట్టింది ఎవరు? అంతా తెలిసి మళ్ళీ వాడి కాళ్ళు ఎందుకు పట్టుకుంటావ్. ఇలాంటి సిగ్గుమాలిన పని ఎప్పుడూ చేయకు. ఇదంతా మనం ప్రజల్లోనే తేల్చుకుందాం' అన్న మాటలు ఆ రోజు ఆయన జీవిత చరిత్రలో కూడా రాశాను. ఇప్పుడు మళ్ళీ రాస్తున్నాను.

నిజానికి ఎప్పటికీ కాలదోషం ఉండదు. కాల విలంబనం తప్ప. కోటి జన్మలెత్తినా మీరూ, చంద్రబాబూ ఆయన వ్యక్తిత్వం ముందు మరుగుజ్జులేనండీ. అటువంటి ఉన్నత విలువలు కలిగిన వ్యక్తిని మీ చెత్త పేపర్‌లో పిచ్చి రాతలతో, అసహ్యమైన కార్టూన్లతో ఎంత హీనంగా చూపించారు. ఆయన మీకు చేసిన అపకారమేమిటి? ప్రజలకు చేసిన పొరపాటు ఏమిటి? 'ఈ వయస్సులో నన్ను అవమానిస్తారా' అని బాధపడుతున్నారే. ఇదే వయస్సులో మీరందరూ కలిసి ఎన్టీఆర్‌ను ఎంత బాధకు గురిచేశారు? మనసున్న వాళ్ళయితే ఆలోచిస్తారు. ఎన్నో జీవితాలతో ఆటలాడుకున్న మిమ్మల్ని వారి ఆత్మలు శపిస్తున్నాయనీ, అందుకే ఇలాంటి దుఃస్థితి గురుశిష్యులకిద్దరికీ వచ్చిందనీ అనిపిస్తోంది.

'కాలః ప్రసారిత కరోదీర్ఘాదపి గృహ్ణతి' అని విష్ణు శర్మ 'పంచ తంత్రం'లో చెప్పినట్లు... కాలం చేతులు చాలా పొడవుగా ఉంటాయండీ. ఆ సమయం వచ్చినప్పుడు ఒంటి స్తంభం మేడలో ఉన్నా విడచిపెట్టదు. మీ కీలుబొమ్మ ప్రభుత్వంలో చిట్‌ఫండ్ వ్యాపారమనే ముసుగులో ఎన్నో అక్రమాలు చేసి వేల ఎకరాలు సంపాదించి వారి కన్నీళ్ళ మీద భవనాలు కట్టుకొని ప్రశాంతంగా ఉండాలనుకున్న సమయంలో మీ అక్రమ మార్గదర్శి వ్యాపారమే సీఐడీ రూపంలో అక్కడిదాకా మిమ్మల్ని తరుముకుంటూ రప్పించింది. ఎప్పటికైనా చేసిన పాపాలు ఊరికే పోవు కదా. అలుపు ఎరుగకుండా పోరాడుతున్న ఉండవల్లి అరుణ్‌కుమార్ గారికి, న్యాయం కోసం నిలబడ్డ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మీ గురు శిష్యులిద్దరూ చేసిన పాపాలకు పూర్తి శిక్ష అనుభవించినప్పుడే ఎన్టీఆర్, అలాగే దగాపడ్డ మరికొందరి ఆత్మలకు నిజమైన శాంతి లభిస్తుందని భావిస్తూ...

లేఖకురాలు ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.షష్ఠి ప.1.06 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ సా.4.23 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.8.04 నుండి 9.34 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.49 నుండి 10.40 వరకు తదుపరి ప.2.55 నుండి3.44 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.22 నుండి 11.54 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.34, **సూర్యాస్తమయం:** 6.18.

● అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీలో అండర్ రిజర్వ్ షట్‌డౌన్‌లో ఉన్న 4 యూనిట్ ద్వారా బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. విద్యుత్ ఉత్పత్తికి తగినంతగా డిమాండ్ లేని కారణంగా ఇటీవల 1, 3, 4 యూనిట్లను అండర్ రిజర్వ్ షట్‌డౌన్ చేసి 2వ యూనిట్‌ను మాత్రమే పనిచేయించారు. విద్యుత్ అవసరాలు పెరిగిన నేపథ్యంలో మంగళవారం 1, 3 యూనిట్ల నుంచి, బుధవారం 4వ యూనిట్ నుంచి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు.

చెట్టు చెట్టుకో వెరైటీ

చేబ్రోలులో అరుదైన మియాజాకీ రకం మామిడి

- కిలో పండ్ల ధర రూ.2.70 లక్షలు
- ప్రపంచంలోనే అతి పెద్ద 5 కేజీల నూర్జహాన్ మామిడి
- అరటి పండులాంటి మామిడి రకాలూ ఉన్నాయ్

యాపిల్ పండ్ల ఆకారంలోనూ మామిడి పండ్లు ● అరుదైన మామిడి రకాలు పండిస్తున్న రైతు నాగేశ్వరరావు

పిఠాపురం: అరుదైన రకాలు పండించాలన్న ఆ రైతు ఆలోచన మొక్కగా మొదలై.. చెట్టుగా మారింది. అది శాఖోపశాఖలుగా విస్తరించి తోటనిండా అద్భుతాలను పండిస్తోంది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ఓదూరు నాగేశ్వరరావు అనే రైతు నాలుగు ఎకరాల మామిడి తోటలో ఎన్నో రకాల మామిడి మొక్కలు నాటారు. తోటంతా కాస్తే వచ్చే ఆదాయాన్ని అందులోని ఒకే ఒక మామిడి చెట్టు తెచ్చిపెడుతోంది. ఆ ఒక్క చెట్టుకు 15 కాయలు కాయగా.. వాటి విలువ అక్షరాల రూ.15 లక్షలకు పైగానే ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

కింగ్ ఆఫ్ మేంగో.. ఒక్కో కాయ రూ.లక్ష పైనే

జపాన్ దేశంలో మాత్రమే పండే మియాజాకీ రకం మామిడిని ఓదూరు నాగేశ్వరరావు పండిస్తున్నారు. ఇది ప్రపంచంలోనే అతి ఖరీదైన మామిడి పండుగా గుర్తింపు పొందింది. ఇది బంగారం ధరతో పోటీ పడుతుంది. జపాన్‌లోని మియాజాకీ ప్రాంతంలో పండటం వల్ల దీనికి మియాజాకీ అనే పేరొచ్చింది. దీనిని సూర్యుడి గుడ్లు (ఎగ్స్ ఆఫ్ సన్) అని కూడా పిలుస్తారు. సువాసనలు వెదజల్లుతూ.. లోపల బంగారు ఛాయతో మెరిసిపోయే ఈ మామిడి పండు అత్యధిక పోషకాలను కలిగి ఉంటుందట. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో కేజీ రూ.2.70 లక్షల వరకు పలుకుతుందని.. ఒక్కో కాయ ధర కనీసం రూ.లక్ష వరకు ఉంటుందని చెబుతున్నారు. ఇది క్యాన్సర్‌కు మందుగా.. కొలెస్ట్రాల్ తగ్గించే ఔషధంగా పేరొందడంతో దీనికి విలువ పెరిగింది. నాగేశ్వరరావు తోటలో గత ఏడాది మియాజాకీ రకం పండు మాత్రమే ఒకటి మాత్రమే కాయగా.. ఈ ఏడాది ఏకంగా 15 కాయలు కాసాయి.


మియాజాకీ మామిడి పండ్లు


నూర్జహాన్ రకం మామిడి

సుమో.. మామిడి!

ఈ రైతు తోటలో ఈ ఏడాది కొత్తగా ఐదు కేజీల మామిడి చెట్లు కాపు మొదలుపెట్టాయి. ఒక్కో మామిడి కాయ బరువు సుమారు ఐదు కేజీలు ఉండటం వీటి ప్రత్యేకం. ప్రస్తుతం ఒక చెట్టుకు రెండు మాత్రమే కాసాయి. ఈ రకాన్ని అఫ్గాన్ దేశానికి చెందిన నూర్జహాన్‌గా పిలుస్తారు. ప్రపంచవ్యాప్తంగా అతి పెద్ద కాయగా దీనికి గుర్తింపు ఉంది. ఒక్క కాయ రూ.వెయ్యికి పైనే ఉంటుంది. సుమారు అడుగు పొడవు ఉండడం దీని విశేషం. పూత దశలో ఉండగానే దీనికి డిమాండ్ పెరుగుతుంది. మామిడి ప్రియులు వీటిని ముందుగానే బుక్ చేసుకుంటారు.

విచిత్ర ఆకారాలు.. చిత్రమైన రంగులు

నాగేశ్వరరావు తోటలో అడుగుపెడితే కళ్లు మిరుమిట్లు గొలిపే రంగులు.. చిత్ర విచిత్రమైన ఆకారాల్లో మామిడి కాయలు కనిపిస్తాయి. చూడటానికి తయారు చేసిన కాయల మాదిరిగా కనిపిస్తాయి. ఇక్కడి మామిడి చెట్లకు అరటి పండ్లు వేలాడుతుంటాయి. వాటిని కోస్తే మాత్రం అచ్చమైన మామిడి పండ్లే. వీటిని అరటి పండ్ల మాదిరిగానే వలుచుకు తినేయొచ్చు. అచ్చం యాపిల్ పండ్ల మాదిరిగా ఉండే మామిడి పండ్లు సైతం ఈ తోటలో కాస్తున్నాయి. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు వందకు పైగా అబ్బురపరిచే మామిడి మొక్కలతో ఈ పండ్ల తోట కనువిందు చేస్తోంది.

మియాజాకీ 15 కాయలు కాసింది



నాలుగేళ్ల క్రితం వివిధ రకాల మామిడి మొక్కలు వేయడం ప్రారంభించాను. గత ఏడాది మియాజాకీ మామిడి పండు ఒకటి కాసింది. ఈ ఏడాది ఏకంగా 15 కాయలు కాసాయి. ఈ రకం మొక్కలు 20 నాటాను. వాటిలో రెండు చెట్లు మాత్రమే కాస్తున్నాయి. ఒక్కో కాయ 380 నుంచి 450 గ్రాముల వరకు బరువు ఉన్నాయి. మొత్తం మామిడి కాయల బరువు సుమారు 6 కేజీల వరకు ఉంటుంది. వీటి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.15 లక్షల పైమాటే.

– ఓదూరి నాగేశ్వరరావు, రైతు, చేబ్రోలు

ఇవి చాలా అరుదు



మియాజాకీ, నూర్జహాన్ రకాల మామిడి మన ప్రాంతంలో పండటం చాలా అరుదు. ఇవి చాలా విలువైనవి. నాగేశ్వరరావు తోటలో పండించే పంటలు అన్ని రకాలు చాలా అరుదైనవే. వీటిని ఇతర రైతులకు పరిచయం చేయడానికి ప్రయత్నిస్తాం. మొక్కలు నాటినా అవి చాలా వరకు పంటకు రావు. కానీ.. ఆయన అరుదైన రకాలను పండించడం మాకే ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మియాజాకీ పండించడం మిరాకిల్‌గానే చెప్పవచ్చు.

– అరుణ్‌కుమార్, ఇన్‌చార్జ్ ఉద్యాన శాఖాధికారి, గొల్లప్రోలు

నర్సాపూర్–యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): వేసవిలో ప్రయాణికుల డిమాండ్ మేరకు నర్సాపూర్–యశ్వంత్‌పూర్ మధ్య 6 వారంతపు సర్వీసులు నడపనున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు ప్రకటించారు. నర్సాపూర్–యశ్వంత్‌పూర్ (07687) ఈ నెల 14, 21, 28 తేదీలలో ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.10 గంటలకు నర్సాపూర్‌లో బయలుదేరి 7.20 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. అక్కడ బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.50 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07688) ఈ నెల 15, 22, 29 తేదీలలో ప్రతి సోమవారం మధ్యాహ్నం 3.50 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు జామున 4.50 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. అక్కడ బయలుదేరి ఉదయం 8.30 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది.

పేదల ఇళ్లకు అదనంగా భూమి కేటాయించడం హర్షణీయం

955వ రోజు రిలే నిరాహార దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు


రిలే నిరాహార దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: రాజధాని ప్రాంతంలోని పేదల భూముల కోసం అదనంగా 268 ఎకరాలు కేటాయించడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నేతలు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో 955వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు బుధవారం పలువురు హాజరయ్యారు. గతంలో ఏ ప్రభుత్వం పేదల కోసం ఇంతగా చొరవ చూపించి భూములు ఇచ్చిన దాఖలాలే లేవని, పేదల కలలు సాకారం చేసేందుకు నడిబొడ్డున శాటిలైట్ సిటీ నిర్మాణం చేసేందుకు శరవేగంగా పనులు చేస్తుండటంపై హర్షం వ్యక్తం చేశారు. పేదలను ఈ ప్రాంతంలో ఉంచకుండా చేసేందుకు కులవాదులు వందల కొద్దీ తప్పుడు కేసులు వేయిస్తుండటం సిగ్గుచేటన్నారు. దళిత దళారులను అడ్డుపెట్టుకొని చేస్తున్న ఈ తప్పుడు వ్యవహారంలో అగ్రవర్ణాల మోచేతి నీళ్ళు తాగుతూ బహుజనులకు అన్యాయం చేస్తున్న వీరిని తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. తాము ధర్నా చేస్తున్న ప్రాంతాన్ని అంబేడ్కర్ ధర్నా చౌక్‌గా నామకరణం చేసి స్థూపం ఏర్పాటు చేయాలన్నారు. సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, బొలిమేర శ్యామ్యూల్, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ సలహాదారుగా జపాన్ మాజీ రాయబారి


మసనోరినకనోకు నియామక పత్రం అందజేస్తున్న రవీంద్ర

బుచ్చినాయుడుకండ్రిగ (తిరుపతి జిల్లా): శ్రీసిటీ సలహాదారుగా జమైకాలోని జపాన్ మాజీ రాయబారి మసనోరినకనో నియమించినట్లు శ్రీసిటీ బుధవారం తెలిపింది. ఈ మేరకు మసనోరినకనోతో శ్రీ సిటీ ఎండీ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి ఇటీవల జపాన్‌లో ఈ నియామక ఒప్పందంపై సంతకం చేయించారు. మసనోరినకనో ఫిబ్రవరి 2015 నుంచి అక్టోబర్ 2017 వరకు జమైకా, కామన్వెల్త్ ఆఫ్ ది బహామాస్, బెలిజ్‌కు జపాన్ రాయబారిగా పనిచేశారు. ఫిబ్రవరి 2011 నుంచి ఫిబ్రవరి 2015 వరకు చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్‌గా కొనసాగారు. దౌత్య విధుల్లో భాగంగా శ్రీలంక, అమెరికా, ఈజిప్టు, రాజకీయ, ప్రజా సంబంధాలు మరియు సాంస్కృతిక అధికారిగా పనిచేశారు. టోక్యో వాసెడా వర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ, టోక్యో అయోమగాకున్ వర్సిటీ నుంచి అంతర్జాతీయ రాజకీయాల్లో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ఒప్పందం అనంతరం మసనోరినకనో స్పందిస్తూ.. 2011లో మొదటిసారి శ్రీసిటీని సందర్శించినప్పుడు తనను ఎంతగానో ఆకట్టుకుందన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

- రోడ్డుపై కాలిపోయిన మృతదేహం లభ్యం
- ముందు రోజు రాత్రి స్నేహితులతో పార్టీ
- ఆ తర్వాత పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొన్నట్టు సీసీ కెమెరాలో రికార్డ్
- కృష్ణాజిల్లాలో ఘటన


రోదిస్తున్న తల్లి రూతమ్మ


జీవన్(ఫైల్)

పెనమలూరు : కృష్ణా జిల్లా పెనమలూరు మండల పరిధిలోని పెదపులిపాక గ్రామ శివారు డొంకరోడ్డులో బుధవారం తెల్లవారు జామున ఇంజినీరింగ్ విద్యార్థి మృతదేహం కలకలం రేపింది. మృతదేహం కాలిపోయిన స్థితిలో ఉండటం అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనపై పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్లూరుపాలేనికి చెందిన సుధాకర్, రూతమ్మలు విజయవాడ సున్నపుబట్టీల వద్ద ఉంటున్నారు. సుధాకర్ వాచ్‌మేన్‌గా పని చేస్తాడు. వారి కుమారుడు జమ్మలమూడి జీవన్(21) విజయవాడ వన్‌టౌన్‌లోని పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్‌కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం జీవన్ మిత్రుడు శ్యామ్ పుట్టిన రోజు సందర్భంగా గురునానక్‌నగర్ ప్రాంతంలోని ఓ రెస్టారెంట్‌లో పార్టీ చేసుకున్నారు. అర్ధరాత్రి వరకు పార్టీలో ఉన్న జీవన్.. మిత్రుడి యాక్టివా తీసుకుని బయటకొచ్చాడు. ఆ తర్వాత పెదపులిపాక శివారులోని డొంక రోడ్డులో కాలిపోయి శవమై కనిపించాడు. జీవన్‌ను ఎవరైన పథకం ప్రకారం హత్య చేశారా.. లేక బలవన్మరణానికి పాల్పడ్డాడా.. అనే విషయం మిస్టరీగా మారింది. ఘటనపై పెనమలూరు పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టి పలు విషయాలు సేకరించారు. జీవన్ మంగళవారం రాత్రి 12:20 గంటలకు మిత్రుడి వాహనంపై రెస్టారెంట్ నుంచి బయటకొచ్చాడు. అక్కడి నుంచి యనమలకుదురు పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి సీసాలో రూ.100 పెట్రోల్ పోయించుకున్నాడు. ఈ దృశ్యాలు పెట్రోల్ బంక్ వద్ద సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఆ తర్వాత అర్ధరాత్రి 1.40 గంటలకు తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. రూ.12 వేలు ఈఎంఐ డబ్బు వాడుకున్నాను.. ఇంటికి రావడం లేదు.. అమ్మ సారీ.. అని చెప్పాడు. ఆ తర్వాత జీవన్ ఫోన్ పని చేయలేదు. అంతకు ముందు రోజే జీవన్ తన ఇన్‌స్టాగామ్‌లో.. దిస్ ఈజ్ లాస్ట్ డే. అని పెట్టగా మిత్రులు ఎగతాళి చేశారు. దీనికి జీవన్.. రాత్రి చూస్తారుగా అని పోస్టు పెట్టాడు. ఈ విషయాలు పోలీసుల విచారణలో వెలుగు చూశాయి. జీవన్ మృతదేహం వద్ద ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని కాల్స్‌ను పరిశీలిస్తున్నారు. రాత్రి పార్టీలో ఉన్న మిత్రులను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రూ.2.5 కోట్ల విలువైన బంగారం పట్టివేత

పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు, రెండు కార్లు


పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన బంగారం తరలించిన కార్లు

దొరవారిసత్రం: ఎలాంటి బిల్లుల్లేకుండా 2 కార్లలో తరలిస్తోన్న 5.2 కేజీల బంగారు బిస్కెట్లు, బంగారు కడ్డీలను తిరుపతి జిల్లాలోని దొరవారిసత్రం పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన బుధవారం దొరవారిసత్రం మండలం తల్లంపాడు గ్రామ సమీపంలోని స్వర్ణా టోల్ ప్లాజా వద్ద జరిగింది. వివరాలను నాయుడుపేట సీఐ సోమయ్య, ఎస్ఐ తిరుమలరావు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి టోల్ ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి బిల్లులు లేకుండా రూ.2.5 కోట్ల విలువైన 5.2 కేజీల బంగారు బిస్కెట్లు, బంగారు కడ్డీలను చెన్నై నుంచి నరసరావుపేటకు 2 కార్లలో తరలిస్తుండగా గుర్తించారు. కార్లల్లో ప్రయాణిస్తోన్న నరసరావుపేటకి చెందిన బంగారు వ్యాపారులు సుమంత్, దిలీప్, సాయి కుమార్, రాజును అదుపులోకి తీసుకుని బంగారాన్ని, కార్లను సీజ్ చేశారు. పట్టుబడిన బంగారం అంతా తిరుపతి కస్టమ్స్ అధికారులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

శ్రీవారి సేవలో తెలంగాణ గవర్నర్ తమిళిసై


ధ్వజస్తంభానికి మొక్కుతున్న తెలంగాణ గవర్నర్ తమిళిసై

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ బుధవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. కాగా, శ్రీవారిని మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్ టి.రాజా, రేమాండ్స్ అధినేత గౌతమ్ సింఘానియా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గౌతమ్ సింఘానియా మాట్లాడుతూ ముంబయిలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి జూన్‌లో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. అలాగే తిరుమలలో విద్యాసంస్థ నిర్వహణ బాధ్యత తీసుకుని మంచి ఫలితాలు సాధించమని చెప్పారు. త్వరలోనే మరిన్ని విద్యాసంస్థల నిర్వహణ బాధ్యతలు స్వీకరిస్తామని వివరించారు.

తెలంగాణ

తెలంగాణ టెన్త్‌లోనూ బాలికలదే పైచేయి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల్లో 86.60 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియట్ తరహాలోనే టెన్త్ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి బుధవారం హైదరాబాద్‌లో పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన, పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావులతో కలసి టెన్త్ ఫలితాలను విడుదల చేశారు. మొత్తంగా 4,94,504 మంది దరఖాస్తు చేసుకోగా.. 4,91,862 మంది పరీక్షలు రాశారని, ఇందులో 4,22,795 మంది (86.60 శాతం) ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

క్లుప్తంగా

సోరెన్‌తో నితీశ్ భేటీ

రాంచీ: సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాలను ఐక్యం చేయడంపైనే ప్రధానంగా చర్చించామని జార్ఖండ్ ముఖ్యమంత్రి, జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీ చీఫ్ హేమంత్ సోరెన్‌తో భేటీ తర్వాత జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ప్రకటించారు. బుధవారం రాంచీకి చేరుకున్న నితీశ్.. ఆర్జేడీ కీలక నేత తేజస్వీ యాదవ్‌తోపాటు సోరెన్‌తో చర్చలు జరిపారు. 'బీజేపీని ఓడించడం, విపక్షాలను ఏకతాటి మీదకు తేవడంపైనే చర్చించాం. ఈ సంప్రదింపుల ఫలితం వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. చరిత్రను తిరగరాయాలన్న బీజేపీ సర్కార్ కుతంత్రాలను మేం తిప్పికొడతాం. హిందూ–ముస్లిం ఐక్యతను మళ్లీ పునఃప్రతిష్ఠిస్తాం' అని నితీశ్ మీడియాతో అన్నారు. ఎన్‌డీఏయేతర పార్టీలను ఏకంచేసే క్రమంలో విపక్ష పార్టీల అగ్రనేతలతో వరసగా భేటీలను నితీశ్ కొనసాగిస్తున్న విషయం తెల్సిందే. మంగళవారం ఒడిశాకు వెళ్లిన నితీశ్ అక్కడ బిజూ జనతాదళ్ చీఫ్ నవీన్ పట్నాయక్‌తో గంటకుపైగా మంతనాలు జరిపారు. ఇటీవల ఆయన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌లనూ కలిశారు. ఏప్రిల్‌లో రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గేనూ నితీశ్ కలిశారు. అంతకుముందు ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్, ఆప్ అధినేత కేజ్రీవాల్, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తదితరులతోనూ భేటీ అయ్యారు.

మోచా తుపానుతో అండమాన్‌లో భారీ వర్షాలు

పోర్ట్ బ్లెయిర్/భువనేశ్వర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మోచా తుపానుగా మారబోతోంది. దీని ప్రభావంతో అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. సంబంధిత వివరాలను భారత వాతావరణ శాఖ బుధవారం వెల్లడించింది. 'అండమాన్, నికోబార్ దీవుల్లోని పోర్ట్ బ్లెయిర్ సమీపంలో అల్పపీడనం కేంద్రీకృతమైంది. అది గురువారంకల్లా భీకర మోచా తుపానుగా మారి ఆ దీవుల్లో భారీ వర్షాలకు కారణమవుతుంది. తర్వాత బంగాళాఖాతం ఆగ్నేయ, సమీప ప్రాంతాల్లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మే 13న కాస్తంత బలహీనపడి బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్, మయన్మార్‌లోని క్యావూక్‌ప్యూ పట్టణాల మధ్య తుపాను తీరం దాటనుంది. మే 14న గంటకు 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జాలర్లు చేపలవేట కోసం సముద్రంలోకి వెళ్లకపోవడం శ్రేయస్కరం' అని కోల్‌కతా రీజియన్ డైరెక్టర్ జీకే దాస్ చెప్పారు. అత్యవసర నిర్వహణ కేంద్రాల ద్వారా నిరంతరం పరిస్థితిని అంచనావేస్తూ తీరప్రాంతవాసులను అప్రమత్తం చేస్తామన్నారు.

కర్ణాటక కాంగ్రెస్‌దే!

ఎగ్జిట్ పోల్స్ వెల్లడి	కాంగ్రెస్‌కు 122 నుంచి 140 సీట్లు	ఇండియాటుడే-మై యాక్సిస్ వెల్లడి	అత్యధిక సర్వేల్లో కాంగ్రెస్‌కే మొగ్గు	ఒకట్రెండింట్లో బీజేపీకి ఆధిక్యం	జేడీ(ఎస్)కు 20 నుంచి 25

సాక్షి, బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ఎగ్జిట్ పోల్స్ జైకొట్టాయి. కాంగ్రెస్ స్పష్టమైన మెజారిటీ సాధించనుందని ఇండియాటుడే–మై యాక్సిస్ సర్వే వెల్లడించింది. మెజారిటీకి 113 స్థానాలు కావాల్సి ఉండగా కాంగ్రెస్ 122 నుంచి 140 దాకా నెగ్గుతుందని ఇండియాటుడే పేర్కొనడం విశేషం. బీజేపీకి కేవలం 62 నుంచి 80 సీట్లే వస్తాయని అంచనా వేసింది. మొత్తమ్మీద కాంగ్రెస్‌కు 43 శాతం ఓట్లొస్తాయని, బీజేపీకి 35 శాతం, జేడీ(ఎస్)కు 16 శాతం దాకా రావచ్చని తెలిపింది. టైమ్స్ నౌ, ఇండియా టీవీ కూడా కాంగ్రెస్‌కు 120 సీట్ల దాకా వస్తాయని, బీజేపీ 90 స్థానాలకు పరిమితమవుతుందని పేర్కొన్నాయి. కాంగ్రెసే ఏకైక పెద్ద పార్టీగా నిలవనుందని బుధవారం సాయంత్రం పోలింగ్ ముగియగానే వెలువడ్డ ఎగ్జిట్‌పోల్స్‌లో చాలావరకు పేర్కొన్నాయి. బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీగా తలపడ్డా 2018 ఫలితాలతో పోలిస్తే కాంగ్రెస్ బాగా పుంజుకుందని దాదాపుగా సర్వేలన్నీ వెల్లడించాయి. కాంగ్రెస్‌కు 100 నుంచి 112, బీజేపీ 83 నుంచి 95 సీట్లొస్తాయని సీ ఓటర్ సర్వే తేల్చింది. జన్ కీ బాత్ కాంగ్రెస్‌కు 91 నుంచి 106 స్థానాలు, బీజేపీకి 94 నుంచి 117 ఇచ్చింది. కొన్ని మాత్రం హంగ్ ఏర్పడుతుందని జోస్యం చెప్పాయి. అదే జరిగితే జేడీ(ఎస్) మరోసారి కింగ్‌మేకర్ పాత్ర పోషించే అవకాశముంది. ఆ పార్టీకి 14 నుంచి 30 స్థానాలు రావచ్చని సర్వేలు తేల్చాయి. శనివారం ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెలువడనున్నాయి.

38 ఏళ్లుగా కన్నడ ఓటర్లు ఏ పార్టీకీ వరుసగా రెండోసారి అధికారం కట్టబెట్టని సంగతి తెలిసిందే. ఈ చరిత్రను ఈసారి ఎలాగైనా తిరగరాయాలని బీజేపీ ప్రచారంలో సర్వశక్తులూ ఒడ్డింది. ప్రధాని మోదీ కాలికి బలపం కట్టుకుని రాష్ట్రమంతటా కలియదిరిగారు. పదుల కొద్దీ బహిరంగ సభలు, ర్యాలీలు, మెగా రోడ్ షోలతో హోరెత్తించారు. కాంగ్రెస్ కూడా ఈసారి స్పష్టమైన మెజారిటీ సాధనే లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రానికి చెందిన మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టిన నేపథ్యంలో పార్టీ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. 81 ఏళ్ల వయసులోనూ రాష్ట్రమంతటా తిరిగి శ్రమించారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ వద్రా రోజుల తరబడి జోరుగా ప్రచారం చేశారు.

2018లో అలా...

ప్రస్తుత అసెంబ్లీలో బీజేపీకి 116, కాంగ్రెస్‌కు 69, జేడీ(ఎస్)కు 29 స్థానాలున్నాయి. 2018లో కూడా హంగ్ అసెంబ్లీయే ఏర్పడింది. 104 సీట్లతో బీజేపీ అతి పెద్ద పార్టీగా నిలిచింది. కాంగ్రెస్‌కు 80, జేడీ(ఎస్)కు 37 సీట్లొచ్చాయి. బీఎస్పీ, కేపీజేపీ, స్వతంత్రులకు ఒక్కో స్థానం దక్కింది. కాంగ్రెస్, జేడీ(ఎస్) సంకీర్ణంగా ఏర్పడే ప్రయత్నాల్లో ఉండగానే బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకొచ్చింది. బీఎస్ యడియూరప్ప సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. కానీ మెజారిటీ నిరూపించుకోలేక బలపరీక్షకు ముందే రాజీనామా చేశారు. అనంతరం ఊహించినట్టుగానే కాంగ్రెస్–జేడీ(ఎస్) జట్టు కట్టి కుమారస్వామి సీఎం అయ్యారు. కానీ పాలక కూటమికి చెందిన 17 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి బీజేపీ గూటికి చేరడంతో సర్కారు 14 నెలలకే కుప్పకూలింది. మళ్లీ బీజేపీ గద్దెనెక్కింది. తర్వాత 15 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో పన్నెండింటిని బీజేపీ గెలుచుకుని మెజారిటీ సాధించింది.


చికమగళూరులో బారులు తీరిన ఓటర్లు

ప్రాంతాలవారీగా ఇండియాటుడే ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు

ప్రాంతం	సీట్లు	బీజేపీ	కాంగ్రెస్	జేడీ(ఎస్)
కోస్తా	19	16	3	0
సెంట్రల్	23	10	12	1
బెంగళూరు	28	10	17	1
కల్యాణ్	40	7	32	1
ముంబై	50	21	28	1
మైసూరు	64	6	36	18

కర్ణాటకలో పోలింగ్ 71.77%

- అత్యధికంగా రామనగరలో 78.22 శాతం
- బీబీఎంపీ స్థానంలో కేవలం 48.63 శాతం

సాక్షి, బెంగళూరు: కర్ణాటక శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 224 స్థానాల్లో బుధవారం ఒకేదఫాలో ఎన్నికలు నిర్వహించారు. అక్కడక్కడ చెదురుమదురు సంఘటనలు మినహా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ 10 గంటల తర్వాత పుంజుకుంది. మండుటెండలను సైతం లెక్కజేయకుండా ప్రజలంతా ఓట్లు వేసేందుకు బారులు తీరారు. మధ్యాహ్నం కల్లా 50 శాతం పోలింగ్ పూర్తయ్యింది. రాత్రి 10 గంటలకల్లా అందిన సమాచారం ప్రకారం 71.77శాతం పోలింగ్ నమోదయ్యింది. పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉన్నట్లు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. అత్యధికంగా రామనగర స్థానంలో 78.22 శాతం, బెంగళూరు నగరంలో భాగమైన బృహన్ బెంగళూరు మహానగర పాలికే(బీబీఎంపీ) స్థానంలో అత్యల్పంగా 48.63 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 58,545 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 2,615 మంది అభ్యర్థులు నిలిచారు. మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ, ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మాజీ ముఖ్యమంత్రులు బీఎస్ యడియూరప్ప, డీవీ సదానంద గౌడ, సిద్ధరామయ్య, జగదీష్ షెట్టర్, కుమారస్వామి, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి, సుధా నారాయణమూర్తి తదితర ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ నెల13న ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. రాష్ట్రంలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 72.36 శాతం పోలింగ్ నమోదయ్యింది.

యాదగిరి జిల్లా శహపుర నియోజకవర్గం నగనూరు గ్రామంలో 105 ఏళ్ల వృద్ధురాలు దేవకమ్మ ఓటు వేశారు. మంగళూరులో ఆనంద ఆళ్వా (107), శివమొగ్గ జిల్లాలో బీబీ జాన్ (101) ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. బెళగావి జిల్లా శివపురలో పారవ్వ ఈశ్వర సిద్నాళ (68) అనే వృద్ధురాలు ఓటు వేసిన తర్వాత పోలింగ్ కేంద్రంలోనే కుప్పకూలి మరణించింది. హసన్ జిల్లాలో ఓ వ్యక్తి ఓటేసి బయటకు రాగానే హఠాత్తుగా గుండెపోటుకు గురై చనిపోయాడు.

మాదే విజయం: బొమ్మై

ఈసారి బీజేపీ పూర్తి మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వస్తుందని సీఎం బసవరాజ్ బొమ్మై ధీమా వెలిబుచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ కంటే తామే ఎక్కువ సీట్లు గెలుస్తామని, తమకు 120 వరకు వస్తాయని జేడీ(ఎస్) నేత కుమారస్వామి అన్నారు. కింగ్‌మేకర్ కాదు, కింగ్ అవుతామని చెప్పారు.

ఈవీఎంలు ధ్వంసం

విజయపుర జిల్లా మసాబినాల్ గ్రామంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను(ఈవీఎం) తీసుకెళ్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. ఎన్నికల సంఘం అధికారిపై చెయ్యి చేసుకున్నారు. ఈవీఎం కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లను గ్రామస్తులు ధ్వంసం చేశారు. ఈవీఎంలు, వీవీప్యాట్లను మార్చేశారని పుకార్లు వ్యాపించడమే ఇందుకు కారణం. ఈసీ అధికారుల ఫిర్యాదు మేరకు 23 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పద్మనాభనగర్ నియోజకవర్గంలో కొందరు ప్రత్యర్థులపై భౌతిక దాడికి పాల్పడ్డారు. బళ్లారి జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది.


ఓటేసిన నారాయణమూర్తి దంపతులు


సీఎం బొమ్మై


నిర్మలా సీతారామన్


మల్లికార్జున ఖర్గే


సిద్ధరామయ్య


డీకే శివకుమార్


కుమారస్వామి



కన్నడ నటులు యశ్, రిషబ్ శెట్టి


ఓటేయడానికి వచ్చిన కొత్త పెళ్లికూతురు

ఒక ఇమ్రాన్.. రెండు కేసులు

పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి, పాకిస్తాన్ తెహ్రీకీ ఇన్సాఫ్ అధినేత ఇమ్రాన్ ఖాన్‌ను రెండు కేసులు చిక్కుల్లో పడేశాయి. ఒక కేసు ఆయన అరెస్ట్‌కి దారి తీస్తే, మరో కేసులో న్యాయస్థానం ఆయనని దోషిగా తేల్చింది. ఈ రెండు కేసులు దేనికవే భిన్నమైనవి. బ్రిటన్‌లో మూలాలున్న ఒక కేసులో మనీ లాండరింగ్ వ్యవహారాలు ప్రధానంగా ఉంటే , మరో కేసులో ప్రభుత్వానికి వచ్చిన ఖరీదైన బహుమతుల్ని అమ్ముకొని సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

– సాక్షి,సెంట్రల్ డెస్క్



అల్ ఖదీర్ ట్రస్ట్ కేసు

ఇమ్రాన్ ఖాన్ అరెస్టుకు కారణమైన అల్ ఖదీర్ ట్రస్ట్ కేసుది ఆసక్తికరమైన నేపథ్యం. దీని మూలాలు బ్రిటన్‌లో ఉన్నాయి. ఇమ్రాన్ ప్రధానిగా ఉన్నప్పుడు 2019లో అల్ ఖదర్ యూనివర్సిటీ ట్రస్ట్ ఏర్పాటు ముసుగులో భారీగా అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. పాకిస్తాన్ రియల్ ఎస్టేట్ వ్యాపారి మాలిక్ రియాజ్‌కు, ఇమ్రాన్‌ఖాన్ మధ్య జరిగిన క్విడ్ ప్రోకో ఒప్పందంతో దేశ ఖజానాకు రూ.5 వేల కోట్లు నష్టం వాటిల్లిందనేది ప్రధానమైన ఆరోపణ. గత ఏడాది జూన్‌లో మొట్టమొదటిసారిగా అల్ ఖదీర్ యూనివర్సిటీ ట్రస్ట్ కేసు అవినీతిపై అధికారంలో ఉన్న సంకీర్ణ సర్కార్ బహిరంగంగా ఆరోపణలు చేసింది. పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి రానా సనుల్లా వివరాల ప్రకారం పంజాబ్‌లోని జీలం జిల్లా సోహావా ప్రాంతంలో సూఫీయిజాన్ని బోధించడం కోసం అల్ ఖదీర్ యూనివర్సిటీని నిర్మించడానికి ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీ, ఆయనకు అత్యంత సన్నిహితులైన అనుచరులు జుల్ఫికర్ బుఖారీ, బాబర్ అవాన్ కలిసి అల్ ఖదీర్ ట్రస్ట్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 2019లో ఇమ్రాన్ భార్య బుష్రా బీబీ బహ్రియా పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి విరాళాలు తీసుకోవడానికి ఒప్పందం చేసుకున్నారు. ట్రస్ట్‌కు వందలాది కోట్ల విలువైన 57.25 ఎకరాలను ఆ సంస్థ విరాళంగా అందించింది. అందులో 240 కనాల్స్ భూమిని (30 ఎకరాలు) బుష్రా బీబీకి ప్రాణ స్నేహితురాలైన ఫరా గోగి పేరిట బదలాయించారు. బహ్రియాలో రియల్ ఎస్టేట్ సంస్థ అధిపతే మాలిక్ రియాజ్. ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల్ని బ్రిటన్‌లో విచారించే నేషనల్ క్రైమ్ ఏజెన్సీ (ఎన్‌సీఏ) ఒకానొక కేసులో మాలిక్ రియాజ్ నుంచి ఏకంగా 19 కోట్ల పౌండ్ల (అప్పట్లో పాకిస్తాన్ కరెన్సీలో రూ. 5,000 కోట్లు) నల్లధనం జప్తు చేసింది. బ్రిటన్‌లో చట్టాల ప్రకారం విదేశీయుడికి చెందిన డబ్బుల్ని స్వాధీనం చేసుకుంటే తిరిగి వారి మాతృ దేశంలో ప్రభుత్వానికి అప్పగించాలి. అదే ప్రకారం పాకిస్తాన్‌లో ఇమ్రాన్ ప్రభుత్వానికి అప్పగించింది. అయితే ఇమ్రాన్‌కు, మాలిక్ రియాజ్‌కు మధ్య కుదిరిన ఒప్పందంతో ఇమ్రాన్ సర్కార్ ఆ వ్యాపారి బ్రిటన్ ఖాతాకు తిరిగి డబ్బులు పంపినట్టుగా ప్రభుత్వం ఆరోపిస్తోంది. దీనికి ప్రతిఫలంగా మాలిక్ రియాజ్ యూనివర్సిటీ నిర్మాణం కోసం భూములతో పాటు రూ.500 కోట్ల రూపాయల్ని కూడా ముట్టజెప్పారన్నది ఆరోపణ. అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న పాకిస్తాన్‌ను ఈ ఒప్పందంతో ఇమ్రాన్ సర్కార్ పూర్తిగా ముంచేసిందని షహబాజ్ సర్కార్ ఆరోపించింది. ఈ కేసులో మే 1న ఇమ్రాన్‌పై అరెస్ట్‌కి వారెంట్లు జారీ కాగా మే9న ఆయన అరెస్టయ్యారు.

తోషాఖానా కేసు..

ప్రభుత్వానికి వచ్చే కానుకలను భద్రపరిచే ఖజానాను తోషఖానా అంటారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు తమకు ఎవరు ఏ కానుక ఇచ్చినా తోషఖానాకు తప్పనిసరిగా అప్పగించాలి. ఇమ్రాన్‌ఖాన్ ప్రధాని పదవిలో ఉండగా 101 కానుకలు వచ్చాయి. వాటిల్లో అత్యంత ఖరీదైన వజ్రాల రిస్ట్ వాచీలు, ఉంగరాలు, కఫ్‌లింక్స్ పెయిర్, రోలాక్స్ వాచీలు, పెన్నులు పెర్ఫ్యూమ్స్, ఐ ఫోన్లు, మసీదు, అత్తర్ బాటిల్స్ నమూనాల వంటి కళాకృతులు వంటివి ఉన్నాయి. ఇమ్రాన్ తనకు వచ్చిన కానుకలేమిటో చెప్పడానికి నిరాకరించడంతో పాటు వాటిని అమ్ముకోవడానికి అనుమతినివ్వాలంటూ ఈసీకి లేఖ కూడా రాశారు. 2018, సెప్టెంబర్ 24 నాటికి అలా వచ్చిన కానుకల్లో 10 కోట్ల విలువైన కానుకల్ని ప్రభుత్వానికి 2 కోట్లు చెల్లించి ఇమ్రాన్ తీసుకున్నారని, వాటిని మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముకున్నారని ఆరోపణలు వచ్చాయి. కేవలం మూడు వాచీలను అమ్మేసి ఇమ్రాన్ సొమ్ము చేసుకున్న మొత్తం రూ.3.6 కోట్లుగా తేలింది. పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్ (పీఎంఎల్–ఎన్) నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2022 ఆగస్టులో తోషఖానా వివాదంపై కేసు నమోదు చేసింది. ఇమ్రాన్ తనకు వచ్చిన కానుకల వివరాలు చెప్పకుండా కొన్ని అక్రమ మార్గాల్లో అమ్ముకున్నారంటూ కేసు పెట్టింది. ఇమ్రాన్ గద్దె దిగిన తర్వాత తోషఖానాలో కొన్ని పుస్తకాలు తప్ప మరే వస్తువు మిగల్లేదు. ఇప్పుడు పాక్ కోర్టు ఆయనని ఈ కేసులో దోషిగా తేల్చింది.

ఇమ్రాన్ ఖాన్ ముమ్మాటికీ దోషే

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని, పీటీఐ అధినేత ఇమ్రాన్ ఖాన్ (70)ను వరుసగా కష్టాలు చుట్టుముడుతున్నాయి. అక్రమ భూ బదలాయింపు కేసులో అరెస్టయిన ఆయనను 8 రోజులపాటు నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో (ఎన్ఏబీ) రిమాండ్‌కు తరలిస్తూ కోర్టు బుధవారం ఆదేశాలిచ్చింది. మరోవైపు తోషఖానా కేసులో ఇమ్రాన్‌ను ఇస్లామాబాద్ సెషన్స్ కోర్టు దోషిగా తేల్చింది. ఆయన ముమ్మాటికీ దోషేనని న్యాయమూర్తి హుమాయూన్ దిలావర్ నిర్ధారించారు. కాగా తనకు ప్రాణభయం ఉందని ఇమ్రాన్ ఒక ప్రకటన విడుదల చేశారు. 24 గంటలుగా వాష్‌రూమ్‌కు కూడా వెళ్లలేదని చెప్పారు. తన వైద్యున్ని కలిసే అవకాశమివ్వాలని కోర్టును కోరారు. ప్రధాని షహబాజ్ షరీఫ్ భాగస్వామిగా ఉన్న మనీ లాండరింగ్ కేసులో సాక్షి 'గుండెపోటు'తో మరణించాడని, తనకూ అదే గతి పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రణరంగంగా పాక్



ఇమ్రాన్ అరెస్టును ఖండిస్తూ పీటీఐ నేతలు, కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. మంగళవారం ప్రారంభమైన ఆందోళనలు బుధవారమూ కొనసాగాయి. 144 సెక్షన్‌ను సైతం లెక్కచేయకుండా ఆందోళనకారులు వీధుల్లోకి వచ్చారు. లాహోర్, పెషావర్, క్వెట్టా, కరాచీ, రావల్పిండి తదితర నగరాల్లో విధ్వంసానికి పాల్పడ్డారు. వాహనాలను దహనం చేశారు. దాంతో దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. అదనపు బలగాలను మోహరించారు. అన్ని విద్యాసంస్థలను మూసేశారు. పరీక్షలను వాయిదా వేశారు.

చికిత్స చేస్తుంటే చంపేశాడు

కొల్లాం/తిరువనంతపురం: కుటుంబసభ్యులతో తీవ్రంగా గొడవపడి గాయపడిన వ్యక్తిని పోలీసులు ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స చేయిస్తుండగా ఒక్కసారిగా ఉన్మాదిలా మారి వైద్యురాలిని రోగి హతమార్చిన ఘటన కేరళలో జరిగింది. కొల్లం జిల్లా కొట్టరక్కరలో సందీప్ అనే సస్పెండైన టీచర్ తన కుటుంబసభ్యులతో తీవ్రంగా గొడవపడ్డాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కాలి గాయానికి చికిత్స కోసం బుధవారం తెల్లవారుజామున ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యురాలు వందనా దాస్(23) చికిత్స చేస్తుండగా అతను హఠాత్తుగా సర్జికల్ బ్లేడ్, కత్తెరతో అందరిపైనా దాడికి దిగాడు. వైద్యురాలిని పలుమార్లు పొడిచాడు. పోలీసులతో పాటు నలుగురు గాయపడ్డారు. తీవ్రంగా రక్తమోడుతున్న డాక్టర్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినా లాభం లేకపోయింది. ఇది దారుణమని, నిందితునిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం పినరయి విజయన్ అన్నారు. ఈ ఘటనపై కేరళ హైకోర్టు మండిపడింది. రోగి అసాధారణంగా ప్రవర్తిస్తున్నాడని తెలిసీ ఆపలేకపోవడం పూర్తిగా పోలీసుల, ప్రభుత్వ వైఫల్యమని పేర్కొంది.

బాధితురాలికి 5 మిలియన్ డాలర్లు చెల్లించండి

లైంగిక వేధింపుల కేసులో ట్రంప్‌కు కోర్టు ఆదేశం

న్యూయార్క్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (76)కు మరో ఎదురుదెబ్బ తగిలింది. జీన్ క్యారోల్ అనే జర్నలిస్టును లైంగికంగా వేధించిన కేసులో ఆమెకు 5 మిలియన్ డాలర్లు (రూ.41 కోట్లు) చెల్లించాలని ఆయనను మన్‌హట్టన్ ఫెడరల్ జ్యూరీ ఆదేశించింది. 1996లో ట్రంప్ డిపార్టుమెంటల్ స్టోర్‌లో తనపై అత్యాచారానికి పాల్పడ్డారని, భౌతిక దాడితో పాటు తప్పుడు ప్రచారంతో అప్రతిష్ట పాలుచేశారని క్యారోల్ ఆరోపించారు. లైంగికంగా వేధింపులు నిజమే అయినా ట్రంప్ అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు నిరూపించలేకపోయారని కోర్టు పేర్కొంది. పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌కు డబ్బుల చెల్లింపు కేసులో ట్రంప్‌పై అభియోగాల నమోదుకు కోర్టు ఇటీవలే ఆదేశించడం తెలిసిందే.

స్వప్రయోజనాలే పరమావధి

కాంగ్రెస్‌పై మోదీ ధ్వజం

కర్ణాటక ఎన్నికల్లో లబ్ధి కోసం గిరిజనుల ప్రాణాలు పణంగా పెట్టిందని ఆరోపణ

జైపూర్: కాంగ్రెస్ పార్టీకి దేశం కంటే స్వప్రయోజనాలే ముఖ్యమని ప్రధాని నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. కేవలం కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసం వీలైనన్ని అడ్డదారులు తొక్కే ప్రయత్నం చేసిందన్నారు. ఆయన బుధవారం రాజస్తాన్‌లోని అబూ రోడ్‌లో ర్యాలీలో మాట్లాడారు. ''సుడాన్ అంతర్యుద్ధంలో చిక్కిన కర్ణాటక హక్కీపిక్కీ గిరిజనుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేందుకు కూడా కాంగ్రెస్ వెనకాడలేదు. వారి ప్రాణాలు అక్కడ ప్రమాదంలో ఉన్న విషయాన్ని ఉద్దేశపూర్వకంగానే బయట పెట్టింది. తద్వారా ఒకరిద్దరైనా చనిపోకపోతారా అని చూసింది. అదే జరిగితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యంగా చూపి కర్ణాటకలో ఓట్లు దండుకోవాలని పన్నాగం పన్నింది'' అన్నారు.

ఉగ్రవాదం పట్ల మెతక వైఖరి

సంతుష్టీకరణ రాజకీయాల్లో భాగంగా ఉగ్రవాదుల పట్ల మెతక వైఖరి అవలంబించడం కాంగ్రెస్ నైజమని మోదీ మండిపడ్డారు. జైపూర్ బాంబు పేలుళ్ల కేసులో ఉద్దేశపూర్వకంగానే కోర్టులో సరిగా వాదనలు వినిపించకుండా నిందితులంతా విడుదలయ్యేందుకు రాజస్తాన్ సర్కారు సహకరించిందన్నారు. ''ఐదేళ్లుగా రాష్ట్ర కాంగ్రెస్‌లో సిగ్గుచేటైన రాజకీయ పోరాటం సాగుతోంది. సీఎంతో సహా నేతలంతా కుర్చీ కోసం కొట్టుకోవడంలో మునిగిపోయారు. ప్రజలను, పాలనను గాలికొదిలేశారు'' అంటూ ధ్వజమెత్తారు. ''సీఎం అశోక్ గహ్లోత్‌కు సొంత ఎమ్మెల్యేలపైనే విశ్వాసం లేదు. వారికీ ఆయన మీద నమ్మకం లేదు'' అంటూ చెణుకులు విసిరారు. 2020లో అసమ్మతి కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ తిరుగుబావుటా ఎగరేసినప్పుడు వసుంధర రాజె సింధియా వంటి రాష్ట్ర బీజేపీ అగ్ర నేతల మద్దతుతోనే ప్రభుత్వాన్ని నిలబెట్టుకోగలిగానని గహ్లోత్ ఆదివారం చెప్పడం తెలిసిందే. అంతకుముందు నాథ్‌ద్వారాలో రూ.5,500 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం గహ్లోత్‌తో కలిసి మోదీ శంకుస్థాపన చేశారు. దేశానికి ఏ మంచి జరిగినా కాంగ్రెస్, విపక్షాలు భరించలేవంటూ ఈ సందర్భంగా దుయ్యబట్టారు. ప్రతిదాన్నీ ఓట్ల కోణం నుంచే చూసేవాళ్లు దేశం కోసం ఏమీ చేయలేరన్నారు. అందువల్లే రాజస్తాన్ వంటి రాష్ట్రాలు మౌలిక ప్రాజెక్టులకు నోచుకోక వెనకబడ్డాయన్నారు. రాష్ట్రంలోని పలు పెండింగ్ ప్రాజెక్టులను గహ్లోత్ ఈ సందర్భంగా మోదీ దృష్టికి తీసుకెళ్లడం విశేషం.


కార్యక్రమంలో గెహ్లోట్, మోదీ మంతనాలు

జూన్‌లో అమెరికాకు మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ జూన్‌లో అమెరికా పర్యటనకు వెళ్తున్నారు. అధ్యక్షుడు జో బైడెన్ దంపతుల ఆహ్వానం మేరకు పర్యటిస్తున్నట్టు విదేశాంగ శాఖ తెలిపింది. జూన్ 22న మోదీకి బైడెన్ విందు ఇస్తారు. ద్వైపాక్షిక బంధాల బలోపేతానికి మోదీ పర్యటన ఉపయోగపడుతుందని వైట్‌హౌస్ పేర్కొంది.

'వాట్సాప్'పై కేంద్రం నజర్

- ఫోన్ వాడనప్పుడూ మైక్రోఫోన్‌ను వినియోగిస్తోందని ఆరోపణలు
- గోప్యత ఉల్లంఘనపై విచారణకు ఐటీ శాఖ ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: వాట్సాప్ వినియోగదారుల వ్యక్తిగత గోప్యతపై కొద్ది రోజులుగా సందేహాలు తలెత్తుతున్నాయి. వాట్సాప్ యాప్ వాడకంలో లేనప్పుడు కూడా వినియోగదారుల అనుమతి లేకుండా ఫోన్‌లో మైక్రోఫోన్‌ను సంస్థ యాక్సెస్ చేస్తోందన్న ఆరోపణలను కేంద్రం సీరియస్‌గా తీసుకుంది.

అసలేం జరిగింది?

'నేను ఫోన్ వాడకున్నా సరే వాట్సాప్ యాప్ బ్యాక్‌గ్రౌండ్‌లో నా మొబైల్ మైక్రోఫోన్‌ను వాడుతోంది. నిద్రపోయి ఉదయం ఆరింటికి లేచా. అప్పుడూ మైక్రోఫోన్ దుర్వినియోగం అవుతోంది. అసలేం జరుగుతోంది?' అంటూ ఇంజనీరింగ్ డైరెక్టర్ ఫోడ్ డబిరి శనివారం ట్వీట్‌చేశారు. దీనికి 6.5 కోట్ల వ్యూస్ వచ్చాయి. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. చారు. ''ఇది గోప్యతపై దాడి. దీనిపై వెంటనే విచారణ జరిపిస్తాం. గోప్యతకు భంగం వాటిల్లినట్లు తేలితే చర్యలు తప్పవు' అంటూ బుధవారం ట్వీట్ చేశారు. కొన్ని నివేదికల ప్రకారం వాట్సాప్ యాప్ బ్యాక్‌గ్రౌండ్‌లో మైక్రోఫోన్‌ను యాక్సెస్ చేస్తోంది. ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్ కూడా దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు. మైక్రోఫోన్, కెమెరా వంటి ప్రైవసీ సూచికలను ఏదైనా యాప్ యాక్సెస్ చేసినప్పుడు స్మార్ట్‌ఫోన్‌లో గ్రీన్ నోటిఫికేషన్ వినియోగదారుడికి హెచ్చరికగా పనిచేస్తుంది.

ఖండించిన వాట్సాప్: ఈ ఆరోపణలను వాట్సాప్ ఖండించిది. డబిరి పిక్సల్ ఫోన్‌లోని బగ్ ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసింది. దీనిపై దర్యాప్తు చేసి పరిష్కరించాలని గూగుల్‌ను అభ్యర్థించినట్టు ట్వీట్‌లో చేసింది.

ఉపాధికి రక్షణ కవచం!



పాల సముద్రం వద్ద బీఈఎల్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్	• రాడార్లు, మిసైల్స్, సబ్‌మెరైన్ పరికరాల తయారీ, టెస్టింగ్ • తొలి దశలో రూ.384 కోట్లతో యూనిట్ • రూ.148 కోట్లతో పనులకు టెండర్లు • ఇప్పటికే రూ.50 కోట్లతో ప్రహరీ, సోలార్ ప్లాంట్ ఏర్పాటు
914 ఎకరాల్లో ఐదు దశల్లో నిర్మాణం	• ఈ కాంప్లెక్స్ నిర్మాణంతో పలు అనుబంధ పరిశ్రమల రాక • స్థానిక యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు • ఎంఓయూతో చేతులు దులిపేసుకున్న గత సర్కారు • పట్టుబట్టి పరిశ్రమ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకున్న ప్రస్తుత ప్రభుత్వం

సాక్షి, అమరావతి : పారిశ్రామికంగా రాష్ట్రం శరవేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. ఓ వైపు పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు.. మరో వైపు సెజ్ (స్పెషల్ ఎకనామిక్ జోన్)లు, వాటిలో భారీ పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వీటికి అనుబంధంగా ఏర్పాటయ్యే పరిశ్రమల ద్వారా లక్షల సంఖ్యలో యువతకు ఉపాధి మార్గాలు చేరువ కానున్నాయి. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లా పాల సముద్రం వద్ద 914 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగానికి చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్ పనులు వేగం అందుకున్నాయి. ఐదు దశల్లో ఈ యూనిట్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే తొలి దశలో రూ.384 కోట్లతో అభివృద్ధికి బోర్డు ఆమోదం తెలిపింది. త్వరలో జరిగే బోర్డు సమావేశంలో మిగిలిన దశలకు సంబంధించి ఆమోదం లభించనుందని బీఈఎల్ అధికారులు తెలిపారు. ఈ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్‌లో రాడార్, మిసైల్, సబ్‌మెరైన్లకు సంబంధించిన పరికరాలను అభివృద్ధి చేయడమే కాకుండా వీటిని పరీక్షించేలా టెస్టింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. తొలి దశకు సంబంధించి క్షిపణుల అసెంబ్లింగ్, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ కార్యకలాపాలకు అవసరమైన మౌలిక వసతులను రూ.148 కోట్లతో అభివృద్ధి చేయడానికి ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. బిడ్ దక్కించుకున్న సంస్థ క్షిపణుల తయారీకి సంబంధించి మల్టీ స్టోర్డ్ బిల్డింగ్స్, ప్రీ ఇంజనీర్డ్ బిల్డ్‌లతో పాటు ఒక ఫ్యాక్టరీకి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంటుంది. వీటితో పాటు విద్యుత్, నీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, వరద నీటి కాల్వలు, అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, కల్వర్టులు, వీధి దీపాలు వంటి వాటిని సమకూర్చాల్సి ఉంటుంది. ఆసక్తి గల సంస్థలు మే 23లోగా బిడ్లను దాఖలు చేయాలని కోరింది. ఇప్పటికే ఈ 914 ఎకరాల చుట్టూ సుమారు రూ.50 కోట్లతో ప్రహరీ నిర్మించింది. గోడ చుట్టూ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా, సొంత అవసరాల కోసం సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఏపీఐఐసీ అధికారులు 'సాక్షి'కి వెల్లడించారు.

చకచకా అనుమతులు

గత ప్రభుత్వ అసమర్థ నిర్వాకానికి బీఈఎల్ ప్రాజెక్టు ఒక ఉదాహరణ. అత్యంత ప్రతిష్టాత్మకమైన క్షిపణులు, ఇతర రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి 2016లోనే బీఈఎల్ ముందుకు రాగా, రాష్ట్ర ప్రభుత్వ అలసత్వంతో ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. భూమి కన్వర్షన్, పర్యావరణ అనుమతులు తేవడంలో అప్పటి ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంతో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించి, త్వరితగతిన అనుమతులు వచ్చేలా చర్యలు చేపట్టారు. మరోపక్క యూనిట్ పనులు ప్రారంభించకపోతే భూ కేటాయింపులు రద్దు చేయడంతో పాటు, పెనాల్టీ విధిస్తామంటూ బీఈఎల్‌కు ఏపీఐఐసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీంతో బీఈఎల్ కొంత సమయం ఇవ్వాలని, పెనాల్టీలు రద్దు చేయాలని కోరింది. గతంలో కంటే పెద్ద యూనిట్ ఏర్పాటు చేసేలా, కొత్తగా సమగ్ర ప్రాజెక్టు ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. దీన్ని పరిశీలించిన ఏపీఐఐసీ బోర్డు అన్ని అనుమతులు మంజూరు చేసింది. అనుమతులు రావడంతో బీఈఎల్ కూడా యూనిట్ ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు చేపట్టింది. నిధులు కూడా కేటాయించింది. రక్షణ రంగంలో అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై బీఈఎల్ అధికారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మచిలీపట్నం బీఈఎల్ కార్యాలయంలో ప్రత్యేకంగా బోర్డు సమావేశం ఏర్పాటు చేసి, తొలి దశలో రూ.384 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయితే 2025 నాటికి ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

డిఫెన్స్ హబ్‌గా ఏపీ

దేశ రక్షణ అవసరాల తయారీ హబ్‌గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి తెలిపారు. ఇప్పటికే కేంద్ర రక్షణ సంస్థ 914 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్ అభివృద్ధి చేస్తుండగా ఏపీఐఐసీ కూడా 1,200 ఎకరాల్లో ఏపీ ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ (ఏపీ-ఏడీఈ) పార్క్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి త్వరలో జరిగే ఏపీఐఐసీ బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నామని చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టుల రాకతో శ్రీ సత్యసాయి జిల్లాతోపాటు రాష్ట్రం రక్షణ రంగ ఉత్పత్తులకు తయారీ కేంద్రంగా తయారవుతుందన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల రాకతో ప్రత్యక్షంగా 2,800 మందికి, పరోక్షంగా 8,000 మంది వరకు ఉపాధి లభిస్తుంది. యాంకర్ యూనిట్‌గా బీఈఎల్ భారీ ప్రాజెక్టును చేపడుతుండటంతో అనేక అనుబంధ కంపెనీలు, ఎంఎస్ఎంఈలు ఏర్పాటు కానున్నాయి.

జగనన్నకు చెబుదాం.. వర్ల రామయ్య కాల్

- 1902కు టీడీపీ నేతలు, కార్యకర్తల పైశాచిక ఫోన్ కాల్స్
- ప్రజలకు మేలు చేసే కార్యక్రమాన్ని నీరుగార్చడమే లక్ష్యం
- సభ్యత మరచి ఉద్యోగిపై వర్ల రామయ్య దబాయింపులు

సాక్షి, అమరావతి: ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం ఆ బాధ్యతను గాలికి వదిలేసి ప్రతి కార్యక్రమాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. సంతృప్త స్థాయిలో ప్రజా సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై సైతం టీడీపీ విషం చిమ్మడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన తొలిరోజే వక్రీకరించేందుకు విపక్ష నేత చంద్రబాబు ప్రయత్నించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యతోపాటు పలువురు పార్టీ నేతలు మంగళవారం 1902 హెల్ప్‌లైన్ సెంటర్‌కు ఫోన్ చేసి దబాయింపులకు దిగారు. హెల్ప్‌లైన్ ఉద్యోగులను వేధించడమే లక్ష్యంగా వర్ల రామయ్య సభ్యత మరిచి మాట్లాడడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తలపెట్టిన కార్యక్రమాన్ని నీరుగార్చే విధంగా హెల్ప్‌లైన్ ఉద్యోగితో రాజకీయాలు మాట్లాడుతూ తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ బెదిరింపులకు దిగడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబుకు, టీడీపీకి రాజకీయ ప్రయోజనాలు, పబ్లిసిటీ మినహా ప్రజల ప్రయోజనాలు పట్టవని, మంచి జరుగుతుంటే ఓర్చుకోలేరనే విషయం మరోసారి తేటతెల్లమైందని పేర్కొంటున్నారు. ఇదే తరహాలో పలు ప్రాంతాల నుంచి టీడీపీ శ్రేణులు 1902 హెల్ప్‌లైన్ సెంటర్‌కు ఫోన్లు చేస్తూ పైశాచికంగా వ్యవహరిస్తున్నట్టు ఉద్యోగులు వాపోతున్నారు.

క్లుప్తంగా...

గ్రేడ్-3 ఈవో అభ్యర్థుల తుది జాబితా విడుదల

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖలో గ్రేడ్-3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ (ఈవో) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం వెల్లడించింది. వివరాలను https://psc.ap.gov.in లో పొందుపరిచింది. ఏపీపీఎస్సీ 2021లో 60 ఈవో గ్రేడ్-3 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఎంపిక పరీక్ష అనంతరం అర్హులైన అభ్యర్థులను జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచింది.

ప్రశాంతంగా పాలిసెట్-2023

89.56 శాతం మంది విద్యార్థుల హాజరు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాలిసెట్-2023 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ప్రవేశ పరీక్ష కోసం 1,60,329 అభ్యర్థులు నమోదు చేసుకోగా, 1,43,592 (89.56 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రాథమిక 'కీ'ని శనివారం, ఫైనల్ 'కీ'ని సోమ, మంగళవారాల్లో విడుదల చేస్తామని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి ఓ ప్రకటనలో తెలిపారు. 'కీ' http://sbtetap.gov.in వెబ్ సైట్లో ఉంటుందన్నారు. పది రోజుల్లో ఫలితాలను విడుదల చేసి కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రక్రియను చేపడతామని పేర్కొన్నారు. కాగా, సాంకేతిక విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ విజయవాడలోని మేరీస్ స్టెల్లా, పటమట బాలుర ఉన్నత పాఠశాల కేంద్రాల్లో, కమిషనర్ నాగరాణి ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

'టీడీపీ అధికారంలోకి వస్తే నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తాం'

కర్నూలు(అర్బన్): రాజకీయంగా చచ్చిన శవాలు కూడా సవాళ్లు విసరడం వింతగా ఉంది.. నేను ముందే చెప్పా.. సాగనిస్తే పాదయాత్ర, అడ్డుకుంటే దండయాత్ర అంటూ టీడీపీ కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆయన బుధవారం నందికొట్కూరులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. తన పాదయాత్రను అడ్డుకునేందుకు ఎంత మంది వచ్చినా.. మేం రెడీ, తన్నులు తినడానికి మీరు రెడీనా? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ మంత్రులు కొవ్వెక్కి మాట్లాడుతున్నారు.. రైతులను తిడుతున్నారని చెప్పారు. రైతులు చేసిన నేరమేంటి? తడిసిన ధాన్యం కొనమని చెప్పడం తప్పా? అన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో విద్యుత్, బస్సు చార్జీలను మూడు సార్లు పెంచారని, ఇంటి పన్ను, చెత్త పన్ను, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే పన్నుల భారాన్ని తొలగించి నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామన్నారు.

విధిని ఎదిరించాడు.. విజయం సాధించాడు

ఐఐఎం సీటు సాధించిన దివ్యాంగుడు

- విద్యుదాఘాతంలో కాళ్లు, చేతులు కోల్పోయిన చంద్రమౌళి
- పట్టుదలతో ఇంజనీరింగ్ పూర్తి చేసి క్యాట్‌లో విజయం



కొత్త శక్తిని కూడదీసుకుని..



ప్రమాదానికి ముందు ఆడుతూపాడుతూ చంద్రమౌళి

రావికమతం (అనకాపల్లి జిల్లా): విధి వక్రించినా పట్టుదలతో నిలబడ్డాడు. ధైర్యం కూడదీసుకుని ముందడుగు వేశాడు. మధ్యలో ఆగిపోయిన ఇంజనీరింగ్‌తోపాటు న్యాయవిద్యను సైతం పూర్తి చేసి అమెజాన్ సంస్థలో డేటా ఆపరేషన్ అసోసియేట్ ఉద్యోగం సంపాదించాడు. ఇప్పుడు ఏకంగా క్యాట్‌లో ఉత్తీర్ణుడై ఐఐఎం సీటు సాధించాడు. ఈ నెల 21న అహ్మదాబాద్ ఐఐఎంలో చేరనున్నాడు. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన ఈ విజేత పేరు ద్వారపురెడ్డి చంద్రమౌళి. తండ్రి వెంకటరమణ చిరు వ్యాపారి. తల్లి సత్యవతి ప్రైవేట్ స్కూల్ టీచర్. చంద్రమౌళి కాకినాడ కైట్‌లో బీటెక్ చేస్తూ సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. 2018 మే 26న మేడపై ఉండగా ప్రమాదవశాత్తూ జారిపోయిన ఉంగరాన్ని తీసేందుకు యత్నించగా.. విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై కాళ్లు, చేతులు కోల్పోవడంతో డీలా పడిపోయాడు.

కొన్ని నెలలు గడిచాక చంద్రమౌళి నిరాశను వదిలిపెట్టాడు. శక్తిని కూడదీసుకుని కొత్త జీవితం ప్రారంభించాడు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో మధ్యలో ఆగిపోయిన ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అంతలోనే కరోనా చంద్రమౌళికి మరో పరీక్ష పెట్టింది. తండ్రి వెంకటరమణ కుమారుడి పక్కనే రక్షణ సూట్ ధరించి నెల రోజుల పాటు సేవలందించారు. వారి మొండి ధైర్యానికి విధి తలవంచింది. నెల తర్వాత ఇంటికి వచ్చిన చంద్రమౌళి తేరుకుని తన గమ్యం వైపు అడుగులు వేశాడు. ఆప్తుడైన న్యాయవాది ప్రభాకర్, స్నేహితుడు ప్రసాద్ అండగా నిలిచి మానసిక స్థైర్యం అందించారు. దీంతో చంద్రమౌళి మొండి చేతులతోనే పనులు చేయడం ప్రారంభించాడు. ల్యాప్‌టాప్‌ను ఆపరేట్ చేయడం సాధన చేశాడు. విశాఖలో కృత్రిమ కాళ్లు తీసుకుని నడవడం కూడా కొద్దికొద్దిగా అలవాటు చేసుకున్నాడు. మూడు నెలల్లో అన్ని పనులూ చేయడం ప్రారంభించాడు. కరోనా తర్వాత ఇంజనీరింగ్‌లో ఉద్యోగాలు కష్టతరమవుతున్నాయని భావించి అనకాపల్లిలో బీఎల్ పూర్తి చేశాడు. జీవనోపాధికి అమెజాన్‌లో డేటా ఆపరేషన్ అసోసియేట్ ఉద్యోగం సంపాదించాడు. కొన్నాళ్ల నుంచి ఇంటినుంచే ఆ ఉద్యోగం చేస్తున్నాడు. పట్టుదలతో చదివి కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్) స్క్రైబ్ సహాయంతో రాసి ఉత్తీర్ణుడయ్యాడు. దేశంలోనే అత్యున్నత బిజినెస్ స్కూల్‌గా ప్రసిద్ధి చెందిన అహ్మదాబాద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో సీటు సాధించాడు. ఈ నెల 21న జాయిన్ అయ్యేందుకు సిద్ధపడుతున్నాడు. ఎంత కష్టం ఎదురైనా కలత చెందవద్దని, ధైర్యంగా ఎదుర్కోవాలని చంద్రమౌళి సూచిస్తున్నాడు.

ఇక సరికొత్త బోధన

- రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులకు వృత్తినైపుణ్య శిక్షణ
- ఐదు కేంద్రాల్లో ముగిసిన సన్నద్ధత కార్యక్రమాలు
- 15 నుంచి జూన్ 9 వరకు 5 వేల మందికి శిక్షణ



శిక్షణలో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు

విశాఖ విద్య: మారుతున్న కాలానికి తగ్గట్టు ప్రస్తుత అవసరాల మేరకు బోధనలో విప్లవాత్మక మార్పులు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో 1998, 2008, 2018 డీఎస్సీల్లో ఎంపికైన ఉపాధ్యాయులకు రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 15 నుంచి జూన్ 9 వరకు వృత్తిపరమైన శిక్షణ అందించనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) నిర్వహించిన సన్నద్ధత శిక్షణ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా శ్రీకాకుళం, విశాఖపట్నం, కృష్ణా, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు జిల్లా కేంద్రాల్లో మూడు రోజులపాటు ఎస్‌సీఈఆర్‌టీ సమీక్షలను నిర్వహించింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ఒక్కో జిల్లా నుంచి నలుగురు ఉపాధ్యాయులను డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ (డీఆర్పీ)లుగా ఎంపిక చేసి శిక్షణ ఎలా నిర్వహించాలనే దానిపై వారికి సూచనలిచ్చింది.

ఐదు వేల మందికి శిక్షణ

డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లు 26 జిల్లాల్లో సుమారు 5 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. విశాఖపట్నంలో ఇంగ్లిష్ సబ్జెక్టుపై నిర్వహించిన సన్నద్ధత శిక్షణ కార్యక్రమంలో 26 జిల్లాల నుంచి 52 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని, ఆ దిశగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటం మంచి పరిణామమని శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

వృత్తి నైపుణ్యాలు తప్పనిసరి

ఉపాధ్యాయులకు వృత్తిపరమైన నైపుణ్యాలు తప్పనిసరి. మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనలోనూ సరికొత్త మార్పులు రావాల్సిన అవసరం ఉంది. ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా భవిష్యత్ చదువులపై ఎలా ముందుకెళ్లాలో తెలుస్తుంది. ఇలాంటివి తరచూ జరగాల్సిన అవసరం ఉంది.

– బి.నాగరాజు, ఉపాధ్యాయుడు, తాడిమర్రి, శ్రీ సత్యసాయి జిల్లా

సంక్షేమాభివృద్ధిని విస్మరిస్తారా?

అప్పులు తెచ్చుకోవడమే నేరం అంటారా?

- స్వయం ప్రకటిత ఆర్థిక నిపుణులు సిగ్గుపడాలి
- అమరావతి బాబు సొంత సామ్రాజ్యమా?
- అక్కడ నివసించే అర్హత పేదలకు ఎందుకు లేదు?
- 50 వేల ఎకరాల్లో 54 వేల మంది పేదలు ఉండకూడదా?
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు మండిపాటు



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో నాలుగేళ్లుగా నెలకొన్న పరిస్థితులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా, రాష్ట్రం దివాలా తీస్తోందంటూ ఓ ఆర్థిక నిపుణుడు చెప్పారని ఈనాడు రామోజీరావు రాశారని, ఆయన ఎత్తులన్నీ ప్రజలకు తెలుసని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు మండిపడ్డారు. సంక్షేమాభివృద్ధిని విస్మరించిన స్వయం ప్రకటిత ఆర్థిక నిపుణులు అలా మాట్లాడటానికి సిగ్గుపడాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి తగ్గట్లు అప్పులు తెచ్చుకోవడమే నేరమన్నట్లు వారు మాట్లాడటం, వీరు ప్రచారం చేయడం దారుణం అని ధ్వజమెత్తారు. రాష్ట్రం దివాలా తీసిందని ఏ విధంగా చెబుతారని నిలదీశారు. జగనన్నకు సమస్యలు చెప్పడమంటే కూడా అపహాస్యమేనా అని ప్రశ్నించారు. బుధవారం ఆయన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమరావతి ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై టీడీపీ, దాని అనుబంధ సంఘాలు సుప్రీంకోర్టులో సవాలు చేయడాన్ని వైఎస్సార్‌సీపీ ఖండిస్తోందని చెప్పారు. అమరావతి ప్రాంతం చంద్రబాబు సొంత సామ్రాజ్యమా? అంటూ మండిపడ్డారు. అక్కడ నివసించే అర్హత పేదలకు ఎందుకు లేదో బాబు చెప్పాలని నిలదీశారు. పేదలకు స్థలాలు ఇస్తుంటే చంద్రబాబు అండ్ కో కళ్లలో రక్త కన్నీరు వస్తోందన్నారు. చంద్రబాబులో అణువణువునా అస్పృశ్యతే ఉందని, దళితులపై ఇంకా విషం చిమ్ముతూనే ఉన్నారని చెప్పారు. అమరావతిలోని 50 వేల ఎకరాల్లో 54 వేల మంది పేదలు ఉండకూడదా.. వారికి సెంటున్నర స్థలం ఇవ్వకూడదా? అని ప్రశ్నించారు.

అంటరాని అమరావతిగా మార్చేసిన బాబు

'54 వేల మంది పేద వాళ్లకు, నివసించడానికి ఆవాసం లేని అభాగ్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక గూడును కల్పిస్తుంటే అడ్డుకోవాలని ప్రయత్నించటం దుర్మార్గం. చంద్రబాబు అంటరాని అమరావతిగా మార్చేశారు. అమరావతి రాజధాని ప్రాంతం అంటే అదేదో గేటెడ్ కమ్యూనిటీ ప్రాంతంగా, కొంత మంది మాత్రమే నివాసం ఉండే ప్రాంతంగా బాబు, టీడీపీ నేతలు అభివర్ణించడం దిక్కుమాలిన రాజకీయం. సెంటు భూమి కోసం యుద్ధాలు చేసిన కమ్యూనిస్టు పార్టీలు కూడా ఇప్పుడు ఎందుకు చంద్రబాబుకు మద్దతిస్తున్నాయో అర్థం కావడం లేదు. బడుగు బలహీన వర్గాలకు ఈ ప్రభుత్వం సాయం చేసేందుకు ముందుకు వచ్చిన ప్రతిసారీ చంద్రబాబు, ఆయన చుట్టూ ఉన్న ఎల్లో కార్పొరేట్ శక్తులు అడ్డుపడుతూనే ఉన్నాయి. అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రజాభిప్రాయంతో, అందరి అంగీకారంతో ఏర్పడిందా? రైతుల పేరుతో అడ్డుకోవడం ఏంటి.. ఎక్కడన్నా ఉందా ఈ చోద్యం? అమరావతిలో శాసన రాజధాని ఉండి తీరుతుంది. విశాఖలో పరిపాలన రాజధాని, కర్నూలులో న్యాయ రాజధాని ఉంటుంది. సెప్టెంబర్ నుంచి సీఎం జగన్ విశాఖలో నివసించబోతున్నారు. పేదవాడికి రూ.2.08 లక్షల కోట్లు డీబీటీ ద్వారా నేరుగా వారి అకౌంట్లల్లోకి వెళ్లడం బాబుకు నచ్చడం లేదు' అని సుధాకర్ బాబు నిప్పులు చెరిగారు.

'సింగిల్ స్పెషల్' డిగ్రీ!

- ఒక సబ్జెక్టు ప్రధానంగా కొత్త కరిక్యులమ్
- ఇప్పటిదాకా డిగ్రీలో మూడు కామన్ సబ్జెక్టులు
- ఇకపై మేజర్, మైనర్ సబ్జెక్ట్ కాంబినేషన్‌తో గ్రాడ్యుయేషన్
- 2023–24 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి
- గ్రాడ్యుయేషన్ స్థాయిలోనే పరిపూర్ణంగా తీర్చిదిద్దేలా కోర్సు
- గందరగోళం సృష్టించేలా ఓ మీడియా కథనాలు దారుణం
- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: విద్యా ప్రమాణాలను పెంపొందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అందులో భాగంగా డిగ్రీ విద్యలో సింగిల్ సబ్జెక్టు మేజర్‌గా కొత్త కరిక్యులమ్‌ను ప్రవేశపెడుతోంది. ఇప్పటివరకు డిగ్రీలో మూడు సబ్జెక్టులు ప్రధాన కాంబినేషన్‌తో విద్యాబోధన సాగుతుండగా ఇకపై ఒక మేజర్ సబ్జెక్టు ప్రధానంగా డిగ్రీ విద్య కొనసాగనుంది. జూన్ నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానం అమల్లోకి రానుంది. ఈ మేరకు కరిక్యులమ్‌లో మార్పులు చేస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంది. బుధవారం మంగళగిరిలోని కార్యాలయంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ రామ్మోహన్‌రావు మీడియాకు వివరాలను వెల్లడించారు. 'సెట్స్' స్పెషల్ ఆఫీసర్ సుధీర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏదైనా ఒక సబ్జెక్ట్‌లో విద్యార్థులు సంపూర్ణ నైపుణ్యాలను సాధించే దిశగా కరిక్యులమ్‌ను సిద్ధం చేసినట్లు చెప్పారు. గతంలో బీఎస్సీ–ఎంపీసీ (మూడు సబ్జెక్టుల కాంబినేషన్) ఉండగా ఆ స్థానంలో బీఎస్సీ మ్యాథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీలో ఒక సబ్జెక్టును మేజర్‌గా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రెండో సెమిస్టర్ నుంచి దాదాపు 100 కోర్సుల నుంచి విద్యార్థులు తమకు నచ్చిన విభాగంలో మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. తద్వారా మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఏదో ఒకదానితో పీజీ విద్యను అభ్యసించేలా మార్పులు చేసినట్లు చెప్పారు.

బీఎస్సీ, బీఏ, బీకామ్‌లో అమలు

డిగ్రీలో మేజర్ సబ్జెక్టుతో పాటు కచ్చితంగా ఒక మైనర్ సబ్జెక్టు చదవాలి. ఉదాహరణకు ఒక సైన్స్ విద్యార్థి మైనర్ సబ్జెక్టుగా ఆర్థిక శాస్త్రం, చరిత్ర, సంగీతం, యోగా, డేటాసైన్స్, మార్కెటింగ్.. ఇలా ఇతర సబ్జెక్టులను ఎంపిక చేసుకోవచ్చు. ఆర్ట్స్ విద్యార్థులు మైనర్‌లో (ఇంటర్మీడియట్ కోర్సుల ఆధారంగా) నచ్చిన సబ్జెక్టు తీసుకోవచ్చు. కొత్త విధానాన్ని బీఎస్సీతో పాటు బీఏ, బీకామ్ డిగ్రీలో అమలు చేయనున్నట్టు తెలిపారు. డిగ్రీ విద్యలో ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంతో పాటు ఇంజనీరింగ్‌తో సమానంగా తీర్చిదిద్దేందుకు ఈ విద్యా సంస్కరణలు దోహదం చేస్తాయని వివరించారు. వచ్చే జూన్‌లో కొత్త కరిక్యులమ్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయని, దీనిపై డిగ్రీలో చేరే విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తామన్నారు.

నాలుగో ఏడాది డిగ్రీకి అనుమతి

జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం దేశంలో తొలిసారి విద్యా సంస్కరణలను మన రాష్ట్రంలోనే అమలు చేసినట్లు హేమచంద్రారెడ్డి తెలిపారు. ఇప్పటికే నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీని ప్రవేశపెట్టామని, ప్రస్తుతం మూడో ఏడాది డిగ్రీ విద్య పూర్తయిందన్నారు. యూజీసీ ఫ్రేమ్ వర్క్ ప్రకారం ఆనర్స్ డిగ్రీని రెండు విధాలుగా విభజించామన్నారు. మూడేళ్ల డిగ్రీలో 75 శాతం మార్కులు సాధించినవారు రీసెర్చ్ ఆనర్స్ డిగ్రీ కోర్సులో చేరవచ్చు. ఇది పూర్తి చేసిన వారు పీజీ లేకుండా పీహెచ్‌డీ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మూడేళ్ల కోర్సులో ఉత్తీర్ణులైతే జనరల్ ఆనర్స్ కోర్సును అభ్యసించవచ్చు. ఇది పూర్తిచేసిన వారు పోస్టు గ్రాడ్యుయేషన్ రెండో ఏడాదిలో చేరవచ్చన్నారు. ఆనర్స్ కోర్సులను అందించేందుకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో గత మూడేళ్లలో వరుసగా 30 శాతం అడ్మిషన్లతో పాటు సంబంధిత కోర్సుల్లో ఇద్దరు డాక్టరేట్ కలిగిన ప్రొఫెసర్లు ఉంటేనే అనుమతులు మంజూరు చేస్తామన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి తదితరులు

డిగ్రీ విద్యార్థులకు 10 నెలల ఇంటర్న్‌షిప్

నూతన విద్యావిధానంలో భాగంగా డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసిందన్నారు. ఇంజనీరింగ్ తదితర ప్రొఫెషనల్ కోర్సులకు ఇంటర్న్‌షిప్ ఉన్నట్టుగానే నాన్ ప్రొఫెషనల్ డిగ్రీ కోర్సుల విద్యార్థులకు కూడా 10 నెలల ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టామన్నారు. మైక్రోసాఫ్ట్ ద్వారా ఏడాదిలో 1.20 లక్షల సర్టిఫికేషన్ కోర్సులను అందించడం దేశంలో ఓ మైలురాయిగా అభివర్ణించారు.

విద్యార్థుల్లో గందరగోళం సృష్టించొద్దు

ఉన్నత విద్యలో ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక మార్పులను చూసి ఓర్వలేక కొన్ని పత్రికలు గందరగోళం సృష్టించే కథనాలు రాస్తున్నాయని హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యలో పలు సంస్కరణలు తెచ్చిందని, ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకున్నామన్నారు. 2009 నుంచి ద్రవిడ వర్సిటీలో అడ్డగోలుగా చేపట్టిన 6055 పీహెచ్‌డీ అడ్మిషన్లను రద్దు చేశామన్నారు. 2014–18లో గత ప్రభుత్వ హయాంలో ఏకంగా 980 పీహెచ్‌డీ అడ్మిషన్లు ఇచ్చారని, వాటిపై విచారించి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. రాయలసీమ వర్సిటీలోనూ 2008–2011 మధ్యలో చేపట్టిన 2,490 అక్రమ పీహెచ్‌డీ అడ్మిషన్లను రద్దు చేశామన్నారు. టీడీపీ హయాంలో అక్కడ 518 పీహెచ్‌డీ అడ్మిషన్లు ఇవ్వగా 2019 నుంచి ఇప్పటి వరకు 28 అడ్మిషన్లు మాత్రమే ఇచ్చామన్నారు. ఆర్–సెట్‌ను తీసుకొచ్చి పీహెచ్‌డీ అడ్మిషన్లలో పారదర్శకతకు పెద్దపీట వేశామన్నారు. వాస్తవాలను కప్పిపుచ్చి ఓ మీడియా అసత్య ప్రచారం చేయడం దారుణమని ఆక్షేపించారు.

• తెలంగాణ

దేశవ్యాప్తంగా ఏకకాల దాడులకు కుట్ర

ఉగ్రవాదుల విచారణలో కీలక విషయాలు

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు భోపాల్, హైదరాబాద్‌లలో అరెస్టు చేసిన ఉగ్రవాదులు భారీ కుట్ర పన్నినట్లు బయటపడింది. మధ్యప్రదేశ్, హైదరాబాద్‌తోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులకు వారు సిద్ధపడ్డట్లు తెలియవచ్చింది. మంగళవారం హైదరాబాద్‌లో పట్టుకున్న ఐదుగురినీ ఏటీఎస్ అధికారులు బుధవారం భోపాల్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం వారిని ఈ నెల 20 వరకు పోలీసు కస్టడీకి అప్పగించింది. పోలీసుల నుంచి తృటిలో తప్పించుకున్న జవహర్‌నగర్‌లోని శివాజీనగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్ కోసం ఏటీఎస్‌తోపాటు రాష్ట్ర నిఘా వర్గాలు, పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. బుధవారం రాత్రి వరకు అతడి ఆచూకీ లభించలేదు. భోపాల్, హైదరాబాద్‌లలో ఇప్పటివరకు అరెస్టయిన 16 మంది విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

టాస్కులు ఇవ్వకపోవడంతో

భోపాల్‌లోని షాజహానాబాద్‌కు చెందిన యాసిర్ ఖాన్ నేతృత్వంలో 2018లో ఈ మాడ్యూల్ ఏర్పడింది. ఓ వర్గానికి చెందినవారితో మతమార్పిళ్లు చేయించి యాసిర్ వారిని ఉగ్రవాద బాట పట్టించాడు. యాసిర్ తొలినాళ్లలో హిజ్బ్ ఉత్ తహ్రీర్ (హెచ్‌యూటీ) సంస్థలో పనిచేశాడు. ఎన్నాళ్లు నిరీక్షించినా ఎలాంటి టాస్కులు ఇవ్వకపోవడంతో ఆ సంస్థకు దూరమై మహ్మద్ సలీంగా మారిన సౌరబ్‌రాజ్ విద్యతో కలిసి సొంతంగా మాడ్యూల్ తయారు చేయడం మొదలెట్టాడు. ఆ పని మీదే సలీంను హైదరాబాద్ పంపి కొందరిని ఉగ్రబాట పట్టించడంతోపాటు మరో ముఠా తయారయ్యేలా ప్రేరేపించాడు. వాటికి హెచ్‌యూటీ (భోపాల్), హెచ్‌యూటీ (హైదరాబాద్) పేర్లు పెట్టుకున్నారు. పెల్లెట్స్‌తో పనిచేసే ఎయిర్ పిస్టల్స్ వాడకంపై అనంతగిరి అడవుల్లో, నాటు తుపాకులు కాల్చడంపై భోపాల్ సరిహద్దుల్లోని నిర్మానుష్య ప్రాంతాల్లో ప్రాక్టీస్ చేశారు. పూర్తి ఫిట్‌నెస్, ఆయుధాల వినియోగంపై పట్టు సాధించి ఎప్పుడైనా దాడులకు సిద్ధంగా ఉండాలన్నది వారి లక్ష్యం.



రిథమ్ సాంగ్వాన్‌కు కాంస్యం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీని భారత్ కాంస్య పతకంతో ప్రారంభించింది. అజర్‌బైజాన్‌లో బుధవారం మొదలైన ఈ టోర్నీలో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో రిథమ్ సాంగ్వాన్ 219.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించింది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ షూటర్ ఇషా సింగ్ 154.8 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ సరబ్‌జిత్ సింగ్ 198.9 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు.



అర్జున్‌కు ఆరో స్థానం

టెపి సెగెమన్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడు పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచాడు. స్వీడన్‌లో బుధవారం ముగిసిన ఈ టోర్నీలో విన్సెంట్ కీమర్ (జర్మనీ)తో జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను అర్జున్ 48 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. దొమ్మరాజు గుకేశ్ (భారత్), అభిమన్యు మిశ్రా (అమెరికా) నాలుగు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు.

భారత్ తీన్‌మార్ పంచ్...

విశ్వ వేదికపై భారత బాక్సర్లు తమ పంచ్ పవర్‌ను చాటుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఏకంగా మూడు పతకాలతో తిరిగి రానున్నారు. పతక వర్ణాలు (స్వర్ణ, రజత, కాంస్య) ఇంకా ఖరారు కాకపోయినా పతకాలు మాత్రం ఖాయమయ్యాయి. తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ (57 కేజీలు), హరియాణా బాక్సర్లు దీపక్ భోరియా (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) తమ ప్రత్యర్థులపై పైచేయి సాధించి సెమీఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. శుక్రవారం సెమీఫైనల్లో ఈ ముగ్గురు బరిలోకి దిగనున్నారు. గెలిస్తే ఫైనల్ చేరి స్వర్ణ–రజతాల కోసం పోటీపడతారు. ఓడితే మాత్రం కాంస్య పతకాలతో తమ పోరాటాన్ని ముగిస్తారు.



హుసాముద్దీన్



నిశాంత్ దేవ్

- ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి మూడు పతకాలు ఖాయం
- సెమీఫైనల్లో హుసాముద్దీన్, దీపక్, నిశాంత్ దేవ్
- క్యూబా బాక్సర్‌ను ఓడించి సంచలనం సృష్టించిన నిశాంత్ దేవ్

తాష్కెంట్: ప్రత్యర్థి ఎవరైనా తమ పంచ్‌లతో అదరగొడుతున్న భారత బాక్సర్లు ప్రపంచ పురుషుల సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మూడు సెమీ ఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. దీపక్ భోరియా (51 కేజీలు), హుసాముద్దీన్ (57 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) తమ జోరు కొనసాగిస్తూ సెమీఫైనల్ చేరి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో దీపక్ 5–0తో నుర్జిగిత్ దిషిబయేవ్ (కిర్గిస్తాన్)పై, హుసాముద్దీన్ 4–3తో దియాజ్ ఇబానెజ్ (బల్గేరియా)పై, నిశాంత్ దేవ్ 5–0తో జార్జి టెరీ క్యూలార్ (క్యూబా)పై గెలుపొందారు. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్‌లో బెనామా (ఫ్రాన్స్)తో దీపక్; సైడెల్ హోర్టా (క్యూబా)తో హుసాముద్దీన్; అస్లాన్‌బెక్ షింబెర్జనోవ్ (కజకిస్తాన్)తో నిశాంత్ దేవ్ తలపడతారు. ప్రపంచ పురుషుల బాక్సింగ్‌లో పవర్ హౌస్‌గా పేరున్న క్యూబా దేశ బాక్సర్‌పై భారత బాక్సర్ విజయం సాధిస్తాడని ఊహకందని విషయం. కానీ పట్టుదలతో పోరాడితే క్యూబా బాక్సర్‌ను కూడా ఓడించే సత్తా భారత బాక్సర్లలో ఉందని బుధవారం నిశాంత్ దేవ్ నిరూపించాడు. జార్జి క్యూలార్‌తో జరిగిన బౌట్‌లో నిశాంత్ ఆద్యంతం దూకుడుగా ఆడి పైచేయి సాధించాడు. గత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగిన నిశాంత్ ఈసారి సెమీఫైనల్‌కు చేరి భారత్‌కు మూడో పతకాన్ని ఖాయం చేశాడు.



దీపక్

10 ప్రపంచ పురుషుల సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు భారత్ గెలిచిన పతకాలు. అమిత్ పంఘాల్ (2019) రజతం సాధించగా... విజేందర్ (2009), వికాస్ కృషన్ (2011), శివ థాపా (2015), గౌరవ్ (2017), మనీశ్ కౌశిక్ (2019), ఆకాశ్ (2021) కాంస్య పతకాలు గెలిచారు. తాజా ఈవెంట్‌లో హుసాముద్దీన్, దీపక్, నిశాంత్ దేవ్‌లకు కనీసం కాంస్య పతకాలు ఖాయమయ్యాయి.

ఐసీసీ ఆదాయంలో మన వాటా 38.5 శాతం!

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటి వరకు ఆదాయం, వాటాలపరంగా 'బిగ్ 3' శాసిస్తూ వచ్చాయి. ఐసీసీ ఆర్జన నుంచి భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ దాదాపు సమాన వాటా పొందాయి. అయితే ఇకపై ఇది 'బిగ్ 1'గా మాత్రమే ఉండనుంది! తాజాగా ప్రతిపాదించిన కొత్త లెక్క ప్రకారం వచ్చే నాలుగేళ్ల కాలానికి (2024–27) ఐసీసీకి వచ్చే ఆదాయంలో 38.5 శాతం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఖాతాలోకే చేరనుంది. ప్రసార హక్కులు, వాణిజ్యపరమైన ఒప్పందాల ద్వారా సంవత్సర కాలానికి ఐసీసీ 600 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 4,917 కోట్లు) ఆర్జించే అవకాశం ఉండగా... ప్రతీ ఏటా భారత్‌కు 231 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,893 కోట్లు) లభిస్తాయి. ఆశ్చర్యకరంగా ఈ జాబితాలో రెండో స్థానంలో ఇంగ్లండ్ 6.89 శాతం (సుమారు రూ. 339 కోట్లు), మూడో స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాకు 6.25 శాతం (సుమారు రూ. 308 కోట్లు) మాత్రమే దక్కనున్నాయి. ఓవరాల్‌గా 88.81 శాతం ఆదాయం ఐసీసీ పూర్తి స్థాయి సభ్యులైన 12 జట్లకు చేరనుండగా, అసోసియేట్ జట్ల కోసం 11.19 శాతం మొత్తం కేటాయించనున్నారు.

ఢిల్లీకి చెన్నై చెక్

- 27 పరుగులతో విజయం
- క్యాపిటల్స్‌ను కట్టడి చేసిన పతిరణ, దీపక్ చహర్, జడేజా



జడేజా

చెన్నై: చెపాక్‌లో చెన్నై చేసిన స్కోరు, సొంతగడ్డపై కనబరిచిన జోరు తక్కువే... కానీ అంతకంటే తక్కువకే ఢిల్లీ క్యాపిటల్స్‌ను కట్టడి చేసి మ్యాచ్ గెలిచింది. బుధవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో సూపర్‌కింగ్స్ 27 పరుగుల తేడాతో క్యాపిటల్స్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. శివమ్ దూబే (12 బంతుల్లో 25; 3 సిక్సర్లు) పరుగులే ఇన్నింగ్స్ టాప్‌స్కోర్. బెంగళూరుపై భారీ స్కోరును ఛేదించిన ఢిల్లీ క్యాపిటల్స్ ఈ మ్యాచ్‌లో 168 పరుగుల లక్ష్యాన్ని అధిగమించలేకపోయింది. 20 ఓవర్లు పూర్తిగా ఆడి 8 వికెట్లకు 140 పరుగులే చేయగలిగింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన జడేజా (21 పరుగులు; 1 వికెట్)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. వార్నర్ (0), సాల్ట్ (17)లను దీపక్ చహర్ అవుట్ చేయగా, మార్ష్ (5) రనౌట్ కావడంతోనే మ్యాచ్‌లో ఢిల్లీ వెనుకబడిపోయింది.



స్కోరు వివరాలు

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) అమన్ (బి) అక్షర్ 24; కాన్వే (ఎల్బీడబ్ల్యూ) (బి) అక్షర్ 10; రహానే (సి అండ్ బి) లలిత్ 21; మొయిన్ అలీ (సి) మార్ష్ (బి) కుల్దీప్ 7; దూబే (సి) వార్నర్ (బి) మార్ష్ 25; రాయుడు (సి) రిపాల్ (బి) ఖలీల్ 23; జడేజా (సి) అక్షర్ (బి) మార్ష్ 21; ధోని (సి) వార్నర్ (బి) మార్ష్ 20; దీపక్ (నాటౌట్) 1; తుషార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 167. వికెట్ల పతనం:** 1–32, 2–49, 3–64, 4–77, 5–113, 6–126, 7–164, 8–166. **బౌలింగ్:** ఖలీల్ 4–0–32–1, ఇషాంత్ 2–0–23–0, లలిత్ యాదవ్ 3–0–34–1, అక్షర్ 4–0–27–2, కుల్దీప్ యాదవ్ 4–0–28–1, మిచెల్ మార్ష్ 3–0–18–3.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి) రహానే (బి) చహర్ 0; సాల్ట్ (సి) రాయుడు (బి) చహర్ 17; మార్ష్ (రనౌట్) 5; పాండే (ఎల్బీడబ్ల్యూ) (బి) పతిరణ 27; రోసో (సి) పతిరణ (బి) జడేజా 35; రిపాల్ (రనౌట్) 10; అక్షర్ (సి) రహానే (బి) పతిరణ 21; అమన్ (నాటౌట్) 2; లలిత్ (బి) పతిరణ 12; కుల్దీప్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 140. వికెట్ల పతనం:** 1–0, 2–20, 3–25, 4–84, 5–89, 6–116, 7–125, 8–140. **బౌలింగ్:** చహర్ 3–0–28–2, తుషార్ 3–0–18–0, తీక్షణ 2–0–16–0, రవీంద్ర జడేజా 4–0–19–1, మొయిన్ అలీ 4–0–16–0, పతిరణ 4–0–37–3.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	11	8	3	0	16	0.951
చెన్నై	12	7	4	1	15	0.493
ముంబై	11	6	5	0	12	-0.255
లక్నో	11	5	5	1	11	0.294
రాజస్తాన్	11	5	6	0	10	0.388
కోల్‌కతా	11	5	6	0	10	-0.079
బెంగళూరు	11	5	6	0	10	-0.345
పంజాబ్	11	5	6	0	10	-0.441
హైదరాబాద్	10	4	6	0	8	-0.472
ఢిల్లీ	11	4	7	0	8	-0.605

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా x రాజస్తాన్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

తొలి పోరు, ఫైనల్ అహ్మదాబాద్‌లోనే!

- దక్షిణాదిలోనే పాకిస్తాన్ మ్యాచ్‌లు
- అక్టోబర్ 5 నుంచి వన్డే వరల్డ్ కప్

ముంబై: ఆసియా కప్ నిర్వహణ సందిగ్ధంలో పడినా... బెట్టు వదిలి పాకిస్తాన్ క్రికెట్ జట్టు వన్డే వరల్డ్ కప్ కోసం భారత్‌లో పర్యటించేందుకు సిద్ధమైంది. అయితే తాము ఆడే మ్యాచ్‌ల వేదికల విషయంలో మాత్రం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ముందు ప్రత్యేక విజ్ఞప్తిని ఉంచింది. ఐపీఎల్ ముగిసిన తర్వాత అధికారికంగా ప్రకటించబోయే వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 5న అహ్మదాబాద్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తో రన్నరప్ న్యూజిలాండ్ తలపడుతుంది. నవంబర్ 19న జరిగే ఫైనల్‌కు కూడా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం ఆతిథ్యమిస్తుంది. భారత్ తమ తొలి పోరులో చెన్నైలో ఆస్ట్రేలియాతో తలపడే అవకాశం ఉండగా... అక్టోబర్ 15న భారత్, పాకిస్తాన్ మధ్య పోరు జరుగుతుంది. అంతర్గత సమాచారం ప్రకారం పాకిస్తాన్ తమ 9 లీగ్ మ్యాచ్‌లను దక్షిణాది వేదికలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలలోనే ఆడే అవకాశం ఉంది. ఒకవేళ పాక్ ఫైనల్ చేరితే మాత్రం అహ్మదాబాద్‌లో ఆడక తప్పదు.



వరల్డ్ కప్‌కు దక్షిణాఫ్రికా అర్హత...

దక్షిణాఫ్రికా జట్టుకు అదృష్టం కలిసొచ్చింది. గత కొంత కాలంగా వరుస పరాజయాలు ఎదుర్కొంటూ వరల్డ్ కప్‌కు నేరుగా అర్హత సాధించే అవకాశాలు సంక్లిష్టం చేసుకున్న ఆ జట్టు ఎట్టకేలకు తమ ప్రమేయం లేకుండానే క్వాలిఫై అయింది. ఐర్లాండ్, బంగ్లాదేశ్ మధ్య మంగళవారం జరిగిన తొలి వన్డే వర్షం కారణంగా రద్దు అయింది. ఐర్లాండ్‌లో ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌లూ గెలిచి ఉంటే ఆ జట్టుకు అవకాశం దక్కేది. అయితే ఆ అవకాశం లేకపోవడంతో ఎనిమిదో జట్టుగా సఫారీ బృందం అవకాశం దక్కించుకుంది. మరో రెండు స్థానాల కోసం జూన్–జులైలో జింబాబ్వేలో జరిగే క్వాలిఫయింగ్ టోర్నీలో 10 జట్లు తలపడనున్నాయి. ఇందులో మాజీ చాంపియన్లు వెస్టిండీస్, శ్రీలంకలతో పాటు నెదర్లాండ్స్, ఐర్లాండ్, నేపాల్, ఒమన్, స్కాట్లాండ్, యూఏఈ, అమెరికా, జింబాబ్వే ఉన్నాయి.

సినిమా

ఊహా లోకంలో..

రాజుల కాలంలో అంతఃపురం ఎలా ఉండేది అంటే.. ఇలా ఉంటుందేమో అని సినిమాలు చూపించాయి. మరి.. స్వర్గలోకం ఎలా ఉంటుంది? అంటే.. ఈ లోకాన్ని కూడా ఊహించి, సినిమాల్లో చూపించారు. ఇప్పుడు కొన్ని సినిమాలు కొత్త ప్రపంచాలను చూపించనున్నాయి. ఊహాజనిత కథలతో సాగే ఈ చిత్రాల కోసం భారీ సెట్స్‌తో కొత్త లోకాలను సృష్టిస్తున్నారు. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.



చిరంజీవి
అఖిల్

స్వర్గం నేపథ్యంలో...

ముప్పై ఏళ్ల క్రితం చిరంజీవి, శ్రీదేవి హీరో హీరోయిన్లుగా 'జగదేకవీరుడు అతిలోకసుందరి' సినిమా ప్రేక్షకులను ఎంతగానో మెప్పించింది. కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలోని ఈ చిత్రంలో కొన్ని సీన్లు స్వర్గం నేపథ్యంలో ఉంటాయి. తాజాగా చిరంజీవి నటించనున్న ఓ సినిమా మళ్లీ ప్రేక్షకులను స్వర్గలోకంలోకి తీసుకెళ్లనుందని టాక్. గత ఏడాది కల్యాణ్ రామ్‌తో ఫ్యాంటసీ యాక్షన్ ఫిల్మ్ 'బింబిసార' తీసిన వశిష్ఠ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా ఓ చిత్రం రూపొందనుందని టాక్. 'బింబిసార' తరహాలోనే ఫ్యాంటసీ జానర్‌లో ఉండే ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలు ఊహాజనిత స్వర్గం బ్యాక్‌డ్రాప్‌లో ఉంటాయనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ నిర్మించనుందట.

సాహసాల ధీర

'ధీర'గా ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకుని వెళ్లనున్నారట అఖిల్. ప్రభాస్ 'సాహో' చిత్రానికి చేసిన అసిస్టెంట్ డైరెక్టర్స్ టీమ్‌లో ఒకరైన అనిల్‌కుమార్ ఇటీవల అఖిల్‌కు ఓ కథ చెప్పారు. ఫ్యాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ నిర్మించనుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అంతేకాదు.. ఈ సినిమాకు 'ధీర' టైటిల్‌ను పరిశీలిస్తున్నారని, హీరోయిన్ పాత్రకు జాన్వీ కపూర్‌ను చిత్ర యూనిట్ సంప్రదించిందని సమాచారం.

నాలుగు పేజీల భైరవకోన

ప్రేక్షకులను 'భైరవకోన'కు తీసుకెళ్తామంటున్నారు సందీప్ కిషన్. 'టైగర్' (2015) చిత్రం తర్వాత హీరో సందీప్ కిషన్, దర్శకుడు వీఐ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న హారర్ ఫ్యాంటసీ ఫిల్మ్ 'ఊరు పేరు భైరవకోన'. 'శ్రీకృష్ణదేవరాయల కాలంలోని గరుడ పురాణానికి, ప్రస్తుతం అందుబాటులో ఉన్న గరుడ పురాణానికి నాలుగు పేజీలు తగ్గాయి', 'గరుడ పురాణంలో మాయమైపోయిన ఈ నాలుగు పేజీలే భైరవకోన' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ ఫ్యాంటసీ అడ్వెంచరస్ యాక్షన్ థ్రిల్లర్‌లో వర్ష బొల్లమ్మ, కావ్యా థాపర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అనిల్ సుంకర, రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే ఓ ప్రకటన రానుంది.

అంజనాద్రి వీరుడు

'హను–మాన్' చిత్రం కోసం 'అంజనాద్రి' అనే ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. హనుమంతుని శక్తులు పొందిన ఓ యువకుడు 'అంజనాద్రి' రక్షణ కోసం ఎలాంటి పోరాటాలు, సాహసాలు చేశాడు అనే అంశాలతో 'హను–మాన్' సినిమా ఉంటుంది. తేజా సజ్జా, అమృతా అయ్యర్ హీరో హీరోయిన్లుగా ఈ చిత్రాన్ని ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో కె. నిరంజన్‌రెడ్డి నిర్మించారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. అలాగే ప్రశాంత్ వర్మ దర్శకత్వంలోనే 'అధీర' చిత్రం రూపుదిద్దుకుంటోంది. నిర్మాత డీవీవీ దానయ్య కుమారుడు దాసరి కల్యాణ్ ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. సూపర్ హీరో బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాలో కూడా కాస్త ఫ్యాంటసీ ఎలిమెంట్స్ కనిపిస్తాయి. కె. నిరంజన్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ఇవే కాదు.. మరికొన్ని చిత్రాలు కూడా ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకుని వెళ్లేందుకు సిద్ధం అవుతున్నాయి.



సందీప్ కిషన్



తేజా సజ్జా



కల్యాణ్

'బింబిసార'

క్లైమాక్స్ కంప్లీట్

'గేమ్ చేంజర్' క్లైమాక్స్ కంప్లీట్ అయ్యింది. హీరో రామ్‌చరణ్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'గేమ్ చేంజర్'. ఇందులో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఇటీవల ప్రారంభమైన ఈ చిత్రం క్లైమాక్స్ షూటింగ్ ముగిసింది. క్లైమాక్స్‌లో భాగంగా ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటు ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు దర్శకుడు శంకర్. ''గేమ్ చేంజర్' క్లైమాక్స్ చిత్రీకరణ పూర్తయింది. ఇక 'ఇండియన్ 2' సినిమాపై ఫోకస్ పెట్టాలి'' అని ట్వీట్ చేశారు శంకర్.



రామ్‌చరణ్
కియారా

డిసెంబర్‌లో హరోం హర



జ్ఞానసాగర్, సుధీర్ బాబు, సుమంత్

సుధీర్ బాబు హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. 'ది రివోల్ట్' అనేది ఉపశీర్షిక. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి. నాయుడు నిర్మిస్తున్నారు. నేడు (మే 11) సుధీర్ బాబు పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'హరోం హర'ని డిసెంబర్ 22న విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించి, ఓ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ''అందరూ పవర్ కోసం గన్ పట్టుకుంటారు... కానీ ఇది యాడాడో తిరిగి నన్ను పట్టుకుంది'' అని సుధీర్ బాబు కుప్పం యాసలో చెప్పే డైలాగ్ గ్లింప్స్‌లో ఉంది. చిత్తూరు జిల్లా కుప్పంలో 1989లో జరిగిన కథతో ఈ సినిమా రూపొందుతున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

గెలుపు కోసం పరుగు



ధనరాజ్, పృథ్వీ, కిరణ్, చరణ్, సోనియా

''ప్రతి మనిషి గెలుపు కోసమే పరిగెడతాడు. అయితే మా 'భువన విజయమ్' ఓడి గెలిచినవాడి కథ. గెలిచినవాళ్లు ఓడిపోయినవాళ్లని గెలిపించిన కథ. కామెడీ, ఫ్యాంటసీ, థ్రిల్.. ఇలా అన్నీ ఉన్న ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు దర్శకుడు యలమంద చరణ్. సునీల్, శ్రీనివాస్ రెడ్డి, వెన్నెల కిశోర్, ధనరాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భువన విజయమ్'. కిరణ్, వీఎస్కే నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నటుడు ధనరాజ్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో ప్రేక్షకుడి పాత్ర చేశాను. ఈ చిత్రంలోని పాత్రలని నేను ఎలా చూస్తానో ఆడియన్స్ కూడా అలానే చూస్తారని డైరెక్టర్ చెప్పడం సవాల్‌గా అనిపించింది'' అన్నారు. ''యూనిట్ సహకారంతో అనుకున్న టైమ్‌కి పూర్తి చేసి, రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు కిరణ్, వీఎస్కే. ఈ చిత్రానికి సమర్పణ: లక్ష్మి, సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: సాయి.

శివలా కస్టడీ గుర్తుండిపోతుంది

– శ్రీనివాసా చిట్టూరి



''నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో 'కస్టడీ' సినిమా రూపొందింది. నాగార్జునగారి కెరీర్‌లో 'శివ' మూవీ ఎలా గుర్తుండి పోయిందో నాగచైతన్య కెరీర్‌లో 'కస్టడీ' అలా గుర్తుండిపోతుంది. తెలుగు ఎమోషన్స్‌తో ఒక హాలీవుడ్ సినిమా చూసిన అనుభూతితో పాటు ఓ మంచి చిత్రం చూశామనే సంతృప్తిని ప్రేక్షకులకు 'కస్టడీ' ఇస్తుంది'' అన్నారు నిర్మాత శ్రీనివాసా చిట్టూరి. నాగచైతన్య, కృతీ శెట్టి జంటగా వెంకట్ ప్రభు దర్శకత్వం వహించిన చిత్రం 'కస్టడీ'. తెలుగు–తమిళ భాషల్లో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రీనివాసా చిట్టూరి మాట్లాడుతూ– ''మన తెలుగు దర్శకులు రెండు మూడు సినిమాలతో బిజీగా ఉండటంతో 'వారియర్', 'కస్టడీ' సినిమాలను తమిళ డైరెక్టర్స్‌తో తీశాను. 'గ్యాంబ్లర్' సినిమా నుంచి వెంకట్ ప్రభుతో ఓ సినిమా చేయాలనుకున్నాను.. అది 'కస్టడీ'తో కుదిరింది. ఒక కానిస్టేబుల్ కథ ఇది. మంచి కథ, చక్కని స్క్రీన్‌ప్లే, ప్రేక్షకులకు నచ్చే ఎమోషన్స్, సీరియస్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో కథ సాగుతుంది. ఈ కథ వినగానే ఇళయరాజాగారు, యువన్ సంగీతం అందిస్తామనడం హ్యాపీ. ఈ మూవీ హిట్టవుతుందనే నమ్మకంతోనే 'కస్టడీ 2' ఉంటుందని చెబుతున్నాం. నేను 'యు టర్న్' తీసేనాటికి సమంతగారి మార్కెట్ ఏంటో ఎవరికీ తెలీదు. కథ నచ్చి చేశాను. అలాగే గోపీచంద్ 'సీటీమార్', రామ్ 'వారియర్', ఇప్పుడు నాగచైతన్య 'కస్టడీ' సినిమాలు కూడా వారి కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్ సినిమాలు. బడ్జెట్ లెక్కలు వేసుకోకుండా కథకు కావాల్సింది ఖర్చు పెట్టాం. మా బ్యానర్‌లో రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 90 శాతం పూర్తయింది. అలాగే నాగార్జునగారితో తీసే సినిమా షూటింగ్‌ని జూన్‌లో ఆరంభించాలని అనుకుంటున్నాం.

యువత నేపథ్యంలో...

సాయి చరణ్, పల్లవి, ట్రాన్సీ హీరో హీరోయిన్లుగా జీయల్‌బీ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఐక్యూ' (పవర్ ఆఫ్ స్టూడెంట్స్). కాయగూరల రాజేశ్వరి సమర్పణలో కాయగూరల లక్ష్మీపతి నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కి రెడీగా ఉంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో నటుడు సుమన్ మాట్లాడుతూ– ''రెగ్యులర్ కథలకు భిన్నంగా కొత్త కథలను ఎంచుకుని 'ఐక్యూ' లాంటి సినిమా తీసిన నిర్మాతలకు మనం అండగా ఉండాలి'' అన్నారు. ''యువత నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది'' అన్నారు కాయగూరల లక్ష్మీపతి. ''మేధస్సుకు సంబంధించిన చిత్రం ఇది'' అన్నారు జీయల్‌బీ శ్రీనివాస్.



సాయిచరణ్, పల్లవి

వజ్ర కాళేశ్వరీ దేవి

'మనోహరం, బీస్ట్' వంటి చిత్రాలతో మలయాళ, తమిళ ఇండస్ట్రీల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి అపర్ణా దాస్ తెలుగు చిత్ర పరిశ్రమకి ఎంట్రీ ఇస్తున్నారు. పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా నటిస్తున్న నాలుగో చిత్రంలో 'పీవీటీ 04' (వర్కింగ్ టైటిల్) కీలక పాత్రలో నటిస్తున్నారు అపర్ణా దాస్. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఎస్. నాగవంశీ, ఎస్. సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీలో వజ్ర కాళేశ్వరీ దేవి పాత్రను పోషిస్తున్నారు అపర్ణా దాస్. ఆమె పాత్రకి ఎంతో ప్రాధాన్యం ఉందని, ఆమె రాక సినిమాకి మరింత ఆకర్షణ అవుతుందని యూనిట్ పేర్కొంది.



అపర్ణ

సాక్షి బిజినెస్
గురువారం
11-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)				బులియన్ రూ.లలో ముంబై
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲	నాస్‌డాక్	12,236	▲	56	బంగారం (24 క్యారెట్)
179	49	డోజోన్స్	33,357	▼	204	61,495 ▼ 38
61,940	18,315	ఎఫ్‌టీఎస్ఈ 100	7,741	▼	23	బంగారం (22 క్యారెట్)
		డాక్స్	15,896	▼	59	61,249 ▼ 38
		షాంఘై	3,319	▼	39	వెండి (కిలో)
		నికాయ్	29,122	▼	121	76,261 ▼ 138

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఐపీవోకి జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా

- రూ. 2,800 కోట్ల సమీకరణ యోచన
- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: రుణ భారాన్ని తగ్గించుకునేందుకు, విస్తరణ ప్రణాళికలను అమలు చేసేందుకు అవసరమైన నిధుల సమీకరణ కోసం జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పబ్లిక్ ఇష్యూకి (ఐపీవో) రానుంది. దీని ద్వారా రూ. 2,800 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను (డీఆర్‌హెచ్‌పీ) నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. ఇప్పటికే జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌లో భాగమైన జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్.. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయి ఉన్నాయి. దీంతో గ్రూప్ నుంచి జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా మూడో లిస్టెడ్ కంపెనీ కానుంది. కంపెనీకి వార్షికంగా 153.43 మిలియన్ టన్నుల కమోడిటీ కార్గో హ్యాండ్లింగ్ స్థాపిత సామర్థ్యం ఉంది. 2022 డిసెంబర్ 31 నాటికి సంస్థకు నికరంగా రూ. 2,875 కోట్ల రుణాలు ఉన్నాయి. 2022–23 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా రూ. 447 కోట్ల నికర లాభం ఆర్జించింది.

డాక్టర్ రెడ్డీస్ లాభం 959 కోట్లు

- క్యూ4లో రూ. 6,297 కోట్ల ఆదాయం
- రూ. 40 తుది డివిడెండు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ (డీఆర్ఎల్) గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 959 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో నమోదైన లాభం రూ. 87.5 కోట్లతో పోలిస్తే ఇది 996 శాతం అధికం. లో బేస్ ప్రభావం ఇందుకు కారణం. ఇక సమీక్షాకాలంలో ఆదాయం 25 శాతం పెరిగి రూ. 5,437 కోట్ల నుంచి రూ. 6,297 కోట్లకు చేరింది. ఆదాయాలు, లాభాల వృద్ధిపరంగా ఇది తమకు రికార్డు సంవత్సరమని కంపెనీ సహ–చైర్మన్ జీవీ ప్రసాద్ పేర్కొన్నారు. ఉత్తర అమెరికా, యూరప్, భారత మార్కెట్లు పటిష్టంగా ఉండటం ఇందుకు దోహదపడిందని బుధవారం ఆర్థిక ఫలితాల ప్రకటన సందర్భంగా విలేకరుల సమావేశంలో పాల్గొన్న కంపెనీ సీఎఫ్‌వో పరాగ్ అగర్వాల్ తెలిపారు. కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం, అన్ని వ్యాపార విభాగాలు పుంజుకోవడం తదితర అంశాలు ఆదాయ వృద్ధికి తోడ్పడ్డాయని ఆయన వివరించారు. ప్రస్తుతం కంపెనీ వద్ద రూ. 5,000 కోట్ల మిగులు నిధులు ఉన్నట్లు చెప్పారు. తాజా ఆర్థిక సంవత్సరంలోనూ కొత్త ఉత్పత్తులు, ఉత్పాదకతను పెంచుకోవడంపై మరింతగా దృష్టి పెట్టనున్నట్లు సంస్థ సీఈవో ఎరెజ్ ఇజ్రేలీ చెప్పారు. పూర్తి ఆర్థిక సంవత్సరానికి సంస్థ బోర్డు షేరు ఒక్కింటికి రూ. 40 చొప్పున తుది డివిడెండ్‌ను ప్రతిపాదించింది. ఫలితాలకు సంబంధించి మరిన్ని వివరాలు ..



- గ్లోబల్ జనరిక్స్ విభాగం ఆదాయాలు క్యూ4లో 18 శాతం పెరిగి రూ. 5,426 కోట్లకు చేరాయి. కీలకమైన ఉత్తర అమెరికా మార్కెట్లో ఆదాయం 27 శాతం పెరిగి రూ. 2,532 కోట్లుగా నమోదైంది. ఉత్తర అమెరికా మార్కెట్లో నాలుగో త్రైమాసికంలో ఆరు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టగా, పూర్తి ఆర్థిక సంవత్సరంలో 25 ఔషధాలను ఆవిష్కరించింది.
- భారత్‌లో అమ్మకాలు 32 శాతం పెరిగి రూ. 1,283 కోట్లకు చేరాయి. ప్రస్తుత ఉత్పత్తుల ధరల్లో పెరుగుదలతో పాటు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం ద్వారా అదనపు ఆదాయం సమకూరింది.
- యూరప్ మార్కెట్ ఆదాయాలు 12% పెరిగి రూ. 496 కోట్లకు, వర్ధమాన మార్కెట్లలో ఆదాయం 7% క్షీణించి రూ. 1,114 కోట్లుగా నమోదైంది.
- ఫార్మా సర్వీసులు, యాక్టివ్ ఇంగ్రీడియెంట్స్ (పీఎస్ఏఐ) విభాగం మూడు శాతం పెరిగి రూ. 756 కోట్ల నుంచి రూ. 778 కోట్లకు చేరాయి.
- పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం రూ. 21,439 కోట్ల నుంచి 15% వృద్ధితో రూ.24,588 కోట్లకు చేరింది. లాభం రూ. 2,357 కోట్ల నుంచి 91% ఎగిసి రూ.4,507 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై రూ.1,940 కోట్లు వెచ్చించింది. ఈసారి మొత్తం అమ్మకాల్లో 8–9% వెచ్చించనుంది.

ఎల్‌అండ్‌టీ రూ.24 డివిడెండ్

- నికర లాభం రూ. 3,987 కోట్లు
- రూ.2 లక్షల కోట్లు దాటిన ఆర్డర్లు



న్యూఢిల్లీ: ఇంజనీరింగ్, నిర్మాణ రంగ దిగ్గజం ఎల్‌అండ్‌టీ మార్చి త్రైమాసికానికి నికర లాభంలో 10 శాతం వృద్ధిని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.3,621 కోట్ల నుంచి రూ.3,987 కోట్లకు చేరింది. ఆదాయం రూ.52,851 కోట్ల నుంచి రూ.58,335 కోట్లకు వృద్ధి చెందింది. ఒక్కో షేరుకు రూ.24 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయం తీసుకుంది. కంపెనీ గడిచిన ఆర్థిక సంవత్సరంలో 19 శాతం అధికంగా రూ.2,30,528 కోట్ల విలువైన ఆర్డర్లను సొంతం చేసుకుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల కోట్లకు పైగా ఆర్డర్లను పొందడం ఇదే మొదటిసారి అని ఎల్‌అండ్‌టీ సీఈవో ఎస్ఎన్ సుబ్రమణ్యం తెలిపారు. మొత్తం ఆర్డర్ల పుస్తకం మార్చి చివరికి రూ.4 లక్షల కోట్లుగా ఉన్నట్టు చెప్పారు. ఎల్‌అండ్‌టీ కన్సాలిడేటెడ్ ఆదాయం 2022–23లో 17 శాతం వృద్ధితో రూ.1.83 లక్షల కోట్లకు చేరుకోగా, లాభం 21 శాతం పెరిగి రూ.10,471 కోట్లుగా నమోదైంది.

చైర్మన్‌గా తప్పుకోనున్న ఏఎం నాయక్

ఎల్‌అండ్‌టీ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఏఎం నాయక్ 2023 సెప్టెంబర్ 30 నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నారు. దీంతో ప్రస్తుతం సీఈవో, ఎండీగా ఉన్న ఎస్ఎన్ సుబ్రమణ్యం చైర్మన్, ఎండీగా 2023 అక్టోబర్ 1 నుంచి సేవలు అందించనున్నట్టు ఎల్‌అండ్‌టీ ప్రకటించింది. గౌరవ చైర్మన్‌గా నాయక్ కొనసాగుతారని తెలిపింది.

ఏప్రిల్‌లో ఆన్‌లైన్ హైరింగ్ తగ్గింది

ముంబై: వైట్ కాలర్ ఉద్యోగాల కోసం ఆన్‌లైన్ నియామకాలు ఏప్రిల్‌లో తగ్గాయని ఫౌండిట్ నివేదిక వెల్లడించింది. 2022 ఏప్రిల్‌తో పోలిస్తే గత నెలలో ఇది 6 శాతం క్షీణత నమోదైందని వివరించింది. ఆర్థిక అనిశ్చితి ఉన్నప్పటికీ స్టార్టప్స్‌లో హైరింగ్ పెరిగిందని తెలిపింది. 'ప్రస్తుత ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు వ్యాపారాలకు సవాలుతో కూడిన వాతావరణాన్ని సృష్టించాయి. నియామకాలు తగ్గినప్పటికీ ఉద్యోగార్థులకు అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలలో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయి. భారత స్టార్టప్ వ్యవస్థ ఒక మలుపు తీసుకుంది. జాబ్ మార్కెట్ సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ నియామకాల విషయంలో మళ్లీ జోరు ప్రదర్శిస్తోంది' అని తెలిపింది.

టాప్–5లో ఎడ్‌టెక్..

ఉద్యోగావకాశాల పట్ల జాగ్రత్తతో కూడిన సెంటిమెంట్‌లు కొనసాగుతాయని ఆశిస్తున్నప్పటికీ, అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలపై ఆశాజనకంగా ఉంది. ప్రత్యేకించి స్టార్టప్‌లు ప్రతిభ, ఆవిష్కరణల కోసం డిమాండ్‌ను పెంచుతూనే ఉన్నాయి. స్టార్టప్ నియామకాల్లో టాప్–5 రంగాల్లో ఎడ్‌టెక్ ఉంది. బీఎఫ్ఎస్ఐ/ఫిన్‌టెక్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ వంటి ఇతర విభాగాలు కూడా స్టార్టప్ హైరింగ్‌లో గణనీయ డిమాండ్‌ను కలిగి ఉన్నాయి. ఆరోగ్య సేవలు, బీపీవో విభాగాలు తిరోగమన వృద్ధిని నమోదు చేశాయి. స్టార్టప్స్ హైరింగ్‌లో 33 శాతం వాటాతో బెంగళూరు టాప్‌లో నిలిచింది. ఢిల్లీ, ముంబై, పుణే సైతం మెరుగైన ప్రతిభ కనబరిచాయి.



జోరుగా రిటైల్ రంగం..

రిటైల్ రంగం 22% వృద్ధి నమోదు చేసింది. ఈ రంగం అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలలో ఉద్యోగార్థులకు ప్రోత్సాహకరంగా ఉంది. ఈ వృద్ధికి ఈ–కామర్స్ గణనీయంగా దోహదపడింది. భారత్ ఇప్పుడు అతిపెద్ద ఆన్‌లైన్ రిటైలర్లకు వేదికైంది. ఈ విస్తరణ రిటైల్ ఔట్‌లెట్లలో నిపుణులకు డిమాండ్‌ను పెంచింది. ఉద్యోగార్థులకు పుష్కలమైన అవకాశాలను రిటైల్ రంగం కల్పిస్తోంది.

ఇతర విభాగాల్లో ఇలా..

ట్రావెల్, టూరిజం విభాగం 19 శాతం, టెలికం 14, ఎన్‌జీవో, సోషల్ సర్వీస్ 11, ప్రకటనలు, మార్కెట్ పరిశోధన, పబ్లిక్ రిలేషన్స్ 7, చమురు, వాయువు 3, షిప్పింగ్, మెరైన్‌లో హైరింగ్ 2 శాతం ఎగసింది. సాంకేతికత, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై ఆధారపడటం పెరుగుతున్న కారణంగా సైబర్ సెక్యూరిటీ నిపుణులకు అధిక డిమాండ్ ఉంది. బీఎఫ్ఎస్ఐ 4 శాతం, బీపీవో, ఐటీఈఎస్ విభాగంలో నియామకాలు 13 శాతం క్షీణించాయి. ఆరోగ్య సేవలు, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ 16, ఐటీ–హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ విభాగాలలో 22 శాతం తిరోగమన వృద్ధి నమోదైందని నివేదిక వివరించింది.

ఇన్వెస్టర్లలో అప్రమత్తత

- స్వల్ప లాభాల్లో ముగిసిన మార్కెట్లు
- సెన్సెక్స్ 179 పాయింట్లు పైకి
- 49 పాయింట్లు లాభపడిన నిఫ్టీ



ముంబై: అమెరికా ద్రవ్యోల్బణం డేటా ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి స్పందించారు. దీంతో బుధవారం ఈక్విటీ మార్కెట్ అస్థిరంగా చలించి, చివరికి కొనుగోళ్ల మద్దతుతో స్వల్ప లాభాల్లో ముగిసింది. అమ్మకాల ఒత్తిడికి ఉదయం సెషన్‌లో సెన్సెక్స్, నిఫ్టీ పావు శాతం వరకు నష్టాన్ని చూశాయి. కానీ, అక్కడి నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడం సూచీలను తిరిగి లాభాల బాట పట్టించింది. సెన్సెక్స్ మొత్తం మీద 400 పాయింట్ల శ్రేణిలో 61,573 నుంచి 61,974 మధ్య చలించింది. చివరికి పావు శాతం లాభంతో (179 పాయింట్లు) 61,940 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 షేర్లలో 22 లాభపడ్డాయి. నిఫ్టీ 49 పాయింట్లు పెరిగి 18,315 పాయింట్ల వద్ద క్లోజయింది. మార్కెట్లు లాభాల్లో ముగియడం వరుసగా ఇది మూడో రోజు. అంతర్జాతీయ మార్కెట్లలో ఎక్కువ శాతం ప్రతికూలంగా ట్రేడయ్యాయి. సెన్సెక్స్‌లో అత్యధికంగా ఇండస్‌ఇండ్ బ్యాంక్ 3 శాతం లాభపడింది. నష్టపోయిన వాటిల్లో ఎస్‌బీఐ, టాటా స్టీల్, హిందుస్థాన్ యూనిలీవర్, టైటాన్ ఉన్నాయి.

"దేశీ మార్కెట్ ఫ్లాట్‌గా ట్రేడ్ అయింది. యూఎస్ మార్కెట్ చుట్టూ నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు మార్కెట్ల పట్ల సానుకూలంగా వ్యవహరించలేదు" అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. మార్కెట్లు మరో రోజు స్థిరీకరణ చెందాయని రెలిగేర్ బ్రోకింగ్ టెక్నికల్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. రియల్టీ, ఇంధనం, ఆటో రంగాల షేర్లలో కొనుగోళ్లు కనిపించినట్టు చెప్పారు.

యూఎస్ వినియోగ ధరల ఆధారిత ద్రవ్యోల్బణం గణాంకాల విడుదల కానుండడంతో అంతర్జాతీయంగా మార్కెట్లు స్తబ్దుగా ట్రేడయ్యాయి. సియోల్, టోక్యో, షాంఘై, హాంగ్‌కాంగ్ నష్టాల్లో ముగిశాయి.

గో ఫస్ట్‌కు ఎన్‌సీఎల్‌టీ ఊరట

- స్వచ్ఛంద దివాలా పిటిషన్ విచారణకు స్వీకరణ
- ఆర్థిక వ్యవహారాలు, చెల్లింపులపై మారటోరియం

న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న విమానయాన సంస్థ గో ఫస్ట్‌కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) కాస్త ఊరటనిచ్చింది. కంపెనీ స్వచ్ఛందంగా దాఖలు చేసిన దివాలా పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. అలాగే ఆర్థిక వ్యవహారాలు, చెల్లింపులకు సంబంధించి మారటోరియం విధించింది. మే 4న ఉత్తర్వులను రిజర్వ్ చేసిన ఎన్‌సీఎల్‌టీ దాదాపు వారం రోజుల ఉత్కంఠకు తెరదించుతూ తాజాగా బుధవారం నాడు ఆదేశాలను వెలువరించింది. మధ్యంతర పరిష్కార నిపుణుడిగా (ఐఆర్‌పీ) అభిలాష్ లాల్‌ను నియమించడంతో పాటు ఏ ఉద్యోగినీ తీసివేయకూడదని ఆదేశించింది. అలాగే, రద్దయిన మేనేజ్‌మెంటు.. తక్షణ ఖర్చుల కోసం రూ. 5 కోట్ల మొత్తాన్ని ఐఆర్‌పీ వద్ద డిపాజిట్ చేయాలని సూచించింది. తమ విజ్ఞప్తులను కూడా తెలుసుకున్న తర్వాతే గో ఫస్ట్ దివాలా పిటీషన్‌పై తగు నిర్ణయం తీసుకోవాలంటూ సంస్థకు విమానాలను లీజుకిచ్చిన కంపెనీల అభ్యంతరాలను ఎన్‌సీఎల్‌టీ తోసిపుచ్చింది. గో ఫస్ట్ తాను బాకీల విషయంలో డిఫాల్ట్ అయ్యానని, రుణదాతల నుంచి వచ్చిన డిమాండ్ నోటీసులను కూడా సమర్పించిందని, లీజు సంస్థలు కూడా దీన్ని ఖండించడం లేదని ద్విసభ్య ఎన్‌సీఎల్‌టీ బెంచ్ పేర్కొంది. ఈ నేపథ్యంలో దివాలా చట్టంలోని సెక్షన్ 10 కింద కంపెనీ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలిపింది. దీనితో దివాలా విచారణ పూర్తయ్యే వరకూ ఇతరత్రా దావాల నుంచి గో ఫస్ట్‌కు రక్షణ లభించనుంది. సంస్థ ఆస్తులను బదిలీ చేయడానికి గానీ రుణ దాతలు రికవరీ చేసుకోవడానికి గానీ ఉండదు. గో ఫస్ట్‌కు రూ. 11,463 కోట్ల ఆర్థిక భారం ఉండగా, 7,000 మంది పైగా ఉద్యోగులు ఉన్నారు.



భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కేంద్రంలో 1600 పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్

వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో 1600 పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ప్రకటన విడుదల చేసింది. దీనికోసం కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవెల్(సీహెచ్ఎస్ఎల్) ఎగ్జామినేషన్–2023కు నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **పరీక్ష:** ఎస్ఎస్‌సీ–సీహెచ్ఎస్ఎల్ ఎగ్జామినేషన్–2023
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1600
» **పోస్టుల వివరాలు:** లోయర్ డివిజన్ క్లర్క్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో), డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్ ఏ).
» **అర్హతలు:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హత ఉండాలి.
» **వయసు:** 01.08.2023 నాటికి 18–27ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** టైర్–1, టైర్–2 రాత పరీక్షలు, కంప్యూటర్ టెస్ట్/టైపింగ్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరి తేది:** 08.06.2023
» **టైర్1 పరీక్ష తేదీలు:** ఆగస్టులో నిర్వహిస్తారు.
» **వెబ్‌సైట్:** https://ssc.nic.in

హెచ్ఏఎల్, హైదరాబాద్‌లో 150 అప్రెంటిస్‌లు

హైదరాబాద్ బాలానగర్‌లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్).. 2023–24 అప్రెంటిస్ శిక్షణలో భాగంగా గ్రాడ్యుయేట్, డిప్లొమా, జనరల్ స్ట్రీమ్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 150
» **ఖాళీల వివరాలు:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–74, టెక్నీషియన్ (డిప్లొమా) అప్రెంటిస్–52, జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–24.
» **ట్రేడ్/విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, ఫార్మసీ, ఎంఎల్‌టీ, బీకాం, బీఎస్సీ.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** డిప్లొమా/డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **వాక్ఇన్ తేదీలు:** 23.05.2023 నుంచి 25.05.2023 వరకు.
» **వేదిక:** ఆడిటోరియం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్, హెచ్ఏఎల్ ఏవియానిక్స్ డివిజన్, బాలానగర్, హైదరాబాద్.
» **వెబ్‌సైట్:** www.hal-india.co.in

హెచ్ఏఎల్, హైదరాబాద్‌లో 178 ట్రేడ్ అప్రెంటిస్‌లు

హైదరాబాద్ బాలానగర్‌లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్).. 2023–24 అప్రెంటిస్ శిక్షణలో భాగంగా ఐటీఐ ట్రేడ్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 178
» **ట్రేడులు:** ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, టర్నర్, వెల్డర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, సీవోపీఏ, ప్లంబర్, పెయింటర్, డీజిల్ మెకానిక్, మోటార్ వెహికల్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మ్యాన్–సివిల్, డ్రాఫ్ట్స్‌మ్యాన్–మెకానికల్.
» **అర్హత:** సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వాక్ఇన్ తేదీలు:** 17.05.2023 నుంచి 19.05.2023 వరకు
» **వేదిక:** ఆడిటోరియం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్, హెచ్ఏఎల్ ఏవియానిక్స్ డివిజన్, బాలానగర్, హైదరాబాద్.
» **వెబ్‌సైట్:** www.hal-india.co.in

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, బిలాస్‌పూర్‌లో 548 అప్రెంటిస్‌లు

బిలాస్‌పూర్‌లోని సౌత్‌ఈస్ట్ సెంట్రల్ రైల్వే(ఎస్ఈసీఆర్) పర్సనల్ డిపార్ట్‌మెంట్, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం.. అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 548
» **కేటగిరి వారీగా ఖాళీలు:** అన్ రిజర్వ్‌డ్–215, ఈడబ్ల్యూఎస్–59, ఓబీసీ–148, ఎస్సీ–85, ఎస్టీ–41.
» **విభాగాలు:** ఫిట్టర్, పెయింటర్, ప్లంబర్, మెకానిక్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, టర్నర్, వైర్‌మ్యాన్, గ్యాస్‌కట్టర్, ఫోటోగ్రాఫర్ తదితరాలు.
» **అర్హత:** పదో తరగతితో పాటు సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి 10+2/ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 15 నుంచి 24 ఏళ్లు ఉండాలి.
» **అప్రెంటిస్‌షిప్ కాలవ్యవధి:** ఒక ఏడాది.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.06.2023.
» **వెబ్‌సైట్:** www.secr.indianrailways.gov.in

హెచ్‌ఈసీ.. 'పోటీ'లో నెగ్గేలా!

ఇంటర్మీడియెట్ హెచ్‌ఈసీ విద్యార్థులకు విభిన్న కోర్సులు, వినూత్న కెరీర్ అవకాశాలు స్వాగతం పలుకుతున్నాయి! హిస్టరీ, సివిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులుగా ఉండే హెచ్‌ఈసీ చదివిన విద్యార్థులు.. సివిల్స్ నుంచి గ్రూప్స్ వరకూ అనేక పోటీ పరీక్షల్లో రాణించే అవకాశం ఉంది. దీంతోపాటు లా, సోషల్ వర్క్, టీచింగ్ కెరీర్ వంటి చక్కటి మార్గాలను వీరు అందిపుచ్చుకోవచ్చు. హెచ్‌ఈసీ గ్రూప్‌తో అందుబాటులో ఉన్న ఉన్నత విద్య కోర్సులు, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..

» హెచ్‌ఈసీతో పలు ఉన్నత విద్య కోర్సులు, ఉద్యోగాలు
» డిగ్రీ స్థాయిలో వినూత్న కాంబినేషన్లలో చేరొచ్చు
» లా, సోషల్ వర్క్, ఫైన్ ఆర్ట్స్ వంటి ట్రెండీ కోర్సులు
» పోటీ పరీక్షల్లోనూ ముందంజలో నిలిచే అవకాశం



హెచ్‌ఈసీ విద్యార్థులకు డిగ్రీ స్థాయిలో ప్రధానంగా బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్(బీఏ)కోర్సు అందుబాటులో ఉంది. దీంతోపాటు ఇటీవల కాలంలో బీఏలోనూ వినూత్న కాంబినేషన్లు ప్రవేశపెడుతున్నారు. హిస్టరీ, ఎకనామిక్స్, పబ్లిక్ పాలసీ మేనేజ్‌మెంట్; హిస్టరీ, సోషియాలజీ, ఎకనామిక్స్ వంటి కాంబినేషన్లు, బీఏ సోషల్ వర్క్ తదితర కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. ఇవి జాబ్ మార్కెట్‌లో అవకాశాలు అందుకునేందుకు దోహదపడుతున్నాయి.

కాంపిటీటివ్ ఎగ్జామ్స్

హెచ్‌ఈసీ విద్యార్థులు ఉద్యోగ నియామక పరీక్షల్లో ముందుండే అవకాశముంది. ఆయా పోటీ పరీక్షలకు పేర్కొన్న సిలబస్ అంశాలు ఎక్కువగా హిస్టరీ, ఎకనామిక్స్, జాగ్రఫీ, పాలిటీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వంటి సబ్జెక్టుల నుంచే ఉంటున్నాయి. దీంతో అకడమిక్ స్థాయిలోనే బ్యాచిలర్ డిగ్రీ(బీఏ)లో ఈ అంశాలను పూర్తి స్థాయిలో చదివిన విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్, బ్యాంకింగ్ వంటి పోటీ పరీక్షల్లో రాణించే వీలుంటుంది.

సోషల్ వర్క్

బీఏలో సోషల్ వర్క్ స్పెషలైజేషన్ చేసిన వారిని స్వచ్ఛంద సంస్థలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని గ్రామీణాభివృద్ధి శాఖ, ప్రణాళిక విభాగం, యునెస్కో, యూనిసెఫ్ వంటి సంస్థలు ఫీల్డ్ ఆఫీసర్లు, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్‌గా నియమించుకుంటున్నాయి. సోషల్ వర్క్ స్పెషలైజేషన్‌లో.. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలపై అవగాహన కల్పించే విధంగా కరిక్యులం అమలు చేస్తున్నారు. సామాజిక సమకాలీన అంశాలు, విభిన్న వర్గాలకు అందిస్తున్న పథకాలు, వాటిని సమర్థంగా అమలు చేసే విధానాలపై శిక్షణ ఇస్తున్నారు. దీంతో సోషల్ వర్క్ సబ్జెక్ట్‌తో బీఏ పూర్తి చేసుకున్న వారికి చక్కటి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

టీచింగ్ కెరీర్

హెచ్‌ఈసీ పూర్తి చేసుకున్న వారికి అందుబాటులో ఉన్న మరో ఉన్నత విద్య అవకాశం..ఉపాధ్యాయ వృత్తికి మార్గం వేసే డీఈడీ కోర్సు. ఈ కోర్సు ఉత్తీర్ణులకు ప్రభుత్వ రంగంలో సెకండరీ గ్రేడ్ టీచర్స్‌గా కొలువులు లభిస్తున్నాయి. దీంతోపాటు ప్రైవేట్ స్కూల్స్‌లో టీచర్‌గా కెరీర్ ప్రారంభించొచ్చు. డిగ్రీ తర్వాత బీఈడీ పూర్తి చేసుకుంటే.. స్కూల్ అసిస్టెంట్ కొలువు సొంతం చేసుకునే వీలుంది.

న్యాయ విద్య

హెచ్‌ఈసీ విద్యార్థులకు ఉజ్వల కెరీర్‌ను అందించే మరో చక్కటి కోర్సు.. లా(న్యాయ విద్య). ఇంటర్మీడియెట్ అర్హతతోనే అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ కోర్సులో చేరొచ్చు. ఈ కోర్సు పూర్తయ్యాక న్యాయవాద వృత్తి లేదా కార్పొరేట్ సంస్థల్లో లీగల్ విభాగాల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. బీఏ ఎల్ఎల్‌బీలో అడుగు పెట్టాలంటే.. రాష్ట్ర స్థాయిలో లాసెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అదేవిధంగా కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్)లో ర్యాంకు ఆధారంగా.. జాతీయ స్థాయిలో పేరున్న నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశం లభిస్తుంది. వీటిలో బీఏ ఎల్ఎల్‌బీ కోర్సు పూర్తి చేసుకుంటే..కార్పొరేట్ కొలువులు స్వాగతం పలకడం ఖాయం.

డిగ్రీ నుంచే బిజినెస్ నైపుణ్యాలు

హెచ్‌ఈసీ విద్యార్థులకు కార్పొరేట్ కొలువులకు మార్గం వేస్తున్న మరో కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ) లేదా బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్(బీబీఎం). ఈ కోర్సులు పూర్తి చేస్తే బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలోనే వ్యాపార నిర్వహణ నైపుణ్యాలు సొంతమవుతాయి. ఉన్నత విద్యకు వెళ్లాలనుకుంటే.. ఐసెట్, క్యాట్, మ్యాట్ వంటి ఎంట్రన్స్ టెస్టుల్లో ప్రతిభ చూపి..ఐఐఎంలు తదితర టాప్ బీస్కూల్స్ నుంచి మేనేజ్‌మెంట్ పీజీ పట్టా అందుకోవచ్చు.

ఫైన్ ఆర్ట్స్.. కెరీర్ ఫైన్

హెచ్‌ఈసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న వినూత్న కోర్సులు..ఫైన్ ఆర్ట్స్. సృజనాత్మకత, కళాత్మక దృక్పథం ఉంటే..ఫైన్ ఆర్ట్స్ విభాగాల్లో షైనింగ్ కెరీర్స్‌ను సొంతం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఫోటోగ్రఫీ, స్కల్ప్చర్, పెయింటింగ్ స్పెషలైజేషన్లతో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సులు అభ్యసిస్తే కెరీర్ అవకాశాలు గ్యారెంటీ. తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు జేఎన్ఏఎఫ్ఏయూ(హైదరాబాద్), డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(ఆంధ్రప్రదేశ్)లు ప్రధాన గమ్యాలుగా నిలుస్తున్నాయి. వీటితోపాటు ఇతర యూనివర్సిటీలు కూడా పెయింటింగ్, స్కల్ప్చర్(శిల్పకళ)లలో బ్యాచిలర్ కోర్సులు అందిస్తున్నాయి.

ఎకనామిక్స్‌తో అవకాశాలు

ఇంటర్‌లో హెచ్‌ఈసీ గ్రూప్‌లో ఎకనామిక్స్ చదివిన విద్యార్థులు డిగ్రీలోనూ ఈ గ్రూప్ సబ్జెక్ట్‌గా ఎంచుకుంటే.. ఎన్నో అవకాశాలు అందుకోవచ్చు. బీఏలో ఎకనామిక్స్‌ను గ్రూప్ సబ్జెక్ట్‌గా ఎంపిక చేసుకున్న విద్యార్థులకు భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేటు అవకాశాలు లభిస్తాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్ అండ్ ఇన్సూరెన్స్ విభాగాలు, అదే విధంగా కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వ రంగంలో ప్రణాళిక విభాగం, కన్సల్టెన్సీ సంస్థల్లో ఎకనామిక్స్ ఉత్తీర్ణులకు ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ తదితరాలకు ఎకనామిక్స్ కోర్సులను అందించడంలో మంచి పేరుంది.

హాస్పిటాలిటీ కెరీర్స్

హెచ్‌ఈసీ విద్యార్థులు టూరిజం అండ్ హాస్పిటాలిటీ విభాగాల్లో..బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, బ్యాచిలర్ ఆఫ్ హాస్పిటాలిటీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరే వీలుంది. జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో బీహెచ్ఎంలో అడుగుపెడితే చక్కటి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇందుకోసం ఎన్‌సీహెచ్ఎంసీటీ నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ఫారెన్ లాంగ్వేజెస్

హెచ్‌ఈసీ విద్యార్థులకు సత్వర ఉపాధికి మార్గం .. ఫారెన్ లాంగ్వేజెస్. ప్రస్తుతం దాదాపు అన్ని రంగాల్లోని కంపెనీలు విదేశీ సంస్థలతో ఒప్పందాల ఆధారంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీంతో సదరు విదేశీ సంస్థలతో సంప్రదింపులు నిర్వహించేందుకు సంబంధిత భాష నిపుణుల కోసం అన్వేషిస్తున్నాయి. ముఖ్యంగా జపనీస్, స్పానిష్, జర్మనీ, చైనీస్, ఫ్రెంచ్ వంటి ఫారెన్ లాంగ్వేజ్ నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. ఐటీ, ఫార్మా, టూరిజం, కన్సల్టింగ్ సంస్థల్లో కొలువులు దక్కించుకోవచ్చు. హైదరాబాద్‌లోని ఇఫ్లూ సహా పలు యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు ఆయా విదేశీ భాషల్లో సర్టిఫికెట్, బ్యాచిలర్, పీజీ స్థాయి వరకు కోర్సులను అందిస్తున్నాయి.

ఉద్యోగావకాశాలు

హెచ్‌ఈసీ అర్హతతోనే ఉద్యోగావకాశాలు కూడా సొంతం చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) నిర్వహించే కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత ఆధారంగా.. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–సి ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు.

ఎన్‌డీఏతో.. డిగ్రీ+ఉద్యోగం

హెచ్‌ఈసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో అద్భుత అవకాశం.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఎగ్జామినేషన్. ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి.. ఇండియన్ మిలటరీ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకుంటే..ఆర్మీలో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు అధికారిగా కెరీర్ ప్రారంభించొచ్చు. శిక్షణ సమయంలోనే ఎన్‌డీఏ క్యాడెట్ ట్రైనీలకు అకడమిక్ తరగతులు నిర్వహించి జేఎన్‌యూ నుంచి బీఏ డిగ్రీ కూడా అందిస్తారు. అంటే.. ఎన్‌డీఏలో అడుగుపెడితే ఒకే సమయంలో ఇటు డిగ్రీ సర్టిఫికెట్, అటు ఉద్యోగం రెండూ సొంతమవుతాయి. మరోవైపు హెచ్‌ఈసీతో బీఏలో చేరి.. ఆ తర్వాత కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్ఈ)లో ఉత్తీర్ణత ఆధారంగా.. త్రివిధ దళాల్లోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ, మిలటరీ అకాడమీల్లో అడుగు పెట్టొచ్చు.

కంప్యూటర్ స్కిల్స్

ప్రస్తుతం అన్ని సంస్థలు ఆన్‌లైన్ లేదా కంప్యూటర్స్ ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కింది స్థాయిలో రికార్డ్స్ నిర్వహణ నుంచి ఉన్నత స్థాయిలో క్లౌడ్ సర్వీసెస్ వరకూ.. అన్నింటికీ కంప్యూటర్ కీలకంగా మారింది. కాబట్టి హెచ్‌ఈసీ విద్యార్థులు ఎంఎస్ ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్, కంప్యూటర్ ఆపరేటింగ్ స్కిల్స్ పెంచుకుంటే ప్రైవేట్ రంగంలో కొలువులు దక్కించుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లిష్

హెచ్‌ఈసీ విద్యార్థులు జాబ్ మార్కెట్లో ముందంజలో నిలిచేందుకు దోహదం చేసే మరో నైపుణ్యం.. స్పోకెన్ ఇంగ్లిష్. ఆంగ్లంలో ధారాళంగా మాట్లాడే స్కిల్ ఉంటే.. బీపీఓ, బీపీఎం, ఇతర ఔట్ సోర్సింగ్ విభాగాల్లో సైతం కొలువులు సొంతం చేసుకోవచ్చు.

ఎస్ఈఓ సర్టిఫికేషన్

వందల సంఖ్యలో సంస్థలు, వేల సంఖ్యలో ఉత్పత్తులు అందుబాటులో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో వినియోగదారులు బెస్ట్ ప్రొడక్ట్స్, వాటి వివరాల కోసం వెబ్‌సైట్స్‌పై ఆధారపడటం సర్వ సాధారణంగా మారింది. ఒక ప్రొడక్ట్ లేదా సర్వీస్ పరంగా తమ సంస్థ వివరాలు సెర్చ్ ఇంజన్‌లో ముందు వరుసలో కనిపించే విధంగా చేసే నైపుణ్యాలు అందించే కోర్సు.. సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్. దీనిపై అవగాహన పెంచుకోవడం ద్వారా కొలువులు దక్కించుకునే వీలుంది.

క్లుప్తంగా...

8 యూఎల్బీలకు 'ప్రత్యేక' పాలన పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎనిమిది నగర, పురపాలకసంస్థలు, నగర పంచాయతీల్లో (యూఎల్బీల్లో) ప్రత్యేకాధికారుల పాలనను ప్రభుత్వం మరో ఆరునెలలు పొడిగించింది. ఈ మేరకు బుధవారం పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక పాలన పొడిగించిన యూఎల్బీల్లో రాజాం, రాజమహేంద్రవరం, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, గుడివాడ, గూడూరు ఉన్నాయి. వీటిలో ప్రత్యేకాధికారుల పదవీకాలం మే 6వ తేదీతో ముగిసింది. దీంతో రాజాంకు చీపురుపల్లి ఆర్డీవో, రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు తూర్పు గోదావరిజిల్లా కలెక్టర్, భీమవరానికి పశ్చిమ గోదావరిజిల్లా కలెక్టర్, తాడేపల్లిగూడెం, పాలకొల్లుకు భీమవరం ఆర్డీవో, తణుకుకు నరసాపురం సబ్ కలెక్టర్, గుడివాడకు కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్, గూడూరుకు స్థానిక ఆర్డీవోను ప్రత్యేకాధికారులుగా నియమించారు.

అన్నమయ్య యూడీఏ పరిధి విస్తరణ

సాక్షి, అమరావతి: అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అనుడ) పరిధికి మరో 137 గ్రామాలను చేర్చారు. ఈ యూడీఏ పరిధిని విస్తరిస్తూ పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో వైఎస్సార్ కడప జిల్లాలోని 111 గ్రామాలు, అన్నమయ్య జిల్లాలోని 26 గ్రామాలు కలిపి కొత్తగా మొత్తం 137 గ్రామాలను విలీనం చేశారు. దీంతో 'అనుడ' పరిధి మరో 1120.24 చ.కి.మీ పెరిగి, 14,182.27 చ.కి.మీకి చేరినట్టయింది.

జంట హత్యల నిందితుడు ఆత్మహత్య


రామారావు (ఫైల్)

సారవకోట: శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం కోదడ్డపనస గ్రామంలో మంగళవారం ఇద్దర్ని హత్య చేసిన ముద్దాడ రామారావు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదడ్డపనసకు చెందిన ముద్దాడ రామారావు(32) వివాహేతర సంబంధం నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వెలమల ఎర్రమ్మ, ముద్దాడ సంతోష్‌లను మంగళవారం హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు హత్యలు చేసి పొలాల్లోంచి నడుచుకుంటూ వెళ్లిన రామారావు.. తొగిరి పంచాయతీ కొమ్మవలస సమీపంలో ఊరచెరువు వద్ద పంట పొలాల్లో తాను హత్యలకు వాడిన కత్తితోనే గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నిందితుడి సెల్ సిగ్నల్స్ ఆధారంగా వెతుకుతూ మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి పెద్దన్నయ్య గణపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూన్ 1 వరకూ అరుణ్ పిళ్లై కస్టడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో హైదరాబాద్ వ్యాపారి అరుణ్ పిళ్లైకస్టడీని జూన్ 1 వరకూ పొడిగిస్తున్నట్లు రౌజ్ అవెన్యూ కోర్టు పేర్కొంది. గత కస్టడీ ముగియడంతో ఈడీ అధికారులు బుధవారం పిళ్లైను ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ ఎదుట హాజరుపరిచారు. దర్యాప్తు కీలక దశలో ఉందని, కస్టడీ పొడిగించాలని ఈడీ తరపు న్యాయవాది కోరారు. అనంతరం కస్టడీని జూన్ 1 వరకూ పొడిగిస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. మరోవైపు, పిళ్లై బెయిలు కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను మే 18న విచారిస్తామని ఆయన తెలిపారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకు అర్బన్: అకాల వర్షాల సమయంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా వ్యవహరించి రైతులకు డబ్బులు జమ చేసిందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మునిసిపల్ కార్యాలయంలో బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధి, ప్రణాళికతో వ్యవహరించి తడిసిన ధాన్యాన్ని కూడా ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయించారని చెప్పారు.

రైతులకు రూ.5,600 కోట్లు ఎగ్గొట్టిన చరిత్ర నీది చంద్రబాబూ..

నువ్వు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు అందాల్సిన రూ.5,600 కోట్లు ఎగ్గొట్టిన చరిత్ర నీది కాదా చంద్రబాబూ.. అని మంత్రి ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక 31.87 లక్షల మంది రైతుల దగ్గర నుంచి 3 కోట్ల 27 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేసినట్లు తెలిపారు. ఈ మూడున్నరేళ్లలో రైతులకు రూ.57,140 కోట్ల ధాన్యం సొమ్ములు జమచేసినట్లు చెప్పారు. పోరుబాట పేరుతో ప్రజల మధ్యకు వచ్చిఏం చెప్పగలవని ప్రశ్నించారు. ఇప్పుడు రైతుల వద్దకొచ్చి మొసలి కన్నీరు కార్చేందుకు చంద్రబాబు సిద్ధమవుతున్నారని ఆయన దుయ్యబట్టారు.

ఏనుగుల లెక్క తేలుద్దాం

- దక్షిణాది రాష్ట్రాల వ్యాప్తంగా లెక్కింపు
- మన రాష్ట్రంలో కౌండిన్య అభయారణ్యం, ఎస్వీ నేషనల్ పార్క్, శేషాచలం ప్రాంతంలో గణన
- మూడు విధాలుగా లెక్కింపునకు ప్రణాళిక

ఈ నెల 17 నుంచి 3 రోజులపాటు ఏనుగుల గణన



సాక్షి, అమరావతి: దక్షిణాది రాష్ట్రాల్లో ఏనుగుల లెక్క తేల్చేందుకు ఆయా రాష్ట్రాల అటవీ శాఖలు సిద్ధమయ్యాయి. ఈ నెల 17వ తేదీ నుంచి 3 రోజులపాటు ఏనుగుల గణన చేపట్టనున్నారు. మన రాష్ట్రంలోని కౌండిన్య ఏనుగుల అభయారణ్యం, శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్, శేషాచలం అటవీ ప్రాంతాల్లో లెక్కింపు చేపట్టనున్నారు. చిత్తూరు జిల్లా పలమనేరు అటవీ ప్రాంతంలో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంది. తమిళనాడు సరిహద్దుల నుంచి ఈ ప్రాంతంలోకి ఏనుగులు వస్తుండటంతో వాటి కోసం చాలాకాలం క్రితం కౌండిన్య అభయారణ్యాన్ని నెలకొల్పారు. శేషాచలం అడవులు, ఎస్వీ నేషనల్ పార్క్‌లోనూ ఏనుగులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో సుమారు 175 ఏనుగులు ఉన్నట్టు అంచనా వేశారు. తాజా లెక్కింపు పూర్తయితే వాటి సంఖ్య పెరిగిందా.. తగ్గిందా అనేది తేలుతుంది.

ఒకేసారి ఎందుకంటే..!

ఏనుగులు నీటి లభ్యతను బట్టి ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సంచరిస్తూ ఉంటాయి. ఈ క్రమంలోనే అవి ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రంలోకి ప్రవేశించి అటూఇటూ తిరుగుతూ ఉంటాయి. దీంతో రాష్ట్రాల వారీగా లెక్కింపు చేపట్టినప్పుడు రెండుచోట్లా వాటిని లెక్కించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అటవీ సరిహద్దులు ఉన్న రాష్ట్రాల్లో ఒకేసారి లెక్కింపు జరపాలని నిర్ణయించారు. అందులో భాగంగానే దక్షిణ భారతదేశంలోని కర్ణాటక, కేరళ, ఏపీ, తమిళనాడు, గోవా, మహారాష్ట్రలోని కొంత ప్రాంతంలో ఒకేసారి ఈ నెల 17, 18, 19 తేదీల్లో లెక్కింపు జరపనున్నారు.

లెక్క.. పక్కా..!

ఇందుకోసం కర్ణాటక అటవీ శాఖ రూపొందించిన మోడల్‌ను అనుసరిస్తున్నారు. అక్కడ ఏనుగుల సంఖ్య వేలల్లో ఉండటంతో చాలా జాగ్రత్తగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధానంలో మన రాష్ట్రంలో లెక్కింపు నిర్వహించడానికి అటవీ శాఖ సిద్ధమైంది. మొదటి రోజు 17వ తేదీన అటవీ ప్రాంతంలోని బ్లాకుల పరిధిలో బీట్ల వారీగా 5 చదరపు కిలోమీటర్ల పరిధిలో 15 కిలోమీటర్లు తిరిగి లెక్కింపు జరపనున్నారు. ఇందుకోసం బీట్ల వారీగా ఇద్దరు, ముగ్గురితో బృందాలు ఏర్పాటు చేశారు. రెండవ రోజు నిర్దేశించిన రెండు కిలోమీటర్ల ప్రాంతంలో తిరిగి ఏనుగుల గుంపులను బట్టి లెక్కింపు జరుపుతారు. మూడవరోజు చెరువులు, మైదానాల్లో నేరుగా ఏనుగుల గుంపుల వద్దకెళ్లి వాటి ఫొటోలు తీసి లెక్కిస్తారు. గుంపులో పెద్దవైన ఆడ, మగ ఏనుగులు.. ఆ తర్వాత పెద్దవైన మగ, ఆడ ఏనుగులు.. పిల్లలు, దంతాలు లేని ఏనుగులు (మఖనా), గుంపు నుంచి వేరుపడిన ఒంటరి ఏనుగులుగా వాటిని వర్గీకరించి లెక్కింపు చేపట్టనున్నారు.

ప్రణాళికాబద్ధంగా లెక్కింపు

> దక్షిణాది రాష్ట్రాలతో కలిసి ఒకేసారి ఏనుగుల లెక్కింపును ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నాం. ఇందుకోసం పక్కా ప్రణాళిక సిద్ధం చేశాం. మూడు విధాలుగా లెక్కింపు నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.
> – శాంతిప్రియ పాండే, ఏపీ సీసీఎఫ్ (వైల్డ్ లైఫ్), ఏపీ అటవీ శాఖ

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- ఐదుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులపై పోక్సో కేసు
- అల్లూరి సీతారామరాజు జిల్లా జడ్డంగిలో ఘటన

రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా): పదో తరగతి విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఐదుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన పూర్తి వివరాలిలా ఉన్నాయి.. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం జడ్డంగి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చదల సన్యాసిరెడ్డి, గుమ్మిడి నాగరాజు, పల్లాల గోపాలరావు, మఠం శాంతిబాబు, జీడెం సత్యనారాయణ గత కొంత కాలంగా పదో తరగతి విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నారు. రెండు నెలల క్రితం పెద్దాపురానికి చెందిన పడాల ట్రస్ట్.. పాఠశాలలో 'గుడ్ టచ్-బ్యాడ్ టచ్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించింది. ఆ సమయంలో కొంత మంది విద్యార్థినులు తమను ఉపాధ్యాయులు లైంగికంగా వేధిస్తున్నారంటూ లిఖితపూర్వకంగా ట్రస్ట్ నిర్వాహకులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ట్రస్ట్ సభ్యులు విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్, కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. వారి ఆదేశాల మేరకు విద్యాశాఖకు చెందిన డివిజన్ స్థాయి అధికారులు అత్యంత గోప్యంగా విద్యార్థినులను విచారించారు. దర్యాప్తులో ఉపాధ్యాయుల లైంగిక వేధింపులు వాస్తవమేనని తేలడంతో ఐదుగురు ఉపాధ్యాయులను డీఈవో సలీం బాషా సస్పెండ్ చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్పీ తుహిన్ సిన్హా.. రాజవొమ్మంగి సీఐ బాజీలాల్, ఎస్‌ఐ షరీఫ్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఐదుగురి ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

చిన్నారిని మింగేసిన స్విమ్మింగ్ పూల్

- ఈత నేర్చుకునేందుకు వెళ్లి ఎనిమిదేళ్ల బాలుడు మృతి
- ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న తమ్ముడు


పవన్ (ఫైల్)

మునగపాక/అనకాపల్లి టౌన్: ముక్కుపచ్చలారని చిన్నారి ఈత నేర్చుకునేందుకు వెళ్లి మృత్యువాత పట్టాడు. మరో చిన్నారి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. అనకాపల్లిలో బుధవారం సాయంత్రం ఈ విషాదం చోటు చేసుకుంది. జిల్లా మునగపాక మండలం అరబుపాలెం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రాపేటి గంగునాయుడు (చంటి), భార్య మాధవి దంపతులకు పవన్ (8), చరణ్ (7) సంతానం. వేసవి సెలవులు కావడంతో పిల్లలిద్దరికీ ఈత నేర్పించేందుకు అనకాపల్లి బైపాస్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్‌కు తీసుకెళ్లి శిక్షణ నిమిత్తం బుధవారం చేర్పించారు. పిల్లలిద్దరూ తొలి రోజున స్విమ్మింగ్ పూల్‌లోకి దిగి ఈత కొడుతుండగా.. మునిగిపోతున్నట్టు గుర్తించిన తండ్రి వారిని పైకి తీసి హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పెద్దకుమారుడు పవన్ మృతిచెందగా.. చిన్న కుమారుడు చరణ్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. పవన్ మృతదేహాన్ని ఎస్‌ఐలు దివాకర్, సత్యనారాయణ, ఎస్.ప్రసాద్ పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు.

విదేశీ విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- గిరిజన విద్యార్థులకు మంత్రి బొత్స పిలుపు
- స్కూల్, కాలేజీ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల


సెట్ ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గిరిశిఖర గ్రామాల్లోని గిరిజన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న విదేశీ విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని ప్రతిభా పాఠశాలలు (స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్), కళాశాల (కాలేజీ ఆఫ్ ఎక్స్‌లెన్స్)ల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలను బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరతో కలిసి బొత్స విడుదల చేశారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి 8వ తరగతిలో 190 సీట్లకు 878 మంది, ఇంటర్మీడియెట్‌లో 450 సీట్లకు 3,548 మంది ప్రవేశపరీక్ష రాశారని చెప్పారు. విద్యార్థులకు వచ్చిన ర్యాంకుల ఆధారంగా సీట్లను కేటాయిస్తామన్నారు. ఐఐటీ, మెడికల్ సీట్ల లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో ప్రారంభించిన ప్రతిభా పాఠశాలలు, కళాశాలల్లో చదువుకున్న గిరిజన విద్యార్థులు పలు ఐఐటీలు, ఎన్‌ఐటీలు, మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధిస్తున్నారని అభినందించారు. ప్రతిభావంతులకు విదేశీ ఉన్నత విద్యావకాశాలనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్నారని వివరించారు. ఇప్పటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకొని గిరిజన విద్యార్థులు ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బొత్స, రాజన్నదొర సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకులాల సంస్థ సంయుక్త కార్యదర్శి ఎస్.రమణమూర్తి, ఉప కార్యదర్శి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులపై భారం పడనీయకండి

- కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి డిప్యూటీ సీఎం అంజాద్ బాషా విజ్ఞప్తి
- ఒకవేళ అదనపు భారం పడితే రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది


కేంద్ర మంత్రి స్మృతి ఇరానీతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఎంపీ మిథున్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ/కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ హజ్ యాత్రికులపై భారం పడకుండా చూడాలని కేంద్రానికి డిప్యూటీ సీఎం అంజాద్ బాషా విజ్ఞప్తి చేశారు. యాత్రికులకు అనుకూలంగా వీలైతే బయలుదేరే స్థానాలు (ఎంబార్కేషన్ పాయింట్లు) మార్చాలని కోరారు. వైఎస్సార్‌సీపీ లోక్‌సభా పక్ష నేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజాం, సభ్యులు ఇబదుల్లా, ఖాదర్ తదితరులతో కలిసి అంజాద్ బాషా బుధవారం కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి స్మృతి ఇరానీతో భేటీ అయ్యారు. హజ్ యాత్రికుల సమస్యలపై ఆమెకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అంజాద్ బాషా మీడియాతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరిన వెంటనే విజయవాడలో హజ్ యాత్రికులకు కేంద్రం ఎంబార్కేషన్ పాయింటు ఏర్పాటు చేసిందని చెప్పారు. ఇందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. హైదరాబాద్, బెంగళూరు పాయింట్ల కన్నా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి చార్జీ రూ.80 వేలు అధికంగా ఉన్న విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు. టెండర్ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఈ చార్జీల్లో మార్పు జరగకపోవచ్చని కేంద్ర మంత్రి చెప్పారన్నారు. ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో సంప్రదిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్రం నుంచి 2,300 మంది హజ్‌కు వెళ్తుండగా వీరిలో 1,982 మంది విజయవాడను ఎంబార్కేషన్ పాయింటుగా ఎంపిక చేసుకున్నారన్నారు. హజ్ యాత్రికులపై అదనంగా రూపాయి కూడా భారం పడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారన్నారు. ఒకవేళ అదనపు భారం పడేలా ఉంటే ఆ ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.

బేషరతుగా ధాన్యం కొనుగోలు చేయాలి

- జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిమాండ్
- తూతూ మంత్రంగా సాగిన పర్యటన
- కేకలు, అరుపులు.. జెండా కర్రలు విసిరిన అభిమానులు
- మాట్లాడకుండానే రాజమహేంద్రవరానికి పయనం
- నేడు ఇద్దరు రైతులు తన వద్దకు వచ్చి సమస్యలు చెప్పాలని సూచన


మీడియాతో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్

కడియం, కొత్తపేట, పి.గన్నవరం: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం బేషరతుగా కొనుగోలు చేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించారు. కొత్తపేట మండలం అవిడి గ్రామంలో మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోయి, రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ వస్తే తప్ప ఈ ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనే పరిస్థితి లేదన్నారు. రాత్రికి రాత్రి సంచులు పంపి ధాన్యం పట్టుబడి పట్టించిందన్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించే వరకు పోరాడతామని చెప్పారు. కాగా, గ్రామంలోని కట్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద దిబ్బలపై పలువురు రైతులు ఆరబోసుకున్న ధాన్యం రాసులను పరిశీలించేలా ఆ పార్టీనేతలు కార్యక్రమాన్ని రూపొందించారు. అయితే పవన్ ఎంతసేపటికీ రాకపోవడంతో పలువురు రైతులు బరకాలు కప్పి వెళ్లిపోయారు. తీరా రాత్రి 7 గంటలకు వచ్చి, బరకాలు కప్పని ఇద్దరు రైతుల ధాన్యాన్ని పరిశీలించారు. అంతకుముందు రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు, రాజవోలు మీదుగా కడియం ఆవకు చేరుకున్నారు. అక్కడ రైతులతో కాసేపు మాట్లాడారు. తర్వాత వేమగిరి మీదుగా కడియపులంక చేరుకున్నారు. రాత్రి పి.గన్నవరం మండలం రాజులపాలెంలో అభిమానులు బిగ్గరగా కేకలు వేస్తూ, పార్టీ జెండాలు, ఎర్ర కండువాలు పవన్‌పైకి విసరడంతో ఆయన మాట్లాడకుండానే రాజమహేంద్రవరానికి వెళ్లి పోయారు. ఇద్దరు రైతులు గురువారం రాజమహేంద్రవరం వచ్చి తనకు సమస్య వివరించాలని చెప్పారు.

• తెలంగాణ

రూ.1.32 కోట్ల విలువైన బంగారం పట్టివేత

శంషాబాద్ విమానాశ్రయంలో స్వాధీనం

శంషాబాద్ (హైదరాబాద్): విదేశాల నుంచి తీసుకొచ్చిన అక్రమ బంగారాన్ని ఎయిర్‌పోర్టులో దేశీయ ప్రయాణికుడి ద్వారా తరలిస్తుండగా డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు పట్టుకున్నారు. మంగళవారం రాత్రి ముందస్తు సమాచారం మేరకు డీఆర్‌ఐ అధికారులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి చెన్నై వెళ్తున్న అనుమానిత ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని పరిశీలించారు. అతని వద్ద 2013 గ్రాముల బరువు కలిగిన క్యాప్సూల్‌లో పేస్టు రూపంలో ఉన్న బంగారం బయటపడింది. అరబ్ దేశం నుంచి వచ్చిన ప్రయాణికుడు తనకు దేశీయ డిపార్చర్ కేంద్రంలో అప్పగించినట్లు విచారణలో నిందితుడు వెల్లడించాడు. బంగారం విలువ రూ.1.32 కోట్లు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత వాటాలే

కృష్ణా జలాల పంపిణీపై తేల్చేసిన బోర్డు


సమావేశంలో పాల్గొన్న అధికారులు

సాక్షి, అమరావతి: కృష్ణా జలాలను 2023–24 నీటి సంవత్సరంలో పాత పద్ధతిలోనే ఏపీకి 66 శాతం (512 టీఎంసీలు), తెలంగాణకు 34 శాతం (299 టీఎంసీలు) చొప్పున పంపిణీ చేస్తామని కృష్ణా బోర్డు తేల్చి చెప్పింది. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే కేంద్ర జల్ శక్తి శాఖ లేదా అపెక్స్ కౌన్సిల్ దృష్టికి తేవాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. కృష్ణా జలాల్లో తమకు 50 శాతం వాటా కావాలన్న తెలంగాణ సర్కార్ డిమాండ్‌ను తోసిపుచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపుల ఆధారంగా తెలుగు రాష్ట్రాలకు 66:34 నిష్పత్తిలో నీటిని పంపిణీ చేస్తూ 2015 జూన్ 19న కేంద్ర జల్ శక్తి శాఖ నిర్దేశించిన తాత్కాలిక సర్దుబాటునే కొనసాగించాలన్న ఏపీ ప్రభుత్వ వినతిని కృష్ణా బోర్డు ఆమోదించింది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు వెలువడే వరకూ పాత పద్ధతిలోనే నీటిని పంపిణీ చేయాలన్న వాదనతో బోర్డు ఏకీభవించింది. కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని బోర్డు కార్యాలయంలో బుధవారం 17వ సర్వ సభ్య సమావేశం జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు మొదలైన సమావేశం సాయంత్రం 4 గంటల వరకూ వాడివేడిగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, తెలంగాణ సర్కార్ తరపున నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఈఎన్‌సీ మురళీధర్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పంపిణీపై పాత వాదనే..

గతేడాది తరహాలోనే కృష్ణా జలాలను పంపిణీ చేయాలని కృష్ణా బోర్డును ఏపీ అధికారులు కోరడంపై తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలకు చెరి సగం పంపిణీ చేయాలని డిమాండ్‌ను ఏపీ అధికారులు వ్యతిరేకించారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల ఆధారంగా ఏపీ వాటా 70 శాతమని గుర్తు చేశారు. తెలంగాణ సర్కార్ చిన్న నీటిపారుదల విభాగంలో వాడుకుంటున్న 175 టీఎంసీలను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఏపీ వాటా 80 శాతం అవుతుందన్నారు. అయినప్పటికీ రాజీ పడి 66 శాతానికే అంగీకరించి తాత్కాలిక సర్దుబాటుపై సంతకం చేశామన్నారు.

సుప్రీం కోర్టు, ట్రిబ్యునల్ తీర్పులకు కట్టుబడతాం..

ఎలాంటి నీటి కేటాయింపులు లేకున్నా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీలను కేటాయిస్తూ తెలంగాణ సర్కార్ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని ఏపీ అధికారులు డిమాండ్ చేశారు. నీటి కేటాయింపులు లేని నేపథ్యంలో ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ వెనక్కి పంపిందని తెలిపారు. దీనిపై తెలంగాణ అధికారులు స్పందిస్తూ సుప్రీం కోర్టు, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లో విచారణ కొనసాగుతున్నందున ఆ తీర్పులకు కట్టుబడి ఉంటామన్నారు.

సుంకిశాల.. సీమ ఎత్తిపోతల

హైదరాబాద్ తాగునీటి పథకం పేరుతో సాగర్ జల విస్తరణ ప్రాంతంలో అక్రమంగా సుంకిశాల ఇన్‌టేక్ వెల్ ప్రాజెక్టును తెలంగాణ చేపట్టడంపై ఏపీ అధికారులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. సాగర్‌లో నీటి మట్టం తగ్గిపోవడం వల్ల హైదరాబాద్‌కు తాగునీటిని సరఫరా చేయలేకపోతున్నామని, నిర్దేశిత 16.5 టీఎంసీలను మాత్రమే సుంకిశాల ఇన్‌టేక్ వెల్ ద్వారా వాడుకుంటామని తెలంగాణ అధికారులు చెప్పారు. ఆ ప్రాజెక్టు డీపీఆర్ ఇవ్వాలని ఏపీ అధికారులు కోరారు. నీటి కేటాయింపులను సమర్థంగా వినియోగించుకునేందుకు తాము చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతలకు సహకరించాలని కోరగా తెలంగాణ అధికారులు మౌనం దాల్చారు.

ఆర్డీఎస్‌పై సీడబ్ల్యూపీఆర్‌ఎస్‌తో అధ్యయనం..

ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీం) చివరి ఆయకట్టు భూములకు నీళ్లందించేందుకు వీలుగా ఆధునికీకరణకు అనుమతి ఇవ్వాలని తెలంగాణ అధికారులు కోరగా సీడబ్ల్యూపీఆర్‌ఎస్ (సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్) అధ్యయన నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ చెప్పారు. ఆర్డీఎస్ కుడి కాలువను అక్రమంగా చేపట్టారని తెలంగాణ అధికారులు పేర్కొనడంపై ఏపీ అధికారులు అభ్యంతరం తెలిపారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఆర్డీఎస్ కుడి కాలువకు 4 టీఎంసీలు కేటాయించిందని, ట్రిబ్యునల్ తీర్పు నోటిఫై అయ్యాక కాలువ పనులు చేపడతామని స్పష్టం చేయడంతో తెలంగాణ అధికారులు మౌనం వహించారు. శ్రీశైలం కనీస నీటి మట్టం 854 అడుగులలో నీటి నిల్వలు లేకున్నా, వరద ప్రవాహం ప్రారంభం కాకున్నా తెలంగాణ సర్కార్ విద్యుదుత్పత్తి చేస్తూ తమ హక్కులను కాలరాస్తున్నా బోర్డు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఏపీ అధికారులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. జలవిద్యుదుత్పత్తిపై ఆర్‌ఎంసీతో అధ్యయనం చేపట్టి నిబంధనలు రూపొందిస్తామని బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ చెప్పారు. సాగర్ ఎడమ కాలువలో ప్రవాహ నష్టాలను అంచనా వేసేందుకు రెండు రాష్ట్రాల ఎస్‌ఈల నేతృత్వంలోని కమిటీతో అధ్యయనం చేయాలన్న ఏపీ ప్రతిపాదనకు బోర్డు అంగీకరించింది.

ఇప్పటికైనా ఏకాభిప్రాయం కుదిరేనా?

ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్ రూల్ కర్వ్స్ (నిర్వహణ నియమావళి) ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్ అమలు, జల విద్యుదుత్పత్తి నిబంధనలు, వరద సమయంలో మళ్లించిన జలాలను కోటాలో కలపాలా? వద్దా? అనే అంశాలపై గత సర్వ సభ్య సమావేశంలో బోర్డు సభ్యుడు ఆర్కే పిళ్లై అధ్యక్షతన ఆర్‌ఎంసీ (జలాశయాల నిర్వహణ కమిటీ) ఏర్పాటైంది. రెండు రాష్ట్రాల అధికారులతో చర్చించిన ఆర్‌ఎంసీ నివేదికను రూపొందించింది. దీన్ని అంగీకరిస్తూ ఏపీ అధికారులు సంతకం చేయగా తెలంగాణ అధికారులు చివరి నిమిషంలో అడ్డం తిరిగారు. ఈనేపథ్యంలో గెజిట్ నోటిఫికేషన్ అమలే లక్ష్యంగా బోర్డుసభ్యులు అజయ్‌కుమార్‌గుప్తా అధ్యక్షతన రెండురాష్ట్రాల ఈఎన్‌సీలు, జెన్‌కో డైరెక్టర్లు సభ్యులుగా ఆర్‌ఎంసీని బోర్డు చైర్మన్ పునరుద్ధరించారు. నెలలోగా రూల్ కర్వ్స్, జలవిద్యుదుత్పత్తి నిబంధనలు, వరద జలాల మళ్లింపుపై నివేదిక ఇవ్వాలని ఆర్‌ఎంసీని ఆదేశించారు.

పాత విధానం ప్రకారమే పంపిణీ

> ప్రాజెక్టుల వారీగా బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపుల ఆధారంగానే ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలను పంపిణీ చేస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ 2015లో తాత్కాలిక సర్దుబాటు చేసింది. ఇందుకు అంగీకరిస్తూ ఇరు రాష్ట్ర ప్రభుత్వాల తరపున అధికారులు సంతకాలు చేశారు. రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపిణీ బాధ్యతను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్రం అప్పగించింది. ట్రిబ్యునల్ తీర్పు వెలువడే వరకూ పాత పద్ధతిలోనే కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయాలి. కృష్ణా జలాల్లో తమకు 50 శాతం వాటా కావాలని తెలంగాణ కోరడం అసంబద్ధం.
> – శశిభూషణ్‌కుమార్, ఏపీ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి

చెరి సగం పంచాలి

> కృష్ణా జలాల్లో తెలంగాణకు 50 శాతం వాటా ఇవ్వాలి. 2015లో కేంద్రం చేసిన తాత్కాలిక సర్దుబాటు 2015–16 నీటి సంవత్సరానికి మాత్రమే. పాత పద్ధతిలో కృష్ణా జలాలను పంపిణీ చేస్తే అంగీకరించం. ఈ అంశాన్ని కేంద్ర జల్ శక్తి శాఖ దృష్టికి తీసుకెళతాం.
> – రజత్‌కుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల శాఖ

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 11 । మే । 2023

I



బందరు డీఎస్పీగా మాధవరెడ్డి
కోనేరుసెంటర్: బందరు డీఎస్పీగా వై.మాధవరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురంలో పనిచేస్తున్న ఆయనను మచిలీపట్నం బదిలీ చేశారు.



కిల్కారి సేవలు పరిశీలన
పెనమలూరు: కిల్కారి సేవలను వినియోగించుకొని మాతాశిశు మరణాలు నివారించాలని కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు మధుసూదన్, కుమార్ తెలిపారు.



రైతులకు న్యాయం చేస్తాం..
అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు న్యాయం చేస్తామని అగ్రికల్చర్, మార్కెటింగ్ కమిషనర్ రాహుల్‌పాండే తెలిపారు. -IIలో▸

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు బుధవారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. గుంటూరు మొహిద్దీన్‌పాలెంకు చెందిన కె.దుర్గారావు, ఉమాశైలజ అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేశారు. ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందించారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు సమర్పించారు.

సెబ్ అడిషనల్ ఎస్పీగా రాహుల్



కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీగా పీఎస్ రాహుల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రూపు -1 ద్వారా సెలెక్ట్ అయి ట్రైనింగ్ నిమిత్తం ఆయన కృష్ణా జిల్లాకు వచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ పి.జాషువాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

సీఎం బహిరంగ సభ స్థల పరిశీలన



మచిలీపట్నంటౌన్: ఈ నెల 22వ తేదీన బందరు పోర్టు పనుల ప్రారంభానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరంలో నిర్వహించే బహిరంగ సభ స్థలాన్ని ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం బుధవారం పరిశీలించారు. కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ పి.జాషువాతో కలిసి నోబుల్ కళాశాల మైదానంతో పాటు పోలీస్ పరేడ్ గ్రౌండ్ సందర్శించారు. ఈ రెండు ప్రాంతాల్లో సీఎం బహిరంగ సభకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేయనున్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి అడ్మిషన్లు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరేందుకు అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టామని ఎన్టీఆర్ జిల్లా ఐటీఐ అడ్మిషన్ల కన్వీనర్ ఎం.కనకారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు వచ్చే నెల 6 తేదీలోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసే సమయంలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్ సమయంలో అభ్యర్థి దరఖాస్తులో వివరాలు సక్రమంగా లేకపోతే అడ్మిషన్ పొందుటకు అనర్హులని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు విజయవాడ రమేష్ ఆసుపత్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నేరుగా కానీ, 94906 39639, 77804 29468 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

యార్డులో 88,049 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు) : గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 81,023 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 88,049 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ. 5,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 52,178 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

పేదల పట్టాభిషేకానికి సర్వం సిద్ధం

- ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు
- కురగల్లు, నిడమర్రు, మందడంలో శరవేగంగా లేఅవుట్ల అభివృద్ధి పనులు
- ఈ నెల 15 వ తేదీ నాటికి పనులు పూర్తి
- సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీ



కురగల్లు గ్రామంలో సిద్ధం చేస్తున్న లేఅవుట్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సీఆర్‌డీఏ పరిధిలో నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు సర్వం సిద్ధం అవుతోంది. విజయవాడ తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఇప్పటికే ఇంటి పట్టాలు మంజూరు చేశారు. కోర్టులో రైతుల వివాదం ముగిసాక పట్టాలు ఇస్తామని, ఇంతకు మునుపే హామీ పత్రాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇచ్చిన హామీ నెరవేర్చబోతున్నారు. అమరావతి ప్రాంతంలోని మందడం, కురగల్లు, నిడమర్రు ప్రాంతాల్లో ఇంటి స్థలాలు ఇస్తున్నారు. ఈ మూడు ప్రాంతాల్లో 11 లేఅవుట్లను ఏర్పాటు చేస్తున్నారు. హైకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ప్రభుత్వం స్థలాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆలస్యం లేకుండా లేఅవుట్ల అభివృద్ధి పనులు చేస్తున్నారు. కలెక్టర్ ఢిల్లీరావు దృష్టి సారించి ప్రత్యేక బృందాల పర్యవేక్షణలో పనుల వేగం పెంచారు. లేఅవుట్ ప్రాంతాల లెవలింగ్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. లబ్ధిదారులకు ఇచ్చే ప్లాట్లకు మార్కింగ్‌తో పాటు స్టోన్ ప్లాంటేషన్ సైతం చేస్తున్నారు. సామాజిక అసమతుల్యత, పేదలు అమరావతిలో నివసించే అవకాశం లేదని దుర్మార్గంగా వ్యవహరించిన టీడీపీ నాయకులకు తగిన బుద్ధి చెప్పేలా కోర్టు తీర్పు ఇవ్వడంతో లబ్ధిదారులైన పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ కార్పొరేషన్ పరిధిలో 20,684 మంది పేదలకు పట్టాలు మంజూరు చేశారు. తాజాగా స్థలాల కోసం నగర పరిధిలో దరఖాస్తు చేసుకున్న మరో 3511 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు అమరావతిలో ఇచ్చేందుకు వీలుగా భూమిని సిద్ధం చేశారు. ఈ మేరకు బోరుపాలెం, పిచుకులపాలెం, అనంతవరం గ్రామాల పరిధిలో 168 ఎకరాలు కేటాయించారు. ఆయా గ్రామాల్లో స్థలాలు ఇవ్వనున్నారు. సీఆర్‌డీఏ అధికారులు సైతం భూములు అప్పగింతపై ఆమోదం తెలిపారు.

లేఅవుట్లను అభివృద్ధి చేస్తున్నారిలా...

గ్రామం	విస్తీర్ణం (ఎకరాల్లో)
నిడమర్రు	487
కురగల్లు	37
మందడం	42
మొత్తం	566

శరవేగంగా లేఅవుట్ అభివృద్ధి పనులు....

లేఅవుట్ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్ , లేఅవుట్ ప్రాంతాల్లో ఉండి ప్రత్యేక బృందాల ద్వారా పనుల వేగం పెంచారు. ఇప్పటికే సీఆర్డీఏ పరిధిలో ప్లాట్ల అభివృద్ధికి టెండర్లు పిలిచారు. రూ.46 కోట్ల విలువైన పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించారు. ప్రధానంగా లేఅవుట్లలో పెగ్ మార్కింగ్ చేసి ప్లాట్లకు స్టోన్ మార్కింగ్ చేసేందుకు వీలుగా 74 ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. ఈ బృందంలో విలేజి సర్వేయర్, ప్లానింగ్ సెక్రటరీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ముగ్గురు సభ్యులు ఉంటారు. లేఅవుట్ల అభివృద్ధి ఎనిమిది ప్రత్యేక బృందాల పర్యవేక్షణలో సాగుతోంది. ఒక్కో బృందంలో తహసీల్దార్, జిల్లా అధికారి, ఈఈ ముగ్గురు అధికారులు త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. వీరికి సహాయకారులుగా టీపీఓ, సర్వేయర్, ఏఈ ఉంటారు. మొత్తం ఎనిమిది బృందాల్లో 48 మంది అధికారులు, సిబ్బంది నిరంతరం పనిచేస్తున్నారు. ఈ నెల 15వ తేదీ నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అతి త్వరలోనే పేదలకు ప్రభుత్వం స్థలాలు ఇచ్చి పట్టాభిషేకం చేయనుంది.

త్వరలోనే పట్టాలు ఇస్తాం



సీఆర్డీఏ పరిధిలోని మూడు గ్రామాల్లో విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని పేదలకు ఇంటి స్థలాలు ఇస్తున్నాం. అక్కడ ప్లాట్ల అభివృద్ధి, మార్కింగ్, స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. లే అవుట్లు పూర్తిగా తయారు చేసి త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పేదలకు ఇంటి పట్టాలు అందజేస్తాం. పట్టాల ప్రింటింగ్ పూర్తి అయింది. అధికారుల సంతకాలు సైతం సిద్ధం చేసి ఉంచాం.

– ఎస్. ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

కోర్టు తీర్పు ఆనందదాయకం



రాజధాని అమరావతి ప్రాంతంలో పేదలు ఉంటే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని టీడీపీ నాయకులు వేసిన పిటిషన్లను కొట్టివేస్తూ కోర్టు ఇచ్చిన తీర్పు ఎంతో ఆనందదాయకం. సొంత ఇంటి కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఆయన అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అనుసరించిన సామాజిక న్యాయం మరో మారు రుజువైంది. తమలాంటి పేదలు ఎప్పటికీ ఆయన వెంటే ఉంటాం.

– అబ్దుల్ రజియా, లబ్ధిదారు, విద్యాధరపురం, విజయవాడ

ఎదురు చూపులు ఫలించాయి



సొంత ఇంటి స్థలం కోసం కొన్ని నెలలుగా ఎదురు చూస్తున్న కలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాకారం చేసింది. చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనలకు న్యాయస్థానం అడ్డుకట్ట వేసి ఇచ్చిన తీర్పు ద్వారా ఇప్పటికైనా వారికి కనువిప్పు కావాలి. సీఆర్‌డీఏ పరిధిలో ఇంటి స్థలం కేటాయించటం, కోర్టు తీర్పు ద్వారా లైన్ క్లియర్ కావడంతో త్వరలో ఇంటి పట్టాలను అందుకోబోతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది.

– ఈదర రుక్మిణి, లబ్ధిదారు, భవానీపురం, విజయవాడ

నేటి నుంచి దీక్ష విరమణలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడ పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షా పీఠం దీక్షల విరమణకు సిద్ధమైంది. మూడు రాష్ట్రాల నుంచి విచ్చేసే భక్తులతో దీక్షా పీఠంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరియనుంది. మంగళవారం నుంచి సుందరకాండ పారాయణం, మన్యుసూక్త మూలమంత్ర హోమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం సుందరకాండ పారాయణం పూర్తి కాగా గురువారం నుంచి దీక్ష విరమణలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుంటున్నారు. గురువారం నుంచి 15వ తేదీ వరకు జరిగే ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 13వ తేదీ శనివారం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ జరుగుతుంది. తొలుత పీఠం నుంచి దీక్షాదారులు పవిత్ర కృష్ణానదికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరిస్తారు. కలశాలతో నదీ జలాలను తీసుకుని తిరిగి పీఠానికి చేరుకుని స్వామి వారిని అభిషేకిస్తారు. పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ చేతుల మీదగా దీక్ష విరమణలు చేస్తారు. 14వ తేదీ హనుమత్ జయంతిని పురస్కరించుకుని స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేస్తారు. 15వ తేదీ సోమవారం మహా పూర్ణాహుతితో దీక్షలు, ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. పీఠం ఆవరణలోని యాగశాలలో దీక్ష విరమణల కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు వేచి ఉండేందుకు క్యూలైన్లతో పాటు ఆలయం వెలుపల చలువ పందిళ్లు సిద్ధం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం దేవస్థానంలో ఉచిత అన్న ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మాజీ సైనికుల వినతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని మాజీ సైనికుల కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీంకు సంబంధించిన ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆంధ్రా-తెలంగాణ సబ్‌ఏరియా సికింద్రాబాద్ మేజర్ జనరల్ రాకేష్ మనోచ సందర్శించారు. అక్కడ మాజీ సైనికులకు అందిస్తున్న హెల్త్‌స్కీం గురించి, సమస్యలను ఆఫీస్ ఇన్‌చార్జి కల్నల్ రావును అడిగి తెలుసుకున్నారు. మాజీ సైనికులకు అందాల్సిన అన్ని ప్రతిఫలాలు అందేలా తన వంతు కృషి చేస్తానని మేజర్ జనరల్ రాకేష్‌మనోచ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మాజీ సైనికుల అసోసియేషన్ (నెక్సా) ప్రెసిడెంట్ జి.శివనాగేశ్వరరావు ఆధ్వర్యంలో మేజర్‌కు తమ సమస్యలపై వినతిపత్రం అందచేశారు. అనంతరం శివనాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ సైనికుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి పనికి సికింద్రాబాద్ వెళ్లాల్సి వస్తుందని, ఆ తరహాలో విజయవాడ-గుంటూరులో ఒక సబ్‌ఏరియా బ్రాంచ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. నెక్సా జనరల్ సెక్రటరీ ఉమామహేశ్వరరావు, కోశాధికారి కేవీ గుప్తా, ఎస్‌కే ఖాసీం, వల్లీ, ఎంహెచ్‌ఆర్ గుప్తా, రామాంజనేయులు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మేజర్ జనరల్ రాకేష్ మనోచకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సైనికుల అసోసియేషన్ సభ్యులు

ప్రగతి పథంలో పొదుపు సంఘాలు

- లక్ష్యాలను అధిగమిస్తూ డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రుణాలు
- సకాలంలో సున్నా వడ్డీ జమ
- వైఎస్సార్ చేయూతతో సుస్థిర జీవనోపాధుల కల్పన



కంకిపాడులో డ్వాక్రా సభ్యులకు సున్నా వడ్డీ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి (ఫైల్)

కంకిపాడు: పొదుపు సంఘాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రత్యేకించి డ్వాక్రా సంఘాల్లోని అక్కచెల్లెమ్మల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తోంది. మహిళాభివృద్ధితోనే కుటుంబాలు ఉన్నతి సాధిస్తాయనే ఉద్దేశంతో ఎన్నో విధాలుగా ప్రభుత్వం చేయూతనందిస్తోంది. సభ్యులకు సకాలంలో రుణాలు అందేలా చూడటం, సుస్థిర జీవనోపాధుల కల్పనతో ప్రగతి సాధించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమిస్తోంది. కృష్ణా జిల్లాలోని 25 మండలాల్లో 1177 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 31,834 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 3,29,539 మంది సభ్యులు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా పరిశీలిస్తే ఎస్సీ వర్గానికి సంబంధించి 9316 సంఘాల్లో 93491 మంది, ఎస్టీ వర్గానికి చెందిన 825 సంఘాల్లో 8204 మంది, బీసీలకు చెందిన 13665 సంఘాల్లో 1,43,971 మంది, మైనార్టీలకు సంబంధించి 921 సంఘాల్లో 9205 మంది, ఇతర కేటగిరీలో 7107 సంఘాల్లో 74668 మంది సభ్యులుగా ఉన్నారు.

సజావుగా...లక్ష్యాలను అధిగమిస్తూ.....

జిల్లాలో ఉన్న స్వయం సహాయ సంఘాల సభ్యులకు సజావుగా బ్యాంకుల నుంచి రుణాలు అందించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సమర్థంగా చర్యలు తీసుకుంటోంది. ఏటా నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమిస్తూ డ్వాక్రా అక్కచెల్లెళ్లకు రుణాలను అందిస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో సభ్యురాలికి గరిష్టంగా రూ.2 లక్షలు వరకూ రుణం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. 2019-20లో 23084 సంఘాలకు రూ. 691.34 కోట్లు రుణాలు లక్ష్యంగా నిర్దేశించుకోగా 20791 సంఘాలకు రూ. 848.07 కోట్లు అందించారు. 2021-22లో 19365 సంఘాలకు రూ. 699.82 కోట్లు రుణాలు లక్ష్యం కాగా, 24,291 సంఘాలకు రూ. 784.46కోట్లు అందించారు. 2021-22లో 19523 సంఘాలకు రూ. 783.98 కోట్లు లక్ష్యం కాగా, 23178 సంఘాలకు రూ.1575.37 కోట్లు రుణాలిచ్చారు. 2022-23లో 17712 సంఘాలకు రూ.735.69 కోట్లు రుణాలు లక్ష్యం కాగా, 17993 సంఘాలకు రూ.1164.57 కోట్లు అందించారు.

వడ్డీ భారం నుంచి విముక్తి

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం డ్వాక్రా అక్కచెల్లెమ్మల శ్రేయస్సు లక్ష్యంగా పనిచేస్తుంది. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ వైఎస్సార్ సున్నావడ్డీని సంఘ సభ్యులకు అందించింది. 2019-20లో 27675 సంఘాలకు రూ.20.67 కోట్లు సున్నా వడ్డీ విడుదలైంది. 2020-21లో 27675 సంఘాలకు రూ 19.04 కోట్లు, 2021-22లో 29440 సంఘాలకు రూ 24.08 కోట్లు సున్నా వడ్డీని ప్రభుత్వం జమ చేసి సభ్యులకు వడ్డీ భారం నుంచి విముక్తి కలిగించింది.

సుస్థిర జీవనోపాధుల కల్పన....

డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణాలు అందించటంతో పాటుగా సుస్థిర జీవనోపాధులను కల్పించేందుకు వైఎస్సార్ చేయూతను ప్రవేశపెట్టింది. దీని ద్వారా వచ్చే రూ.18750 మొత్తం, నాలుగేళ్లకు రూ.75 వేలు బ్యాంకుల నుంచి రుణం అందించి ఆ మొత్తంతో పాడిగేదెలు, ఇతర వ్యాపారాలు ఏర్పాటుకు అవకాశం ఇచ్చింది. 2020-21లో 98779 మంది సభ్యులకు రూ.185.21 కోట్లు, 2021-22లో 101991 మందికి రూ. 191.23 కోట్లు, 2022-23లో 98952 మందికి రూ.185.54 కోట్లు లబ్ధి చేకూర్చింది. దీంతో ఆయా కుటుంబాల ఉన్నతికి, జీవనోపాధులను మెరుగుపర్చుకునే దిశగా చర్యలు తీసుకోవటంతో రుణ ఫలాలను అనుభవిస్తూ ప్రగతి సాధిస్తున్నారు.

జీవనోపాధి మెరుగుపడింది



నేను ఎంతో కాలంగా చీరల వ్యాపారం చేస్తున్నా. ప్రస్తుతం రుణం రూ. 2 లక్షలు ఇస్తున్నారు. సున్నా వడ్డీ జమ చేస్తున్నారు. ఈ మొత్తాన్ని వ్యాపారం వృద్ధి చేసుకోవటానికి వినియోగిస్తున్నా. కుటుంబం ఆనందంగా ఉంది. రుణాలను తిరిగి సకాలంలో చెల్లిస్తుండటంతో బ్యాంకర్లు ముందుకు వచ్చి రుణాలు ఇస్తున్నారు.

వి.వెంకటలక్ష్మి, ఈడుపుగల్లు, చీరల వ్యాపారం

మహిళల అభ్యున్నతే లక్ష్యం



ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా ప్రయత్నిస్తున్నాం. ఏటా రుణాలను లక్ష్యాలకు మించి అందిస్తున్నాం. రికవరీ పర్సెంటేజ్ బావుంది. 2023-24లోనూ అన్ని సంఘాలకు రుణాలు అందేలా చూస్తాం. నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించి మహిళల అభ్యున్నతికి, కుటుంబాలు ప్రగతి సాధించే దిశగా పర్యవేక్షణ వహిస్తున్నాం.

– పి.ఎస్.ఆర్.ప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, కృష్ణా జిల్లా

ప్రజల్లోకి విస్తృతంగా జగనన్నకు చెబుదాం

కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉద్దేశాన్ని ఆయన వివరించారు. ప్రస్తుతం స్పందన కార్యక్రమం సచివాలయ స్థాయి నుంచి కలెక్టరేట్ స్థాయి వరకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్నామని చెప్పారు. 400 పైగా అర్జీలు అందుతున్నాయని తెలిపారు. స్పందనకు నేరుగా రాలేని వాళ్లు, ఆన్‌లైన్ లో అర్జీలు సమర్పించే విధానంపై అవగాహన లేకపోవడంతో చాలా మంది తమ సమస్యలు చెప్పుకోలేకపోతున్నారని తెలిపారు. 1902 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమస్య చెబితే రిజిస్టర్ అయ్యేలా ఒక వెసులుబాటు కల్పించామని వెల్లడించారు. ఈ విధానంలో సమస్య పరిష్కారం అయినప్పటికీ అర్జీదారు సంతృప్తి చెందాడా? లేదా అని ఫీడ్ బ్యాక్ తీసుకుంటామని వివరించారు. ఒక వేళ అర్జీదారుడు సంతృప్తి చెందకపోతే జిల్లా స్థాయిలో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ ఆ అర్జీదారు నుంచి వివరాలు సేకరిస్తుందన్నారు. సాధ్యమైనంత వరకు అర్జీదారులు స్థానిక సచివాలయం, మండలంలోనో అర్జీ ఇవ్వాలని కోరారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే 1902కు తప్పక కాల్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యలు వంటివి తెలుసుకునేందుకు సీఎం అవకాశం కల్పించారన్నారు. సమస్యలను ప్రజలు నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకునే అవకాశం ఉందని చెప్పారు. స్పందనలో ఎక్కువగా నమోదవుతున్న రెవెన్యూ పరమైన అర్జీలలో 22ఏ, ఆర్వోఆర్ అర్జీల విషయంలో ఆలస్యం కాకుండా పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు. పదేపదే ఓపెన్ అవుతున్న అర్జీలకు సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డివిజన్ స్థాయిలో జరిగే స్పందనకు తాను కూడా హాజరై సమస్యలను తెలుసుకుంటానని కలెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా పాలిసెట్



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం నిర్వహించిన పాలిసెట్–2023 ప్రవేశ పరీక్ష ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగింది. ఎన్టీఆర్ జిల్లాల్లో మొత్తం 23 పరీక్ష కేంద్రాల్లో 6,974 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. తిరువూరులోని 1,365 మంది, నందిగామలోని 1,364 మంది, విజయవాడలోని పది పరీక్ష కేంద్రాల్లో 4,245 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. ఎన్టీఆర్ జిల్లాలో 89.53 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పాలిసెట్–2023 ఎన్టీఆర్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.విజయసారథి తెలిపారు.

కృష్ణా జిల్లాలో..

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా వ్యాప్తంగా పాలిటెక్నిక్ ఎంట్రన్స్ (పాలీసెట్) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షను 13 కేంద్రాల్లో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 4,597 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4,188 మంది విద్యార్థులు హాజరయ్యారు. 409 మంది విద్యార్థులు హాజరుకాలేదని డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

విస్సన్నపేట: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాలల్లో 2023–24 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు గిరిజన గురుకుల పాఠశాలల కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కన్వీనర్ జి.జాన్సన్ దేవరాజ్ బుధవారం తెలిపారు. విస్సన్నపేట, జగ్గయ్యపేట, ఉయ్యూరు, నందిగామ, కొండపల్లి, మైలవరం పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ కింద 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీలు ఉన్న సీట్లలో భర్తీకి, అలాగే కొత్తగా అడ్మిషన్లు కోసం 3వ తరగతి నుంచి 5వ తరగతిలో చేరగోరు ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. దరఖాస్తులు సమీపంలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఈ నెల 30వ తేదీలోగా అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 94911 10211లో సంప్రదించాలని తెలిపారు.

జగనన్నకు చెప్పండి.. పరిష్కారం పొందండి

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో ఎస్పీ జాషువా, డీఆర్వో వెంకటేశ్వర్లు

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా సమస్యను వివరించి పరిష్కారం పొందాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఎస్పీ పి. జాషువా, డీఆర్వో వెంకటేశ్వర్లుతో కలిసి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు న్యాయమైన పరిష్కారం చూపాలని నిర్దేశించారన్నారు. 1902కు ఫోన్ చేస్తే ఈ కేంద్రంలో సమస్య రికార్డు చేసుకుని సంబంధిత అధికారులకు పరిష్కారం కోసం పంపుతారన్నారు. సమస్య ఏదైనా సంతృప్తికరమైన పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ మూడు కమిటీలు పరిశీలన అనంతరం పరిష్కారం ఏ విధంగా జరుగుతుందో చూసేందుకు జిల్లాలో అపెక్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో..

జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మండల స్థాయి కమిటీలో తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఉంటారన్నారు. డివిజన్‌స్థాయి కమిటీలో ఆర్డీవో, డీఎస్పీ, డివిజన్ స్థాయి అధికారులు ఉంటారని తెలిపారు. జిల్లాస్థాయి కమిటీలో జెడ్పీ డెప్యూటీ సీఈవో, డీపీవో, డీఎల్‌డీవో, కేఆర్ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్, ఏఎస్పీ, డీఎంఅండ్‌హెచ్‌వోలను నియమించామన్నారు. జిల్లా అపెక్స్ కమిటీలో కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, డీఆర్వోలను నియమించామన్నారు. మండల స్థాయిలో ప్రతి సోమవారం, డివిజన్ స్థాయిలో ప్రతి గురువారం, జిల్లాస్థాయిలో ప్రతి శుక్రవారం, అపెక్స్ కమిటీ ప్రతి సోమవారం సమావేశమై సమస్యల పరిష్కార వివరాలను పరిశీలిస్తారన్నారు. నూరుశాతం అర్జీదారునికి సంతృప్తికలిగేలా పరిష్కరించటమే ధ్యేయంగా సమన్వయంతో అధికారులందరూ పనిచేయాలన్నారు.

వారం రోజుల్లో పరిష్కారం..

ఎస్పీ జాషువా మాట్లాడుతూ కానిస్టేబుల్ స్థాయిలోనే సమస్యను స్వీకరించి, గంట వ్యవధిలోనే స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఆ సమస్యను పంపి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. చట్టపరంగా మంచి పరిష్కారం అర్జీదారునికి అందిస్తామని తెలిపారు. ఏ సమస్య ఏదైనా వారం రోజుల్లో పరిష్కరించేలా యంత్రాంగాన్ని సిద్ధం చేసినట్లు ఎస్పీ వివరించారు.

అత్త ఇంట్లో కోడలి చోరీ

రెడ్డిగూడెం(మైలవరం): అత్త ఇంట్లోనే చోరీ చేసి, ఆపై ఇంట్లో దొంగలు పడ్డారని ఓ కట్టుకథ అల్లి అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది ఓ కోడలు. పోలీసు విచారణలో అసలు విషయం బయటపడటంతో కోడలితో పాటు ఆమెకు సహకరించిన వ్యక్తిని కూడా అరెస్ట్ చేశారు. రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో బుధవారం మైలవరం డివిజన్ ఏసీపీ ఎం. రమేష్ దీనికి సంబంధించిన వివరాలు తెలిపారు.

టీవీ చూస్తానని చెప్పి..

మండల పరిధిలోని మద్దులపర్వ గ్రామానికి చెందిన కంచర్ల వెంకమ్మ ఈనెల 7వ తేదీన తిరువూరు గ్రామం తన అక్కవాళ్ల ఇంటికి వెళ్తూ.. ఆమె కొడలు అయిన కంచర్ల విజయ టీవీ చూస్తానని చెప్పడంతో ఇంటి తాళం ఇచ్చి వెళ్లింది. బీరువాలో నగలు ఉన్న విషయాన్ని పసిగట్టిన విజయ తనకు తెలిసిన మరో వ్యక్తి.. ఏ.కొండూరు మండలం పాతకొండూరు గ్రామానికి చెందిన మారెళ్ల మల్లయ్యను పిలిపించి, అదే రోజు రాత్రి చోరీకి పాల్పడింది. బీరువాలో నుంచి బంగారపు వస్తువులను దొంగిలించి, ఇరువురు వాటిని పంచుకున్నారు. ఆపై తాళం పగలగొట్టినట్టుగా సృష్టించి ఎవరికి వారు వెళ్లిపోయారు.

కట్టుకథ అల్లినా దొరికేశారు..

ఎనిమిదో తేదీన ఇరువురు ముద్దాయిలు వేసుకున్న పథకం ప్రకారం మధ్యాహ్నం సమయంలో వెంకమ్మకు ఫోన్ చేసి, ఇంటి తాళం పగలగొట్టి ఉందని, బీరువా కూడా తెరిచి ఉన్నట్లుగా ఓ కట్టుకథను ఆమెకు చెప్పారు. దీంతో వెంకమ్మ వచ్చి ఇంటిని చూసుకొని తొమ్మిదో తేదీన రెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రెడ్డిగూడెం ఎస్ఐ ఎస్. శ్రీను, మైలవరం సీఐ మోహన్‌రెడ్డి నేతృత్వంలో సిబ్బంది విచారించి, సాంకేతిక సాయంతో కంచర్ల విజయ, మారెళ్ల పుల్లయ్యలే చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు. వారి నుంచి సుమారు రూ.1.40లక్షల విలువ చేసే బంగారు వస్తువులను రికవరీ చేశారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ ఎం. రమేష్ తెలిపారు. చాకచక్యంగా అతి తక్కువ సమయంలో కేసును ఛేదించి, నగలను రికవరీ చేసిన ఎస్ఐ శ్రీనును ఏసీపీ అభినందించారు. మైలవరం సీఐ డీకే మోహన్‌రెడ్డి, రెడ్డిగూడెం ఎస్ఐ ఎస్. శ్రీను సమావేశంలో పాల్గొన్నారు.

చైన్ స్నాచర్లకు రెండేళ్ల జైలు శిక్ష

విజయవాడ స్పోర్ట్స్: ఇబ్రహీంపట్నం మండలం రాయనపాడు, జూపూడి ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు రెండేళ్లు జైలు శిక్ష విధిస్తూ విజయవాడ నాల్గో అదనపు మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి ఎస్.కోమలవల్లి బుధవారం తీర్పు చెప్పారు. 2018 సెప్టెంబర్ 28వ తేదీన రాయనపాడులోని చిల్లర దుకాణం వద్ద నిలబడిన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు తెంచుకుపోయారు. ఈ ఘటన జరిగిన నాలుగు రోజుల తరువాత జూపూడిలో చిల్లర దుకాణం నిర్వహిస్తున్న మరో మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకుపోయారు. ఈ రెండు ఘటనలపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాంకేతిక ఆధారాలతో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడింది ఇబ్రహీంపట్నం కొండపల్లికి చెందిన నామాల నాగరాజు, కటికల మోహన్‌కృష్ణగా పోలీసులు గుర్తించారు. 2019 ఫిబ్రవరి 20వ తేదీన దొంగలను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. 12 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నాగరాజు, మోహన్‌కృష్ణలకు ఒక్కొక్కరికీ రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రైతులకు న్యాయం చేస్తాం

వ్యవసాయ శాఖ మార్కెటింగ్ కమిషనర్ రాహుల్‌పాండే



చోడవరంలో ఏవో శైలజ నుంచి వివరాలు తెలుసుకుంటున్న రాహుల్ పాండే

పెనమలూరు: అకాల వర్షాల కారణంగా తడిసిన మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేసిన రైతులకు న్యాయం చేస్తామని అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిషనర్, డైరెక్టర్ రాహుల్‌పాండే అన్నారు. చోడవరం గ్రామంలో బుధవారం అధికారులు బృందంతో కలిసి తడిసిన మొక్కజొన్న, జొన్న పంటలను ఆయన పరిశీలించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి రైతుల వద్ద నుంచి మొక్కజొన్న సేకరిస్తున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్‌పాండే మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా జొన్న, మొక్కజొన్న, వరి సాగు చేసిన రైతులకు తీవ్ర ఇబ్బందులు వచ్చాయన్నారు. రైతులకు ఆదుకోవటానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో పంటల వివరాలను పరిశీలించి రైతులకు న్యాయం చేయటానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మొక్కజొన్న క్వింటా రూ. 1,962 గిట్టుబాటుధర ప్రభుత్వం ఇస్తోందన్నారు. తేమ శాతం తగ్గటానికి తడిచిన మొక్కజొన్న పంటను రైతులు ఎండబెట్టాలన్నారు. బాగా ఉన్న మొక్క జొన్న పంటలో బూజు పట్టిన పంటను కలిపితే నష్టం పెరుగుతుందని, ఈ విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా రైతులు మాట్లాడుతూ మొక్కజొన్న పంట ప్రభుత్వం కొనుగోలు చేసినట్లే జొన్న పంటను కూడా కొనుగోలు చేయాలని కోరారు. దీనికి కమిషనర్ సమాధానం చెబుతూ త్వరలో ఉన్నత స్థాయిలో సమావేశం ఉందని, జొన్న పంట విషయం కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కార్యక్రమంలో జేడీ మార్కెటింగ్ శ్రీనివాసరావు, డీఎం మార్క్‌ఫెడ్ మురళీ, ఏడీ మార్కెటింగ్ నిత్యానంద, మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోకండి..



కొటికలపూడిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న, మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్‌పాండే

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): మొక్కజొన్న, ధాన్యం అమ్మకాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ కమిషనర్, ఎండీ రాహుల్ పాండే కోరారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొటికలపూడిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్నతో కలసి బుధవారం ఆయన ప్రారంభించారు. తడిసిన మొక్కజొన్న కూడా విక్రయించుకోవచ్చని, నిబంధనల మేరకు ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. గ్రామంలో 572 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా ఎకరాకు 35– 40 క్వింటాళ్ల దిగుమతి వచ్చినట్లు పంటకోత ప్రయోగం ద్వారా తెలిసిందని ఏడీఏ శ్రీనివాసరావు తెలిపారు. క్వింటా మద్దతు ధర రూ.1962 ఉందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగమణిమ్మ, డీడీ దివాకర్, సర్పంచి రెంటపల్లి నాగరాజు, వైస్ ఎంపీపీ బండి నాగమణి, మండల పార్టీ అధ్యక్షుడు బొంతా సాంబశివరావు, పీఏసీఎస్ చైర్మన్‌లు జానీ, గాంధీ, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, ఐటీవింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రసన్న బోసు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితులకు రెండేళ్ల జైలు

చిలకలపూడి(మచిలీపట్నం): గంజాయి కలిగి ఉన్న కేసులో ఓ మహిళపై నేరం రుజువు కావటంతో రెండేళ్లు కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధిస్తూ ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు బుధవారం తీర్పు చెప్పారు. గుడివాడ పెద ఎరుకపాడుకు చెందిన షేక్ దేవమాత తన ఇంట్లో 2014 డిసెంబర్ 12వ తేదీన 5.4 కేజీల గంజాయిని కలిగి ఉన్నట్లుగా గుడివాడ ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏపీపీ మోచర్ల రాధాకృష్ణ నలుగురు సాక్షులను విచారించారు. నిందితురాలిపై నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

మరో కేసులో..


ఇరువురు మహిళలు గంజాయి కలిగి ఉన్నట్లుగా నేరం రుజువు కావటంతో ఒక్కొక్కరికీ రెండేళ్లు జైలు శిక్ష, రూ. 10వేలు జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు బుధవారం తీర్పు చెప్పారు. గుడివాడ పెద ఎరుకపాడుకు చెందిన షేక్ దేవమాత, భాష్యంమాతలు 2018 నవంబర్ 10వ తేదీన 2.3 కేజీల గంజాయి కలిగి ఉన్నట్లుగా గుడివాడ ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఏపీపీ మోచర్ల రాధాకృష్ణ నలుగురు సాక్షులను విచారించగా ఇరువురు మహిళలపై నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి



పెనమలూరు: విద్యుత్ షాక్‌తో చిన్నారి దుర్మరణం చెందాడు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు డొంకరోడ్డుకు చెందిన కార్పెంటర్ నడకుదుటి నాగరాజు కుమారుడు నడకుదుటి శ్రావణ్‌తేజ(8) బుధవారం ఇంటి పైన తోటి పిల్లలతో క్రికెట్ ఆడుతున్నాడు. బాల్ ఇంటిపై నుంచి కిందకు పడిపోవటంతో శ్రావణ్‌తేజ ఇంటిపై నుంచి కిందకు తొంగి చూసిన సమయంలో ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి విద్యుత్ ట్రాన్స్‌ఫారంపై పడ్డాడు. ఈ ఘటనలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద మృతి



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో ఓ గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామంలోని మిత్రా దాబా ఎదురు విజయవాడ నుంచి గన్నవరం వైపు వెళ్లే జాతీయరహదారి పక్కన గ్రీన్ ఫీల్డ్ కోసం వేసిన మట్టిపై సుమారు 40 సంవత్సరాలు కలిగిన మహిళ మృతి చెంది ఉంది. గులాబీ, వంకాయ రంగులు గల దుస్తులు ధరించి ఉంది. శరీరంపై గాయాలు లేకపోవడం, ఇతరత్రా ఆధారాలు లభించకపోవడంతో వడదెబ్బ తగిలి మృతి చెంది ఉంటుందని పటమట పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య సేవలు మరింత విస్తృతం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



ఫ్యామిలీ డాక్టర్ శిబిరంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అందిస్తున్న వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. ఆమె బుధవారం జిల్లాలోని పలు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గొల్లపూడి–4 సచివాలయాన్ని సందర్శించిన ఆమె అక్కడి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులతో పాటు, గర్భిణులు, బాలింతలకు, కౌమారదశ పిల్లలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. ఆయా సేవలను మరింత విస్తృతం చేసేందుకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొండపల్లి వైద్యాధికారి డాక్టర్ శిరీష, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష..

జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసి, సేవలను విస్తృతం చేసేందుకుగాను విజయవాడలోని తన కార్యాలయంలో డీఎంహెచ్ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు పాల్గొన్నారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ల భౌగోళిక సరిహద్దులు, క్రమబద్ధీకరణలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ నోడల్ అధికారి డాక్టర్ మోతీబాబు, 104 సమన్వయ అధికారి శ్రీనివాస్ వైద్యాధికారులు పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి రౌడీషీటర్ ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భార్యతో గొడవపడి ఓ రౌడీషీటర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన రౌడీషీటర్ గులివిందల బాలవెంకటసాయి భాస్కర్ అలియాస్ ఆల్ అవుట్ సాయి(24)కి దివ్యశ్రీ అనే యువతితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి అయిన దగ్గర నుంచి సాయి తరచూ భార్యతో గొడవపడుతూ ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించేవాడు. మంగళవారం ఉదయం కూడా ఇదే విధంగా భార్య, అత్తమామలతో గొడవపడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయి తన ఇంటి లోపలికి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాసేపటి తర్వాత కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగా సాయి ఎంతసేపటికటి తలుపులు తీయకపోవడంతో తలుపులు పగలకొట్టి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో వారు చికిత్స నిమిత్తం అతన్ని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో ఉన్న పిల్లల రక్షణపై శిక్షణ



శిక్షణకు హాజరైన అధికారులతో జేసీ అపరాజితాసింగ్, ఎన్ఐడీఎం అధికారులు

గన్నవరం రూరల్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఎన్ఐడీఎం)ఆధ్వర్యంలో ప్రమాదంలో ఉన్న పిల్లలను రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ కార్యక్రమం బుధవారం మండలంలోని కొండపావులూరు ఎన్ఐడీఎం సంస్థలో ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితాసింగ్, ఎన్డీఆర్ఎఫ్ సెకండ్ ఇన్ కమాండ్ నిరంజన్ సింగ్, ఎన్ఐడీఎం సౌత్ క్యాంపస్ జాయింట్ డైరెక్టర్ కల్నల్ పీఎస్ రెడ్డి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు, పిల్లలు, గిరిజన సంక్షేమం, జువైనల్ వెల్ఫేర్, పోలీస్, ఏపీ వైద్య విధాన పరిషత్, డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్, ఏపీఎస్పీ బెటాలియన్, మెడికల్ అండ్ హెల్త్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన అధికారులు 51 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారు.

సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చు..

జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితాసింగ్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ ఎంతో ముఖ్యమైనదన్నారు. అధికారుల సామర్థ్యాలను పెంపొందించటంలో ఈ శిక్షణ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఎన్ఐడీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ, ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతోష్‌కుమార్, సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కుమార్ రాకా మార్గదర్శకత్వంలో కొత్తగా పనిచేస్తున్న ఎన్ఐడీఎం సదరన్ క్యాంపస్ ఏపీలోనే మొదటి శిక్షణ కేంద్రంగా ప్రారంభించినట్లు అధికారులు చెప్పారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

పెనమలూరు: మద్యం మత్తులో హత్య చేసిన నిందితులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం ఐఫోన్ బడ్స్ పై వివాదం తలత్తడంతో తాడిగడపకు చెందిన చెన్నూరి అజయ్‌సాయిని మిత్రులు కగ్గాసాయినాగార్జున, పామర్తి మణికంఠసాయి, మణికంఠ స్వామి, ప్రశాంత్, శ్రీధర్ కానూరు వద్ద దాడి చేసి హత్య చేశారు. ఆ సమయంలో వారు మద్యం మత్తులో ఉన్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితులను పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలించి పట్టుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

మోపిదేవివార్పు(మోపిదేవి): మండల పరిధిలోని మోపిదేవివార్పు వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లంకొండ సీతమ్మ(73) మృతి చెందింది. స్థానిక ఎస్ఐ పద్మ ఇచ్చిన సమాచారం మేరకు బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన సీతమ్మ మోపిదేవి వార్పు వద్ద ఉంటున్న తమ కుమార్తె ఇంట్లో ఉంటుంది. మతి స్థిమితం లేక తెల్లవారుజామున గురుకుల పాఠశాల సమీపంలో రోడ్డుపైకి రావడంతో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పద్మ వివరించారు.

క్లుప్తంగా

విద్యార్థినికి ఆర్థిక సాయం



కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతిలో 591 మార్కులు సాధించిన కృష్ణలంకకు చెందిన విద్యార్థిని బి.సౌజన్యకు ఉన్నత చదువుల నిమిత్తం అమరావతి వాకర్స్ క్లబ్ సభ్యులు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ పాఠశాల ఆవరణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సౌజన్యను సత్కరించి నగదు అందజేశారు. క్లబ్ సభ్యుడు దివి సాంబశివరావు రూ.10 వేలు, మిగిలిన సభ్యులందరూ కలిసి రూ.10 వేలు, క్లబ్ తరఫున రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నిమ్మల జ్యోతిక, యాదల రూపేంద్ర, కోశాధికారి అత్తోట చెన్నయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): తన భూమికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారన్న మనస్తాపంతో ఓ వ్యక్తి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పూర్ణానందంపేటలో జరిగింది. బాధితుడి బంధువుల కథనం మేరకు.. పిన్నప్రోలు చెన్నారావు పూర్ణానందం పేటలో కుటుంబ సభ్యులతో కలసి నివసిస్తున్నాడు. అదే ప్రాంతంలో ఉన్న అతని స్థలాన్ని చికెన్ సెంటర్ నిర్వహించుకునేందుకు ఓ వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. కొంతకాలం తరువాత అద్దెకు ఉంటున్న వ్యక్తి స్థానిక పెద్దల అండదండలతో ఆ స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారని ఆరోపిస్తూ చెన్నారావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై న్యాయస్థానంలో విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో తనకు న్యాయం జరిగేలా లేదంటూ మనస్తాపంతో బుధవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చెన్నారావు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): నిద్రమాత్రలు తీసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతికి చెందిన డి.రామయ్య నాయుడు(74) గత నెల 18వ తేదీన బస్టాండ్ సమీపంలోని ఒక లాడ్జిలో రూమ్ అద్దెకు తీసుకున్నాడు. అదే నెల 22వ తేదీ రాత్రి 12.30 గంటల సమయంలో అతడి రూమ్‌లో లైట్లు వెలుగుతుండడంతో లాడ్జి సిబ్బంది వెళ్లి చూశారు. రామయ్యనాయుడు రూమ్‌లో మంచం మీద పడి ఉండగా నోటి నుంచి నురగ వస్తుండాన్ని గమనించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది నిద్రమాత్రలు మింగినట్లు గుర్తించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రేపు విభవ-2023

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం సిద్ధార్థ ఆడిటోరియంలో విభవ-2023 పేరుతో సాంకేతిక, సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ ప్రకటించారు. సిద్ధార్థ కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో విభవ-2023 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుకోడానికి ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి టి.ఎస్.రవికిరణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో ఎంసీఏ, ఎమ్మెస్సీ, ఎంటెక్ కంప్యూటర్ సైన్స్, పీజీ కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అధ్యాపకుడు జి.సామ్రాట్ కృష్ణ, పీజీ విభాగం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



యలమంచిలి కాంప్లెక్స్ వద్ద సర్వీస్‌రోడ్డు, డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్



అంబేడ్కర్ స్మృతివనం పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ నిర్మాణంతో జాతీయ రహదారి 16 వెంబడి మూసుకుపోయిన సర్వీస్ రోడ్డు, పూడిపోయిన డ్రెయిన్లను కోర్టు నిబంధనల ప్రకారం పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని వీఎంసీ అధికారులను మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం యలమంచిలి కాంప్లెక్స్ వద్ద సర్వీస్ రోడ్డు, డ్రెయిన్‌ను పరిశీలించారు. రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి అవసరమైన అనుమతులపై జాతీయ రహదారుల అధికారులతో చర్చించి త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను మునిసిపల్ కమిషనర్ ఆదేశించారు. అనంతరం ఆయన బందరు రోడ్డులోని రాఘవయ్య పార్కు వద్ద నిర్మిస్తున్న నిర్మల్ హ్యాపీ భవన్‌ను పరిశీలించారు. ఈ భవన్‌ను ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభిస్తారని, అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. భవన్‌లో పెండింగ్‌లో ఉన్న సివిల్ వర్క్‌లను పూర్తిచేయాలని ఆదేశించారు. నిర్మల్ హృదయ్ భవన్‌లో మొక్కలను ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఉద్యాన విభాగం అధికారులను ఆదేశించారు. సీఎం రూట్‌కు అనుగుణంగా రహదారి వెంబడి గ్రీనరీని పెంపొందించాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన స్వరాజ్య మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, 125 అడుగుల విగ్రహ నిర్మాణాన్ని పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, నాణ్యతప్రమాణాల్లో రాజీలేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ శిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.చంద్ర శేఖర్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కరిముల్లా, ఎస్ఈ నరసింహ మూర్తి, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

అసాంఘిక శక్తులను అణచివేయండి

- ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్
- ఏడు జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్‌లో గంజాయి, మాదకద్రవ్యాల రవాణా నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా ఉంచి అణచివేయాలని ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి.అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏలూరులోని రేంజ్ కార్యాలయం నుంచి ఆయన బుధవారం ఏలూరు రేంజ్ పరిధిలోని తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఏలూరు జిల్లాల ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ సమాజానికి చేటు చేసే అరాచక శక్తులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, దిశ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసిన మహిళలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ గ్రామ సంరక్షణ కార్యదర్శులు (మహిళా పోలీస్) సేవలను వినియోగించుకుంటూ మహిళలపై నేరాలను నిరోధించేందుకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరగాళ్లపై జాగ్రత్తలు వహించేలా ప్రజలను అప్రమత్తం చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి సైబర్ కేసులను దర్యాప్తు చేయాలన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో శాంతి పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో శాంతిని నెలకొల్పేలా చూడాలన్నారు. ఈ నెల 13న మెగా లోక్ అదాలత్ నేపథ్యంలో పరిష్కరించదగిన కేసులకు సంబంధించి కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి కేసులను రాజీ చేసేందుకు ప్రయత్నించాలని తెలిపారు. రాత్రివేళ గస్తీని మరింత పెంచాలని అధికారులను డీఐజీ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, కాకినాడ ఎస్పీ సతీష్‌కుమార్, అంబేడ్కర్ కోనసీమ ఎస్పీ శ్రీధర్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, పశ్చిమగోదావరి ఎస్పీ ఉప్పాడ రవిప్రకాష్, కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా, అదనపు ఎస్పీలు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జాన్సన్



బాలల హక్కులపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాన్సన్, అరవ రమేష్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తల్లిదండ్రులకు అవగాహన లేక 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు జరిపిస్తున్నారని, అది చట్టరీత్యా నేరమని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జాన్సన్ పేర్కొన్నారు. బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సమగ్ర బాలల సంరక్షణ పథకం (డీసీపీయూ), స్థానిక వార్డ్ సచివాలయ మహిళా పోలీస్ సిబ్బంది సహకారంతో పశ్చిమ నియోజకవర్గం పెజ్జోనిపేట ఆర్‌సీఎం దేవాలయం ఆవరణలో చైల్డ్‌లైన్, ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్ ఆధ్వర్యంలో బుధవారం సెమినార్ జరిగింది. సమ్మర్ క్యాంప్‌లోని బాలల కోసం 'బాలల హక్కుల పరిరక్షణ – అందరి పాత్ర' అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాన్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలబాలికలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బాలలు ఆపదలో ఉంటే వెంటనే చైల్డ్‌లైన్ – 1098 లేదా డయల్ 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. చైల్డ్‌లైన్ – 1098 జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, మత్తు పదార్థాలు లేని సమాజాన్ని అందరం కలిసి నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్న బాలలకు అండగా చైల్డ్‌లైన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కరోనా తరువాత బాలల స్థితిగతులు మారాయని, కొంత మంది అవగాహన, చైతన్య లేక మొబైల్ ఫోన్, మత్తు పదార్థాలకు బానిసలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి కాకుండా పనుల్లోకి పంపించడం వల్ల బాలలు బాల కార్మికులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. బాలలు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

బాలల హక్కుల పరిరక్షణపై ఆర్‌సీఎం చర్చి డైరెక్టర్ ఫాదర్ జేమ్స్, బర్డ్స్ ఎన్‌జీఓ సంస్థ సెక్రటరీ కె.ప్రకాష్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ సెంటర్ కో ఆర్డినేటర్ నాగరాజు టీమ్ సభ్యులు అబ్రహాం, ప్రవీణ్, స్వరూప, స్థానిక సచివాలయ మహిళా పోలీసు మెర్సీ, సమ్మర్ క్యాంప్ ఇన్‌చార్జ్ బ్రదర్ అశోక్, విజయవాడ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోని బాలల అక్రమ రవాణా యూనిట్ అధికారి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా చైతన్య గీతాలను వినిపించారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి



రోడ్డుపక్క వ్యర్థాలను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని ఆ విభాగం అధికారులు, సిబ్బందిని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. 24, 5, 3 డివిజన్ల పరిధిలోని మొగల్రాజపురం, క్రీస్తురాజుపురం, గుణదల, గంగిరెద్దుల దిబ్బ తదితర ప్రాంతాల్లో ఆయన అధికారులతో కలిసి బుధవారం రాత్రి పర్యటించి పారిశుద్ధ్యం నిర్వహణను పరిశీలించారు. వీధి దీపాలు వెలగకపోవడం, బ్లాక్ స్పాట్ ప్రాంతాలు (తగినంత వెలుతురు లేకపోవడం), దోమల బెడద, డ్రెయిన్లలో మురుగు పారుదలకు సంబంధించి ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు రాత్రి తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టామని స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మొగల్రాజపురంలో దోమల బెడదను గుర్తించారు. డ్రెయిన్లలో దోమల లార్వా నిర్మూలనకు ఆయిల్ బాల్స్ వేసేందుకు, ఫాగింగ్‌ను రెట్టింపు చేయడానికి అదనపు కార్మికులను నియమించాలని హెల్త్ అధికారులను ఆదేశించారు. డ్రెయిన్లను శుభ్రంచేసి మురుగు ప్రవాహం సజావుగా ఉండేలా చూడాలని సూచించారు. క్రీస్తురాజుపురం, గుణదల, గంగిరెద్దుల దిబ్బ ప్రాంతాల్లో రోడ్ల పక్కన చెత్తను గమనించి పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని హెల్త్ అధికారులను హెచ్చరించారు. 100 శాతం నివాసాల నుంచి చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య సిబ్బంది ఆదేశించారు. మంచినీటి సరఫరా పైప్ లైన్ లీకేజీలు లేకుండా చూడాలని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ)లో మురుగునీటి పారుదలకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

రెడ్ క్రాస్‌కు డీఆర్డీఏ ఉద్యోగుల ఆర్థిక సాయం



కలెక్టర్ ఢిల్లీరావుకు చెక్కును అందజేస్తున్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): జిల్లా రెడ్ క్రాస్ సొసైటీకి డీఆర్డీఏ ఉద్యోగులు, సిబ్బంది రూ.1,00,531 ఆర్థిక సహాయం అందించారు. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు కలిసి ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందిస్తున్న సేవల్లో ఉద్యోగుల భాగస్వాములు కావాలని కలెక్టర్ ఢిల్లీరావు ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు తమవంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సహాయం అందించిన డీఆర్డీఏ ఉద్యోగులు, సిబ్బందిని కలెక్టర్ ఢిల్లీరావు ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలోని ఉద్యోగులు అందరూ రెడ్‌క్రాస్‌లో భాగస్వాములై ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, ఎం.సునీత పాల్గొన్నారు.

మహాయజ్ఞానికి పటిష్ట బందోబస్తు



విజయవాడ స్పోర్ట్స్: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే చండీ రుద్ర రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను రాణా బుధవారం పరిశీలించారు. ఈ యజ్ఞానికి వచ్చే భక్తులు, ప్రముఖులకు భద్రత, రక్షణ పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని స్టేడియం పరిసరాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రమాదాలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈ పర్యటనలో సీపీ వెంటన డీసీపీ విశాల్‌గున్ని, ఏసీపీలు భాస్కరరావు, వెంకటనారాయణ, సీఐ గుణరాము పాల్గొన్నారు.

పటమట సబ్ రిజిస్ట్రార్‌గా కృష్ణచైతన్య

సాక్షి ప్రతినిధి, విజయవాడ: పటమట సబ్‌రిజిస్ట్రార్‌గా కృష్ణచైతన్యను డెప్యూటేషన్‌పై ఉన్నతాధికారులు నియమించారు. ఆయన ప్రస్తుతం గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్-2 సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పటమట సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన అర్జ రాఘవరావును ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టుచేసి, రిమాండ్‌కు పంపారు. దీంతో ఆయన ప్రభుత్వం సస్పెండ్ చేసింది. గుణదల సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌రావును గాంధీనగర్‌లో జాయింట్-2 సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు.

దేవినేని ట్రస్ట్ ద్వారా పేదలకు చేయూత



పేదలకు బండ్లను అందజేస్తున్న కడియాల బుచ్చిబాబు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, 20వ డివిజన్‌కు చెందిన ఇద్దరు నిరుపేదలకు జీవనోపాధి నిమిత్తం దేవినేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బుధవారం చేయూత అందించారు. పేద కుటుంబాలకు చెందిన ఐనంపూడి సరస్వతి, గణపవరపు వేణు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, జీవనోపాధి కోసం సహాయం చేయాలని వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ట్రస్ట్ ద్వారా రూ.40 విలువచేసే తోపుడు బండి, ఇస్త్రీ బండిని పార్టీ నాయకుడు కడియాల బుచ్చిబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని పేదలకు అండగా నిలిచేందుకు ట్రస్ట్ ద్వారా అవినాష్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య, దుర్గ గుడి పాలక మండలి సభ్యులు బచ్చు మాధవి, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు చిమటా సాంబశివరావు, పార్టీ నాయకులు సుభాని, విజయలక్ష్మి, ఎస్.ఎస్.రాజు, పల్లెం రవి, రాజేష్, ధనరాజు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ ఖాదర్‌బాషాకు ఆత్మీయ వీడ్కోలు



ఆటోనగర్(విజయవాడతూర్పు): ఎదుటి వారిని తక్కువ అంచనా వేయకూడదని, అలా చేస్తే అన్ని విధాలుగా విఫలమవుతామని విజయవాడ సెంట్రల్ ఏసీపీ ఎస్కే ఖాదర్‌బాషా అన్నారు. ఏడీసీపీగా బదిలీపై వెళ్లిన ఆయనకు పటమట సీఐ విశ్వనాథ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఏసీ కల్యాణ మండపంలో బుధవారం ఆత్మీయ వీడ్కోలు, అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ.. సుమారు రెండేళ్ల పాటు పటమట, మాచవరం, గుణదల పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది తనకు చక్కగా సహకరించారని కొనియాడారు. ప్రతి కేసు విషయంలోనూ ఉత్తమ పనితీరు కనబరిచారని అభినందించారు. ప్రస్తుత సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు మాట్లాడుతూ.. ఖాదర్‌బాషాకు సహకరించినట్టే తనకు సహాయ సహకారాలు అందించాలని పోలీసు అధికారులు, సిబ్బందిని కోరారు. అనంతరం సెంట్రల్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది ఖాదర్‌బాషాను గజమాలతో సన్మానించారు. పటమట, మాచవరం, గుణదల సీఐలు కాశీవిశ్వనాథ్, గుణరామ్, కృష్ణమోహన్, వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ ద్రోహులకు మాట్లాడే నైతిక అర్హత లేదు

ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్



భవానీపురం(విజయవాడపశ్చిమ): సెంట్రల్ హజ్ కమిటీ నిర్ణయించే హజ్ యాత్రికుల టికెట్ ధరల విషయంలో రాష్ట్ర హజ్ కమిటీ పాత్ర ఏమీ ఉండదని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హజ్ యాత్ర టికెట్ ధరల తగ్గింపు విషయంలో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడిందని, ఒక వేళ కేంద్రం తగ్గించని పక్షంలో రాష్ట్రమే ఆ మొత్తాన్ని భరిస్తుందని డెప్యూటీ సీఎం అంజాద్ బాషా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. వాస్తవం ఇలా ఉంటే బీజేపీతో పొత్తులో ఉన్న జనసేన పార్టీ నాయకుడు పోతిన మహేష్, పొత్తు కోసం వెంపర్లాడుతున్న టీడీపీ నాయకుడు జలీల్‌ఖాన్ ఓట్ల కోసం మైనార్టీలపై కపట ప్రేమ చూపిస్తున్నారని ఎద్దేవాచేశారు. మైనార్టీ ద్రోహులైన వారికి మాట్లాడే అర్హత లేదని దుయ్యబట్టారు. వారికి మైనార్టీలపై నిజంగా ప్రేమ ఉంటే పక్క రాష్ట్రాల్లో ముస్లింలకు ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్లు ఎత్తేస్తామన్న బీజేపీ నాయకుల ప్రకటనలను ఖండించాలని సూచించారు. మైనార్టీలకు మేలు చేస్తున్న మైనార్టీ పక్షపాత ప్రభుత్వం తమదని స్పష్టం చేశారు.

42 మంది సిద్ధార్థ విద్యార్థులకు ఉద్యోగాలు



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రముఖ ఔషధ తయారీ సంస్థలు లారస్ ల్యాబ్, హెటిరో ల్యాబ్స్ ఇటీవల తమ కళాశాల ఆవరణలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో తమ కళాశాలకు చెందిన 42 మంది విద్యార్థులు ట్రైనీ కెమిస్ట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని పీబీ సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం కళాశాల ఆవరణలో అభినందించారు. ఈ విద్యార్థులందరికీ త్వరలో ఆయా కార్యాలయాల్లో శిక్షణ ఇస్తారని ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తెలిపారు. రాత పరీక్ష, టెక్నికల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి ఉద్యోగాలు ఎంపిక కావడం సంతోషంగా ఉందని కళాశాల శిక్షణ, ఉపాధి విభాగాధిపతి కావూరి శ్రీధర్ పేర్కొన్నారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.మనోరంజని, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు చదలవాడ నాగేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ సూరెడ్డి వెంకటేశ్వరరావు, కళాశాల డీన్ రాజేష్ సీ జంపాలతో పాటుగా అధ్యాపకులు ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించారు.

ప్రాణదాత



అవయవదానం చేసిన వల్లుపు శ్రీరాములు (ఫైల్)

తాడేపల్లిరూరల్: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన ఓ యువకుడు అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మను ప్రసాదించాడు. తాను తనువు చాలించినా మూడు కుటుంబాల్లో ఆనందాలు నింపాడు. మణిపాల్ ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన వల్లుపు శ్రీరాములు(23) సెంట్రింగ్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం శ్రీరాములుకు బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో శ్రీరాములు భార్య వసంత, తండ్రి ఏడుకొండలు, తల్లి సుశీల అవయవ దానానికి అంగీకరించారు. శ్రీరాములు కాలేయం, కిడ్నీని మణిపాల్ హాస్పిటల్‌లో అవసరమైన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశామని, మరొక కిడ్నీని ట్రాన్స్‌ప్లాంటేషన్ నిమిత్తం గుంటూరులోని వేదాంత హాస్పిటల్‌కు తరలించామని వైద్యులు తెలిపారు. అవయవదానానికి ముందుకు వచ్చినందుకు దాత కటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆడుకుంటామని వెళ్లి.. అనంత లోకాలకు

- వీటీపీఎస్ కెనాల్‌లో ఇద్దరు చిన్నారుల గల్లంతు
- అన్న మృతదేహం లభ్యం.. జాడలేని చెల్లి


కార్తికేయ (ఫైల్)


సహస్ర శ్రీ (ఫైల్)

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో తీవ్ర విషాదం నెలకొంది. ఆడుకుంటామని తల్లితో చెప్పి ఇంటినుంచి బయటకు వెళ్లిన చిన్నారులు సమీపంలోని వీటీపీఎస్ కెనాల్‌లో గల్లంతయ్యారు. ఇద్దరు చిన్నారుల్లో అన్న శవమై తేలగా.. చెల్లి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. పోలీసుల కథనం ప్రకారం.. గొల్లపూడి ఓల్డ్ పోస్టాఫీస్ రోడ్డులోని సుబ్రహ్మణ్యేశ్వర రెసిడెన్సీలో పానుగుపాటి శ్రీనివాసరావు నివాసం ఉంటున్నారు. ఆయన విజయవాడ నగరపాలక సంస్థలో ఇన్‌చార్జి ఏఈగా పనిచేస్తున్నారు. ఆయనకు కార్తికేయ (11), సహస్రశ్రీ (7) సంతానం. గొల్లపూడి జెడ్పీ హైస్కూల్‌లో కార్తికేయ 5వ తరగతి, సహస్రశ్రీ రెండో తరగతి చదువుతున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఆడుకుంటామని తల్లితో చెప్పి ఇద్దరు చిన్నారులు ఇంటినుంచి బయటకు వెళ్లారు. రాత్రి 9.30 గంటల వరకు ఇంటికి రాలేదు. తండ్రి ఆఫీసు నుంచి వచ్చి పిల్లలకు కోసం వారి స్నేహితులు, బంధువులు, చుట్టుపక్కల వారి ఇళ్లలో వెతికారు. అపార్ట్‌మెంట్‌లోని ఇతర ఫ్లాట్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. తిరిగి బుధవారం ఉదయం వెతకడం ప్రారంభించారు. శ్రీనివాసరావు నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ పిల్లల కోసం కెనాల్ పరిసరాలలో వెతుకుతుండగా చెప్పులు కనిపించాయి. వాటిని శ్రీనివాసరావుకు చూపించగా.. అవి తమ పిల్లలవేనని గుర్తించారు. దీనిపై భవానీపురం పోలీసులకు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. పిల్లల ఆచూకీ కోసం పోలీసులు గాలించగా.. కెనాల్‌లో కార్తికేయ మృతదేహం లభ్యమైంది. సహస్ర కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం, భవానీపురం పోలీసులు గాలిస్తున్నారు.

బ్రిటన్ ఎత్తుకెళ్లిన వస్తువులు 8 మిలియన్లు

- ఇండియా సహా వివిధ దేశాల నుంచి బ్రిటన్ దోచుకుపోయిన విలువైన సంపద
- ఆ జాబితాలో కోహినూర్ వజ్రం, టిప్పుసుల్తాన్ ఉంగరం, షాజహాన్ వైన్ జార్
- ప్రాచీన ఈజిప్ట్‌కు చెందిన విలువైన రోసెట్టా స్టోన్ బ్రిటన్ పరం
- బ్రెజిల్ నుంచి 70 వేల రబ్బరు విత్తనాల చోరీ
- విక్టోరియా మ్యూజియంలో భద్రంగా ఉన్న విలువైన సాంస్కృతిక, వారసత్వ కళాఖండాలు

సాక్షి, అమరావతి

బ్రిటిష్ సామ్రాజ్యం.. దాని కాలనీలు మన దేశం సహా ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి లెక్కలేనన్ని విలువైన కళాఖండాలను దోచుకెళ్లింది. 16వ శతాబ్దం చివరి నుంచి 20వ శతాబ్దం వరకు బ్రిటిష్ సామ్రాజ్యం ప్రపంచవ్యాప్తంగా తన కాలనీలు, వలస రాజ్యాలు, రక్షిత ప్రాంతాలను స్థాపించింది. బ్రిటన్‌లోని పలు మ్యూజియాలలో ప్రస్తుతం ప్రదర్శనలో ఉన్న అనేక సాంస్కృతిక కళాఖండాలు వలస రాజ్యాల ప్రజల నుంచి దోచుకున్నవే. వాటిని తిరిగి ఇచ్చేయాలని ఆ దేశాలు కోరుతున్నా.. బ్రిటన్ పట్టించుకోవడం లేదు. కోహినూర్ వజ్రం నుంచి బెనిన్ కాంస్యాలు, పార్థినాన్ మార్బుల్స్ వంటి 8 మిలియన్లకుపైగా కళాఖండాలు బ్రిటిష్ మ్యూజియంలలో ఉన్నట్టు అంచనా. వాటిలో అత్యంత విలువైనవి కొన్ని ఇవే.

టిప్పుసుల్తాన్ ఉంగరం



ఈస్టిండియా కంపెనీతో 1799లో జరిగిన యుద్ధంలో టిప్పు సుల్తాన్ ఓడిపోయిన తర్వాత.. బ్రిటిష్ దళాలు సుల్తాన్‌ను చంపి ఆయన ఖడ్గం, బొమ్మ పులి, చేతి వేలి నుంచి ఉంగరాన్ని తీసుకెళ్లారు. సుల్తాన్ ఉంగరంపై దేవనాగరి లిపిలో రాముడి పేరు చెక్కి ఉండేది. ఖడ్గాన్ని భారతదేశానికి తిరిగి రప్పించారు. 41 గ్రాముల ఈ ఉంగరాన్ని 2014లో వేలం వేయగా.. అంచనా ధర కంటే పది రెట్లు ఎక్కువ ధర చెల్లించి ఒక వ్యక్తి కొనుగోలు చేశారు. టిప్పుసుల్తాన్‌కు చెందిన వేసవి రాజభవనం నుంచి తీసుకెళ్లిన బొమ్మ పులి ప్రస్తుతం విక్టోరియా ఆల్బర్ట్ మ్యూజియంలో ఉంది.

కోహినూర్ వజ్రం



ప్రపంచంలోనే అత్యంత విలువైన కోహినూర్ వజ్రాన్ని భారతదేశం నుంచి బ్రిటిషర్లు తీసుకుపోయారు. 105.6 క్యారెట్లు, 21.6 గ్రాముల బరువున్న కోహినూర్ వజ్రాన్ని ప్రస్తుత ఏపీలోని కొల్లూరు గనిలో సేకరించారు. మొఘల్ చక్రవర్తులు నెమలి సింహాసనంపై దీన్ని ఉంచేవారు. మొదట దీన్ని సేకరించినప్పుడు 793 క్యారెట్లతో ఉండేది. ఆ తర్వాత దాన్ని కట్ చేశారు. 1849లో బ్రిటిషర్లు దాన్ని విక్టోరియా రాణికి అప్పగించారు. ఆమె దాన్ని పలు సందర్భాల్లో తన కిరీటంపై ధరించేవారు. ప్రస్తుతం ఇది లండన్ టవర్‌కి చెందిన జ్యువెల్ హౌస్ మ్యూజియంలో ఉంది. కోహినూర్ ప్రపంచంలోనే పురాతన, అత్యంత ప్రసిద్ధ వజ్రాలలో ఒకటి.

ఎల్గిన్ మార్బుల్స్

ఎల్గిన్ మార్బుల్స్ పురాతన గ్రీకు శిల్పాల సమాహారం. గ్రీస్‌లోని పార్థినాన్ నుంచి 1801–1805 సంవత్సరాల మధ్య బ్రిటిషర్లు ఎథీనా దేవతకు అంకితం చేసిన ఈ శిల్పాలను తీసుకెళ్లారు. ఈ శిల్పాలు గ్రీకుల గొప్పతనం, వారి వారసత్వం, చరిత్రను తెలుపుతాయి. 1453 నుండి దాదాపు 400 సంవత్సరాల పాటు ఒట్టోమన్ సామ్రాజ్యం గ్రీకును పాలించింది. ఆ సమయంలో బ్రిటిష్ రాయబారి లార్డ్ ఎల్గిన్, పార్థినాన్ శిథిలాల నుంచి ఈ శిల్పాలను సేకరించి తీసుకెళ్లారని చెబుతారు.

బ్రెజిల్ రబ్బరు విత్తనాలు

బ్రెజిల్‌కే సొంతమైన హెవియా బ్రాసిలియెన్సిస్ (రబ్బరు చెట్టు) 70 వేల విత్తనాలను 1876లో బ్రిటిష్ యాత్రికుడు హెన్రీ విక్హామ్ దొంగిలించాడు. ఇది చరిత్ర గతిని మార్చిన ఘటనగా పేర్కొంటారు. బ్రెజిల్‌లోని శాంటారెమ్ ప్రాంతంలోని 140 అడుగుల ఎత్తుకు పెరిగిన రబ్బరు చెట్టు విత్తనాలవి. అప్పటివరకు రబ్బరు పరిశ్రమపై బ్రెజిల్‌కు ఉన్న ఆధిపత్యం ఈ ఘటనతో చెదిరిపోయింది. ఈ విత్తనాలు ప్రస్తుతం లండన్ మ్యూజియంలో ఉన్నాయి.

బెనిన్ కాంస్యాలు

ఒకప్పటి బెనిన్ రాజ్యమే ఇప్పటి నైజీరియా. 1897లో బ్రిటిషర్లు బెనిన్‌పై దాడిచేసి ఆ నగరాన్ని దోచుకుంది. అక్కడి రాజ భవనంలో ఉన్న చారిత్రాత్మక వస్తువులు, 200కిపైగా కాంస్య ఫలకాలు ఇప్పుడు బ్రిటిష్ మ్యూజియంలో ఉన్నాయి. 1960లో స్వాతంత్ర్యం పొందినప్పటి నుంచి నైజీరియా పలుసార్లు ఈ కాంస్యాలను తిరిగి ఇవ్వాలని కోరినా ఫలితం లేదు.





రోసెట్టా స్టోన్

ఈజిప్టులోని రోసెట్టా ప్రాంతంలో దొరికిన పురాతన శాసనం ఇది. ఈజిప్టును పాలించిన టోలెమీ 196 బీసీలో నల్లటి బసాల్ట్ గ్రానైట్ రాయిపై ఈ శాసనాన్ని చెక్కించారు. మూడు విభిన్న ఈజిప్టియన్ భాషల్లో రాసిన ఈ శాసనం తన సామ్రాజ్యం, తాను చేసిన పనుల గురించి ఇందులో రాయించారు. 1799లో ఈ రాయిని కనుగొన్నారు. నెపోలియన్ బోనపార్టీ ఈజిప్టు నుంచి దీన్ని స్వాధీనం చేసుకున్నారు. 1800 సంవత్సరంలో ఫ్రెంచ్ సైన్యం ఓడిపోయిన తర్వాత బ్రిటిషర్లు దీన్ని స్వాధీనం చేసుకుని బ్రిటన్‌కు తరలించారు. ప్రాచీన ఈజిప్టు సామ్రాజ్యం, గ్రీకుల సంస్కృతి, వారసత్వం గురించి తెలిపే అత్యంత విలువైన శాసనంగా దీన్ని పరిగణిస్తారు. అందుకే దీన్ని తిరిగి ఇవ్వాలని ఈజిప్టు దేశం బ్రిటన్‌ను కోరినా పట్టించుకోలేదు.

షాజహాన్ వైన్ జార్



మొఘల్ చక్రవర్తి షాజహాన్ వైన్ తాగే జార్‌ను కూడా బ్రిటిషర్లు తీసుకెళ్లి అక్కడి మ్యూజియంలో పెట్టుకున్నారు. తెల్లటి కప్పులా ఉండే ఈ జార్ దిగువ భాగంలో కమలం, ఆకులను పోలి ఉండేది. హ్యాండిల్‌పై కొమ్ము, గడ్డంతో ఉన్న జంతువు ఉండేది. 19వ శతాబ్దంలో ఈ అందమైన వైన్ జార్‌ను కల్నల్ చార్లెస్ సెటన్ గుత్రీ దొంగిలించి బ్రిటన్‌కు పంపినట్టు చెబుతారు. 1962 నుంచి ఇది లండన్‌లోని విక్టోరియా మ్యూజియంలో ఉంది.

బ్రహ్మోత్సవంలా గంగమ్మ జాతర

వివిధ వేషాలు.. కళాకారుల నృత్యాలతో హోరెత్తిన తిరుపతి

- శోభాయమానంగా సారె ఊరేగింపు
- ఊరేగింపునకు స్వాగతం పలికిన ముస్లింలు


గంగమ్మకు సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

సాక్షి, తిరుపతి: తిరుపతి తాతయ్యగుంట గంగ జాతర బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. జాతర సందర్భంగా మొదటి రోజు బుధవారం ఉదయం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. 900 ఏళ్ల చరిత్ర కలిగిన తిరుపతి తాతయ్యగుంట జాతరను ప్రభుత్వం ఈ ఏడాది నుంచి రాష్ట్ర పండుగగా ప్రకటించింది. సారె ఊరేగింపు సందర్భంగా స్థానికులు, ప్రజాప్రతినిధులు, అధికారులు వివిధ వేషధారణలతో ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. వేషధారణలతో రాని వారి మొహాలకు ఎమ్మెల్యే స్వయంగా గంధం పూసి, మసితో నల్లని బొట్టుపెట్టి జాతర సంప్రదాయాన్ని కొనసాగించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, సన్నాయి మేళాల మధ్య గంగమ్మ ప్రతిమలు, సారెతో ఊరేగింపు ప్రారంభించారు. ఆదిశక్తి, కాంతార వేషధారణలు, తప్పెట గుళ్లు, గరగ, గిరిజన నృత్యాలు, తీన్మార్ డప్పులు, కోలాటాలు, పలకల దరువు వంటి 36 రకాల జానపద కళాబృందాల నృత్యాలతో వేలాది మందితో 5 కి.మీ మేర సారె ఊరేగింపు సాగింది. అమ్మవారికి ప్రీతిపాత్రమైన వేపాకు, మామిడి తోరణాలు, అరటి చెట్ల ఏర్పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారి ఊరేగింపునకు స్థానికులు గోవు పేడ, గో మూత్రంతో కల్లాపు చల్లి దారి పొడవునా సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. నివాసాలు, దుకాణాల ముందు నిలబడి ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పాదాలపై పసుపు నీళ్లు పోసి కొబ్బరి కాయలు కొట్టి హారతులిచ్చారు. ఈ ఊరేగింపులో ముస్లింలు సైతం పాల్గొని హిందూ సంప్రదాయం ప్రకారం పసుపు నీటితో స్వాగతం పలికారు. మేయర్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో సారె తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు దిష్టి తీశారు.

బైరాగి వేషంలో కైకాల వంశస్తులు

తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా మొదటి రోజు బుధవారం కైకాల వంశస్తులు తమ ఆనవాయితీని కొనసాగించారు. ప్రస్తుత తరానికి చెందిన దొరైరాజ్ బైరాగి వేషం ధరించి పొర్లు వీధికి చేరుకున్నారు. అతనికి స్థానికులు పసుపు నీటితో కాళ్లు కడిగి ప్రత్యేక పూజలు చేశారు. గంగ జాతర అంటే సీమలో ప్రత్యేకమైంది అంబలి. అమ్మవారికి ప్రీతిపాత్రమైనది కూడా అంబలి. జాతర సందర్భంగా స్థానికులు ముందు రోజు రాత్రి రాగి, సజ్జ పిండితో వంట తయారు చేసి పులియబెడతారు. దానికి పెరుగు, ఉల్లిపాయ, కరివేపాకు, కొత్తిమీర, పచ్చి మిరపకాయ ముక్కలను కలిపి తయారు చేసిన అంబలిని వీధుల్లో వెళ్తున్న వారికి పంపిణీ చేశారు.

జిల్లా వార్తలు

నాణెం.. చరిత్రకు సాక్ష్యం

- 45 ఏళ్లుగా ప్రాచీనమైన నాణేలు సేకరిస్తున్న కోగంటి శివాజీ
- అర పైసా నుంచి కిలో బరువు నాణేలు సైతం సేకరణ
- ఆకట్టుకుంటున్న శ్రీరాముని పట్టాభిషేకం నాణెం
- ప్రత్యేక ఆకర్షణగా 1500 సంవత్సరాల నాటి నాణేలు
- నాణేల ప్రదర్శనలతో రేపటి పౌరులకు చరిత్రపై అవగాహన


పురాతన నాణేల ప్రదర్శనలో కోగంటి శివాజీ

రామవరప్పాడు(గన్నవరం): ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. పురాతన నాణేల సేకరణ అంటే ఎంతో ఇష్టం. అర్ధ శతాబ్దం క్రితం మొదలైన ఈ అభిలాషను నేటికీ కొనసాగిస్తున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వందల సంవత్సరాల నాటి నాణేలను సైతం సేకరించారు. అరుదైన స్వదేశీ నాణేలతో పాటు అనేక దేశాల నాణేలు, కరెన్సీ నోట్లు ఆయన వద్ద ఉన్నాయి. అరపైసా నాణెం నుంచి కిలో బరువు తూగే నాణేల వరకు వాటిల్లో ఉండటం విశేషం.

విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలో నివసించే కోగంటి శివాజీ తెలుగు విశ్రాంత ఉపాధ్యాయుడు. 1964లో ఉపాధ్యాయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి గన్నవరం, నైనవరం, కంచ్రిక, ఎనికేపాడు తదితర ప్రాంతాల్లో పనిచేసి ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందారు. ఉపాధ్యాయుడిగా ఉన్నప్పుడే నాణేల సేకరణ గురించి విద్యార్థులకు వివరించేవారు. ఈ క్రమంలోనే ఆయన కూడా సేకరణ మొదలు పెట్టారు.

ఈ నాణేల సేకరణ ద్వారా ప్రాచీన కాలం నాటి జీవన, ఆర్థిక, సామాజిక పరిస్థితులను అవగాహన పరిచేవారు. విద్యార్థులు కూడా నాణేలు సేకరించేలా అభిలాషను పెంపొందించారు.

1500 సంవత్సరాల నాటి నాణేలు

అర్థపైసా, కాసు, అణా, బేడా నుంచి వందల సంవత్సరాల క్రితం నాణేలను అతి కష్టం మీద శివాజీ సేకరించారు. దేశంలోని పురాతన నాణేలతో పాటు మెక్సికస్, సింగపూర్, ఫ్రాన్స్, లండన్, కెనడా, రష్యా తదితర 18 దేశాల నాణేలు ఆయన వద్ద ఉన్నాయి. 1808 సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీ విడుదల చేసిన టెన్ క్యాష్, ట్వంటీ క్యాష్ నాణేలు, 1500 సంవత్సరాల నాటి గ్వాలియర్, రాజరాజచోళ, మాధవ్‌రాజ్ శింధ్యా పరిపాలనా కాలం నాటి నాణేలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చోళులు, పాండ్యులు ఉపయోగించిన నాణేలు శివాజీ సేకరణలో ఉన్నాయి. క్విట్ ఇండియా ఉద్యమం పేరుతో విడుదల చేసిన యాభై పైసల వెండి నాణెం, 2008లో చైనాలో జరిగిన ఒలింపిక్స్ గేమ్స్ ప్రారంభంలో విడుదల చేసిన కిలో వెండి నాణెం, రూపాయి నుంచి వెయ్యి రూపాయల నాణేలను శివాజీ సేకరించారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భారత ప్రభుత్వం విడుదల చేసిన అరుదైన బంగారు నాణెం కూడా ఆయన వద్ద ఉంది.

శ్రీరాముని పట్టాభిషేకం నాణెం

అత్యంత ప్రాచీన అరుదైన శ్రీరాముని పట్టాభిషేకం నాణెంను శివాజీ అనేక వ్యయప్రయాసల కోర్చి సేకరించారు. ఈ నాణేలు మూడు రకాలుగా ఉంటాయి. మొదటి రెండు రకాలు అరుదుగా లభిస్తాయి. మూడో రకపు (చెక్కుడు) నాణేన్ని తాను మాత్రమే సేకరించగలిగానని శివాజీ సంతోషంగా చెప్పారు. భద్రాచలం శ్రీరాముని ఆలయంలో ఈ అరుదైన నాణేం ఒకటుందని తెలిసిందని, ఆ తర్వాత తన వద్దే ఈ చెక్కుడు నాణేం ఉందని పేర్కొన్నారు. శ్రీరాముని పట్టాభిషేకం నాణేం మరో రకం (పెద్దది) కూడా శివాజీ వద్ద ఉంది. వీటితో పాటు బ్రిటీష్ కాలం నాటి స్టిక్ టెలీస్కోప్‌లు, ప్రాచీన తాళాపత్ర గ్రంథాలు, గ్రహ స్థితులు తెలుసుకునే కాలజ్ఞానం గ్లోబు వంటి అరుదైన పురాతన వస్తువులను సేకరించారు. పురాతన నాణేలు, వస్తువుల సేకరణకు శివాజీ అనేక ప్రాంతాల్లో పర్యటించారు. కొన్ని ప్రాంతాల్లో కొంత మంది నకిలీ నాణేలను అంటగట్టి డబ్బులు గుంజుకుని మోసగించిన ఘటనలు ఉన్నా వెనుకంజ వేయలేదని శివాజీ తెలిపారు.

నాణేల ప్రదర్శనలు నిర్వహిస్తూ...

విజయవాడ నగరంలో పలుచోట్ల పురాతన నాణేముల ప్రదర్శనలు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణేముల సేకరణపై శివాజీ అభిలాష కల్పిస్తున్నారు. వివిధ దేశాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆర్థిక పరిస్థితులను నాణేల సేకరణ ద్వారా తెలుసుకోవచ్చని వివరిస్తున్నారు. అనేక పాఠశాలల్లో శిబిరాలు నిర్వహించి పురాతన నాణేలపై, చరిత్రలపై అవగాహన కల్పిస్తున్నారు.

విద్యార్థులు అలవాటు చేసుకోవాలి



45 సంవత్సరాలుగా సుమారు 2500కు పైగా అరుదైన నాణేలు, కరెన్సీ నోట్లను సేకరించగలిగాను. పురాతన వస్తువులు, నాణేములను సేకరించడాన్ని విద్యార్థులు అలవాటుగా మార్చుకోవాలి. జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య పేరు మీద నాణేం విడుదల చేసి గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పొట్టి శ్రీరాములు, కాకాని వెంకటరత్నం, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో నిలిచిపోయిన వైఎస్ రాజశేఖరరెడ్డి పేర్లు మీదుగా నాణేలు విడుదల చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

– కోగంటి శివాజీ, విశ్రాంత ఉపాధ్యాయుడు, ఎనికేపాడు, విజయవాడ రూరల్ మండలం







అరుదైన శ్రీరాముని పట్టాభిషేకం చెక్కుడు నాణెం; శ్రీరాముని పట్టాభిషేకం పెద్ద నాణెం; బ్రిటీష్ కాలం నాటి స్టిక్ టెలీస్కోప్‌లు; పురాతన వస్తువులు ; పలు దేశాలకు చెందిన నాణేలు

సెమీస్‌కు చేరిన ఐటా టెన్నిస్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని స్టార్ టెన్నిస్ అకాడమిలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఐటా అండర్–14,16 బాలబాలికల జాతీయ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ సెమీ ఫైనల్‌కు చేరింది. బుధవారం జరిగిన క్వార్టర్స్ అండర్–16 బాలుర విభాగంలో డి.అభిరామ్, మీర్‌ఫజల్, వై.ఇషాన్, మిటల్, బాలికల విభాగంలో రిషిత, వి.ఎస్.ప్రసన్న, టి.హిమజరెడ్డి, క్రితిక, అండర్–14 బాలుర విభాగంలో ఫజల్‌అలీ, మిథిల్, తనిష్, ఇషాన్, బాలికల విభాగంలో సనిద్య, ప్రతరావ్, జోషిత, నెహల్‌మారియా ప్రత్యర్థులపై పై చేయి సాధించి సెమీ ఫైనల్‌కు చేరారు. మరో రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని స్టార్ టెన్నిస్ అకాడమి డైరెక్టర్ కె.గోపాలరావు, రిఫరీ ఎం.శివకుమార్ తెలిపారు.


హిమజారెడ్డి


ఇషాన్

జాతీయ స్థాయి నాటిక పోటీల విజేత 'అతీతం'


ప్రథమ బహుమతి సాధించిన కళాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ వారి ఆధ్వర్యంలో ఈనెల 7, 8, 9 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి నాటిక పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. పట్టణంలోని ఎస్పీఎస్ హైస్కూల్ కఠారి సత్యనారాయణ కళావేదికలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రథమ బహుమతి గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి 'అతీతం' కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతి శ్రీకాకుళం జిల్లా బోరివంక గిరిజన సాంస్కృతిక సేవాసంస్థ వారి 'కొత్త పరిమళం', తృతీయ బహుమతి తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ వారి 'మనస్విని' కైవసం చేసుకున్నాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి.సత్యన్నారాయణ, కార్యదర్శి ఏవీఎస్ ప్రసాదు, సంయుక్త కార్యదర్శి ఆర్‌వీఎల్ నరసింహరావు, ఆర్థిక కార్యదర్శులు బి సత్యన్నారాయణ, శీరం శ్రీనివాసరావు, మట్టా రాజా, నరహరశెట్టి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

డీఎస్‌ఏ సీఈవో శ్రీనివాసరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్‌ఏ సీఈవో యు.శ్రీనివాసరావు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) సీఈవో యు.శ్రీనివాసరావు సూచించారు. ఈ నెల 10వ తేదీ నుంచి జూన్ తొమ్మిదో తేదీ వరకు జిల్లాలో జరిగే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఇందిరాగాంధి మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఆర్చరీ, అథ్లెటిక్స్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, జూడో, సాఫ్ట్‌బాల్, సాఫ్ట్‌టెన్నిస్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, తైక్వాండో, త్రోబాల్, వాలీబాల్, పవర్‌లిఫ్టింగ్, వాటర్‌స్పోర్ట్స్, వెయిట్ లిఫ్టింగ్, సెపక్‌తక్రా, రెజ్లింగ్ క్రీడాంశాల్లో జిల్లా వ్యాప్తంగా అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 50 శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ శిక్షణ శిబిరాల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను స్పోర్ట్స్ స్కూల్, రెగ్యులర్ కోచింగ్‌కు ఎంపిక చేస్తామన్నారు. డీఎస్‌ఏ చీఫ్ కోచ్ అజీజ్ మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో జరిగిన సీఎం కప్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో, టెన్నిస్ క్రీడాంశాల్లో స్త్రీ, పురుష జట్లు పతకాలు సాధించినట్లు చెప్పారు. జిల్లా క్రీడాకారులు సాధించిన ట్రోఫీలను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు.

సీఎం టేబుల్ టెన్నిస్ టోర్నీలో కేబీఎన్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ సీఎం టేబుల్ టెన్నిస్ టోర్నీలో కేబీఎన్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. తిరుపతిలో ఇటీవల జరిగిన ఏపీ సీఎం కప్ టేబుల్ టెన్నిస్ పోటీలలో తమ విద్యార్థులు పి.రూపేష్‌కల్యాణ్, ఇమ్రాన్‌జానీ అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కమిటీ కార్యాలయంలో ప్రతిభ చూపిన వారిని, తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్రరావులను కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్‌లు అభినందించారు.

13 నుంచి చెస్ వేసవి శిక్షణ తరగతులు

విజయవాడ స్పోర్ట్స్: గ్లోబల్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పటమట చెన్నుపాటి రామకోటయ్య మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో చెస్ వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు అకాడమి కార్యదర్శి షేక్ ఖాసీం తెలిపారు. నెల రోజుల పాటు జరిగే ఈ శిక్షణ శిబిరాన్ని 5 నుంచి 16 ఏళ్ల బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9849514138ను సంప్రదించాలని సూచించారు.